
POCKET BOOKS
EMESCO

అపజయం

కన్నడ మూలం
త్రివేణి

అనువాదం
శర్వాణి

తారుమారైన
ఆమె పథకం





'త్రివేణి' (అనసూయా శంకర్, 1928 - 1964, మైసూరు). కన్నడ - ఇంగ్లీషు సాహిత్యాలతో గాఢపరిచయం సంపాదించిన పట్టభద్రురాలు. 'హువ్వుహణ్ణు', 'సోమగెద్దెవళ్లు', 'అపస్వర', 'బెక్కిన్‌కణ్ణు', 'కీలుగొంబి', 'బెళ్లిమోడ' మొదలైన నవలలతోసహా మొత్తం 29 కృతులు ప్రచురించి కన్నడ సాహిత్య కథాకారులలో అగ్రశ్రేణిని అధిరోహించారు.


అపజయం : భార్యాభర్తలిద్దరూ సంవత్సరంలో పన్నెండు నెలలూ కలిసి ఉండకూడదు. అలా ఎప్పుడూ కలిసి ఉంటే ఏదో ఒక దెబ్బలాట, అసమాధానం, మనస్తాపాలు కలుగుతూనే ఉంటాయి...



'శర్వాణి' (నీలారంభం శారదమ్మ, కోలారు) : 'త్రివేణి' కన్నడ నవలలను తమ సరసానువాదాల ద్వారా తెలుగువారికి పరిచయం చేసి పేరు కెక్కారు. వాటిలో 'వసంతగానం' (MSCO 104), 'పాప పరిహారం' (EPB 186), 'అపస్వరం' (EPB 287), 'అపజయం' (EPB 288), 'కీలుబొమ్మ' (EPB 289), 'వెండిమబ్బు' (EPB 290) ఎమెస్కో పాఠకులకై ఎన్నిక చేసినవి. 'నిరంజన' కన్నడ నవలకు అనువాదమైన వీరి 'అభయధామం' (EPB 224) కూడ పాఠకుల ఆదరణ పొందినదే.

యం. శేషాచలం అండ్ కో
మచిలీపట్నం మద్రాసు సికింద్రాబాదు

POCKET BOOKS
EMESCO
288




అపజయం
అనువాదం శర్వాణి

APAJAYAM

Kannada novel by 'TRIVENI' :
Telugu translation by 'SARVANI'

First Edition :

April 1967

Pocket Book Edition :
November 1976

Publishers :

M. SESHACHALAM & Co.,

Machilipatnam, Secunderabad, Madras.

Cover Design :

BAPU

Printers :

SRI KALA PRINTERS,

Madras – 33.

Distributors :

ANDHRA PRADESH BOOK DISTRIBUTORS,

Rashtrapathi Road, Secunderabad.

Price: Rs. 3-50

288

"స్త్రీ జీవితం నీకు విసుగనిపిస్తే నీ యింటి తలుపులు నీకోసం ఎప్పుడూ తెరుచుకునే ఉంటాయన్న విషయం గుర్తుంచుకో" అన్న శాము పలుకులు మీరచెవుల్లో ప్రతిధ్వనిస్తూనే వున్నాయి. మూగదెబ్బ తగిలిన చోట మృదువుగా నిమిరినపుడు హాయిగా ఉండటంతో బాటు హాయితో కలిపిన నొప్పికూడా ఉన్నట్టే, ఆమెకు శాము మాటలు సంతోషాన్ని, బాధనూకూడా కలిగించాయి.

శాము నిజంగా ఉదారహృదయుడు. తను అతడిని వదిలివెళ్ళి తనకలను నిజం చేసుకోటానికి ప్రయత్నిస్తున్నాకూడా తనంతట తానే డబ్బు సాయం చేస్తాననటం ఆమెకు ఆశ్చర్యాన్ని కలిగించింది. "నీ యిష్టం ఎలాగైనా చావు. నేనింకో పెళ్ళిచేసుకుని హాయిగా వుంటాను" అని తన పురుషత్వపు అధికారాన్ని చూపగలిగే అవకాశం అతనికి లేకపోలేదు. ఇంకా "నువ్వు నా భార్యవి. నన్ను విడిచిపెట్టి వెళ్ళే హక్కు నీకు లేదు. చచ్చేదాకా నువ్విలా పడి వుండాల్సిందే" అని నిర్బంధించే అవకాశమూ అతనికి లేకపోలేదు. బహుశా అతనలా చేసివుంటే ఆమె రెచ్చిపోయి బంధాన్ని త్రెంచుకుని పారిపోయేదో ఏమో! కాని అతనలా తన స్వామిత్వాన్ని ఆమె మీద రుద్దకుండా, పాపను పోగొట్టుకున్న తల్లి తన దుఃఖాన్ని ఈ విధంగానైనా కాస్త మరవ గలిగితే అంతే చాలన్న ఒక ఉద్దేశంతోనే ఆమె మెడికల్ కాలేజీలో చేరటానికి అనుమతించాడు.

వీణమరణం మీరమనసులోని శాంతిని అట్టడుగునుండి కదిల్చివేసిందన్న విషయం శాముకు బాగా తెలుసు. సంసార సాగరంమీద తుఫానులా విరుచుకుబడ్డ మృత్యువు వేగానికి పైకెగసిన శోకపుటలల తాకిడికి తట్టుకో లేక మీర అసహాయ రాలిలా కొట్టుకుని పోతోంది.

ఆమెలో ఒక భాగమయిన కూతుర్ని పోగొట్టుకుని కుమిలి పోతున్న తల్లి హృదయాన్ని శాము బాగా అర్థం చేసుకున్నాడు. అతని దుఃఖమూ ఆమె దుఃఖమూ ఒక్కటే. జానిని శాము మరవటం అసంభవం. అయిదేళ్ళు వారి జీవితాలను వెలుగుతో నింపి, సౌఖ్యపు అమృత వర్షంతో వారి జీవితాలకు మాధుర్యపు చవిని చూపి వీణ అదృశ్యమై పోయింది. వీణఉన్నప్పుడు రోజూ పండుగలా గడిచిపోయేది. ఇంటి మూల మూలలా వీణ నవ్వుల వెన్నెలతో కాంతిమంతంగా ఉండేది. తనముద్దుల మాటలతో వీణ మరో ప్రపంచాన్నే సృష్టించింది. అలాంటి కూతుర్ని పోగొట్టుకున్న ఆ తల్లితండ్రుల భవిష్యత్తంతా అంధకార మయింది.

కాని శాముకు కన భూమి, తోట, ఎద్దులు వీటి సంరక్షణలో తన దుఃఖాన్ని మరవటానికి వీలుంది. పొలం పుట్రా వీటితో అతనికి గల సంబంధమూ, ఆత్మీయతా అంత సులభంగా తెంచి వేయటానికి వీలయ్యేదికాదు. ప్రకృతిదేవి నిత్యారాధనలో అతను తృప్తిపొందేవాడు. వీణను పోగొట్టుకున్నాక అతని ఉత్సాహం తగ్గిగా పూర్తిగా నశించి పోలేదు. భూదేవిమీద భక్తి తగ్గిపోలేదు. వీణ పోయిన కొత్తలో కొన్నివారాలు అతను మతిచలించినవాడిలా ఏమీ చెయ్యటానికి తోచని పరిస్థితిలో పడి భూమిని గురించి శ్రద్ధవహించలేదు. భోజనమూ నిద్రా కూడా అతనికి అక్కర్లేకపోయింది. ఇంటిపట్టున ఉండకుండా పిచ్చిగా తిరిగేవాడు.

ఒకరోజు అలా తిరుగుతూ శాము అనుకోకుండా ఎద్దులపాక వేపుకి వెళ్ళటం తటస్థించింది. లక్ష్మణుడు శామును చూడగానే తన మెడ ముందుకు చాచింది. తని ప్రియమైన ఎద్దు విశ్వాసంతో ముందుకు చాచిన మెడను అలక్ష్యంతో త్రోసి వెళ్ళలేకపోయాడు. శాము చెయ్యి ఆతనికి తెలియకుండానే ఎద్దు గంగడోలును నిమిరింది. కళ్లు వీపుమీదా పక్కలమీదా పడ్డాయి, పక్కలంతా పేడ మెత్తుకుని ఉంది. ఎద్దు తగ్గర్నుండి గంజలం వాసన వేస్తోంది. ఈగలు, దోమలు దాని వంటిమీద చేరి హింస పెడుతున్నాయి. ఎద్దు తన తోకతో వాడిని తోలుతున్నా వాటి బాధనుండి తప్పించుకోలేకపోతోంది. ఎద్దు వంట్లో

ఎముకలు ఎత్తి కనిపిస్తున్నాయి. కంట్లోనుండి నీరు, జిగురు కారుతున్నాయి.

దాని పరిస్థితి చూసి శాము చకితుడయ్యాడు. అతనికి బుద్ధి తెలిసినప్పటినుండి ఒక్కరోజుకూడా ఎద్దుల్ని ఈ స్థితిలో చూసి ఎరుగడు. రోజూ అతనే స్వయంగా నిల్చుని నింగనిచేత ఎద్దుల్ని కడిగించేవాడు. వాటి వంటిమీద ఒక్క మరక కనిపిస్తే[illegible]వాలు, నింగడిమీద కేకలు వేసేవాడు. శాముకు భయపడి నింగడు ఎప్పుడూ ఎద్దుల్ని శుభ్రంగా ఉంచేవాడు. గడ్డి, పిండి, కుడితిని తనే స్వయంగా దగ్గరవుండి పెట్టించేవాడు. పగలంతా వాటిచేత చాకిరీ చేయించుకుని వాటి సంగతి పట్టించుకోక పోవటానికన్నా మహాపాపం మరొకటి లేదని భావించేవాడు. తన అపార సంపత్తు దిన దినాభి వృద్ధి పొందటానికి కారణం గోమాత, భూమాత అని ఖచ్చితంగా నమ్మేవాడు శాము.

వీణ చావుతో అన్నిటిమీద అలక్ష్యం ఏర్పడిం దతనికి. దేన్నీ గమనించేవాడు కాదు. శాము నిరాసక్తిని గమనించి నింగడూ తన పనుల్ని అశ్రద్ధ చేయసాగాడు. "వామప్పగోరు దుఃఖంలో ఉన్నారు. నేనెలా చేస్తే నేంలే" అనుకుని పనులన్నీ ఎగ్గొట్టేశాడు. దానితో ఎద్దులు మురిగ్గా, బక్కగా తయారయ్యాయి.

శాముకు వాటి పరిస్థితిచూసి ఓ నిమిషం గుండె ఆగినంత పని అయింది. తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు. కళ్ళు నులుముకొని మళ్ళీ చూచాడు. వాటి పరిస్థితి ఆతనికి కోపాన్ని తెప్పించింది. వాటి పరిస్థితిని గమనించకపోవటం తనదే పొరపాటనుకున్నాడు. వీణ చనిపోయాక ఏ పని ఆగి పోయింది? సూర్యుడు ఎప్పటిలాగే ఉదయిస్తున్నాడు, అస్తమిస్తున్నాడు. వెంకమ్మగారు వండుతున్నారు తాము తినటం తప్పటంలేదు. వీణ చావుతో ఏ పని ఆగిపోయింది గనుక? రోజులు దొర్లిపోతున్నాయి. కాని తనిలాకర్తవ్యభ్రష్టుడవటం మంచిదేనా? పనిపాటలు మొదటలా ఉత్సాహంగా సాగటం లేదు నిజమే. కాని తన కర్తవ్యాన్ని తాను నెరవేర్చుకోనక్కరలేదా? సుఖ సంతోషాలకోసం తాను బ్రతకటంలేదు. కాని బ్రతికి ఉండక తప్పదుగదా? బ్రతికున్నాక తన కర్తవ్యాన్ని పాలించకా తప్పదు. తండ్రి తనమీద

ఎంత నమ్మకంతో ఈ అపారమైన ఐశ్వర్యం తనకప్పజెప్పాడు! ఈ నిర్లక్ష్యంతో ఆయనఆత్మ ఎంతక్షోభిస్తుందో కదా! తండ్రికి ద్రోహం ....భూమాతకు ద్రోహం....తప్పుదారిలో పడి కొరడా దెబ్బతిన్న గుర్రంలా జాగృతుడయ్యాడు శాము.

"నింగా....నింగా...." శాము గట్టిగా కేకపెట్టాడు. సావడిలో కూర్చుని కొబ్బరికాయ వలుస్తున్న నింగడు శాము పిలుపువిని పరిగెత్తుకుంటూ వచ్చాడు. వాడి మొహం చూడగానే శాము కోపం కట్టలు తెచ్చుకుంది.

"ఏం చేస్తున్నావురా?"

అయ్యగారికి కోపంవచ్చిందన్న సంగతి తెలుసుకున్న నింగడు భయపడుతూనే మెల్లిగా "వెంకమ్మగోరు ఉప్మాకు కొబ్బరికాయ లేదంటేనూ వలుస్తున్నానండి" అన్నాడు.

శాము ఎద్దు ఎముకలను చూపిస్తూ "ఇలాగేనా వీటిని చూసుకునేది? ఎన్నిరోజు లయిందిరా ఎద్దుల్ని కడిగి?" అని గద్దించాడు.

"......................"

"ఊఁ, చెప్పు, ఎన్ని రోజులయింది?"

"ఓ నెలరోజు లయ్యింటుందయ్యా."

"నేను గమనించటం లేదు కదానని నీ యిష్టం వచ్చినట్టుగా పన్లు చేద్దామనుకుంటున్నావా? అదేం కుదరదు. రోజూ కుడితీ అదీ సరిగ్గా పెడుతున్నావా?"

"......................"

"సరే వెళ్ళు. ఎద్దుల్నన్నిటినీ తోలుకువెళ్ళి చెరువులో శుభ్రంగా కడిగి తీసుకురా."

నింగడు బదులు చెప్పకుండా వరసగా నుంచుని గడ్డిమేస్తున్న పది ఎద్దుల్నివిప్పి చెరువువైపు తోలుకువెళ్ళాడు.

'ఇక ఆవులు ఎలా ఉన్నాయో' అనుకుంటూ ఆవుల కొట్టం వైపు వెళ్ళాడు. కాని ఆవులు ఎప్పటిలా పరిశుభ్రంగా కళకళలాడుతూ కనిపించాయి. వెంకమ్మగారి ధర్మమా అంటూ ఆవులపాక ఆవులూ శుభ్రంగా ఉన్నాయి.

"ఇక తోట, పొలాలు ఎలా ఉన్నాయో చూడాలి" అనుకుంటూ లోపలికి వచ్చాడు శాము.

"అత్తయ్యా, ఎద్దులెలా అయిపోయాయో చూశారా? మీ దయ వల్ల ఆవులు బ్రతికున్నాయి" అన్నాడు వెంకమ్మగారితో.

"నింగడికి ఎన్నిమార్లు చెప్పినా పట్టించుకోందే ఏం చెయ్యమన్నావు? ఇంటి యజమాని శ్రద్ధ తీసుకోకపోతే వాళ్ళకు ఆడిందే ఆట పాడిందే పాటగా ఉంటుంది.

"నాతో ఒక్కమాట చెప్పలేక పోయినారా?"

"ఎలా చెప్పను! నీ దుఃఖంలో నువ్వున్నావాయె. నువ్వలా కుమిలిపోతూ తిరుగుతుంటే ఏ నోటితో చెప్పమంటావు....?" ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

శాము బదులు చెప్పకుండానే వెళ్ళి డ్రాయింగ్ రూములో సోఫాలో కూర్చున్నాడు. రెండు క్షణాలు దూలాలవేపు చూశాడు. తరువాత లేచివెళ్ళి పెరట్లోని నూతిగట్టుమీద కూర్చుని లోపలికి తొంగి చూశాడు. అడుగున నీరు తళతళా మెరుస్తోంది. పైన సూర్యుడితాపం అధికమవ సాగింది. అక్కడినుండి లేచి పడుకునే గదిలోకి వెళ్ళాడు. పక్కమీద పడుకుని కాస్సేపు దొర్లాడు. ఉహుఁ అదీ విసుగ్గానే ఉంది. ఏం చెయ్యాలో ఎలా కాలం గడపాలో తెలియలేదతనికి. వెళ్ళి జాజి పొదని సరిచేశాడు, మల్లిపందిరిని సరిచేశాడు, హాల్లోకి వచ్చి మసి పట్టిన లాంతర్ని శుభ్రపరిచాడు. చేతులు కట్టుకుని ఓ స్తంభాన్నానుకుని నిలబడ్డాడు.

వీణ ఉన్నప్పుడు రోజులు క్షణాల్లా దొర్లిపోయేవి. కాని, ఇప్పుడో?

"శామణ్ణా టిఫిన్ తీసుకుందూగాని రా. అలాగే మీరనూ కేకెయ్" వెంకమ్మగారు పిలిచారు.

శాము బూజుదులపటం చూసి వెంకమ్మగారు.

"అవన్నీ బోరడికి చెబితే చెయ్యడా అబ్బాయ్!" అన్నారు.

"ఏమీ తోచటం లేదత్తయ్యా. ఏదో ఒకపాటి చేస్తున్నా."

"ఉప్మా చల్లారిపోతుంది మరి; మీర ఏది?"

"పిలుస్తా నుండండి. మీరా....మీరా...."

శాము మీర గదిలోకి వెళ్ళిచూశాడు. మీరచేతిలో ఓ పుస్తకం పెట్టుకుని కూర్చుంది.ఆమె కళ్ళు పుస్తకంమీద ఉన్నా చదవటం లేదని ఆమె ముఖభావమే చెబుతోంది. పేజీలు తిప్పటంలేదు ఆమె.

శాము ఒక్కక్షణం తలుపుదగ్గర నుంచుని చూసి తరువాత లోపలికి వెళ్ళి ఆమె భుజంమీద చెయ్యివేశాడు. అనుకోకుండా దెబ్బ తగిలినట్టు అదిరిపడింది మీర.

"టిఫిన్ తీసుకుందాం రా."

మీర మాట్లాడకుండా అతనివెంట వెళ్ళింది.

* * *

తనకు మెడిసిన్‌లో చేరటానికి అనుమతి ఇచ్చినప్పటినుండి మీరకు భర్తమీద ఓ విధమయిన గౌరవమూ, ఆదరమూ కలిగాయి. అతనూ తనలాగే కూతుర్ని పోగొట్టుకున్న నిర్భాగ్యుడయిన తండ్రి, తనలాగానే దుఃఖితుడు అన్న కారణంచేత ఆమె మనసు అతనిపట్ల ఆర్ద్రమయింది. దుఃఖావేగాలలో పడి తనలాగే తల్లడిల్లుతున్న అతని మీద కరుణ జనించిం దామె హృదయంలో. తనవల్ల అతని హృదయంలోని ఆశలన్నిటిని అక్కడే అణచివెయ్యాల్సి వచ్చిన పరిస్థితికి ఆమె జాలి చెందింది.

ఆమె గర్భిణిగా ఉన్నప్పుడు, వెన్నెలభోజనం చేసినరోజు శాము తన మనసులోని కోర్కెను ఆమెతో చెప్పుకున్నాడు. "నాకు ఇంటినిండా పిల్లలుంటేనే ఇష్టం. పిల్లలున్న ఇల్లు నందగోకులంలా ఉంటుంది. నాకు ఆరుగురు మగపిల్లలు, ముగ్గురూ ఆడపిల్లలూ కావాలి" అన్నా డప్పుడు. అతనికోరిక విని భీతిచెందిన మీర కటువుగా "తొమ్మండుగురు పిల్లల్ని కనేసరికి నా సమాధి సిద్ధమవుతుంది" అని జవాబు చెప్పింది. మగవారి పశుత్వాన్ని గురించి తీవ్రమయిన తిరస్కారభావం ఆమెను ముంచివేసింది.

కాని అప్పటికి మీర ఇంకా మాతృత్వాన్ని పొందలేదు. తల్లి కాకముందు, వీణ గర్భంలో ఆకారం దాలుస్తున్నప్పుడు, వేవిళ్ళ బాధతో నీరసించి ఉన్నప్పుడు, ఎప్పటికి ఈ బరువు దించుకుంటావా

అని ముళ్ళమీద నిల్చున్నట్టు ప్రసవ సమయానికోసం ఎదురు చూస్తున్నప్పుడు ఆమె కలా అనిపించటం సహజం. పాప పెరుగుతున్నట్టల్లా, మాతృత్వపు మొగ్గవిచ్చుకుని, మమతా సౌరభంలో జలకమాడిన మీర తనకు తెలియకుండానే మెత్తబడింది. మాతృత్వపు మాధుర్యం ఆమె హృదయపు కాఠిన్యాన్ని పారద్రోలి మెత్తపరచింది. వీణ ఆమె జీవితంలోకి ప్రవేశించాక సంసారాకాశంమీద పూర్ణ చంద్రుడు సదా వెలుగుతూనే ఉన్నాడు. 'పిల్లలే వద్దు' అన్ననాలికే 'పిల్లలతోనే జీవితం' అనటానికి సిద్ధపడింది. ఏ దుర్ముహూర్తంలో మీర 'నాకు పిల్లలే వద్దు' అన్నదో కాని విధి ఆ మాటను నిజంచేసింది.

పెళ్ళిచేసుకుని గృహిణిగా ఉండాలన్న కాంక్ష మీర కెప్పుడూ లేదు. డాక్టరయి దీనప్రజల సేవ చెయ్యాలన్న కోరిక ఆమె మనసులో గాఢంగా హత్తుకునిపోయింది. వివాహ ఆవశ్యకత ఆమె గుర్తించక మునుపే శామును పెళ్ళిచేసుకుంది. ఆ పెళ్ళితో ఆశలన్నిటినీ వదులుకుందాం, భర్తతో కాపురం చెయ్యాలి, భర్తే దైవం, అతన్ని వదిలి దూరంగా ఉండటం మర్యాద కాదు-అన్న హిందూ సమాజపు నియమానికి ఆమె లొంగిందే కాని భర్తపట్ల అమితానురాగం ఎన్నడూ లేదామెకు. దాంపత్య జీవనం మోహావర్చలే దామెను. అప్పుడప్పుడూ దాని ఆకర్షణకు లోనయి, శాముతో సహకరించినా, జీవితంలో దాంపత్య జీవితానికి ప్రాధాన్యత ఇవ్వలేదామె. రాజు, చంపా, నర్మదా వచ్చినప్పటి రాత్రి, తనమాట మన్నించకుండా శాము తనమీద జరిపిన అత్యాచారంవల్ల, ఆ రకమయిన జీవితంమీద ఆమెకున్న కాస్త వ్యామోహమూ తొలగిపోయి, అసహ్యం, జుగుప్సా తలెత్తాయి.

కాని వీణ ప్రవేశంతో మీరకు జీవితంలో నూతనోత్సాహం కలిగింది. జీవించటానికి అర్థం ఏర్పడింది. వీణ తనతోఉంటే ఎక్కడైనా సుఖంగా ఉండగలనన్న ఆత్మవిశ్వాసం మొలకెత్తింది. శామును భర్తగా ప్రేమించకపోయినా తనకూతురి తండ్రి అన్న అభిమానంతో చూడసాగింది. వీణ మృత్యువు తా మిద్దరిమీద పిడుగుపాటులా పడిందన్న సత్యం ఆమెకు తెలియకపోలేదు. శాము తనలాగే పైకి చెప్పక

పోయినా మనసులోనే క్రుంగిపోతున్నాడని అతనిమీద ఆమెకు సాను భూతి కలిగింది. మీర చదువుకోవటానికి అనుమతించి, తనంతట తానే ధనసహాయం చేయటానికి సిద్ధపడిఉన్నప్పుడు అతని ఔదార్యం ఆమెను ఆశ్చర్యచకితురాలిని చేసింది. అతన్నిగురించి తను తప్పుగా అర్థం చేసుకోలేదు కదా అనుకుంది.

ఉలిదెబ్బ తగిలిన రాయి విగ్రహంగా రూపు దాల్చినట్టే, జీవితంలో దెబ్బతిన్న మీర, శాముల హృదయాలు పక్వమవసాగాయి. తనలాంటి పిల్లను చేపట్టినందువల్లనే అతని జీవితం నిస్సారమయి పోయిందని మీర బాధపడ సాగింది. అతని జీవితాన్నే అలవర్చుకుని, భర్తే దైవమన్న నమ్మకంతో అతని సౌఖ్యమే తన సౌఖ్యంగా భావించే అమ్మాయి అయివుంటే శాము సుఖంగా ఉండగలిగేవాడు కదా అన్న భావన కలిగినప్పుడల్లా అపరాధ భారంతో కుంచించుకుపోయేది మీర.

వీణ మృత్యువు భార్యాభర్తల వాక్శక్తిని కుంఠితపరిచింది.

* * *

మెడికల్ కాలేజీలో చేరటానికి అప్లికేషన్ ఫారమ్ తెచ్చుకుంది మీర. ఫారంనింపి దాంతోబాటు పంపాల్సిన సర్టిఫికేట్, మార్క్సుకార్డ్, వీటిని తెచ్చుకోవటానికి మైసూరు వెళ్ళాల్సి వచ్చింది.

శాముతోబాటే టిఫిన్ తీసుకుంటున్నప్పుడు ఈ మాట అతనితో చెబుదామనుకుంది. కాని వెంకమ్మగారి ఎదుట ఈ ప్రస్తావన తేవటాని కిష్టంలేక ఊరుకుంది. టిఫిన్ తీసుకున్నాక శాము పొలంవేపు వెళ్ళే ప్రయత్నంలో ఉండగా మీర-

"మరి...." అంటూ పలకరించింది.

"ఏమిటి?"

"మీతో కాస్త మాట్లాడాలి."

"పద అక్కడ కూర్చుందాం."

డ్రాయింగ్ రూములో సోఫామీద కూర్చుంది మీర. ఆమె కెదురుగా కుర్చీలో కూర్చుంటూ మీర మాట్లాడకుండా కూర్చోవటం చూసి,

"ఏమిటో చెప్పు" అనడిగాడు.

"కాలేజీలో చేరటానికి సర్టిఫికెట్ తెచ్చుకోవాలి. మైసూరుకు వెళ్ళాలి, దానికోసం."

"కాలేజీకి రాస్తే వాళ్ళు పంపరా?"

"పంపుతారు. కాని ఆలస్యమవుతుంది. అందుకే ఓ రోజు వెళ్ళి పని ముగించుకుని వద్దామను కుంటున్నా."

ఒక్క-క్షణం శాము ఏమీ మాట్లాడలేదు. తరువాత తలెత్తి,

"మీ పెదనాన్న గారింటికి వెడతావా?" అన్నాడు. ఈ మాటను ఎంతో ప్రయాసతో అంటున్నట్టు తోచింది.

"ఊఁ. రెండురోజులకే కదా ఎక్కడయితే నేమిటి? తరువాత కూడా హాస్టల్ తెరిచేదాకా అక్కడే ఉంటాను. హాస్టల్‌కు వేరే అప్లికేషన్ వేశాను."

"అలాగే" అని శాము బయటికి వెళ్ళిపోయాడు.

శాము అనుకున్నట్టుగానే, అతని నిరాసక్తివల్ల రైతులు పని-పాటలు మొదటిలా చెయ్యకుండా అశ్రద్ధచేయటం కనిపించింది. కాశయ్య, శివయ్య, మునయ్య అందరూ తమ పాకలముందు నిశ్చింతగా బీడీలు పీలుస్తూ కూర్చున్నారు. శాము పొలాలవేపు వెడుతూ ఉండటాన్ని చూసికూడా, రోజులా పిచ్చిగా తిరుగుతూ ఉన్నారనుకుని ఊరుకున్నారు. కాని శాము పాకలదగ్గిరకు వచ్చి ఒక్కొక్కర్నీ పేరుపెట్టి పిలవసాగాడు. అందరూ గబగబా బయటికివచ్చి అయ్యగారికి దండాలు పెట్టారు.

"ఒరేయ్, కొబ్బరిచెట్లకు పాదులు సరిచేసి ఉప్పు, ఇసుక, ఎరువువేసి నీళ్ళు వదులు. కాలవలోంచి నీళ్ళు వదులు. నా మొహంలో ఏమి టుందర్రా అలా చూస్తారు? పదండి. కాశా! నిమ్మచెట్ల పాదుల్లో కలుపుతీయ్యి."

శాము మొదటిలా పనుల్లో ఆసక్తి వహించటం చూసి రైతులంతా తెల్లబోయారు.

సాయంత్రం ఏడింటిదాకా శాము అక్కడేవుండి అన్నిటినీ ఓ త్రోవకు తెచ్చిగాని ఇంటివేపు మరలలేదు. ఆఖర్లో అందర్నీ,

"రేపటినుండి మీరిలా చేస్తే కుదరదు. మీరెలా చేసినా ఊరు కుంటాననుకున్నారా? జాగ్రత్త" అని హెచ్చరించాడు. నింగడిని పిలిచి,

"రేపుదయం బండి సిద్ధంగా ఉండాలి. అమ్మగారు మైసూరికి వెడతారు" అని చెప్పి ఇంటికి వెళ్లాడు.

అతను ఇంటికి వచ్చేసరికి లాంతరు వెలుగులో వెంకు, మీర కబుర్లు చెప్పుకుంటున్నారు. శామును చూసి ఉత్సాహంతో వెంకు.

"శామణ్ణా, రేపు మీర మైసూరు వెడతారట కదా" అనడిగింది. శాముకు తను చిన్నప్పటినుండి ఎత్తుకుని ఆడించిన పిల్ల వెంకు అంటే ఎంతో అభిమానం.

వెంకు మాట విననట్టుగానే లోపలికి వెళ్ళిపోయాడు. అతనలా వెళ్ళిపోవటం చూసి తెల్లబోయింది వెంకు.

శాముకు వెంకు మనస్సు నొప్పించాలన్న ఉద్దేశం ఎంత మాత్రంలేదు. అతని మనసు ఆలోచనలతో నిండి ఉండటంతో వెంకు మాటలను గమనించకుండా వెళ్ళిపోయాడు.

నిజానికి మీర మెడికల్ కాలేజిలో చేరటం అతని కెంత మాత్రం ఇష్టంలేదు. కాని మీర పరిస్థితి అతన్ని కంగారు పెట్టింది. ఆమె అన్నట్టు ఆమెకు 'పిచ్చి పట్టవచ్చు దేశాంతరం వెళ్ళచ్చు, ఆత్మహత్య చేసుకోవచ్చు.' దీనికి భయపడి ఆమె ఇష్టప్రకారమే కానిద్దామని ఒప్పుకున్నాడు. అసలే దెబ్బతిన్న మనిషిని తను బలవంతంగా కట్టి ఉంచటం మంచిది కాదనుకున్నాడు. చదువువల్ల ఆమె మళ్ళీ మొదటి మీర కావచ్చునన్న ఆశ హృదయాంతరాళంలో మొలకెత్తింది. అతని మనసు ఆమెను కాలేజికి పంపటానికి నిశ్చయించినా అతని మనో విప్లవం తగ్గలేదు. మీర కూడా వెళ్ళిపోతే తన గతి ఏమిటి? తనొక్కడూ ఇంత పెద్ద ఇంట్లో బిక్కు బిక్కుమంటూ కాలం గడపాలా? ఈ ఒంటరి తనాన్ని తను భరించగలడా? తన కెంతో ప్రియమయిన పొలాలూ, తోటలూ, గొడ్డు గోదా ఉన్నాయి నిజమే. కాని అవే సర్వస్వమూ కాదు కదా! తన హృదయం మరో హృదయపు సానుభూతి, స్నేహాలను కోరటం లేదా? ఎవరికోసం

తను యీ ఆస్తిని అభివృద్ధి చేయాలి, ఎవరి కోసం కష్టంపడాలి తను?

ఇలాంటి ప్రశ్న పరంపర అతని మనసును కలవర పరుస్తూనే ఉంది. కాని వాటికి జవాబుమటుకు దొరకటంలేదు.

* * *

ఉదయం వెళ్ళే షటల్ ట్రైను ఎనిమిదిన్నరకే హీరోదెకు వస్తుంది. అందువల్ల మీర రాత్రే ప్రయాణానికి కావాలసిన సిద్ధతలు చేసుకుంది. సూట్‌కేసులో రెండు వాయిల్ చీరలు, జాకెట్లు పడేసింది. ఇంకా కావల్సిన ఒకటి రెండు వస్తువులు సర్దుకుంది. శాము ఇదంతా గమనిస్తూ మౌనంగా ఉండిపోయాడు. తన ఆవేదనను అణచుకోవటాని కోసం ఔదా సీన్యపు తెరవెనుక దాక్కున్నాడతడు.

మీర పెందరాళే లేచి స్నానంచేసి జడవేసుకుని పూలు పెట్టుకొని కాఫీకోసం వంటింటివేపు వెళ్ళింది. వెంకటమ్మగారు ఆశ్చర్యంతో,

"ఏమిటమ్మాయ్, ఎక్కడికో బయలు దేరావే ఇంత తొందరగా?" అనడిగారు.

"మైసూరికి వెళ్ళోస్తాను."

"రాత్రే చెప్పలేక పోయవా? కాఫీ పెట్టేదాన్ని, పాలు కాగాయ్ ఇవ్వనా?"

"రాత్రి నేను మీతో చెప్పలేదా?"

"లేదే!"

"పాడు మరపు. రాను రాను మతిపోతోంది నాకు."

వెంకమ్మగారు పాలు గ్లాసులోపోస్తూ "శామణ్ణకూడా వస్తున్నాడా నీతో?" అనడిగారు.

"లేదు."

"ఒక్కతివి వెడతావా?"

"భయమేమిటి? తెలిసిన ఊరే కదా!"

"అమ్మాయ్, నేనో మాట చెబుతా విను. శామును ఇంతప్పటి నుండి ఎత్తుకుని ఆడించినదాన్ని నేను. వాడి స్వభావం బాగా తెలుసు నాకు. పైకి కఠినంగా కనిపించినా మనస్సు అతి సున్నితం. లోపలి

గుజ్జు మెత్తదైనా పై చిప్ప కఠినంగా ఉన్నట్టే-ఇలాంటి పరిస్థితిలో శాముసు వదిలిపెట్టి వెళ్ళటం అంత మంచిది కాదని పిస్తోంది."

మీర ఆవిడమాటలకు జవాబు చెప్పకుండా పాలు తాగి గ్లాసు కిందపెట్టింది. మీర మాట్లాడక పోవటంచూసి వెంకమ్మగారే మళ్ళీ,

"నేనిలా ఎందుకు చెబుతున్నానంటే జానిని పోగొట్టుకున్న బాధ పగలూ రాత్రి ఆతణ్ణి తినివేస్తోంది. సంతోషాన్ని ఎవరితోనైనా పంచుకుంటే ఎక్కువవుతుంది. దుఃఖాన్ని ఇంకొకరితో చెప్పుకుంటే తగ్గుతుంది. సంతోషపు రోజుల్లో అతనిబాటు ఉండి ఇప్పుడిలా మైసూరు వెళ్ళటం బాగా లేదమ్మాయ్. నువ్వు వెళ్ళిపోతే అతనికేం తోస్తుంది చెప్పు? ఎక్కువ రోజులు అక్కడ ఉండకు తల్లీ. త్వరగా వచ్చేయ్."

వెంకమ్మగారి మాటవిని మీరకు ముల్లు గుచ్చుకున్నట్లయింది. ఇంకా ఇప్పుడే ప్రారంభం. అప్పుడే ముగింపు చెయ్యమంటే ఏం చెప్పగలదు?

మీర ఎటోచూస్తూ "అలాగే, తొందరగానే వచ్చేస్తాను" అంది. వెంకమ్మగారు సంతోషంతో,

"నాకు తెలుసమ్మాయ్! నువ్వుమాత్రం వదిలి ఎక్కువరోజులు ఉండగలవా? చదువుకున్న పిల్లవి. నీకు మాత్రం తెలియందే ముంది. అతని స్వభావం నువ్వు ఎరిగిందేకదా!" అన్నారు.

నింగడు ఇంటిముందు బండి ఆపి, లోపలికొచ్చి మీర చేతిలోని సూట్ కేసు చూపి,

"ఇలా ఇవ్వండమ్మగోరూ, బండిలో ఎడతాను" అన్నాడు.

"ఎవరు చెప్పార్రా నీకు బండి తెమ్మని?"

"అయ్యగోరు నిన్నే సెప్పారు గందా"

శాము ఔదార్యం మీరకు మళ్ళీ గుండెలో గుచ్చుకున్నట్టని పించింది.

మీర శాము ఉన్నగదిలోకి వచ్చింది. శాము గోడవేపు మొహం పెట్టుకు నుంచున్నాడు.

"వెడుతున్నా."

"డబ్బు తీసుకున్నావా?"

"ఆ"

"మంచిది." శాము ఆమెవేపు తిరగకుండానే జవాబిచ్చాడు.

మీర బండిలో ఎక్కి కూర్చుంది, నింగడు నెమ్మదిగా బండి తోలసాగాడు. ఆమె ఇంకా తన ఆలోచనలనుండి తేరుకోకమునుపే నింగడు,

"అమ్మగోరూ, టేసన్ వచ్చింది" అన్నాడు.

మీర రైలుకోసం ఎదురుచూస్తూ నుంచుంది. నింగడు ఇంకా అక్కడే ఉండటాన్ని చూసి,

"నువ్వెళ్ళవోయ్ నింగా. సూట్‌కేసేకదా. పెద్దబరువులేదులే." అంది. ఒంటరిగా నుంచున్న అందగత్తెని చూసి పనీపాటా లేక తిరుగుతున్న యువకుల్లో కొత్త ఉత్సాహం పుట్టుకొచ్చింది. కావాలనే ఆమె ఎదురుగా పచార్లు మొదలెట్టారు. ఓ రసికుడు "సుందర నారీ, ప్రీతమ ప్యారీ...." అని ఈల వెయ్యసాగాడు. కాని మీర దేన్నీ గమనించటంలేదు. తాబేలు తన చిప్పలో దాక్కున్నట్టు ఆమె తన ఆలోచనల్లో లీనమయింది.

దూరంలో రైలుకూత వినపడి మేలుకుంది మీర. ఆ జనం మధ్యలో ఎలాగోలా చోటుచేసుకుంటూ రైలెక్కింది. రైలు బయల్దేరాక చుట్టూ తనతోటి ప్రయాణీకులవైపు చూసింది. ఆమె కెదురుగా భార్యా, భర్త; అయిదేళ్ళ అమ్మాయి కూర్చున్నారు. ఆ పిల్ల అపుడపుడూ కిటికీ దగ్గరకు వెళ్ళి నుంచుంటూ ఉంది. తల్లి "శోభా, అలా బయటికి తొంగిచూడకు. కంట్లో నలుసు పడుతుంది." అని హెచ్చరిస్తూ ఉంది.

"నలుసు ఎక్కడనుండి వస్తోందమ్మా?"

"ఏమో నాకు తెలీదు. ఇలారా. నీకు బిస్కట్ ఇస్తాను."

శోభ వచ్చి తల్లి పక్కన కూర్చుంది. శోభ ముద్దుగా ఉంది. గుండ్రటి మొహం, చిలిపికళ్ళు, మొండిముక్కు, బాబ్‌చేసిన నల్లటి జుత్తు పువ్వులఫ్రాక్ వేసుకున్న శోభ ఒక్క చూపులోనే మీరను ఆకర్షించింది. శోభను చూస్తుంటే వీణ గుర్తుకువస్తోంది. ఆమెకు

హృదయం బరువై కళ్ళు చెమర్చాయి. శోభతల్లి మీర పరిచయం చేసుకోవాలన్న కుతూహలంలో ఆమెవేపే చూస్తోంది. మీర తన కన్నీరు వారికి కనిపించకూడదని బయటికి చూడసాగింది. దుఃఖా వేగం కాస్త తగ్గాక మళ్ళీ ఇటువేపు తిరిగింది. బిస్కట్ కొరుకుతున్న శోభ మీరవైపుచూసి నవ్వింది. మీరకు ఇక నవ్వక తప్పలేదు. శోభతల్లి పలకరించింది.

"ఏ ఊరు వెడుతున్నారు?"

"మైసూరు. మీరు?"

"మైసూరు—చూద్దామని వెడుతున్నాం. మంగళూరు మాది. మీ పేరు?"

"మీర."

"చదువుకుంటున్నారా?"

ఒక్కక్షణంఆగి మీర "అవును" అంది.

"ఏం చదువుతున్నారు?"

"ఇంటర్ పాసయ్యాను. మెడికల్ కాలేజీలో చేరదామని."

"అలాగా చాలా సంతోషం. నాకూ చదువుకోవాలని ఎంతో ఆశగా ఉండేదండి, ఇంటర్ అయ్యాక పెళ్ళయింది. నాగపూర్ యూనివర్శిటీ పరీక్ష ప్రైవేటుగా కట్టి బి. ఎ. పూర్తి చేసుకుందామని ప్రయత్నించాను. కాని యీ శోభమూలంగా నా చదువు అంతటితో ఆగిపోయింది" అంటూ ప్రేమతో శోభవేపు చూపిందామె. ఆమె భర్తవేపు ఓరగాచూసి నవ్వారు. వారి సుఖమయ సంసారాన్ని చూసి కుములుతున్న మీర హృదయానికి కాస్త శాంతి కలిగింది. అయితే ప్రపంచంలో సుఖంగా వుండేవారు కూడా ఉన్నారన్నమాట. ప్రపంచ మంతా దుఃఖమయం కాదన్నమాట. వాసంతి నిజంగా ఎంత హాయిగా ఉంది! భార్యాభర్త లిద్దరూ ఎంత అన్యోన్యంగా ఉన్నారు! వారిద్దర్నీ ప్రేమపాశంతో బంధించివేసింది శోభ. కాని అలాంటి సుఖాలన్నిటి నుండీ పూర్తిగా వంచితురాలు తను. తనేం పాపం చేసుకుంది?

"ఇప్పుడు శోభ పెద్దదయింది. ఇహ చదువుకోవచ్చు కదా."

"అయ్యో, వీలుపడదండి. ఎక్కడ చదవనిస్తుందిది! ఒక్క నిమిషం కథలపుస్తకం చేతిలో పట్టుకున్నా కోపం వచ్చేస్తుంది మహారాణికి."

మళ్ళీ వీణ గుర్తొచ్చింది. ఎన్నిమార్లో మీర పుస్తకం చేతిలోకి తీసుకోగానే దాన్ని లాగి పారేసి "ఆడుకుందాం రామ్మా" అని గోలపెట్టేది వీణ.

"నిజమే. ఇప్పుడిహ చదువుకోలేరు."

"మీరు చదివి ఏంచేస్తారు?"

"తెలిసిందేకదా, డాక్టర్నవుతాను."

"చదివి ఉద్యోగం చెయ్యాలని నాకు ఎంతో ఆశగ్గా ఉండేది. ఏం కాపురాలో! ఇందులో ఎంత బాధ్యత! చదువుకుని హాయిగా ఉద్యోగాలు చేసుకుంటే...."

"పాపం నీకిప్పుడేం తక్కువయిందని?" ఇదివరకు మౌనంగా కూర్చుని వింటున్న వాసంతిభర్త మధ్యలో అందుకున్నాడు.

"ఆడవాళ్ళ కష్టాలు మీకేం తెలుస్తాయిలెండి." అంటూ భర్తకు సమాధానం చెప్పింది వాసంతి.

"ఉద్యోగాలు చేస్తున్న ఆడవాళ్ళందరూ సుఖంగా ఉన్నారంటారా వాసంతీదేవీ?" మీర అడిగింది.

"మాకన్నా సుఖంగా ఉంటారు."

"మాకు చాలా అన్యాయం చేస్తున్నావ్ వాసంతీ?" ఆమె భర్త అన్నారు.

"రెండు రకాల జీవితాల్లోను కష్టసుఖాలు ఉంటూనే ఉంటాయ్." మీర వేదాంతినిలా మాట్లాడింది.

"సంసారంలోని కష్టసుఖాలు ఇంకా విద్యార్థిదశలో ఉన్న మీకేం తెలుస్తాయిలెండి."

మీర ఇహ మాట్లాడలేదు, తన అనుభవంలో ఎన్నో వంతుంది ఆమెకు?

మీర మొహంలో బాధారేఖ మెరిసి మాయమయింది. కిటికీ దగ్గరున్న కూతుర్ని దగ్గరకు తీసుకోవటంలో నిమగ్నురాలయిన

వాసంతి మీర మొహంలోని అపారయాతనను గమనించలేదు. మిగతా ప్రయాణమంతా కబుర్లలోనే గడిచిపోయింది.

మీర పెదనాన్న మీరిల్లు చేరుకునేసరికి పదకొండున్నరయింది. ముందు మీఉత్తరం రాయనందువల్ల ఆమె వచ్చేసంగతి ఇంట్లో ఎవరికి తెలియదు. మీర వచ్చేసరికి కృష్ణయ్యమీరు ఇంట్లో లేరు. శ్రీపాదు బి. ఎస్సీ. టెక్స్‌టైల్స్ పూర్తిచేసుకుని బెంగుళూరులోనే ఫాక్టరీలో ఉద్యోగం చేస్తున్నాడు. అక్కడే గోవిందుడి ఇంట్లో ఉంటున్నాడతడు. శ్రీహరి థారవాడ కర్ణాటకకాలేజిలో లెక్చరర్‌గా పని చేస్తున్నాడు.

మీర తలుపు తట్టగానే కమలమ్మగారు తలుపుతీసి మీరను చూసి ఆశ్చర్యపోయారు.

"రామ్మ, రా. ఉత్తరంముక్కయినా రాయకుండా అకస్మాత్తుగా వచ్చావేం? శాము రాలేదూ? ఇంట్లో అంతా కులాసాయేనా?" అన్నారు. అనుకోకుండా మీర రావటం ఆమెనెంతో సంతోషపరిచింది. నలుగురు కొడుకులున్నా అందరూ చదువులు పూర్తిచేసుకుని వేరే ఊళ్ళలో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ఆఖరివాడు శ్రీపాదు బెంగుళూరు వెళ్ళి సంవత్సరమయింది. అప్పటినుండి భార్యాభర్తలిద్దరే. కృష్ణయ్యగారు ఇంకా రిటైర్ అవ్వలేదు. ఆయన్ని ఒంటరిగా వదిలి కొడుకుల దగ్గరికి వెళ్ళటం ఆమె కిష్టంలేదు. గోపాలం, గోవిందు అప్పుడప్పుడూ తల్లిని తమ దగ్గరకువచ్చి ఉండమని రాసేవారు. కాని భర్తకు అనానుకూల మవుతుందన్న కారణంగా ఆమె వెళ్ళేవారుకాదు. కృష్ణయ్యగారు ఆఫీసుకు వెళ్ళిపోతే ఇంట్లో ఆమెకు ఏమీ తోచేదేకాదు. సాయంత్రాలు ఎపుడయినా వియ్యపురాలు కావేరమ్మగారి ఇంటికి వెళ్ళివచ్చేవారు.

కమలమ్మగారు మీరను ఎంతో ప్రేమగా పలకరించారు భోజనానికి మరో కూరవండి అప్పడాలూ వడియాలు వేయించారు. "చిక్కిపోయా వేమిటమ్మా" అని పలకరించారు. "భోంచేద్దువుగానిలే. ఆకలితో ఉన్నావు" అని బలవంతంగా భోజనానికి లేపారు.

మీర భోంచేస్తూండగానే "ఓ రెండు నెలలు ఇక్కడే ఉండ రాదు టే. నాకూ ఏం తోచటంలేదు" అన్నారు.

"పోనీ శ్రీహరికి పెళ్ళి చెయ్యకూడదూ? వదిన ఇక్కడే...."

"సర్లే, ఎవరి పెళ్ళాల్ని వారు తీసుకుని వెళ్ళిపోతారు. ఇక్క డెందుకుంటారు?"

"మరి పెళ్ళి చేసుకోవటం దేనికంటా? మీ దగ్గర వదిలిపెట్ట టానికా?"

"వద్దు తల్లీ. భార్యాభర్తలు ఎక్కడున్నా సుఖంగా ఉంటే అదే చాలు. కాని శ్రీపాదు విషయమే బెంగగా ఉంది. ఒక్కోసారి ఉద్యోగం వదిలిపెట్టి వచ్చేయమందామా అనిపిస్తుంది."

"కాదు మరీ, శ్రీపాదు మీ ముద్దుల కొడుకాయె. ఇరవయ్ నాలుగేళ్ళ పసిపాపాయి." మీర వేళాకోళం చేసింది.

భోంచేశాక కాసేపు కబుర్లు చెపుతూ కూర్చుంది. తరువాత మీర "ఓ స్నేహితురాలింటికి వెళ్ళొస్తా"నని లేచింది.

"ఈ ఎండలో వెడతావా?"

"సాయంకాలం ఇంట్లోఉండదు. సమాజానికి వెళ్ళిపోతుంది."

"పోనీ గొడుగన్నా తీసుకుని వెళ్లు."

"వద్దు పెద్దమ్మా-పరవాలేదు" అంటూ బయల్దేరింది మీర. మహారాణి కాలేజీదగ్గరికి వెళ్ళేసరికి మధ్యాహ్నం ఒంటిగంటయింది. శెలవులు గనక కాలేజీ మౌనంగా తపస్సుచేస్తున్నట్టుంది. అయిదు న్నర ఏళ్ళ క్రితం తను అదే కాలేజీలో ఫేవరిట్ స్టూడెంట్‌గా ఉండ డం గుర్తుకొచ్చింది. డిబేట్‌లో, ఆటలపోటీల్లో, నాటకాల్లో పాల్గొని బహుమతులు తెచ్చుకున్న దృశ్యాలు ఆమె కళ్ళముందు నిలిచాయి. అన్నిటిల్లో ప్రధమ స్థానం ఆమెదే. నాటకాల్లో నూర్జహాన్, సంయుక్త తనే!

ఆమె మనసు మధురమైన జ్ఞాపకాలతో కోమలమయింది. తను మళ్ళీ విద్యార్థిని కాబోతోంది. మళ్ళీ నూర్జహాన్ పాత్ర ధరించవచ్చు. బహుమతులు పొందవచ్చు. కాని మళ్ళీ తను అయిదున్నర ఏళ్ళ

క్రిందటి మీర కావటం సాధ్యమా? ఆ పసితనం, చైతన్యం, ఉత్సాహం మళ్ళీ రమ్మంటే మాత్రం రాగలవా?

ఇక్కడే డ్రామాక్లాసు తీసుకునేవారు, లెక్చరర్ మర్చంట్ ఆఫ్ వెనిస్ క్లాసు తీసుకోవటం ఇంకా గుర్తుంది. ఆయన్ని ఎంత ఏడిపించేవారు పాపం. డ్రామా తీసుకునే లెక్చరర్ ఇంకా యువకులవటంవల్ల అమ్మాయిల అల్లరికి తట్టుకోలేకపోయేవాడు. ఓ రోజు సిగ్గుసంకోచాలతో కంగారుపడిపోయి. రాజేశ్వరి అడిగిన ప్రశ్నకు జవాబుచెప్పలేక తడబడి డస్టర్‌తో మొహం తుడిచేసుకున్నారు!

ఇది కన్నడంక్లాసు. ఈ క్లాసంటే అమ్మాయిలకంతా కొమ్ములొచ్చేసేవి. వెనకబెంచీల్లో కూర్చుని 'ఫిల్మిండియా', 'ఫిలిం ఫేర్' చదివేవారే ఎక్కువ. కన్నడమే కదా చదవకపోయినా పాసవుతాం అన్న ధైర్యంతో ఉన్న వినోద కన్నడంలోనే ఫేలయింది.

విరామసమయంలో అందరూ పైకివెళ్ళి అదీబ్‌ను బ్రతిమాలి బైజుబావరాలోని పాటలు పాడించి, వాటిని నేర్చుకోవటానికి ప్రయత్నించేవారు. 'గంగాకి మౌజ్‌మె' పాట నేర్చుకోకపోతే తన జీవితమే వ్యర్థమనుకున్న యశోద ఇప్పుడెక్కడుందో? రెండువందల పద్దెనిమిది చీరల రాణి వనజ 'దేవుడు వాన తుంపరలకు బదులుగా చీరల వర్షాన్ని కురిపించకూడదూ?' అనేది. మరో విజయలక్ష్మి పండిట్ కావాలని కలలు కన్న కనక, సినిమాతార కావాలని అలమటించిన మీనాక్షి అందరూ గుర్తుకొచ్చారు.

మీనాక్షికి పెళ్ళయింది. సినిమానటి కావాలన్న కోరిక ఒక విధంగా తీరింది. అలంకారప్రియురాలయిన మీనాక్షిని వాళ్ళత్తగారు "చాల్లే, నోర్మూసుకో. సినిమా తారలా సింగారించుకోవటం తప్ప నీకేం చాతనవును?" అనేవారట.

మీర ఓ కాయితంమీద తను ఇంటర్ పాసయిన సంవత్సరపు రిజిస్టర్ నంబర్ గుర్తువేసి గుమాస్తాచేతి కిచ్చింది. ఆయన 'ఎల్లుండి రండి' అన్నారు.

మీర ఇంటికొచ్చేసరికి కమలమ్మగారు టిఫిన్ చేస్తున్నారు.

"నీ ఫ్రెండు ఉందా ఇంట్లో" అనడిగారు.

"ఊఁ" అని మాట మార్చేసింది. సాయింత్రం ఇంట్లో విసు గనిపించింది. నర్మద ఇంటికి వెడదామంటే ఆమె ఊళ్ళోలేదు. అక్క దగ్గరకు బొంబాయి వెళ్ళింది. మరుసటిరోజంతా పెద్దమ్మ వెంటవెంట తిరుగుతూ గడిపింది.

ఇంటర్ సర్టిఫికేట్ తీసుకుని మెడికల్ కాలేజీకి అప్లికేషన్ వేసిన మరుసటి రోజే పల్లెకు బయలుదేరింది మీర.

'రెండురోజులకే భర్తను వదిలి ఉండలేకపోయావటే' అని వేళాకోళం చేశారు కమలమ్మగారు.

"ఎలాగూ మళ్ళీ...." అని మళ్ళీ తెలివితెచ్చుకుని, "అప్పు డప్పుడూ వస్తూవుంటాగా" అంది.

పల్లెకు బయలుదేరినపుడు ఆమె మనసు ఎప్పటికన్నా కొంచెం తేలిగ్గా ఉన్నా మనసులో ఆరాటంగానే వుంది. మెడికల్ కాలేజీలో సీటు దొరకటం చాలా కష్టమని ఆమెకు తెలుసు. విద్యార్థులు తెలివి, ఆసక్తి, పరీక్షలో తెచ్చుకున్న మార్కులు వీటినిబట్టి ఇచ్చేలా వుంటే మీరకు సీటు దొరకటంలో సంశయించవలసినదేమీ లేదు. కాని తెలివి తేటలకన్నా ప్రముఖ వ్యక్తుల ప్రభావం, జాతి ఇవే ప్రాముఖ్యం వహించటంతో మీర మనసు వ్యాకుల పడసాగింది. అన్నిటికన్నా ముఖ్యమయిన వైద్య వృత్తిలో ఇలాంటివి జరగటం, తెలివికన్నా జాతిని చూడటం ఎంత అన్యాయం! జబ్బుతో బాధపడుతున్న వ్యక్తి వైద్యుడిమీది నమ్మకంతో తన జీవితంలోని ఆశా, ఆకాంక్షల నన్ని టినీ అతనిచేతుల్లో పెట్టి, అనాథుడిలా వైద్యుణ్ణి ఆశ్రయించినపుడు సరిగ్గా 'డయాగ్నోస్' చెయ్యలేక,రోగపు మూలకారణాన్ని తెలుసుకో లేక మరోలా అర్థం చేసుకుని మందు ఇచ్చినట్టయితే రోగి గతేమిటి? శస్త్ర చికిత్స ఎంత బాధ్యతాయుమయిన పని? రోగి చావుబ్రతుకులు వైద్యుడి చేతిలోని శస్త్ర పరికరాల ప్రయోగం మీద ఆధారపడి ఉంటాయి కదా? వైద్యవృత్తి లాంటి గురుతరమయిన బాధ్యతతో కూడిన వృత్తిమీదకూడా జాతిప్రభావం పడటం ఏమంత మంచిది?

మీర విచారలహరి ఒక్కవేపునే పరిగెత్తసాగింది. ఈ అన్యా

యాలకు అంతమంటూ వుండదా? కంచే చేనుమేస్తే ఏమిటి గతి? రక్షించాల్సినవారే భక్షించటానికి మొదలెడితే కాపాడేవా రెవరు?

మీర మనసు కోపంతో మండిపోయింది. దేశాన్నంతా ఒక్కసారి కాల్చి భస్మం చేసివేసి కొత్త రాజ్యనిర్మాణం చేసేదాకా నూతన భావాలకు తావులేదేమో అనిపించింది.

తనకు కాలేజిలో సీటు దొరక్కపోతే—ఆ ఆలోచనతో మీర కంపించిపోయింది. ఆ ఒక్క ఆశే ఆమెను జీవితంతో బంధించి వుంచింది. ఆ ఒక్క ఆశాసూత్రమే జీవిత స్తంభానికి ఆమెను కట్టి వేసింది.

మీర ఎప్పుడు తిరిగివస్తుందో పల్లెలోవారికి తెలియదు. ఎండ మండి పోతూండటంవల్ల మీర బండి చేసుకుని ఇంటికి వచ్చింది. ఆమె వచ్చేసరికి శాము ఇంటికి రాలేదు. వెంకమ్మగారు మీరను చూసి సంతోషంతో పొంగిపోయారు.

"ఓ ఉత్తరం ముక్క రాయలేక పోయావా? శాము బండి పంపేవాడు కదా! నువ్వు లేకపోతే రెండురోజులకే ఇల్లంతా బావురు మంటున్నట్టనిపించింది. నువ్వు వచ్చావు. కళ వచ్చింది."

మీర కళ్ళు మూసుకుని పడక్కుర్చీలో వాలింది.

"అబ్బ! నీ భర్తను నీకే అప్పచెబుతున్నానమ్మాయ్. రెండు రోజులుగా సరిగ్గా ఇంటికే రావటంలేదు. సాయంత్రం అయిదింటికి ఫోంచేసి రాత్రికి అలాగే పడుకున్నాడు.

మీర కళ్ళు తెరిచింది. "ఇవ్వాళింకా భోజనానికి రాలేదా?"

"లేదు."

మీర లేచి నిల్చుని "బోరా....బోరా" అని పిలిచింది.

పాకలో పనిచేస్తున్న బోరడు పరిగెత్తుకొచ్చాడు.

"వెళ్ళి అయ్యగార్ని భోజనానికి పిల్చుకురా."

వెళ్ళిపోతున్న బోరడ్ని వెంకమ్మగారు వెనక్కి పిల్చి "అమ్మగారు రమ్మన్నారని చెప్పవోయ్" అన్నారు.

శాము ఇంటికొచ్చేసరికి మధ్యాహ్నం మూడు గంటలయింది.

ఎండకు శాము మొహం ఎర్రగా కంది పోయింది. బాగా అలసి పోయాడు.

శాము రాగానే మీర లేచి పీట వేసి, కంచం పెట్టి, గ్లాసులో నీళ్ళు పెట్టింది. శాము కాళ్ళు కడుక్కుని భోజనానికి కూర్చున్నాడు. మీర వంటింట్లోనే కాస్త దూరంగా కూర్చుంది.

తను మైసూరికి వెళ్ళిపోవటం అతనికి చాలా బాధాకరంగా వుందని ఆమెకు తెలుసు. సాంత్వనగా మాట్లాడదామంటే వీలుపడ నివ్వటం లేదతను. సంభాషణ త్రుంచేసి వెళ్ళిపొయ్యేవాడు.

రాత్రి ఇక ఊరుకోలేకపోయింది మీర. తనే ముందు పలక రించింది. వెలుగుతున్న లాంతరువత్తి వాళ్ళిద్దరి మాటల్ని వింటు న్నట్టు అటూ ఇటూ కదులుతోంది.

"ఎందుకని ఇలా చేస్తున్నారు మీరు?"

"ఏం చేశాను?"

"నిన్న సాయంత్రం అయిదింటికి భోంచేశారట. రాత్రి అలాగే పడుకున్నారట...."

శాము బదులు చెప్పలేదు.

మీర అంది "మీ రెందుకిలా చేస్తున్నారో నాకు తెలుసు. నేను చదవటానికి వెళ్ళటం మీ కిష్టం లేదు."

"ఛ. నువ్వు సుఖంగా ఉండటమే నాకు కావలసింది."

"నిజమేనా ఆ మాట?"

"ఆ, నిజమే."

"నా సుఖ సంతోషాల కోసం మీ రేమయినా సరే చెయ్య టానికి సిద్ధమేనా?"

"ఓ."

"అయితే మీ రిలా మనసులో బెంగపెట్టుకుంటే నాకు శాంతి ఉండదు. వేళకు సరిగ్గా భోజనం చెయ్యకుండా ఉంటే నేను సంతో షంగా ఉండలేను?"

"...................."

"మీ మీద కోపంతో నేను చదువుకోవటానికి వెళ్ళటం లేదు.

ఈ పల్లెటూళ్ళో ఎలా కాలం గడపాలో నాకు తెలియటంలేదు. పాత జ్ఞాపకాలనుండి తప్పించుకోవటానికి నాకున్న దారి ఇదొక్కటే. నా బుద్ధీ, మనస్సులకు విశ్రాంతి లేకుండా కష్టపడాలి. డాక్టర్ పరీక్ష పాసయ్యాక ఇక్కడికే వచ్చి పని చెయ్యాలన్న కోరిక నాకుంది."

శాము గబుక్కున ఆమె చెయ్యిపట్టుకుని "నిజంగానా?" అన్నాడు.

పసిపాపలా చకితుడయిన అతని మొహంవేపు చూస్తూ మీర చిరునవ్వు నవ్వింది.

"ఇప్పటి కలాగే అనుకుంటున్నాను మరి. ముందేం జరుగుతుందో చెప్పలేను. ఈక్షణం మనది. భవిష్యత్తు విషయంలో నాకు నమ్మకం లేదు. మెడిసిన్ పూర్తయ్యేవరకు నేను జీవించి ఉంటే ఇక్కడికే—మీ దగ్గరకే తప్పకుండా వస్తాను. భార్యలా కాదు; స్నేహితురాలిలా. కాని మెదడుకు పనిలేకుండా మీ సుఖమే నా సుఖమని భావించి ఉండలేను. భర్తే దైవం, అతను సుఖంగా ఉంటే తను సుఖంగా ఉన్నట్టే అని భావించే కాలం కాదిది. స్త్రీ భర్తకన్నా తన వ్యక్తిత్వాన్నీ, ఆత్మనీ గౌరవిస్తుంది. నా మహత్వాకాంక్షను మీరు అర్థం చేసుకుని గౌరవిస్తున్నారు. అది నా అదృష్టం. ఈ విషయంలో మీ కెలా కృతజ్ఞత తెలపాలో నాకు తోచటంలేదు."

శాము మౌనంగా దీపంవేపు చూస్తూ కూర్చున్నాడు. మీర అన్న మాటల్లో ఒక్క వాక్యం మాత్రం అతని మనసులో స్థిరంగా నిలిచింది.

"నేను ఇక్కడికే వచ్చి పనిచేస్తాను."

ఆ ఒక్కమాట అతనిలో చైతన్యాన్ని కలుగచేసింది.

"మీరేమి మనసులో బెంగపెట్టుకోకుండా సంతోషంగా నన్ను పంపండి. అప్పుడే నా మనసుకు శాంతిగా ఉంటుంది."

శాము మౌనంగా తన చేతిలోవున్న ఆమె చేతిని నొక్కాడు. మాటల్లో చెప్పకపోయినా అతని మనసుకు శాంతి కలిగింది.

* * *

మరుసటిరోజునుండి పోస్టుకోసం ఎదురు చూడటానికి మొద

లెట్టింది మీర. భోజనం, నిద్రా అన్నీ మరిచి పోస్ట్‌కోసం ఎదురు చూస్తోంది.

మైసూరు వెళ్ళివచ్చినప్పటినుండి మీర పరధ్యానంగా ఉండటాన్ని గమనించారు వెంకమ్మగారు.

"కూతుర్ని తల్చుకుని కాబోలు" అనుకున్నా మళ్ళీ "ఉహుం. కాదు, చూస్తే అలా కనిపించటంలేదు. మరేదో ఉన్నట్టుంది" అనుకున్నారు.

వీణ జ్ఞాపకాలతో బాధపడుతున్నప్పుడు మీర తన గదిలోకి వెళ్ళి తలుపులు వేసేసుకునేది. మొహంలో దుఃఖమూ, నిరాశా తప్ప మరేమీ ఉండేవికావు.

ఇప్పుడలా కాదు, పేరుకుమాత్రం చేతిలో పుస్తకం ఉండేది. అప్పుడప్పుడూ కళ్ళలో ఆశాకిరణం మెరిసి మాయమయ్యేది. కళ్ళలో చోటు చేసుకున్న దుఃఖపు తెరను తొలిగించి ఆశాభావం వెలిగి మళ్ళీ మాయమయి పోయేది.

మీర ఎంతో ఆత్రుతతో, కలవరంతో ఎదురుచూసిన రోజు రానే వచ్చింది. పోస్ట్‌మాన్ చేతినుండి అందుకున్న కవరును వణికే చేతులతో తెరిచింది.

ఉత్తరంలో ఫలానా రోజుని ఇంటర్వ్యూకి రావాలని ఉంది. తన జీవితాకాంక్ష అంతా యీ ఇంటర్వ్యూతో తేలిపోతుంది కదా అన్న బెంగ పట్టుకుంది మళ్ళీ.

శాము రాగానే ఉత్తరం అతనిచేతి కిచ్చింది. శాము చదువుకున్నాడు. మీర అతని మొహాన్నే పరీక్షగా చూస్తోంది. శాము చిన్నగానవ్వి "సంతోషం" అన్నాడు. కాని అతని మొహంలో కనిపించి మాయమయిన బాధా రేఖను మీర కళ్ళు గమనించాయి.

"ఎప్పుడు వెళ్ళను?"

"నీ ఇష్టం"

"మీరలా మాట్లాడితే వప్పుకోను. చెప్పాలి."

"ఇంటర్వ్యూకు ముందురోజు వెళ్ళు."

"అలాగే"

మీర రెండోమారు మైసూరికి ప్రయాణమయ్యేసరికి వెంకమ్మ గారికి సందేహం కలిగింది. నెలలో రెండుమార్లు మైసూరు ప్రయాణానికి ఏం కారణం ఉంటుంది? తమ కుతూహలాన్ని అణచుకోలేక వెంకమ్మగారు అడిగారు.

"ఇదేమిటమ్మాయ్ మళ్ళీ ప్రయాణమా?"

మీరకు నిజం చెప్పాలనిపించలేదు. తనకు సీటు రాకపోతే?

"నాకు కొంచెం వంట్లో బాగుండటంలేదు. మందు తెచ్చుకోవాలి."

"ఏమిటయింది?" వెంకమ్మగారు కంగారుపడిపోయారు.

"అలాంటిదేమీ లేదు. డాక్టర్‌కు చూపించి మందు తీసుకోవాలి. అంతే."

"అలాగే చెయ్యి, ఇంటిగురించి నువ్వేం బెంగపెట్టుకోకు. నేను చూసుకుంటాను. రెండురోజులు అటూ యిటూ అయినా మంచి డాక్టర్ దగ్గర చూపించుకుని రా తల్లీ."

ఆమె మాటలు తన్ను వెక్కిరించినట్టుగా ఫీలయింది మీర.

రెండోమారు మీర వచ్చేసరికి కమలమ్మగారికి కూడా ఆశ్చర్యం వేసింది. కాని దాన్ని కనపడనీయకుండా "రామ్మ" అన్నారు.

మరుసటిరోజు మీర బజారుకు వెళ్ళొస్తానని ఇంట్లోచెప్పి మెడికల్ కాలేజికి వెళ్ళింది. అప్పటికే అక్కడ చాలామంది అమ్మాయిలూ, అబ్బాయిలూ గుమిగూడారు. అందరి మొహాల్లోనూ కలవరం. సందేహం. భీతి కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. అక్కడున్నవారిలో ఎవరి పరిచయమూలేదు మీరకు, మీర మౌనంగా ఓ బల్లమీద కూర్చుంది. అందరూ ఒకరితో ఒకరు సన్నగా మాట్లాడుకుంటున్నారు. మీర పక్కన ఇరవయ్యేళ్ళ యువతి కూర్చుంది. ఆమెను చూస్తే మైసూరి అమ్మాయిలా కనిపించలేదు. రెండుజడలు వేసుకుని, చెవులకు రింగులు పెట్టుకుంది. ఎంబ్రాయిడరీ చేసిన తెల్లవాయిల్‌చీర కట్టుకుని ఆకుపచ్చ జాకెట్టు వేసుకుంది. మొదట ఆమే పలకరించింది ఇంగ్లీషులో___

"మీ పేరేమిటి?"

"మీర. మీ పేరు?"

"విజయ. మిస్ విజయా పరాంజపె."

"మీది ఈ ఊరు కాదనుకుంటాను?"

కాదు. మాది మహారాష్ట్ర. మా ఊరు పూనా."

"ఇక్కడి కాలేజిలో చేరుతున్నారేం?"

"మా నాన్నగారు పూనాలో ఉద్యోగం చేసేవారు. రిటైరయ్యాక ఇక్కడ మిల్ మానేజర్‌గా ఉద్యోగం దొరికింది. ఇక్కడే అయిదారేళ్ళు ఉండాలనుకుంటాను. పూనాలో చేరితే నేను హాస్టల్లో ఉండాలి. అందుకని ఇక్కడే జాయిన్ అవుదా మనుకుంటున్నా."

ఇంటర్ పూర్తిచేసి వచ్చారా?"

"అవును. మీరు?"

"నేనూ అంతే."

అంతలో ఇంటర్వ్యూ పూర్తిచేసుకుని లోపలినుండి ఓ కుర్రాడు బయటికి వచ్చాడు. ఇహ మిగతా కుర్రాళ్ళంతా అతన్ని చుట్టుముట్టి "ఏమడిగారు? ఏమిటి?" అని ప్రశ్నలవర్షం కురిపించారు.

ఆ అబ్బాయి నీరసంగా "పనికిరాని ప్రశ్నలన్నీను. ఇంటర్వ్యూ ఉట్టి నాటకంమాత్రమే. ఎవరికి సీటివ్వాలో ముందే నిశ్చయించుకుని ఉంటారు. గవర్నమెంటు ఉద్యోగస్తుల పిల్లలకూ, ఆల్లుళ్ళకూ సీటు దొరుతుంది. మనలాటి అనాథులకు తెలివితేటలుండీ పనికిరారు. మా నాన్నకు పదవిలేదు. వారి దృష్టిలో నేను ఉత్తమజాతికి జెందినవాణ్ణి. ఇక నా మార్కులు, నా తెలివీ ఎందుకు పనికివస్తాయి?"

"అయితే ఇదంతా నిజమేనట్రా?"

"కాకపోతే మరేమిటనుకున్నారు? చంటిపిల్లను తల్లి జాగ్రత్తగా చూడాలి. నిజమే. కాని పెద్దకుర్రాడిని మాడ్చి ఆ ముద్ద చంటిపిల్ల నోట్లో పెట్టటం న్యాయమెలా అవుతుంది? వెనుకపడినవారిని ముందుకు తేవాలి. నిజమే. కాని ముందున్నవారిని తొక్కిపెట్టి, వారి సమాధిమీదుగా ప్రగతి పథాన్ని నిర్మించాలని చూస్తోంది గవర్నమెంటు."

ఆ అబ్బాయి ఆవేశంతో మాట్లాడుతున్నాడు. అతని మొహం

ఎర్రబడింది. చుట్టూ ఉన్నవాళ్ళంతా అతన్నే చూస్తున్నారు. విజయకు అతని మాటలు అర్థం కాకపోయినా, అతను ఆవేశంతో మాట్లాడుతున్నాడని తెలుసుకుంది. ఆమె మీరవేపు తిరిగి,

"ఏమంటున్నాడతను?" అడిగింది.

"ఇంటర్వ్యూ ఉట్టి నాటకం అంటున్నాడు."

మీరకు లోపలినుండి పిలుపు వచ్చింది. మీర లేచి నిల్చుంది. విజయ వచ్చి "గుడ్ లక్" అంది.

మీర ప్రవేశించిన గదిలో పదకొండుమంది కూర్చున్నారు. అందులో ఆమెకు ఎవరి పరిచయమూ లేదు. మీర లోపలకి వెళ్ళగానే చేతులు జోడించి నమస్కరించింది. వాళ్ళలో ఒకరిచేతిలో మీర అప్లికేషన్ ఉంది. అందులో ఒకరు అడిగారు.

"నీ పేరేమిటమ్మా?"

"మీర."

"ఇంటర్ పాసయి ఎన్నేళ్ళయింది?"

"ఆరేళ్ళు."

"ఆరేళ్ళ క్రిందటే ఎందుకు చేరలేదు?"

"చేరలేకపోయాను."

"ఎందుకని?"

"వీలులేని పరిస్థితి ఏర్పడింది."

"అదేమిటో తెలుసుకోవచ్చా?"

ఈ ప్రశ్నలకు అర్థం లేదనిపించింది ఆమెకు.

"పెళ్ళయింది. అందుకని చేరలేకపోయాను."

"మరి ఇప్పుడో?"

"మా వారు నేను చదువుకోవటానికి అనుమతించారు."

"ఇప్పుడు మీరు చదవాలని ఎందుకు నిశ్చయించుకున్నారు?"

"నాకు మొదటినుండి డాక్టరవ్వాలన్న కోరిక ఉండేది. మా అన్నయ్య గోపాల్ అక్కడే చదివాడు."

"ఇంకేదైనా కోర్సుకు వెళ్ళలేకపోయారా?"

"డాక్టర్నవ్వాలని ఉంది."

"తరువాత?"

"గవర్నమెంటు ఉద్యోగం చెయ్యాలన్న ఆశలేదు. మా పల్లెకు వెళ్ళి రైతులసేవ చెయ్యాలన్న కాంక్ష ఉంది."

ఆయన మీర మార్క్సుకార్డ్‌ను రెండు నిమిషాలు పరిశీలించి "ఇక మీరు వెళ్ళవచ్చు" అన్నారు.

మీర నమస్కరించి వచ్చేసింది. మీర రాగానే విజయా పరాంజపె మెల్లిగా "అబ్బాయిలకు పోటీగా తయారయ్యా రెందు కని అడగలేదూ?" అంది నవ్వుతూ.

"లేదు. వస్తాను."

"మంచిది. ఇద్దరి అదృష్టమూ బాగుంటే మళ్ళీ కలుద్దాం."

ఆ రోజంతా విజయ పసిపాపలాంటి మొహం మీర కళ్ళకు కట్టినట్టు ఉంది.

* * *

మీర మైసూరు వెళ్ళినరోజు సాయంత్రం శాము ఏమీ తోచక అవధాన్లగా రింటివేపు వెళ్లాడు. అవధాన్లుగా రింట్లో లేరు. కాని ఆయన భార్యా, వెంకూ ఉన్నారు. వారితోనే కబుర్లు చెబుతూ కూర్చున్నాడు. మాటమధ్యలో అకస్మాత్తుగా శాము నోటినుండి,

"మీర ఇంకెన్ని రోజులు ఇక్కడుంటుందో!" అన్న మాట వచ్చేసింది. వెంటనే తన తప్పు తెలుసుకున్నాడు. ఆమాట విన్న అవధాన్లుగారి భార్య ఆశ్చర్యానికి అంతులేదు.

"అదేమిటి శామణ్ణా, అలా అంటున్నావు?" అనడిగారు ఆమె.

"అహఁ....ఏం లేదు....మీరకు పల్లెలో ఏం తోచటంలేదు. కొద్దిరోజులు మైసూర్లోఉండి వస్తుంది" అన్నాడు తడబడుతూ.

"నువ్వూ వెడతావా?"

"ఉహుఁ"

"మరి మీర నొక్కర్తినే పంపుతావా? ఆమె లేకపోతే నీకు అన్నంకూడా సయించదని వెంకమ్మగారు...."

"ఛ ఛ. అలాంటిదేమీ లేదు నాకు. పాతగాయాన్ని కాస్త

మరవగలుగుతుందేమోనని....ఇక్కడే ఉంటే ఎప్పుడూ కుమిలిపోతూ ఉంటుంది. మీరు చూస్తూనే ఉన్నారుగా, ఎలా ఉన్నమనిషి ఎలాగై పోయిందో?"

"నువ్వుమాత్రం ఎలా అయిపోయావో నీకు తెలీనట్టుంది. ఆ రంగూ, ఆ వళ్ళూ ఏదీ? సన్నగా నల్లబడిపోయావ్. శామణ్ణా నేనో మాట చెబుతా. ఏమీ అనుకోకు. మీర వెళ్ళిపోతే నువ్వు మరీ అధ్వాన్నమయి పోతావు. మీర వెళ్ళేలా ఉంటే నువ్వూ వెళ్ళు. అంతే."

"నేను వెళ్ళటానికి ఎలా వీలుపడుతుంది?"

"ఏం? ఎందుకు వీలుపడదు?"

"ఇక్కడెవరు చూసుకుంటారండి? జానిపోయిన క్రొత్తలో కొద్దిరోజులు అశ్రద్ధవహించినందుకే పనులన్నీ ఎక్కడివక్కడే ఆగి పోయాయి."

"మీర వెళ్ళిపోతే నీకుమాత్రం ఎలా తోస్తుంది? ఎలా ఉండ గలవిక్కడ?"

"కాని మీర ఇక్కడుండలేదు. మీర ఇక్కడేఉంటే ఆఖరికి పిచ్చాసుపత్రిలో చేర్చాల్సి ఉంటుంది. మైసూర్లో చదువుకుని...."

అవధాన్లుగారి భార్య ఆశ్చర్యపోయారు.

"ఏవిఁటి? మీర మళ్ళీ చదువుకుంటుందా? ఈ వయసులో...."

"అవును. మీర డాక్టరీ చదువుతుంది. చదువుకు వయ స్సేమిటి? నాకూ పంపాలనిలేదు. కాని మీరను పిచ్చాసుపత్రిలో చూడ టంకన్నా మెడికల్ కాలేజిలో చూడటం నయంకదూ?"

మాట్లాడుతున్న శాము అలాగే లేచి నిల్చుని వెడుతున్నానని కూడా చెప్పకుండా వెళ్ళిపోయాడు.

అవధాన్లుగారి భార్య తెల్లబోయారు. మీర ప్రవర్తన ఆమెకో పెద్ద సమస్య అయింది. అపార ఐశ్వర్యాన్ని, దేవుడిలాంటి భర్తనూ వదిలి చదువుకోవటానికి వెడుతున్న మీర ఆమెకు పిచ్చిదానిలా కన బడింది. ఈ విషయం విన్నదగ్గర్నుండీ మతిపోయినట్టయింది ఆమెకు.

సాయంకాలం దేవుడిముందు దీపం వెలిగించి ఉంచాలన్న ధ్యాసకూడా లేకుండా అలాగే కూర్చుని,

"ఇదేం పోయేకాలం! భర్త భార్యను వదిలిపెట్టటం ఎరుగుదుంకాని భార్య భర్తను విడిచివెళ్ళటం ఇంతవరకూ వినలేదే" అని ఆలోచించసాగారు. ఇహ ఇంట్లో కూర్చోలేక "వెంకూ, పాలు తీసి పొయ్యి వెలిగించమ్మా. నేనలా కోవెలకు వెళ్ళొస్తా" అని కొబ్బరికాయ, తమలపాకులు, వక్క పళ్ళెంలోపట్టుకుని గుడికి బయలుదేరారు.

అక్కడినుండి వచ్చేటప్పుడు పండితులవారి ఇంటికి వెళ్ళారు. పండితులవారి భార్య పుట్టమ్మగారు "రండి సాకమ్మగారూ" అని పిలిచారు.

"ఉహుఁ మీరే రండి. అలా చెరువుదాకా వెళ్ళొద్దాం" అన్నారు సాకమ్మగారు.

ఇద్దరూ చెరువుగట్టుదాకా వెళ్ళారు. సాకమ్మగారు మామూలుగా ఒక్క నిమిషంకూడా మౌనంగా ఉండి ఎరుగని మనిషి. మీర సంగతి విన్నప్పటినుండి ఆమె నోరు మూతపడిపోయింది. మౌనంగా ఉన్న ఆమెను చూసి పుట్టమ్మగారు "ఇదేమిటండి సాకమ్మగారూ! ఎన్నడూలేంది మాట్లాడితే ముత్యాలు రాల్తాయేమో నన్నట్టుగా మౌనంగా ఉండిపోయారేం?" అనడిగారు.

సాకమ్మగారు నోరు విప్పారు.

"ఆ పిల్ల కర్మ మిలా కాలిందికదా అని ఆలోచిస్తున్నా."

"వెంకు సంగతా?"

"కాదు. మీర సంగతి చెబుతున్నా."

"ఏం? మీర కేమయింది? రాణిలా ఉంది. కర్మేమిటి? అమ్మాయి పోయిన దుఃఖమంటారా. ఎన్నిరోజు లుంటుందని? చెట్టుంటే ఫలానికి కొదువేమిటండి? మరోపిల్ల చంకలోకి ఎక్కేదాకా బాధపడుతుంది. తరవాతేముంది?"

"జానికి అయిదేళ్ళయినా తరవాత పిల్లలే కలగలేదు. అంత ఆస్తి ఉంది. సంవత్సరానికో పిల్ల పుట్టకూడదూ?"

"ఈ కాలపు పిల్లలు ఏమేం చేస్తారో ఎవరికి తెలుసు?"

"ఇప్పుడు చూడండి, మీరకు ఇక్కడేం తోచడంలేదట. చదువుకోటానికి మైసూరు వెడుతుందట" అన్నారు సాకమ్మగారు.

పుట్టమ్మగారు అదిరిపడి "ఏమిటీ?" అన్నారు.

"మీర భర్తను వదిలిపెట్టి చదువుకోవటానికి మైసూరు వెడుతుందట."

"ఏం? ఏంతక్కువయింది? చదివి ఉద్యోగంచేసి సంపాదించాలా? దేవుడిచ్చిన ఆస్తి బోలెడంత ఉంది, చాలదూ?"

"నిజం పుట్టమ్మా, ఈ సంగతి విన్నదగ్గర్నుండీ నా మనసుకు స్తిమితంలేదు. మీరకు మంచిబుద్ధి కలగనీ స్వామీ అని వేడుకుందామని కోవెలకు వచ్చాను."

"పోనీ మీరను పిల్చి కాస్త బుద్ధిచెప్పరాదూ? శామణ్ణమాత్రం ఇంతవరకూ ఎందుకు రానిచ్చాడు? కర్ర విరిచినట్టే వీల్లేదని చెప్పలేకపోయాడా?" అన్నారు పుట్టమ్మగారు ఆరాటంతో.

"నేను శామణ్ణతో అదే చెప్పాను. కాని అతను నా మాట వినలేదు."

"ఇంకో ఇద్దరు పిల్లలన్నా పుడితే జానిని మర్చిపోగలుగుతారేమో!"

"నిజమే."

"మీరను ఓ సారి మా ఇంటికి భోజనానికి పిలుస్తాను, అప్పుడు కాస్త చెప్పిచూద్దాం."

"కాని 'నా ఇష్టం. మీకెందు కిదంతా' అంటే?" సాకమ్మగారు సంశయం వ్యక్తపరిచారు.

"అలా అనదు. పెద్దల్ని గౌరవించటం తెలుసును." అభిమానంతో అన్నారు పుట్టమ్మగారు.

మీర మైసూరునుండి వచ్చిన మరుసటిరోజే సాకమ్మగారి కూతురు వెంకు వచ్చి పిలిచింది.

"మీరక్కా, మా ఇంటికి భోజనానికి రావాలిట నువ్వు, అమ్మ చెప్పింది."

మీర ఓ క్షణం అనుమానించింది. "ఆయనింకా ఇంటికి రాలేదు" అంది.

"శామణ్ణ ఎప్పుడొస్తాడో ఏమిటో, మీరు రండి, సేమ్యా వేడిగా ఉంటేనే బావుంటుంది."

అక్కడే వత్తులుచేస్తూ కూర్చున్న వెంకమ్మగారు "వెళ్ళి రా పాపం. అంత అభిమానంతో పిలుస్తున్నప్పుడు రాననటం బావుండదు. శామణ్ణవస్తే నేను చెబుతాలే" అన్నారు.

ఏం చేద్దామా అని ఆలోచిస్తున్న మీర వెంకమ్మగారి మాట వినగానే వెడదామనే నిశ్చయించుకుంది. మీర అవధాన్లు గారింటికి వచ్చేసరికి పుట్టమ్మగారు అక్కడే ఉన్నారు, సాకమ్మగారు మీరను చూపి—

"రామ్మా, మైసూరినుండి ఎప్పుడొచ్చావ్?" అంటూ పలకరించారు.

"నిన్ననే వచ్చానండి,"

"అందరూ కులాసాయేనా?"

"ఆ"

"లోపలికి వెడదాం రామ్మా"

నట్టింట్లో అరిటాకు వేసి వడ్డించారు. కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు కానిచ్చారు. భోజనాలయ్యాక సాకమ్మగారు ఓ గిన్నెలో సేమ్యావేసి మూతపెట్టి వెంకుచేతికిచ్చి "అర్చకులవారింట్లో ఇచ్చేసిరా" అన్నారు. వెంకు ఆర్చకుల ఇంటికివెడితే అక్కడ తనయీడు పిల్ల శారదతో కబుర్లు చెబుతూ ఉండిపోతుందని తెలుసు. అందుకే ఎప్పటిలా "త్వరగావచ్చేయి" అనలేదు.

ఆవిడ చిన్నకొడుకు వెంకటేశు బయట ఆడుకుంటున్నాడు. అవధాన్లుగారు లోపల పడుకున్నారు.

సాకమ్మగారు గదిలో చాపవేసి తాంబూలం పళ్లెంతెచ్చి ఉంచి, "వేసుకోండి పుట్టమ్మగారూ. వేసుకో మీరా" అన్నారు.

"నాకు వద్దండి" మీర వినయంగా చెప్పింది.

పుట్టమ్మగారు తమలపాకుకు సున్నం రాస్తూ సంభాషణ కుపక్రమించారు.

"మీరా నేనో సంగతి అడగాలను కుంటున్నా, నువ్వేం అపార్థం చేసుకోనంటే చెబుతాను."

గోటితో చాప కడ్డీని లాగుతూ కూర్చున్న మీర తలెత్తి చూసింది. ఆమె ఏం అడగాలనుకుంటున్నారో అర్థంకాలేదు. బహుశా తను మైసూరికి వెళ్ళివచ్చినదానికి కారణం అడుగుతారేమో అనుకుంది.

"అడగండి, నేనేమీ అనుకోను," అంది మెల్లిగా.

"చదువుకోవటానికి మైసూరు వెడుతున్నావట నిజమేనా?"

"........................"

"నిజమేనా మీరా?"

"నిజమే"

"ఎందుకు?"

"నా మనసును తేలికపర్చుకోవటానికి నాకు మరో మార్గం లేదు కనక"

"శామణ్ణ నీకేం తక్కువ చేశాడమ్మాయ్? డబ్బుకు కొదవా? శామణ్ణ నిన్నేమన్నా బాధపెడుతున్నాడా? అతడిని వదిలివెళ్ళటం న్యాయమేనా నీకు? ఆడదాని స్థానం భర్త ఇంటిలోనే కదమ్మా! అసలు నువ్వెందుకు చదవాలి?"

మీర అసహాయురాలిలా "నేను వీణను మరవలేను. ఆ జ్ఞాపకాలనుండి తప్పుకోవాలంటే నా మెదడుకు పనికావాలి, మీకు తెలీదు. నాకడుపు తరుక్కుపోతోంది. చింతాగ్ని నన్ను కాల్చేస్తోంది. నాకు డబ్బుంది నిజమే. కాని అది నన్ను సుఖపెట్టలేదు. మీరన్నది నిజమే. ఆయన ఎంతో మంచివారు. నాదే తప్పంతా, ఇక్కడి జీవితానికి అలవాటు పడలేక పోవటం నా బలహీనత. ఏం చెయ్యను నేను? నాకు డబ్బువద్దు. శాంతి కావాలి." అంది.

మీర ఆవేశం చూసి పుట్టమ్మగారు కంగారు పడిపోయారు.

"మీరా, బిడ్డను పోగొట్టుకున్న తల్లి దుఃఖం ఎలా ఉంటుందో

నాకు తెలుసునమ్మా, నేనూ అనుభవించాను. నా మొదటిబిడ్డ పోయి నప్పుడు నేనూ ఇలాగే బాధపడ్డాను. కాని ఇప్పుడు మిగతా పిల్లల్ని చూసుకుని ఆ బాధని మర్చిపోలేదా?"

"కాని....కాని....మీ పరిస్థితే వేరు. నా పరిస్థితి వేరు" అని మోకాలిమీద తలపెట్టుకుని వెక్కి వెక్కి ఏడ్చింది.

మీర ఇలా చిన్నపిల్లలా ఏడ్చేస్తుందని ఊహించలేదు వాళ్ళు. మీర ధైర్యవంతురాలు, గడుసుపిల్ల అని అనుకున్నారు. మీర ఇప్పుడు తమముందు పసిపిల్లలా ఏడుస్తూ కూర్చోవటంతో ఆమెకేమీ తోచలేదు. సాకమ్మగారు మీర దగ్గరగావచ్చి ఆప్యాయంగా తల నిమురుతూ,

"ఏడవకమ్మా. జరిగిందేదో జరిగిపోయింది. ఏడవకు" అని ఓదార్చారు.

క్రమంగా మీర తేరుకుంది. ఆమె దుఃఖావేశం తగ్గాక పుట్టమ్మ గారు,

"పిల్లలు లేకపోతే భర్తతో ఉండలేమా మీరా? మా దొడ్డమ్మకూ పిల్లల్లేరు, కాని ఆమెకు భర్తంటే ఎంత భక్తీ, ప్రేమా ఉందనీ! అరవయ్యేళ్ళొచ్చినా నిన్నా, మొన్నా పెళ్ళయినవారిలా ఉన్నారు."

"కావచ్చు. మీ దొడ్డమ్మ పెరిగినరోజులూ, అప్పటి భావా లకూ, నేను పుట్టిపెరిగిన కాలపు తీరుకూ చాలాతేడా ఉంది. ఆమె భర్తే ప్రత్యక్ష దైవమని నమ్ముతారు. భర్తగీచిన గీత దాటడం మహా పాపం అనుకుంటారు. భర్తలోనే అన్ని సుఖసంతోషాలనూ చూడ గలుగుతారు."

"మరి నువ్వో?"

"నేను భర్త దైవం అని భావించటంలేదు. భర్తకూడా నాలాంటి మనిషే, నా ఆకాంక్ష, ధ్యేయాలకు అడ్డునిలిస్తే అతని మాటకు యెదురుచెప్పటం తప్పుకాదను కుంటున్నాను."

మీర మాటలువిని పాతకాలపు ముత్తైదువలు ఆశ్చర్యపోయారు. పాతకాలపు వాతావరణంలో పెరిగి భర్తే దైవమన్న భావాన్ని నర నరాల్లోనూ జీర్ణించుకున్నవారికి మీర మాటలు నచ్చలేదు. భర్త

మాటలకు అడ్డుచెప్పటమంటే క్షమించరాని నేరంగా పరిగణించేవారు వాళ్ళు.

"హిందూ స్త్రీలకు భర్తే దైవం. అతనిమాట జవదాటడం మహాపాపం."

"కాని నేనలా అనుకోవటంలేదు. ఆయన్ను పెళ్ళి చేసుకోవటం నా అదృష్టం. కాని ఆయన దురదృష్టవంతులు. అయన నా కోరిక సఫలం కావటానికి సహాయం చేస్తున్నారు. అదీ నా అదృష్టమే."

"శాము ఇంకా కుర్రాడు. ఎన్నాళ్ళిలా ఉండగలడు? ఆ సంగతి నువ్వు ఆలోచించక్కర్లేదా?"

"ఆయన మళ్ళీ పెళ్ళి చేసుకోవటానికి నా అభ్యంతర మేమీ లేదు" అంటూ మీర లేచి నిల్చుంది.

సాకమ్మగారు "నిన్ను ఏడిపించటానికే పిలిచినట్టయింది. ఎంతయినా పాతకాలం వాళ్ళం మేము. మన భావాలకు పొందిక ఉండదు" అన్నారు.

"నాకు కోపమేంలేదు." అంటూ మీర బుగ్గలమీద నిలిచిన కన్నీటి చారికలను రుమాలుతో తుడుకుని ఇంటికి వెళ్ళిపోయింది.

పుట్టమ్మగారు నిట్టూర్చి "మంచిపిల్ల, ఏ దుష్టగ్రహాలు ఆ అమ్మాయిని పీడిస్తున్నాయో" అన్నారు.

మీర భర్తను వదిలిపెట్టి మైసూరుకు వెళ్ళి చదువుకుంటుందన్నవార్త పల్లెఅంతటా వ్యాపించింది. మొదట ఎవరూ ఆ మాట నమ్మలేదు. కాని పల్లెలో అందరి గౌరవాభిమానాలకూ పాత్రులయిన సాకమ్మ పుట్టమ్మగార్ల నోటినుండి యీ మాట విన్నప్పుడు నమ్మక తప్పలేదు.

పల్లె ప్రజలకు కాలక్షేపానికి కొత్తసంగతి దొరికింది. పండు ముసలి బీరమ్మ చోళ్ళు చెరుగుతూ రామక్కతో "ఇన్నావా?" అంది.

"ఆఁ, ఆఁ, ఇనకేం మండిపోతన్నాది. పెళ్ళాలు మొగుళ్ళ నొదిలేస్తున్నారు. బ్యాంమర్లూ ఇట్టా సేదిస్తారా?"

"శ్యామపోర్రు ఎంతో మంచోరు పాపం!"

"బిడ్డ పోయిందిగందా ఆ దుక్కం మరిసిపోవ టానికంటా!"

"ఓ బిడ్డపోతేనేటి? ఇంకోటి పుడతాది. బిడ్డ పోనాది గందాని మొగుణ్ణే వదిలేస్తారా?"

"దేవునికే ఎరక. లోపల ఏదేటున్నాదో, పైకట్టా సెపుతున్నారు."

"పెద్దోళ్ళ ఊసు మనకెందుకులే" అని ఇద్దరూ ఊరుకున్నారు.

ఒక్కొరు ఒక్కోరీతిగా వ్యాఖ్యానిస్తూనే ఉన్నారు. నీలమ్మ భర్త శివయ్య.

"శ్యామవిప్పోరి మెతకదనం ఇంతాసేస్తోంది. పెళ్ళాన్ని తల మీద కూకోబెట్టుంటే ఇంకేమవుతాది? పట్టుకు బాదివదిలిపెడితే, నా సామిరంగా అదే మందు." అన్నాడు.

అందరికన్నా గాబరాబడిన వ్యక్తి వెంకమ్మగారు. చిన్నప్పుడే వైధవ్యాన్నిపొంది, ఇంకోకరిసేవలో తమ జీవితపు సార్థకతను చూసుకుంటున్నారు ఆమె. పెద్దమనిషి కాకమునుపే భర్తను పోగొట్టుకుని, ఎటూ ఆశ్రయంలేక దూరపు బంధువయిన శాము తండ్రిపంచన చేరారు. శాము తల్లి ఆవిడను వంటమనిషిగా చూసేదికాదు. భార్యాభర్త లిద్దరూ ఇంట్లో మనిషిగానే స్నేహ విశ్వాసాలతో చూసేవా రావిడను. ఆమె జీవితం వారి కుటుంబంతో పెనవేసుకుపోయింది. శాము అంటే ఆమెకు పంచప్రాణాలు. వంశాని కంతా ఒక్కడైన శామును అతి జాగ్రత్తతో, ఆప్యాయతతో పెంచారు. శాము పెళ్ళి చేసుకున్న మీరను ఎంతో ప్రేమతోనూ, అభిమానంతోనూ చూచుకునేవారు. ఒక్కోసారి మీర తెలివినీ, గడుసుదనాన్నీ చూసి—

"తల్లీ! నువ్వు మగాడై పుట్టిఉంటే లోకాన్నే ఏలేదానివి" అని మెచ్చుకునేవారు, అప్పుడు శాము చిరునవ్వు నవ్వుతూ "అమ్మబాబోయ్! అప్పుడు నా గతేమిటి?" అనేవాడు.

అంతపెద్ద భవంతికి వెలుగులాఉన్న మీర మైసూరుకి వెళ్ళిపోతుందని విని వెంకమ్మగారు దిగులు పడసాగారు. ఏం చెయ్యలేక మీర లేకుండాచూసి శాముతో "ఇదేమిటి నాయనా? ఇలా జరుగు

తుందా ఎక్కడైనా?" అనడిగారు. శాము ఏమిటన్నట్టు ఆవిడవైపు చూశాడు.

"మీర ఇక్కడే ఉండేలా చూడలేవా?"

"వీలు పడదత్తయ్యా."

"అలా అంటే ఎలా బాబూ? ఏం తక్కువయింది మీరకు?"

"దాని మనసుకు శాంతిలేదు."

"చదివితే శాంతి లభిస్తుందా? శాంతి బయటినుండి రాదు. మనసులోనుండే రావాలి."

శాము ఒక్కనిమిషం తలవంచుకుని నిలబడి "మీర జానిని మరవటానికోసం వెడుతోంది." అన్నాడు.

జానిపేరు వినగానే వెంకమ్మగారి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"ఎక్కడికి వెడితేమాత్రం పిల్లను మరవటం సాధ్యమా? ఇంకో పిల్ల పుడితే ఆ గాయం తానైతానే మానుతుంది."

వెంకమ్మగారి మాటకు శాము బదులు చెప్పకుండా ఆ చోటు వదిలి వెళ్ళిపోయాడు. వెంకమ్మగారి మనసు ఆలోచనలతో సతమతమవుతోంది.

అయితే ఇప్పటిదాకా ఎవరూ పుత్రశోకాన్ని అనుభవించలేదా? బిడ్డను పోగొట్టుకున్న వారంతా భర్తనువదిలి వెళ్ళిపోతారా? అభిమన్యుడిలాంటి కొడుకుని పోగొట్టుకుని సుభద్ర బ్రతికివుండ లేదా? ఇంకో పాపకలిగి ఈ ఇంటి చీకటిని పారద్రోలి, వెన్నెలకాంతిని ప్రసరింపచేయదా?

మీర వెళ్ళిపోతే శాము సుఖంగా ఉండలేడన్న సంగతి వెంకమ్మగారికి బాగా తెలుసు. అతనుమాత్రం భార్య కెందుకంత చనువివ్వాలి? మొదటినుండి అలాగే చనువిచ్చి నెత్తికెక్కించుకున్నాడు. పోనీ....వాటి గురించి తను ఆలోచించటం అనవసరం. కాని తాము పెంచి పెద్ద చేసిన శాము అశాంతిగా ఉండటాన్ని తను చూడగలదా? ఈ పిల్లను ఎలాంటి దుర్ముహూర్తంలో చేపట్టాడో, అప్పటినుండి ఏదో ఒక చికాకు ఉండనే ఉంది. ఆఖరికి వాడి మేనమామ కూతురు సరసిని పెళ్ళాడినా బాగుండేది. నిజమే, మీర అపు

రూప సుందరి. కాని చేపట్టిన భర్తను సుఖపెట్టలేని భార్య సౌంద ర్యానికి విలువేమిటి? మీర బంగారంలాటిపిల్ల....కాని కాస్త తలతిక్క.

"వెంకమ్మగారూ, వెంకమ్మగారూ"

వెంకమ్మగారు తమ ఆలోచనల నుండి తేరుకుని, "ఏమి టమ్మా" అంటూ బయటికివచ్చారు. మీర ఓ లేగదూడ వెనుక తిరుగుతూ దాన్ని పట్టుకోటానికి ప్రయత్నిస్తోంది. దూడ ఆమె చేతికి అందకుండా గెంతుతూ పరిగెడుతోంది. దాన్ని పట్టుకునే ప్రయ త్నంలో మీర అలసిపోయింది. ఆమె ఉంగరాలజుత్తు గాలికి చెదరి పోయింది. ఎండకు మొహం ఉత్సాహంతో మెరుస్తోంది. దుఃఖపు చాయ మరుగునపడి చైతన్యంతో కళకళ లాడుతున్నాయి ఆమె కళ్ళు.

వెంకమ్మగార్ని చూసి మీర "దూడ మన్ను తింటోంది. నోటికి బుట్టవేద్దామని చూస్తున్నా, చేతికి అందటం లేదది" అంది.

మీర మొహం చూడగానే వెంకమ్మగారి కోపం మాయ మయింది.

జాని ఇంకో పదేళ్ళు బ్రతికివుంటే ఇలాగే కనిపించేదేమో!

అందంగా కనిపిస్తున్న మీర మొహంలో జాని మొహాన్ని ఊహించుకుంటూ నిల్చున్నారు వెంకమ్మగారు. ఆమె తనను అలా చూస్తూ నిల్చోవటం గమనించి,

"ఏమిటలా చూస్తున్నారు?" అంది మీర.

"ఏం లేదమ్మాయ్. కణ్వాశ్రమంలో లేడితో ఆడుకున్న శకుంతల ఇలాగే ఉండేదేమో అనుకుంటున్నా."

"ఆ దూడను పిలవండి మరి."

"గంగా....గంగా....దా....దా...." అని పిలిచారు వెంకమ్మ గారు. దాని దగ్గరకువెళ్ళి మెళ్ళో వేలాడుతున్న బుట్టను నోటికి వేశారు. మీర అద్భుతాన్ని చూపినట్టు చూస్తూ నిల్చుంది.

"మీరు దానికి ఏం మంత్రం వేశారబ్బా...."

వెంకమ్మగారు జవాబు చెప్పలేదు కాని, "నువ్వు శామణ్ణకు ఏం మంత్రం వేశావోకదా!" అని మనసులోనే అనుకున్నారు.

* * *

మీరకు మెడికల్ కాలేజీలో సీటు దొరికిందని తెలిపిన రోజున శాము జట్టునుండి తప్పిపోయిన లేగదూడలా విలవిలలాడి పోయాడు. "నువ్వు చదవటానికి వీల్లేదు" అని ఖచ్చితంగా భార్యతో చెప్ప లేడు. ఆమెకు కొంచెమయినా శాంతి లభింపచెయ్యటానికి తను అశాంతితో కుమిలిపోవటానికి సిద్ధపడ్డాడు. పోనీ ఆమె అయినా కాస్త హాయిగా ఉంటుందికదా అన్నదే అతని ఆశ.

మీర మైసూరికి వెళ్ళే ప్రయత్నంలో ఉంది. మెడికల్ కాలేజి హాస్టల్‌లో సీటు దొరికింది, ఆమె మెడికల్ కాలేజిలో చేరే విషయం పెదనాన్నకు తెలియపర్చటం, దానికి బదులుగా ఆయన దగ్గర్నుండి వచ్చిన పెద్దకవరును తెరిచి చూడకుండానే చింపిచింపి ముక్కలు ముక్కలుగాచేసి పారవెయ్యటంకూడా జరిగిపోయింది.

మీర వెళ్ళేరోజు నిశ్చయమయ్యాక ఇంటిని రుద్రమౌనం ఆవరించింది. శాము ఇంటిపట్టున ఉండేవాడే కాదు. ఎన్నో రాత్రులు శాముకోసం ఎదురుచూస్తూ మీర సోఫాలో కూర్చుని అలాగే నిద్ర పోయేది. శాము అది చూసి ఆమెకు శాలువా కప్పి వెళ్ళి పడుకునే వాడు. ఉదయం తన వంటిమీద శాలువాచూసి "నన్నెందుకు లేప లేదు" అని కోపం తెచ్చుకునేది మీర. కాని శాము బదులు చెప్ప కుండా నవ్వి వెళ్ళిపోయేవాడు.

రేపు ప్రయాణమనగా ముందురోజున శాము నింగడితో ఉద యానికి బండి సిద్ధంగా ఉంచమని చెప్పాడు. వెంకమ్మగారితో ఏద యినా ఫలహారం చేసిపెట్టమని సూచించాడు.

రాత్రి మీరపెట్టెలో గుడ్డలు సర్దుకోవటాన్నిచూస్తూ మౌనంగా కూర్చున్నాడు శాము.

మీర పెట్టెలో సాదావాయిల్, నేతచీరలు సర్దుతోంది. ఆమెకు అత్యంతప్రియమయిన జార్జెట్ చీరలనూ, శాము మెచ్చుకునే ధర్మ వరపు చీరలనూ పక్కకు పెడుతోంది.

"ఆ చీరలు అక్కర్లేదా?"

"ఊహుఁ"

"ఇక్కడెందుకవి? నీతో తీసుకెళ్ళు."

"అయ్యో వద్దండి. ఇవి చాలు."

ఎన్ని చీరలున్నా తృప్తిచెందని మీర విరక్తితో వద్దు అనటాన్ని భరించలేకపోయాడు. వ్యధా, దానివెంటనే కోపమూ పొంగుకుని వచ్చాయి. గబుక్కున లేచివచ్చి ఆ చీరలన్నిటినీ పెట్టిలో పడేసి "నీ చీరల్ని నీతోబాటే తీసుకుని వెళ్ళు" అంటూ పెట్టె మూతవేసి వెళ్ళిపోయాడు. ఇంతవరకూ శాంతంగా ఉన్నమనిషి ఇంతలో అంత కోపం తెచ్చుకోవటం చూసి చకితురాలయింది మీర.

తెల్లవారింది. మీర స్నానంచేసి ఫలహారం తీసుకుని బెడ్డింగ్ కట్టింది. నింగడు మీర సామాన్లు బండిలో పెట్టాడు. మీర వెంకమ్మ గారితో "వెళ్ళొస్తానండి" అంది.

"శలవుల్లో రా అమ్మాయ్."

"తప్పకుండా వస్తాను. నాకు మాత్రం వేరే ఇల్లు ఎక్కడుంది? మీరు వద్దన్నా ఇక్కడికే వస్తాను."

శాము గదిలో కూర్చున్నాడు. మీర తలుపుదగ్గర నిల్చుని "వెళ్ళొస్తానండి" అంది.

"మంచిది."

మీర లోపలికివచ్చి చప్పుడయ్యేలా తలుపువేసింది. శాము కదలకుండా శిలలా నిల్చున్నాడు. మీర నెమ్మదిగా శాము దగ్గరగా వచ్చి అతని కళ్ళలోకి చూస్తూ "వెడుతున్నాను" అంది. అలా అంటున్నప్పుడు ఆమె మొహం అతని మొహానికి అతి సమీపంగా ఉంది.

"సరే."

మీర ఒక్కనిమిషం అనుమానించి తలుపువేపు చూసింది. గబుక్కున అతనిజుత్తు పట్టుకుని మృదువుగా తలను క్రిందికి వంచి ముద్దుపెట్టుకుంది. శాము సంయమం కట్టలు తెంచుకుంది. అతని

చేతులు ఆమెను చుట్టివేశాయ్. మీర అప్యాయంగా అతని తల నిమురుతోంది.

"మీ ఆరోగ్యం జాగ్రత్త. వెంకమ్మగారు చెప్పినట్టు వినండి."

"ఊఁ"

"ఇక వెళ్ళనా?"

శాము మీరను వదిలి దూరంగా జరిగాడు.

మీర బయటికి వచ్చి వెంకమ్మగారితో,

"ఇదిగో. ఈయన ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం చూపారంటే నాకిచ్చిన మాట జ్ఞాపకం చెయ్యండి" అంటూ బండి ఎక్కింది. బండి కదిలింది. మీర,

"పండితులవారు ఆయనకోసం చేసిచ్చిన తైలం బొమ్మల బీరువాలో ఉంది. మరవకుండా రాసుకోమనండి" అంది.

వెంకమ్మగారు "ఫరవాలేదు. భర్త అంటే అభిమానం ఉంది" అనుకున్నారు. ఆమె లోపలికి వచ్చేసరికి శాము అక్కడ లేడు.

"పిచ్చికుర్రాడు-అప్పుడే తిరగటానికి బయలుదేరాడు" అని ప్రేమగా తిట్టుకుంటూ వంటింట్లోకి వెళ్ళారు.

కాని ఆమె అనుకున్నట్టు శాము బయటికి వెళ్ళలేదు. గదిలోకెళ్ళి మంచంమీద పడుకున్నాడు.

పెళ్ళయిన ఇన్నేళ్ళకు మొదటిమారు మీర తనంతట తానే అతన్ని ముద్దుపెట్టుకుంది. తన దౌర్బల్యాన్ని ఆమె ముందు బయటపెట్టుకున్నందుకు సిగ్గుపడ్డాడతను.

దూరంలో రైలుకూత వినపడింది. శాము ఇంకోవేపు తిరిగి పడుకున్నాడు.

*　　*　　*

మెడికల్ కాలేజి హాస్టల్ స్టేషన్‌కు బాగా దగ్గరవటంవల్ల మీర కూలీచేత సామాన్లు పట్టించుకుని నడిచే వెళ్ళింది.

ఆమె జీవితంలో హాస్టల్లో ఉండటం అదే మొదలు. హాస్టల్ జీవితం ఎలా ఉంటుందో చూడాలన్న కుతూహలం ఉండేదామెకు.

మీర హాస్టల్‌కు వెళ్ళి వార్డన్ దగ్గరనుండి తనగది తాళంచెవి

తీసుకుని గది తాళం తెరిచింది. ఆమె రూంమేటు మనోరమ ఇంకా రాలేదు. రైలు ప్రయాణంతో అలసిపోయిన మీర మంచంమీద పక్క దొర్లించి పడుకుంది.

భోజనాల గంట కొట్టగానే గ్లాసు, కంచం తీసుకుని అమ్మాయిలంతా భోజనాల గదిలోకి వెళ్ళారు. సీనియర్ అమ్మాయిలు జూనియర్ విద్యార్థినుల విషయంలో ఎలాంటి కుతూహలమూ చూపడం లేదు. వారంతా వాళ్ళ లెక్చరర్ల గురించీ, సహవిద్యార్థినుల గురించీ వ్యాఖ్యానించటంలో మునిగిపోయారు. తనలాగే ఏమీ తోచనట్టు కూర్చున్న మరికొంతమంది అమ్మాయిలను చూసి వాళ్ళు జూనియర్ విద్యార్థినులయ్యుండా లనుకుంది. ఆమె ఊహ నిజమే అయింది.

చిక్కమగళూరు కాఫీ ప్లాంటర్ కూతురు డాలీ ఇంటర్ పూర్తి చేసి మెడికల్ కాలేజికి వచ్చింది. ఇంటర్‌లో థర్డ్‌క్లాసులో పాసయినా వెనుకబడిన జాతి అన్న ఒకే ఒక్క అర్హతతో సీటు తెచ్చుకుంది.

భోజనాలప్పుడు మీరకు డాలీ, యశోదల పరిచయమయింది. యశోద బోటనీ ఆనర్స్ పూర్తిచేసి మెడికల్‌లో జాయినయింది. భోంచేస్తూ డాలీ తన పురాణమంతా విప్పింది.

"నాకు డాక్టరవాలన్న కోరిక ఏమాత్రంలేదు. మెడికల్ కాలేజీ లైఫ్ ఎంజోయ్ చేద్దామని వచ్చాను. ఇక్కడయితే స్వేచ్ఛగా ఉండొచ్చు."

ఆ మాట విని మీరకు జుగుప్స కలిగింది. తన గదికి వెళ్లే ముందు డాలీ మీరతో,

"సాయంత్రం షాపింగ్‌కు వెడదాం వస్తారా? రేపు కాలేజికి కట్టటానికి నా దగ్గర ఒక్కటికూడా మంచిచీర లేదు" అంది.

"క్షమించండి. నాకు వేరే పనుంది."

సాయంత్రం తనకోసం వచ్చిన యువకుడితో డాలీ షాపింగ్‌కు బయలుదేరింది. తనవేపే ప్రశ్నార్థకంగా చూస్తున్న మీర, యశోదలతో డాలీ,

"ఇతను నా కజిన్" అంది.

సినిమా తారల బొమ్మల బుష్‌కోటు తొడుక్కున్న ఆ యువకుడు మీర, యశోదలకు నమస్కరించి డాలీతో వెళ్ళిపోయాడు.

రాత్రి రైలులో మీర రూంమేటు మనోరమ హాసననుండి వచ్చింది.

రాత్రి డైనింగ్‌హాల్లో డాలీ తానుకొన్న వస్తువుల్ని వర్ణించింది. మరునటిరోజు కాలేజికి కట్టుకోటానికి ఏదో సినిమాలో నాయకి ఆత్మహత్య చేసుకున్నప్పుడు కట్టుకున్నలాంటి చీర కొనుక్కున్నదట.

ఆ వర్ణన విని మీర నవ్వింది.

కాని మీరు ఆత్మహత్య చేసుకోబోవటం లేదుకదా!"

"లేదబ్బా! జీవితంలోని రుచిని నే నింకా చవిచూడలేదు."

"తొందరపడకండి. జీవితంలో తియ్యదనమే కాదు. చేదు కూడా ఉంటుంది."

"నన్ను భయపెట్టకండి."

"లేదమ్మా, లేదు. జీవితాన్ని ధైర్యంగా ఎదుర్కోండి."

మీర గదిదగ్గర అందరూ విడిపోయారు. మీరకు రాత్రి నిద్ర పట్టలేదు. కొత్తప్రదేశం, కొత్తరకం జీవితం ఆమెలో అధైర్యాన్ని కలగచేశాయి.

మీర చుట్టూ చూసింది. ఎదురు మంచంమీద మనోరమ హాయిగా పడుకుని నిద్రపోతోంది.

ఆయన ఇప్పు డేం చేస్తుంటారో? వెళ్ళగానే ఉత్తరం రాయమన్నారు. తను మరిచిపోయింది.

మీర లేచి లైటువేసి ఉత్తరం రాయటానికి మొదలుపెట్టింది. లైటు వేయగానే మనోరమ మేలుకుంది.

"ఏం చేస్తున్నారు?"

"ఉత్తరం రాస్తున్నా."

"ఎవరికి?"

"ఇంటికి."

"పాపం అమ్మను వదిలి ఉండలేరనుకుంటా నేం?"

మీర జవాబు చెప్పలేదు. పెన్ను, పేపరు కిందపెట్టి లైటు ఆర్పేసింది.

"ఏం ఉత్తరం రాసుకోరా?"

"రేపు రాస్తాను."

"పోనీ పడుకోండి. గుడ్‌నైట్."

మరుసరోజు కాలేజికి బయలుదేరింది మీర. ఎన్నో ఏళ్ళ తపస్సు ఫలితంగా ఈరోజు విద్యామందిరం ఎదుట భక్తురాలయి నిలుచుంది.

మీర కాంపోండులోకి అడుగు పెడుతూండగా వెనుకనుండి ఆమె భుజంమీద చెయ్యిపడింది. మీర వెనక్కి తిరిగిచూసింది.

"విజయా పరాంజపె!"

"జీహాఁ తమరు ఎలా ఉన్నారు?" విజయ నవ్వుతూ అడిగింది. ఆమె చెవుల్లోని రింగులు ఆమె గోధుమరంగు బుగ్గలమీద ఊగుతున్నాయి. ఆమె పసిపాపలాంటి మొహం ఆనందంతో విప్పారింది.

"మీరు రారేమోనని భయపడ్డాను."

"అదృష్టం బావుంది. వచ్చేశాను."

ప్రీ-మెడికల్‌లో తొమ్మండుగురు విద్యార్థిను లున్నారు. మీర సీనియర్ విద్యార్థులవేపు భయభక్తులతో చూసింది. వాళ్ళప్పుడే దేహపు సృష్టిరహస్యాలనూ, వైచిత్ర్యాలనూ తెలుసుకున్నవారుకదా!

క్లాసులు మొదలయ్యాయి. మీర కాలేజి జీవితానికి అలవాటు పడిపోయింది.

విజయ, మీరలకు మంచి స్నేహం కలిసింది. తను బోటనీ ఆనర్స్ అన్న గర్వం యశోదకు. ఇహ డాలిని ఎవరూ మాట్లాడించటానికే లేదు. తండ్రి కూతురు అడిగినప్పుడల్లా డబ్బుపంపేవారు. ఈమెగారు ఆ డబ్బంతా చీరలు, సినిమా, హోటల్, కాస్మెటిక్స్ అంటూ ఖర్చుపెట్టేది, వారానికి రెండుమార్లయినా ఆమె కజిన్స్ వచ్చేవారు.

ఓ ఆదివారం డాలీ ఇంగ్లీష్ పిక్చర్‌కు బయలుదేరింది. మూడు రోజుల ముందునుండి మీరనుకూడా రమ్మని బలవంతపెడుతోంది.

ఇంగ్లీష్ పిక్చర్ చూడాలని మీరకూ వుంది. కాని దానితో వెళ్ళటాని కిష్టంలేదు. డాలీ బలవంతానికి మీర 'కంట్రీ గర్ల్'కి వెళ్ళ టానికి ఒప్పుకుంది. కంట్రీ గర్ల్ బాగుందని విమర్శకులంతా పొగి డారు. కాని మీర ఓ షరతు పెట్టింది.

"మీ కజిన్స్ ఎవరూ రారుగదా?"

డాలీ మొహం ఎర్రబడింది. తడబడుతూ 'లేదు' అంది.

"ముందే చెప్పేసెయ్యండి. వాళ్ళెవరైనా వచ్చేలా ఉంటే నేను రాను."

"ఎవరూ రారు."

మీర, డాలీ సినిమాకు బయలుదేశారు. డాలీ తనే బాల్కనీ టికట్స్ తీసుకుంది. మెట్ల దగ్గిరే డాలీ పేర్ కసిన్ ఎదురుచూస్తూ నిల్చున్నాడు.

"హలో, డాలీ! నువ్వా వచ్చావా సినిమాకు?"

"ఊఁ. ఈమె మీరా. ఇతను కసిన్ జాని."

"జాని!"

మీర అదిరిపడింది. వీణ మొహం ఆమె కళ్ళముందు నిలి చింది. శాము 'జాని' అనే పిలిచేవాడు. మీర గోడను ఆసరాగా పట్టుకుంది.

"ఏమయింది?"

"ఏంలేదు. కాస్త కళ్ళు తిరిగినట్టయింది."

జాని ఎంతో వినయంగా తనకుడిచేతిని ఆమెకు ఆసరాగా అందివ్వబోయాడు.

"అవసరంలేదు" అంది వినయంగా మీర.

పిక్చర్‌నుండి హాస్టల్‌కు రాగానే మీర డాలీపని పట్టించింది.

"నిజం చెప్పండి. మీ ఫేర్ కసిన్ ఎందుకొచ్చాడు? మీరే పిలి చారా?"

డాలీ తెల్లబోయింది. తడబడుతూ "లేదు, అకస్మాత్తుగా కనిపించా డంతే" అంది.

"అబద్దాలు చెప్పకండి. మీరు చెబుతున్నది నిజంకాదని మీ

మొహమే చెబుతోంది. ముందే అతనితో చెప్పి నన్ను తీసుకు వెళ్ళారుకదూ?"

డాలి వప్పుకుంది.

"నాది పప్పే మీరా. నా కసిన్ బజార్లో వెడుతుండగా మిమ్మల్ని చూశాడట. అప్పటినుండి పరిచయం చెయ్యమని ఒకటే గొడవ. నే నెంతో చెప్పిచూశాను. 'వద్దు. ఆమె చాలా సీరియస్' అని. కాని అతను వదల్లేదు. 'నీకు జెలసీ' అంటూ రెచ్చగొట్టాడు. విధిలేక మిమ్మల్ని పరిచయం చెయ్యటానికి వప్పుకున్నా, సినిమాకు తీసుకురమ్మని సలహా యిచ్చిందికూడా అతనే. నేనుకాదు."

మీర గంభీరంగా అంది.

"సరయితే-మీ కజిన్‌తో చెప్పండి. పరిచయముంది కదా అని ఎప్పుడయినా పలకరించటానికి ప్రయత్నించాడో...." మీరకళ్ళు మంచం మీదనున్న జోళ్ళవేపు మళ్ళాయి.

డాలి మొహంమీద స్వేదబిందువులు నిలిచాయి.

"అలాగే. వస్తాను."

"ఒక్క నిమిషం ఆగండి" అంటూ మీర తన పర్సుతీసి రూపాయి పావలా డాలి చేతిలోపెట్టి "ఇది నా టికెట్ డబ్బు. మీ దాక్షిణ్యం నా కక్కర్లేదు" అంది.

"ఛ, వద్దు. స్నేహితుల మన్నాక...."

"స్నేహం వేరు. డబ్బు విషయంలో స్నేహం పనికిరాదు."

డాలీ డబ్బుతీసుకుని వెళ్ళిపోయింది. మళ్ళీ మీరను పలకరించే సాహసం కలగలే దామెకు.

మీర విజయతో ఆ సంగతంతా చెప్పింది. విజయ "మీరు గనుక అంతటితో పోనిచ్చారు. నేనయితే థియేటర్‌లోనే ఇద్దర్నీ కలిపి చెప్పుతోకొట్టి వచ్చేదాన్ని" అంది.

"డాలి కసిన్స్ గొడవ ఏమని చెబుతారు? రోజు కో కసిన్ వస్తూంటాడు. అదేం కసిన్నో దేవుడికే తెలియాలి!"

"పోనిద్దురూ మనకెందు కా గొడవ? మనజోలికి రాకుండా ఉంటే అంతే చాలు."

కృష్ణయ్యగారు అప్పుడప్పుడూ మీరను చూడటానికి వచ్చే వారు. ఆయన వచ్చినప్పుడల్లా ఒక్కటే మాట.

"చదువు మానెయ్, శాముతో లక్షణంగా కాపురం చేసుకో,"

ఆయన మాటలు వినీవినీ మీరాతల బరువెక్కిపోయేది. ఆయన వచ్చి వెళ్ళిన రెండు మూడు రోజులదాకా ఆయన మాటలే చెవిలో ప్రతిధ్వనిస్తూ ఉండేవి. ఏదో ఒక విధంగా ఓ తీరుకు వచ్చిన మనసులోని గాయం మళ్ళీ గాలి తగిలిన మంటలాగా రగుల్కొనేది. ఈ అశాంతివల్ల మనస్సు స్థిరంగా ఉండేది కాదు. క్లాసులో చెప్పిన పాఠాలు తలకెక్కేవి కావు. ఏం చెయ్యాలో తోచక శాముకు ఓ ఉత్తరం రాసింది. అందులో పెదనాన్నవల్ల తనకు కలుగుతున్న కష్టాన్ని వివరించి ఎలాగైనా ఆయన హాస్టలుకు రాకుండా చూడమనీ వచ్చినా ఈ విషయ మెత్తకుండా ఉండేలా చూడమనీ బ్రతిమాలు కుంది.

ఆ ఉత్తరం రాసిన పదిహేనురోజులకు కృష్ణయ్యగారు మీరను చూడటానికి హాస్టలుకు వచ్చారు.

ప్రీ-మెడికల్ పరీక్షలు దగ్గర పడుతూండటంవల్ల మీర హాస్టల్ కాంపౌండ్‌లో చెట్టుకింద కూర్చుని చదువుకుంటోంది. వార్డన్ పర్మిషన్ తీసుకుని కృష్ణయ్యగారు విజిటర్స్ రూములోకి వెళ్ళారు. మనోరమ పరుగెత్తుకుంటూ వచ్చి "మీ పెదనాన్న వచ్చారు" అంది.

మీర విసుగ్గా మొహంపెట్టి "సరే" అంటూ పుస్తకం మూసి విజిటర్స్ రూముకు వెళ్ళింది.

అక్కడ కృష్ణయ్యగారొక్కరే కూర్చున్నారు. మీర నవ్వు మొహంతో,

"ఏమిటి విశేషాలు పెదనాన్నా?" అంది.

"శాము వచ్చాడివ్వాళ. ఉదయం వచ్చి మధ్యాహ్నం బండికి వెళ్ళిపోయాడు."

మీర మొహంలోని ఆశ్చర్యాన్ని గమనించి ఆయనే అడిగారు.

"శాము ఇక్కడికి రాలేదా?"

"లేదు. అక్కడే భోంచేసి వెళ్ళారా?"

"ఊఁ. వెళ్ళేముందు నిన్ను చూసి వెడతానన్నాడు. ఎందుకు రాలేదో మరి!"

మీర తన మనసులోని భావాలను పైకి కనిపించనీయకుండా "రైలుకు టైమయిపోయిందని రాలేదేమో" అంది.

కృష్ణయ్యగారు ఒక్కమారు చుట్టూ చూసి, గొంతు తగ్గించి, "మీరా! నువ్వూ, శామూ దెబ్బలాడుకున్నారా?" అనడిగారు.

"లేదే."

"మరి శాము నిన్ను చూడటాని కెందుకు రాలేదు?"

"నాకు తెలియదు. మరి మిమ్మల్ని చూడటాని కెందుకు వచ్చారు?"

"ఏదో పనిమీద వచ్చాడట ఇక్కడికి. అలాగే చాలా రోజులయిందికదా అని నన్ను చూసివెడదామని వచ్చాడట. ఇదివరకూ నిన్ను పొరపాటుగా అర్థం చేసుకున్నానమ్మా! ఈ రోజు శాము అసలువిషయం చెప్పాడు."

"ఏ విషయం?"

"అదే నీ చదువుగురించి. నువ్వే పట్టుబట్టి, అతనిమాట కాదని చదువుకోటానికి వచ్చావని అభిప్రాయ పడ్డాను. అందుకే నిన్ను తిరిగి వెళ్ళిపొమ్మని బలవంతంచేస్తూ వుండేవాడిని. ఈ రోజు ఏదో మాటల్లో శాము అన్నాడు. అతనే నిన్ను చదువుకోవటానికి పంపాడట. నిజమేనా?"

"ఊఁ."

"నువ్వు డాక్టరయి పల్లెటూళ్ళోని పేదరైతుల కుటుంబాలకు చేతనైన సాయం చేస్తావన్న ఉద్దేశంతో పంపానని నాతో చెప్పాడు. మొత్తంమీద బంగారంలాంటి కుర్రాడు శాము."

కృష్ణయ్యగారు వెళ్ళిపోగానే మీర తనగదికి పరిగెత్తి శాముకు కృతజ్ఞత తెలుపుతూ ఓ పెద్ద ఉత్తరం రాసింది.

శాము తనను చూడకుండా వెళ్ళిపోవటం గుచ్చుకున్నట్ట్లని పించింది. కాని అలా కోరుకోవటానికి తన కేం హక్కుంది? అతడి

ఒంటరిగా వదిలిపెట్టి వచ్చింది తను. కాని....కాని....ఆయనో మారు వచ్చి ఉంటే....!

మీర పరీక్షలో బాగానే రాసింది. ఆమె తన శక్తినంతా ఆ స్వప్న సౌధాన్ని కట్టడానికే ధారపోసింది. ఫస్ట్‌క్లాస్ రావటంలో సందేహమేమీ లేదు.

పరీక్షలయ్యాక పల్లెకు బయలుదేరింది మీర. ఆ రోజునే డాలీ కూడా ఊరికి వెడుతోంది. ఆమెకు వీడ్కోలివ్వటానికి ఆమె 'కజిన్స్' ఎనమండుగురు వచ్చారు. అందరి చేతుల్లోనూ సిగరెట్టుంది. డాలీ తన ఫేర్ కజిన్‌ను ఆనుకునే నిల్చుని కిలకిలా నవ్వుతోంది. అమె చేతిలో నాలుగయిదు ఇంగ్లీష్ సినిమా పత్రిక లున్నాయి.

మీరను చూసి ఫేర్ కజిన్ పళ్ళికిలించాడు. మీర కోపంగా మొహంపెట్టి వెళ్ళి కంపార్ట్‌మెంటులో కూర్చుంది.

"ఇలాంటి దద్దమ్మలంతా కాలేజికి ఎందుకు వస్తారో?...." బొమ్మల బుష్‌కోటు కజిన్ అన్నాడు.

"బాయ్‌ఫ్రెండ్స్‌లేని లైఫ్‌కూడా ఓ లైఫేనా?"

"అమెరికాలో అమ్మాయిలు బాయ్‌ఫ్రెండ్స్ ఎంత ఎక్కువగా ఉంటే అంత గౌరవంగా భావిస్తారు. మనదేశం ఇంకా చాలా వెనకబడి ఉంది జానీ."

"జానీ!" మళ్ళీ అదేపేరు. ఏ పేరునయితే ఆమె మరిచిపోవటానికి ప్రయత్నిస్తోందో అదే వచ్చి ఆమె చెవుల్లో ప్రతిధ్వనిస్తోంది.

"స్టూడెంట్ లైఫ్‌లో పెట్టింగ్ అండ్ నెకింగ్ లేకపోతే అదెలాటి స్టూడెంట్ లైఫ్?"

"హియర్. హియర్."

ఆఖరికి రైలు బయలుదేరింది. మీర "హమ్మయ్య" అని నిట్టూర్చింది.

మీర వస్తుందని శాముకు తెలియదు. మీర ఇంటికి వచ్చేసరికి శాము ఇంట్లో లేడు. వెంకమ్మగారు మీరను చూసి సంతోషంతో "రా తల్లీ రా!" అన్నారు. మీర రావటం ఆమెనెంతో ఆనందపర

చింది. మీరకు ఎంతో ఇష్టకరమయిన చిప్స్ చేసి "ఘోంచేద్దువుగాని రామ్మా! శాము ఇప్పుడప్పుడే రాడుకదా" అన్నారు.

"ఆయన్ని రానివ్వండి. ఫరవాలేదు" అంది మీర. అక్కడే కూర్చుని హాస్టల్ కబుర్లన్నీ చెప్పసాగింది. బిడ్డ కొత్త అనుభవాలను ఆసక్తితో వినే తల్లిలా మీర మాటలు వింటున్నారు వెంకమ్మగారు. అమాయకంగా,

"అది సరే. మరి నెలకు మూడురోజులు బయట కూర్చుంటారా అక్కడ?" అనడిగారు.

ఆ మాట విని మీర పగలబడి నవ్వసాగింది. వెంకమ్మగారికి తా మడిగిన ప్రశ్నలో అంత నవ్వదగిం దేముందో అర్థంకాక, ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయారు.

మీర పక్కలు పట్టుకుని "అబ్బా....నా చేత కాదు" అంటూ పడీపడి నవ్వుతోంది. కళ్ళలో నీళ్ళు కారసాగాయి.

ఇంట్లోకి అడుగు పెడుతూండగానే శాముకు మీర గొంతు వినపడింది. కాని నవ్వుతోందో, ఏడుస్తోందో తెలియక కంగారుగా వంటింట్లోకి పరుగెత్తుకు వచ్చాడు.

"మీరా!"

శాముగొంతు వినగానే మీర నవ్వు ఆగిపోయింది. గబుక్కున తలెత్తి శామువేపు చూసింది.

కొత్తరకం జీవితాన్ని చవిచూసి వచ్చిన మీర శాము కళ్ళకు కొత్తగా కనిపించింది. ఆమె మొహం యౌవనపు కాంతితో మెరుస్తోంది. నవ్వుతో మొహం ఎర్రబడింది.

"ఎప్పు డొచ్చావు?"

"ఇప్పుడే ఓ గంటవుతోంది. భోజనానికి లేవండి."

"ఇదిగో వస్తున్నా."

శాము కాళ్ళూ చేతులు కడుక్కొని వచ్చేలోగా మీర పీటలు వేసి కంచాలు పెట్టింది. వెంకమ్మగారు వడ్డించేటపుడు మీరకు రెండు మిళ్ళేల నెయ్యి ఎక్కువగా వేశారు. ఆమె వాత్సల్యానికి మీర కళ్ళు

చెమర్చాయి. తనకూ ఆమెకూ బాంధవ్య మేమీ లేదు. అయినా ఆమెకు తనమీ దెందు కింత ఆప్యాయత?

"వంట ఎలా ఉందమ్మా!"

"చాలాబావుంది. హాస్టల్లో ఇలాంటి భోజనం, మీలా ప్రేమగా వడ్డించేవాళ్ళు ఎక్కడినుండి వస్తారు? మేము ఇచ్చే డబ్బే వాళ్ళకు ముఖ్యం గాని, మేం సరిగ్గా భోజనం చేస్తామో లేదో వాళ్ళ కనవ సరం."

"బాగా వడ్డిస్తారా?"

"ఆ, కాని మీలా ప్రేమగా ఓ మిళ్ళ నెయ్యివేసే వారుండరు. భోంచెయ్యకపోయినా అడిగేవా ళ్ళుండరు."

మీరకు వెంకమ్మగారి మీదున్న అభిమానానికి సంతోషించాడు శాము.

"అప్పుడే నువ్వు నవ్వుతున్నది దేనికి?"

ఆ సంగతి గుర్తుకు రాగానే మీర మళ్ళీ నవ్వసాగింది.

"ఏమిటో చెబుదూ నీతోబాటు నేనూ నవ్వుతాను."

"ఉహూఁ, మీతో చెప్పేవిషయాలు కావులెండి."

"అదేం చెప్పమంటే బెట్టు చేస్తోం దబ్బా!"

"కొంచెం ఉండండి....నవ్వు....తగ్గాక చెబుతా."

వెంకమ్మగారు తృప్తిగా భోంచేస్తున్న జంటను చూసి తృప్తిగా నిట్టూర్చారు. శామూ మీరా ఇలా అన్యోన్యంగా ఉండటాన్ని చూసి ఎన్నో ఏళ్ళయిన ట్టనిపించింది. పెరుగు వడ్డించి "దూడను కట్టేశారో లేదో" అంటూ బయటికి వెళ్ళారు.

వాళ్ళిద్దరూ ఒకర్నొకరు చూసి ఆర్నెల్లు గడిచి పోయాయి. మాట్లాడుకోవటానికి ఎన్నో విషయా లున్నాయి. వెంకమ్మగారు బయటికి వెళ్ళగానే, మీర శామువేపు చూసి,

"బాగా చిక్కిపోయారు మీరు" అంది.

"వెంకమ్మగారి చేతివంట తింటూ చిక్కిపోవడమే! కాలేజిలో నీకు చాలామంది స్నేహితు లున్నారా?"

"ఓ! అందులో డాలీ అని ఓ అమ్మా యుంది. మా కిద్దరికీ

ఎంత స్నేహ మంటే ఆ అమ్మాయిని చూడగానే చెంప చెళ్ళుమని పించా లనిపిస్తుంది."

"ఏం అంత అందంగా ఉంటుందా ఆమె చెంప?"

"తీసుకొస్తాను. మీరే చూసి చెబుదురుగాని."

"బాబోయ్. అమ్మాయిల సావాసం నా కొద్దు."

"ఏం? మింగేస్తారా మిమ్మల్ని?"

భోజనం కాగానే శాము గదిలోకి వెళ్ళాడు. మీర తాంబూలం పళ్ళెం తీసుకుని వెళ్ళి,

"తమలపాకులు వేసుకోరా?" అంది.

"ఆ, వేసుకోవచ్చు లెద్దూ!"

శాముకు తాంబూలం అంటే ఎంత ఇష్టమో మీరకు తెలుసు. పెళ్ళయిన కొత్తలో అతడు ఆకులు వేసుకునే తీరు ఆమెకు అసహ్యాన్ని కలిగించేది.

"ఆవులు గడ్డిమేసేలా అకులు మేస్తారు మీరు" అని హాస్యం చేసేది భర్తను. శాము ఉదాసీనంగా వేసుకోవచ్చులే అన్నప్పు డామె ఆశ్చర్య పడింది.

"నేను చిలకలు చుట్టి ఇస్తాను. వేసుకుంటారా?"

"అదేమిటి? ఎన్నడూ లేనిది బలవంత పెడుతున్నావు?"

"ఆకులు, వక్క, సున్నం-వీటిలో మనిషికి కావలసిన విటమిన్లుంటాయి. అందుకు వేసుకోమన్నా."

"మెడికల్ కాలేజీలో చేరినందుకు సార్థకమయిందిలే!"

మీర మళ్ళీ నవ్వింది.

మీర నవ్వు మొహాన్ని శాము చూసి ఎన్నో నెలలయింది. ఆమె నవ్వు ఆతని మొహాన్ని కాంతిమంతం చేసింది. మీర అతనికి చిలకలు-చుట్టి యిచ్చి "ఇల్లంతా ఓమారు చూసివస్తాను" అని లేచి వెళ్ళింది. శాముకు ఆమెతో ఎంతో మాట్లాడాలని ఉన్నా, తన నిరాశను కనిపించనీయకుండా "సరే" అన్నాడు. మీర గది తలుపులు ముందుకు లాక్కుని వెళ్ళింది.

భర్త ఇంటిమీది వ్యామోహం ఆమెకు తగ్గలేదు. 'నా ఇల్లు'

అన్న అభిమానం మొదటికన్నా ఇప్పు డెక్కువయినట్టుంది. దీనికి కారణమేమయి ఉంటుంది? ఆరునెలలు ఇంటినీ భర్తనూ వదిలిపెట్టి దూరంగా ఉండటమేనా? అదే అయుండాలి. భార్యాభర్త లిద్దరూ సంవత్సరంలో పన్నెండు నెలలూ కలిసి ఉండకూడదు. అలా ఎప్పుడూ కలిసే ఉంటే ఏదో ఒక దెబ్బలాట, అసమాధానం, మన స్తాపాలు కలుగుతూనే ఉంటాయి. ఇంట్లోఅశాంతి తలెత్తుతుందన్న సూచన కనిపించగానే ఇద్దరిలో ఎవరో ఒకరు ఓ రెండువారాలపాటు ఎక్కడికయినా వెళ్ళటం మంచిది. ఎడబాటు ఒకరి విలువను మరొకరికితెలియచేస్తుంది. పదిహేను రోజుల అనంతరం కలుసు కోవటంలో ఎంత ఆనందం కలుగుతుంది?

మీర ఇంటి గోడలు, కిటికీలు చేతితో తడిమి చూసింది. డ్రాయింగ్‌రూంలో తను కోరితెప్పించిన సోఫాసెట్‌ను చూసి తృప్తి పడింది. "టోరడికి చెప్పి బూజు దులిపించాలి" అనుకుంది. పశువుల పాక దగ్గర నుంచుని లేగదూడల ఆటను చూసింది. ఆమె వెళ్ళేప్పటి కింకా పుట్టని రెండు లేగదూడలు ఆడుకుంటున్నాయి.

మీర ఇల్లంతా తిరిగి శాము పడుకున్న గది దగ్గరికి వచ్చి లోపలికి తొంగిచూసింది. అప్పటికి శాము నిద్ర పోతున్నాడు. ఇక చేసేదేమీలేక బయటి వసారాలో కొచ్చింది. వెంకు వస్తూండటం చూసి అక్కడే నిలుచుంది. మీరను చూసి వెంకు నవ్వుతూ,

"మీరు వచ్చారని తెలిసి పరిగెత్తుకుంటూ వచ్చాను. అమ్మ ఎండలో వెళ్ళొద్దని అరుస్తూనే ఉంది. కాని నేను పరుగెత్తు కొచ్చే శాను" అంది.

వెంకు మొదటికన్నా పొడుగ్గా ఎదిగింది. డొక్కులా ఉన్న మొహం. నిండుగా, కళగా వుందిప్పుడు. ఎముక లెముకలుగావున్న శరీరం వయసు తెచ్చిన మార్పువల్ల అందమైన ఆకారాన్ని ఏర్పరుచు కుంది. కొత్తమనిషిని చూసినట్టు వెంకుని పరిశీలించి చూసింది మీర.

"నీ కెన్నేళ్ళు వెంకూ?"

"పదహారు."

"ఇంకా నీకు పెళ్ళి చేయలేదేం?"

వెంకు మొహం ఎఱ్ఱ బడింది. "ఛ, పొండి మీరక్కా! మీరలా ఏడిపిస్తే నేను వెళ్ళిపోతాను."

"ఏడిపించనులే రా!"

వెంకు, మీర గదిలో కూర్చుని అదీ-ఇదీ మాట్లాడుతున్నారు.

"పరీక్ష ఎలా చేశారు?"

"బాగానే చేశాను."

"మీరు శవాన్ని కోయాలిట. నిజమేనా?"

"అది వచ్చే ఏటినుండి."

మీర పుస్తకాల్ని చూసి వెంకు ఆశ్చర్యంతో,

"ఇదంతా ఎలా చదువుతారండీ? అన్నీ గుర్తుంటాయా? మరిచిపోరూ?"

"మర్చిపోతే ఫేలవుతాం. అంతే."

ఇలా కబుర్లు చెప్పుకుంటూండగానే శాము లేచి వచ్చాడు.

"శామణ్ణా, మైసూరుకి వెళ్ళొచ్చాక మీరక్క ఇంకా బావున్నారు కదూ?"

అదే చనువు. అదే స్నేహం. అప్పటి చిన్నపిల్ల ఇప్పుడు యువతి.

"అలాగా! నేనింకా సరిగ్గా చూడనేలేదు మీరను."

"పో శామణ్ణా, నా మాటంటేనే నవ్వులాట నీకు." వెంకు బుంగమూతి పెట్టింది.

నాలుగేళ్ళ క్రిందటి మాటయితే శాము వెంకు బుగ్గ గిల్లి, కిత-కితలు పెట్టి ఏడిపించి వదిలేవాడు. కాని వెంకు ఇప్పుడు ఈడొచ్చిన పిల్ల.

"మీరా, ఇలా నా ముందు వచ్చి నిల్చో. సరిగ్గా చూసి చెబుతా."

"చాల్చాలు, ఇహ ఊరుకోండి" అంది మీర చిరుకోపంతో.

"కళ్ళు ఫరవాలేదు. బుగ్గలు నిండుకున్నాయి గనుక కళ్ళు చిన్నగా కనిపిస్తున్నా మెరుస్తున్నాయి. కనుబొమలు, కళ్ళకు పెట్టు

కున్న కాటుకతో పోటీ చేస్తున్నట్టున్నాయి ఎవరు ఎక్కువ నలుపా అని. ముక్కు జడలాగే మొండిగా ఉంది...."

శాము వర్ణన విని వెంకు నవ్వు ఆపుకోలేకపోయింది. మీర మొహం ఎఱ్ఱ బడింది.

"బుద్ధి, చాకు కత్తెర్లతో సావాసం చేస్తున్నందువల్లనో ఏమిటో అంతే పదునుగా ఉంది. జుత్తు ఉంగరాలు ఎక్కువయ్యాయికాని, ఒక్క అంగుళంకూడా పొడుగెదిగినట్టు కనిపించటంలా. పెదవులు-అది తాంబూలం వేసుకోవటంవల్ల వచ్చిన ఎరుపో, నిజమైన ఎరుపో పరీక్ష చేసికాని చెప్పలేం. చేతులు...."

మీర తొందరగా వచ్చి శామును పక్కకు నెట్టి వంటింట్లోకి దూసుకు పోయింది. ఆపకుండా నవ్వుతూన్న వెంకు అది చూసి నవ్వు ఆపి,

"శామణ్ణా, మీరక్కకు కోపం వచ్చినట్టుందేం?" అంది.

"కాకపోవచ్చు. తన వర్ణన విని ఆనందం ఆపుకోలేక పారి పోయినట్టుంది."

వెంకు మీరను వెతుక్కుంటూ వంటింట్లోకి వెళ్ళింది. కాఫీ టిఫిన్ అయ్యాక సాయంకాలం ఐదుగంటలకు వెంకుకు తమ ఇల్లు గుర్తుకొచ్చింది.

"ఇక వెడతాను మీరక్కా! అమ్మ కోప్పడుతుంది ఆలస్య మయిందని."

"నేను బలవంత పెట్టి ఉంచేసుకున్నానని చెప్పు. ఏమీ అనరు."

వెంకు వెళ్ళిపోయింది. వెంకుని పంపేసి మీర ఇంట్లోకి వచ్చేసరికి శాము ఫలహారం చేసి పొలాలవేపు వెళ్ళిపోయాడు. మీరకు ఏమిటోగా అనిపించింది. అయితే తన వైద్యవిద్యార్థిని జీవితంలో అతని కెలాంటి ఆసక్తీ లేనేలేదా?

మీర సన్నజాజి పందిరి దగ్గరకు వెళ్ళింది. సన్నజాజిపందిర తన పచ్చటి ఒడినిండా తెల్లటి మొగ్గల్ని నింపుకుని గాలికి ఊగుతోంది. మీర మొగ్గలను కోసి అందంగా గుచ్చింది. మళ్ళీ జడ

వేసుకుని మొగ్గలదండ తల్లో పెట్టుకుంది. తెల్ల వాయిల్ చీర కట్టుకుని ఏమీ తోచక అవధాన్లుగారింటికి వెళ్ళింది. సాకమ్మగారు మీర కాలేజి, హాస్టలు వీటి గురించి ఎన్నో ప్రశ్నలు వేశారు. ఆమెతో మాట్లాడుతూ కూర్చుంది మీర. కబుర్లయ్యాక ఇంటికి వచ్చేసరికి ఎనిమిదయింది. శాము ఆమె కోసం ఎదురుచూస్తున్నాడు. మౌనంగానే భోజనాలు కానిచ్చారు.

మీర తాంబూలపు పళ్ళెం తీసుకుని గదిలోకి వెళ్ళేసరికి శాము లాంతర్లోని వత్తినే తదేకంగా చూస్తూ కూర్చున్నాడు.

"ఆకులు ఇవ్వనా?"

"వద్దు. తమలపాకులు తరవాత. ముందు కాస్త పనుంది."

"ఏమిటది?"

"మధ్యాహ్నం వెంకు...."

మీర మొహం చిట్లించి "మీ హాస్యానికి హద్దూ పద్దూ లేనట్టుంది. వెంకు ఎదుట అలా అనచ్చునా?"

"నేను ఎత్తి పెంచిన పిల్ల వెంకు. దాని ముందు నాకు సంకోచం దేనికి?"

"ఇప్పుడు వెంకు చిన్నపిల్ల కాదన్న విషయం తెలుసా?"

"కాని నాకు చిన్నపిల్లే."

"చిన్నపిల్ల కదా అని మీ యిష్టమొచ్చినట్టుగా మాట్లాడటమేనా?"

"ఏదీ, ఇటు తిరుగు. నా వర్ణన సరిగ్గా ఉందో లేదో చూస్తాను" అంటూ శాము లాంతరు ఆమె మొహానికి దగ్గరగా పెట్టి చూడసాగాడు. మీర నవ్వింది.

"ఉహుఁ. అలా నవ్వకూడదు. గంభీరంగా ఉండాలి. అల్లాగా. నా వర్ణనంతా సరిగ్గానే ఉంది. కాని ఒక్క సందేహం మాత్రం మిగిలి పోయింది."

"ఏమిటది?"

"మరి నీ పెదవుల రంగు - తాంబూలపు ఎరుపో, నిజమైన

ఎరుపో అన్నదే తెలియలేదు. దాని నిజస్వరూపాన్ని పరీక్షించాలి ఇప్పుడు."

"పరీక్షించ నక్కర్లేదు" అంటూ మీర దూరంగా జరిగింది.

"అదికాదు. ఉట్టినే నాసందేహ నివృత్తికోసం అంతే."

"మీ సందేహాని కోసమే నన్నమాట. మీ కోసం కాదుగా?"

"కాదు."

"యూ స్వీట్ స్కౌండ్రల్" అంటూ మీర అతని చేతుల్లో వాలి మొహం పైకెత్తి "పరీక్షించండి" అంది.

శాము తన పెదవులతో మీర పెదవుల రంగును పరీక్షించాడు. శాము తనను వదలగానే మీర అడిగింది.

"ఏం తెలుసుకున్నారో పరీక్షలో?"

"తాంబూలసేవనతో పెదవులు ఇంత ఎర్రగా కావటం సాధ్యం కాదు. కనుక ఇది నిజయమయిన రంగే" అని వప్పుకున్నాడు శాము.

"మీరు మైసూరుకి వచ్చినప్పుడు హాస్టలుకు రాలేదేం?"

"నేను రావాలని అనుకున్నావా నువ్వు?"

మీర తన భావాలను అణచుకుంటూ "అలా అని కాదు. వస్తే బావుండేది" అంది.

"అవును. మీరు రావాలని ఎంతో కోరుకున్నాను" అన్న మాటలను వినాలని ఆశించిన శాము నిరాశ చెందాడు.

"ఏమిటో రాలేకపోయాను."

"అంత పనా?"

"ఓ జత ఎడ్లు బేరం చెయ్యాలనుకున్నాను. అందుకని ఆగలేకపోయాను."

తన్ని చూసిపోవటానికి వీల్లేని కారణం విని మీర చిన్నబోయింది, అది గమనించి శాము

"ఇంకో కారణం కూడా ఉందనుకో" అన్నాడు.

"ఏమిటి?"

"ఎక్కువ రోజులు దూరంగా ఉంటే 'పునర్మిలనపు మాధుర్యం' ఎక్కువవుతుంది కదా?

"నే నొచ్చానని మీ మనసు తియ్యబడిందా?"

"మనసే కాదు. నోరుకూడా తియ్యబడింది."

మీర ఒళ్ళు విరుచుకుంటూ "పరీక్షల గొడవల్లో సరిగ్గా నిద్ర పోయి ఎన్నిరోజు లయిందో" అంది.

"పడుకో, ఇహ లైటు ఆర్పనా?"

"ఊఁ."

శాము లాంతరు తగ్గించి ఆర్పేశాడు. గదిని చీకటి అవరించింది. అయిదు నిమిషాల్లో మీర నిద్రపోయింది. శాముకు మాత్రం నిద్ర పట్టలేదు. అతనికి కొంచెం దూరంలోనే అప్సరసలాంటి మీర నిరాటంకంగా నిద్రపోతోంది. పొగనిండిన గదినుండి ఊపిరాడని మనిషి-పారిపోయేలా లేచివెళ్ళి వేరేగదిలో పడుకున్నాడు.

శలవురోజులు చాల తొందరగా గడిచిపోతున్నాయి. శలవు లయిపోగానే మళ్ళీ మీర మైసూరుకి వెళ్ళిపోతుంది. ఆమె ఇక్కడ ఉన్నన్ని రోజులు సంతోషంగా వుండేలా చూస్తున్నాడు. తను త్వరలోనే వెళ్ళిపోతోంది కనుక శాము మనసు నొప్పించకుండా జాగ్రత్త పడుతోంది మీర.

మీర ఊరికి వెళ్ళటానికి రెండురోజులు ముందు శాము, మీర చెరువువేపు షికారు వెళ్ళారు. ఇంకా అప్పుడే చీకటి పడుతోంది. ఆ ప్రదేశమంతా నిర్జనంగా ఉంది. అంతవరకూ గూళ్ళు చేరని పక్షులు గూళ్ళవేపు వెడుతున్నాయి.

మీర పిల్లలా నీటిలో కాళ్ళు పెట్టుకుని గడ్డిపరక నములుతూ కూర్చుంది.

"ఇలా రా మీరా. నీళ్ళలో కాళ్ళు పెట్టుకుంటే శీతమవుతుంది."

"కానివ్వండి. మరేం బెంగలేదు."

"నువ్వు డాక్టరివయి యిలా అనవచ్చునా?"

"నే నింకా డాక్టర్ని కాలేదు."

"అందుకే పెద్దవాళ్ళు సగం సగం జ్ఞానం వుంటే అపాయమని అంటారు."

"వచ్చిన దగ్గర్నుండీ మీ కో సంగతి చెప్పాలని అనుకుం టున్నాను. కాని చెప్పటానికి భయంగా ఉంది."

శాము నవ్వి "ఎప్పటినుండీ ఈ పిరికితనం నీకు?" అన్నాడు. మీర రోషంతో తిరగబడి "నాకేం పిరికితనం లేదు" అంది. శాము నవ్వి "ఆఁ, అల్లా ఉండాలి నా మీర" అన్నాడు.

"అయితే అడగనా?"

"ఓ! తప్పకుండా"

"మీరు నవ్వకూడదు. కోపగించకూడదు. నన్ను తిట్టకూడదు ఉదాసీనంగా ఉండిపోకూడదు. నా మాట నెరవేర్చాలి."

"ఓహో! ఏదో చాలా చాలా ఉన్నట్టుందే! అదేమిటో వి దాకా మాట ఇవ్వను."

"ప్లీజ్! నా మాట వినండి."

"చెప్పు వింటాను."

"మీ కిప్పుడు ఎన్నేళ్ళు?"

"నాకు తెలీదు."

"తెలీదూ! సరే పోనీ మీ కింకా చిన్న వయసేనని ఒప్ కుంటారా?"

"కావచ్చు,"

"మరి....మీరు....మళ్ళీ పెళ్ళి యెందుకు చేసుకోకూడదు?" మీర అతి దీనంగా శామువేపు చూసింది.

"అమ్మాయిగారూ. తమ రిప్పుడు మైసూరు మెడికల్ కాలేజీ వెడుతున్నారా? లేక బెంగుళూరు మెంటల్ హాస్పిటల్‌కు వె మన్నారా?"

"నా ప్రశ్నకి జవాబు అదికాదు."

"నాకు ఇంకో పెళ్ళా? ఎందుకు?"

"ఎందు కేమిటి? నేను సంవత్సర మంతా మైసూరులో ఉంటానా? శలవురోజుల్లో మటుకే ఇక్కడుంటాను. మీ రింకా చా చిన్నవారు...."

"మరి నువ్వు డాక్టరయి వచ్చి ఇక్కడే ఉంటానని చెప్పిన మాట నిజంకాదా?"

"అది నిజమే. డాక్టర్నయ్యాక ఇక్కడే ఉంటాను. కాని మీ వంశంకోసం, మీ ఆస్తికోసం...."

"నా ఆస్తి అంతా నీపేర రాసేస్తాను. నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో."

"అది న్యాయంకాదు, మీ ఆస్తి మీ పిల్లలకు చెందాలి. దయ చేసి నాకోసం, మీ కోసం, వంశంకోసం...."

"నాకు వయస్సయిపోయింది మీరా. నా కెవరు పిల్ల నిస్తారు?" శాము నవ్వులాటగా అన్నాడు.

మీర శాము ఉక్కులాంటి భుజాలనూ, విశాలమయిన చాతినీ, ఆరోగ్యంతో కళకళలాడుతున్న మొహాన్ని అభిమానంతో చూస్తూ,

"మీకు పిల్లను వెతికేబాధ్యత నాది"

"అలాగేనండి డాక్టర్‌గారూ."

"మన వెంకు బాగాలేదూ? చిన్నప్పుడయితే ఎలాగో ఉండేది కాని ఇప్పుడు నిండుగా లక్షణంగా వుంది. ఏమంటారు?"

శాము పకపకా నవ్వేశాడు.

"వెంకు కో చెల్లెలుంది. ఆరేళ్ళది దాన్నెందుకు చేసుకో కూడదు?"

"మీ కంతా నవ్వులాటగా వుంది."

"కాకపోతే నువ్వే ఆలోచించి చూడు. వెంకును నా చేతులతో ఎత్తుకుని ఆడించాను. అది నాకు ఓ చిన్నిచెల్లి. దానిముందు ఈ మాట అనేవు పొరపాటున. ఇహ సిగ్గుపడిపోయి ఇంటికి రావటం మానేస్తుందంతే" శాము ఖచ్చితంగా చెప్పాడు. మీర మొదటిప్లాను కాస్తాభగ్నమయింది.

"మీకు పిల్ల ఎలాఉండాలో చెప్పండి. నేను వెతకితెస్తాను,"

"నేను కోరినటువంటి పిల్లను తేగలవా నువ్వు?"

"ఓ! చెప్పండి" అంది మీర వుత్సాహంతో.

"నాక్కావాల్సిన పిల్ల నీ అంత పొడుగ్గా వుండాలి. నీ అంత

లావుగా వుండాలి. నీ రంగుంటే చాలు. జుత్తు పొట్టిగా వుంగరా లుంగరాలుగా వుండాలి. పేరుకూడా మీరాఅనే వుండాలి."

మీర నిరాశతో "నేను సరదాగా మాట్లాడుతున్నా ననుకుం టున్నారా?" అంది.

శాము లేచినిల్చుని కఠినంగా, "లేదు. చాలా తెలివిగా మాట్లాడు తున్నాననే అనుకుంటున్నానుగాని, లే ఇంటికి వెడదాం" అన్నాడు.

"ఉహూఁ, నేను రాను నా మాటకు మీరు వప్పుకునేవరకూ ఇక్కడనుండి కదలను నేను" మొండికేసింది మీర.

"సరే నా కేం! ఇప్పుడు మాటఇస్తాను. తరువాత కాదంటాను. అంతే."

"ఉహూఁ, ఉహూఁ,"

"లేచి వస్తావా, ఎత్తుకుని తీసుకువెళ్ళనా?" శాము గద్దించాడు.

మౌనంగానే తన అసమ్మతిని తెలియచేసింది మీర.

అబ్బ! పట్టుపట్టడంలో జానకితల్లే అనుకున్నాడు శాము.

"సరే, నీ కిష్టమొచ్చినంత సేపు ఇక్కడే కూర్చో. కాని ఓ మాట గుర్తుంచుకో. ఈ కానుగ చెట్టుమీద దెయ్యముందని అందరూ చెప్పుకుంటారు.

శాము ఆమెను బెదిరించటానికి ప్రయత్నించాడు.

మీర నవ్వుతూ "దెయ్యాలంటే నాకేం భయంలేదు. వచ్చే ఏటినుండి శవాలు కొయ్యటానికి సిద్ధంగా ఉన్న నాకు దెయ్యాలంటే భయమా?" అంది.

తన ప్రయత్నాలేమి ఫలించక పోవటంతో శాము

"ఓ షరతుమీద పెళ్ళిచేసుకుంటాను నేను" అన్నాడు.

"ఏమిటది?"

"నువ్వూ మళ్ళీ పెళ్ళిచేసుకోవాలి!"

"నేను డాక్టరువృత్తినే పెళ్లాడేశానే!"

"నేనూ వ్యవసాయాన్ని పెళ్ళిచేసుకున్నాను సుమండీ!"

శాము ఆమెమాటకు బదులిచ్చాడు. మీర అతన్ని సకారణంగా ఒప్పించటానికి ప్రయత్నించింది.

"నా కేముందని మళ్ళీపెళ్ళి చేసుకోవాలో చెప్పండి?"

"నాకుమాత్రం ఏముందిటా?"

"మీకు అపారమయిన ఐశ్వర్యముంది. మీ పూర్వీకులు, మీరు కష్టపడి వృద్ధిచేసిన ఆస్తి పరాయివాళ్ళకు చెందకూడదని నా కోరిక. నానుండి మీ సంపత్తు ఇంకొకరి చేతుల్లోకి వెడుతుందనే నా బాధల్లా. మీ కున్నంత ఆస్తి నాకూ ఉండివుంటే అప్పటిమాట వేరు. మీకోసం కాకపోయినా మీ పెద్దల ఆస్తి పరాయివాళ్ళకు వెళ్ళకుండా చూడటాని కోసమయినా పెళ్ళిచేసుకోవాలి మీరు. నా నుండి మీ వంశం ఇక్కడితో ఆగిపోకూడదు.

"నువ్వు డాక్టరివయి రా-అప్పుడు ఆలోచిద్దాం."

అతని మాటతో ఆమెకు భరోసా కలిగింది. ఆ భరోసాతో కలిగిన ఉత్సాహంతో లేచి నిల్చుంది మీర. నెమ్మదిమీద అతనిమనసు మెత్తబర్చాలి అనుకుంది.

*   *   *

మీర ఫస్టుక్లాసులో పాసయింది. ఎప్పుడూ హోటలు, సినిమా, కజిన్ వీటి గొడవలో సతమతమయిపోయే డాలీకూడా ఒక్కమారే పాసవటం మీరకు ఆశ్చర్యాన్ని కలిగించింది. నిజంగా కష్టపడి చదివిన మంజుల ఫెలయిందని విన్నపుడు నమ్మలేకపోయింది. పరీక్ష విద్యార్థుల తెలివి కొలిచే కొలబద్దకాదు. కేవలం అదృష్టపు పరీక్షమాత్రమే అనుకుంది.

డాలీ ఈసారి వచ్చేటపుడు లేడీసైకిల్ కొనిపించుకుని వచ్చింది. హాస్టల్‌కూ, కాలేజీకి పెద్ద దూరమేమీ లేకపోయినా, ఆమె మిగిలిన షికార్లకు సైకిల్ కావలసి వచ్చింది. మనోరమ డాలిని మొహంమీదే అడిగేసింది.

"ఏమిటండీ, హాస్టల్‌నుండి కాలేజీకి నడవలేరా మీరు?"

"అదేంలేదు-కాని షాపింగ్‌కి, పిక్చర్‌కీ వెళ్ళాలంటే నడవాలి కదా! నడిచటమంటేనే విసుగు నాకు. ఈ మారు పరీక్షలో పాసయి

వందుకు మా నాన్న ప్రెజెంట్ చేశారు దీన్ని" అని గర్వంగా చెప్తుంది డాలీ.

కూతురి చదువుని ప్రోత్సహించటానికోసం ఆ తండ్రి సైకిల్ ప్రెజెంట్ చేశారు. కాని కూతురు?

ఈ సంవత్సరం మీరకు బొత్తిగా తీరికలేదు. ఉదయం డిసెక్షన్, వెంటనే కాలేజి. ఉదయం ఎనిమిదినుండి పదిన్నరదాకా డిసెక్షన్, అది కాగానే హాస్టల్‌కొచ్చి కంగారు కంగారుగా భోంచేసి పుస్తకాలు తీసుకుని కాలేజీకి పరిగెత్తటం. ఆలస్య మయిపోతుందన్న భయంతో సరిగ్గా భోజనంకూడా చేసేదికాదు.

డిసెక్షన్ థియేటర్‌లోకి వెళ్ళిన మొదటిరోజు భీతి అసహ్యాలతో, వణికిపోయింది. ఫార్మల్ ఆసిడ్ వాసన థియేటర్‌నంతా ఆవరించింది. టేబుల్‌మీద పడుకోబెట్టిన శవాన్ని చూడగానే భయంతో గట్టిగా అరవాలనిపించింది మీరకు. భయంతో విజయచేతిని గట్టిగా పట్టుకుంది.

నీటిలో పడి ఆత్మహత్య చేసుకున్న అనాధుడి శవం అది. నీళ్ళు తాగటంవల్ల శరీరమంతా ఉబ్బరించింది. కళ్ళు తిరిగి, తిన్న అన్నాన్నంతా డోక్కునేంతటి అసహ్యమయిన వాసన గదినిండా వ్యాపించింది. ఆ దుర్గంధం యెదుట అమ్మాయిల జడలోని పూల పరిమళం, అబ్బాయిల సెంటువాసన ఎక్కడో దాక్కున్నాయి.

విద్యార్థులు శవంచూట్టూ నిల్చున్నారు. డిమాన్‌స్ట్రేటర్ సూచనలిచ్చిన తరువాత సీనియర్ విద్యార్థులు డిసెక్షన్ ప్రారంభించారు. మీర కుతూహలం, కలవరాలతో చూడసాగింది.

ఆ శరీరంనిండా క్రిములే! తనకు కావలసిన భాగాన్ని ఎడమచేతి వేళ్ళతో పట్టుకుని కుడిచేతితో డిసెక్ట్‌చేశాడు ఓ సీనియర్ విద్యార్థి. శరీరంలోనుండి క్రిములు అతనిచేతిమీదికి పాకివస్తున్నాయి. కాని అతను చేతిని వెనక్కితీయటానికి వీల్లేదు. అతనికి కావలసిన నరం దొరక్కపోతుందేమోనన్న భయం. అప్పుడప్పుడూ అతను కుడిచేతితో ఎడమచేతికి ఎక్కడానికి ప్రయత్నిస్తున్న క్రిములను, దులిపి తనపని సాగించేవాడు.

వెతుకుతున్న నరం దొరికినప్పుడు ఆ విద్యార్థుల ఆనందానికి అంతుండేది కాదు. ఏదో గొప్పనిధి దొరికినట్టుగా ఆనందించేవారు.

ఆ రోజు మీరకు అన్నం సయించలేదు. హాస్టల్‌కు రాగానే వేన్నీళ్ళు లేకపోయినా చన్నీళ్ళతోనే స్నానం చేసింది. చేతుల్ని ఎన్ని మార్లు సబ్బుతో రుద్దినా తృప్తికాలేదు. మంటపుట్టేదాకా రుద్ది వదిలి పెట్టింది. అన్నం నోట్లో పెట్టుకో బుద్ధెయ్యలేదు. డిసెక్షన్ రూంలోని వాసనే ఇక్కడా. అసహ్యం, డోకు, జుగుప్స!

ఆ రోజు రోజంతా మీర డల్‌గానే ఉంది. కాని డిసెక్ట్ చెయ్యటం అలవాటయ్యేక, శవంలోని నరనరాల్ని విప్పిచూడటం మామూ లయిపోయాక మీర తేరుకుంది. శరీరపు అంగాంగాల్ని కత్తిరించి విప్పిచూసి, నోట్స్ తీసుకుని మళ్ళీ కుట్టేయటం దినచర్యలో ఓ భాగమయిపోయింది. డిసెక్షన్ పూర్తిచేసి హాస్టల్‌కు వచ్చి హాయిగా భోంచేసి వెళ్ళగలిగేది. మొదటిరోజయిన అనుభవం మళ్ళీ ఎప్పుడూ కాలేదు.

డిసెక్షన్ చేసేటప్పుడు మీ రతన్నుతానే మర్చిపోయేది. అద్భుతాన్ని చూస్తున్న పసిపిల్లలా ఆమెకళ్ళు ఆశ్చర్యానందాలతో పెద్దవయ్యేవి. ఆమె వెదుకుతున్న నరం, రక్తనాళం, ఎముక దొరికినపుడు వర్ణనాతీతమైన ఆనందాన్ని అనుభవించేది.

మీర ఇంకా చిన్నపిల్లగా ఉన్నప్పుడు గోపాల్ చెబుతూ ఉండేవాడు.

"చర్మం మన దేహాన్ని కప్పే ముసుగు. దానిలోపల రక్తం, మాంసం, ఎముకలు ఉన్నాయి. నువ్వు మెడిసిన్ చదువు. నీకూ అంతా అర్థమవుతుంది."

అప్పుడు మీర కుతూహలంతో గోపాల్ మాటలు వింటూ ఉండేది. అప్పటి కుతూహలం, ఆసక్తి ఇంకా అల్లాగే నిలిచిఉన్నాయామెలో. సృష్టి రహస్యాన్ని ఛేధించేదానిలా మీర దాహంతో తన చుట్టూ చూసి గ్రహించేది.

ఓ రోజు పోస్ట్‌మార్టంకు పందొమ్మిదేళ్ళ యువతిదేహం

వచ్చింది. ఆ అమ్మాయి జీవితపు వసంతంలోనే బ్రతుకుమీద విరక్తి కలిగి తన జీవితాన్ని అంతం చేసుకుంది.

మెడికల్ కాలేజి విద్యార్థులు పోస్టుమార్టంపట్ల కన్నా, ఆ అమ్మాయి వ్యక్తిగత జీవితాన్ని గురించి తెలుసుకోవటంపట్లనే ఎక్కువ కుతూహలం చూపారు. ఆమె దేహం వచ్చిన కొద్దిసేపట్లోనే వాళ్ళు ఆ అమ్మాయి జీవిత రహస్యాలను తెలుసుకున్నారు.

తార మహారాజా కాలేజీలో ఎం. ఏ. చదువుతూండేది. ఆ అమ్మాయి చాలా తెలివిగలది. అందం, డబ్బు దేనికీ లోటులేదు. అలాంటిపిల్ల ఓ రోజు కాలేజినుండి రాగానే నీళ్ళగదిలోకి వెళ్ళి ఎంత సేపటికి బయటికి రాలేదు. ఇంట్లోవాళ్ళు గాబరాపడి తలుపు బ్రద్దలు కొట్టించారు. లోపల కనిపించిన దృశ్యం హృదయవిదారకంగా ఉంది. తార ఉరిపోసుకుంది. గంటక్రింద నవ్వుతున్న అమ్మాయి అప్పుడే పళ్ళు కరచుకున్న శవమయింది. చుట్టుప్రక్కల వాళ్ళంతా గుమిగూడారు. కాలేజికి వార్త వెళ్ళింది. క్షణమాత్రంలో కాలేజికి కాలేజే వాళ్ళింటిముందు వాలింది. పోలీసులు వచ్చి విచారణ జరిపి పోస్ట్ మార్టంకోసం శవాన్ని మెడికల్ కాలేజికి పంపారు.

రకరకాల వ్యాఖ్యానాలు బయలుదేరాయి.

"ఆ పిల్ల ప్రవర్తన కొంచెంకూడా మంచిది కాదట. ఎప్పుడు బడితే అప్పుడు, ఎవరితోబడితే వారితో తిరుగుతూ ఉండేదిట. వయసులో ఉన్న పిల్ల, ఏ మనర్థం జరిగిందో.........!"

"కాలేజీలో ఆమె క్లాస్‌మేట్‌ని లవ్‌చేసిందట. వాడు పెళ్ళి చేసుకుంటానని మాటఇచ్చి చనువుగా ఉండేవాడట. ఇంకేముంది? రెండు నెలలయింది. వాడేమో మొహం తప్పించాడు. అపమానాన్ని భరించలేక ఉరిపోసుకుంది."

"తల్లి తండ్రులే కూతురిచేత అలాంటిపనులు చేయించేవారట. ఆమె కెంత దుర్భరమనిపించిందో గొంతుకు తాడు బిగించుకుంది."

"పెళ్ళి నిశ్చయమయిందిట. ఓ మగవాడిచేత మాంగల్యం

కట్టించుకోవటానికన్నా తనే తాడు బిగించుకోవటం నయం అని అంత పని చేసిందట."

అందమయిన అమ్మాయి ఆత్మహత్య చేసుకుంది! ఇహ శీలాన్ని శంకించేవారే! అంతకన్నా మరోవిధంగా ఆలోచించాలన్న ఊహకూడా తట్టదు వారికి.

"అందుకే ఆడపిల్లల్ని చదివించరాదు, చదివి చెడిపోతారు."

గుడ్డివాడొకడు ఏనుగుతొండాన్ని చుట్టిచూసి "ఇదే ఏనుగు" అని నిర్ధరించాడు.

మెడికల్ కాలేజి విద్యార్థులందరూ ఆ అమ్మాయిదేహం చుట్టూ గుమిగూడారు.

అందరి కుతూహలానికి కేంద్రంగా, ప్రయోగ సాధనంగా టేబుల్‌మీద నగ్నంగా పడిఉన్న ఆ అమ్మాయి దేహాన్ని చూసి మీర కళ్ళు చెమర్చాయి.

ఆ అమ్మాయి బ్రతికివుంటే?

ఏ ఇంటి దీపం వెలిగేదో!

ఏ రసికుని హృదయరాణిగా విలసిల్లేదో!

ఏ రామన్, నెహ్రూ, సరోజినీ నాయుడు లాంటివారికి జన్మ ఇచ్చేదో!

విచ్చుకుంటున్న జీవిత పుష్పాన్ని ఏ కరాళహస్తం నలిపి వేసింది? ఏ కారణం ఆమె నిలాంటిపనికి ప్రేరేపించింది? ఏ దారుణ మానసికవ్యధ ఆమె హృదయంలో చిచ్చుపెట్టింది?

టేబుల్‌మీద లజ్జలేకుండా పడిఉంది ముచ్చటయిన దేహం. ఆమె గొంతుచుట్టూ ఉన్న నీలపుగుర్తు తప్పిస్తే దేహంలో అన్ని భాగాలూ సరిగ్గానే వున్నాయి. ఆమె మొహంమీదిస్నో, పౌడర్ మాసి పోలేదు. తల్లోని పూలుమాత్రం కాస్త నలిగాయి.

కొంతమంది విద్యార్థులు ముసిముసి నవ్వులు నవ్వారు.

"ఎక్స్‌పెక్ట్ చేస్తోం దనుకుంటాన్రోయ్?"

"ఎవరిని? బేబీనా? చావునా?"

"బేబీని ఎక్స్‌పెక్టు చేసి చావుని ఇన్వైట్ చేసుంటుంది."

అమ్మాయిలంతా మౌనంగా ఊపిరి బిగపట్టి పోస్టుమార్టంనే గమనిస్తున్నారు.

ఆఅమ్మాయి అందమైన దేహంమీద పదునుగాఉన్న ఆయుధాలు స్వేచ్ఛగా విహారంచేశాయి. డాక్టరు ఆమె దేహపు అనేక భాగాలను కత్తిరించి చూశారు. పరీక్ష అయ్యాక మళ్ళీ అంతా కుట్టి దీనవదనంతో కాచుకునిఉన్న ఆ పిల్ల తండ్రికి దేహాన్ని అప్పజెప్పారు.

ఆయన ప్రశ్నార్థకంగా డాక్టర్‌వైపు చూశారు.

"ప్రజల అనుమానానికి ఆధారం లేదు"అని ఆయనకు తెలిసింది. ఫలితం తెలియగానే చిన్నబోయి ఉన్న అమ్మాయిల మొహాల్లోకి వెలుగు వచ్చింది. తమ జాతికే జరగనున్న అవమానానికి ఆస్కారంలేదని తెలిసి యశోద జేబురుమాలు ఊపింది.

విజయ "పూర్ గర్ల్" అంది.

డాలి "ఎప్పుడు చనిపోతామో! బ్రతికుండగానే వీలయినంత లైఫ్‌ని ఎంజోయ్ చెయ్యాలి" అంది.

"కోమలమయిని పుష్పాన్నుండి ఆత్మ సౌరభాన్ని పీల్చివేసిన కారణం ఏమైఉంటుంది?" అని తన్నుతానే ప్రశ్నించుకుంది మీర.

రకరకాలుగా కథలు అల్లి ప్రచారం చేద్దామనుకున్నవారి నోళ్లు మూతలు పడ్డాయి.

ఆ అమ్మాయి శీలాన్ని శంకించి కడుపుతో ఉందని తేలిగ్గా మాట్లాడిన విద్యార్థులవేపు తిరిగి విజయ—

"సరిగ్గా తెలుసుకోకుండా నోటికొచ్చినట్టు మాట్లాడటం మంచిది కాదు. ఆ అమ్మాయి గంగ అంత పవిత్రంగా ఉంది" అంది.

తమ మాటల కాధారం లేదని తెలుసుకున్న అబ్బాయిలు జవాబు చెప్పలేదు.

ఫైనల్ ఇయర్ మెడికల్ స్టూడెంట్స్‌కు వీడ్కోలు ఇచ్చే సందర్భంలో పెద్దగా పార్టీ అదీ ఏర్పాటు చెయ్యాలని జూనియర్ విద్యార్థులు నిశ్చయించుకున్నారు.

ఆ రోజు 'కిసా-గోతమి'నాటకం వెయ్యాలని తీర్మానించారు. 'రీఫండ్' అన్న ఇంగ్లీషు నాటకంకూడా వేయా లనుకున్నారు.

'గోతమి' పాత్ర మీర నిర్వహించింది. ఆనందుడి పాత్రను రెండో సంవత్సరంలో ఉన్న గోపీనాథ్ వేస్తున్నాడు. బుద్ధుడిపాత్రను తలంతా పండిన లెక్చరరుగారికి అప్పచెప్పారు.

ఓ ఆదివారం మూడుగంటలకు కార్యక్రమం ప్రారంభమైంది. ముందు 'టీ', తరువాత 'ఫోటో'. నాటకాలు సాయంత్రం అయిదు గంటలకు పెట్టుకున్నారు.

మీర శాముకు ఇన్విటేషన్ పంపింది. కాని అతను రావటానికి వీలుపడదని రాశాడు. శాము రాడని మీరకూ తెలుసును.

అధ్యక్షుల ఉపన్యాసం, పోటీలలో గెలిచినవారికి బహుమతులు పంచిపెట్టాక ఇంగ్లీషు నాటకం వేశారు. అ తరువాత 'కిసా-గోతమి' నాటకం ప్రారంభమయింది.

మీర స్టేజీ ఎక్కి కొన్ని సంవత్సరా లయిపోయింది. దానితో కాస్త అధైర్యం కలిగింది మొదట్లో.

తెర లేచింది. గుడ్డతోచుట్టిన పెద్ద రబ్బరుబొమ్మను చేతులతో ఎత్తుకుని స్టేజీమీదకు వచ్చింది మీర. విరబోసుకున్న జుత్తు, నల్ల వాయిల్ చీర. నల్లజాకెట్టు. మొహంలో బొట్టు. దుఃఖావేగంతో వణుకుతున్న పెదవులు-వీటివిచూసి ప్రేక్షకులు ఊపిరి బిగపట్టి చూడ సాగారు. శోక దేవత ఆమె మొహంమీద నాట్యం చేస్తోంది.

పగలంతా చీకటాయె
జీవితమంత శూన్యమాయె
జగమంత అంధకారమాయె

గోతమి ఉప్పెనలా పొంగి వస్తున్న దుఃఖాన్ని పాడి వినిపించింది. స్టేజీ ఎక్కి పాట ఎత్తుకోగానే గోతమి అదృశ్యమయింది. మీర-తన శిశువును పోగొట్టుకున్న తల్లిమీర-ఆ స్థానంలో నుంచుని ఆనందుడిని యాచిస్తోంది.

అగుపించెనా నా
అందాలపాప?
వెలిగింతువా నా ఆరిన జీవనజ్యోతిని?

—వీణను తల్చుకున్న మీర కళ్ళలో అశ్రువులు ధారాపాతంగా ప్రవహించ నారంభించాయి. గోతమి దుఃఖం, మీరకు కేవలం అభినయమే కాదు. నిజంకూడా.

బిడ్డను పోగొట్టుకున్న తల్లి శోకభారంతో కుమిలిపోతూ అంది:
ఇక నవ్వదా నా పాప? మరిక
వెలుగుతో నింపదా నా ఇంటిని?
—'వీణా వీణా' అని ఆక్రోశించింది ఆమె హృదయం.

—మీర కంఠం గద్గదమయింది. ఆమె దగ్గరగా నుంచున్న ఆనందుడు-గోపీనాధ్ ఆమె దుఃఖాన్ని చూసి కంగారుపడ్డాడు. ఇది నటనా లేక నిజమయిన శోకమా? ఆమె కళ్ళలో అశ్రు ప్రవాహం ఆగలేదు. దుఃఖా వేశంతో రొప్పుతూ-

బతికింతువా ఈ పాపను?
నవ్వింతువా యీ చిన్నరిని?
వెలిగింతువా ఈ దీపాన్ని?
—అన్నప్పుడు ఆమె కంఠం గద్గదమయింది.

తెరదించుతూండగా ప్రేక్షకుల కరతాళ ధ్వనులతో హాలంతా మార్మోగిపోయింది.

రెండవ దృశ్యంలో బుద్ధుడూ-సుజాత మాట్లాడు తుండగా, వింగ్స్‌లో గోపీనాధ్ మీరతో-

"అంతగా ఎక్సైటెట్ అవకండి మీరా! మీరు చాలా ఎమోషనల్‌లా ఉన్నారు" అన్నాడు.

విజయ పరుగెత్తుకుంటూ వచ్చి మీర చేతిని అందుకుని-

"అబ్బ! ఇలాంటి అభినయం ఇంతవరకూ చూడలేదు నేను. ఈ మేకప్‌లో, ఈ నల్లటి డ్రస్‌లో ఎంత బాగున్నావో తెలుసునా?" అంది.

మూటవ రంగంలో బుద్ధుడి ప్రశ్నకు గోతమి అంటోంది—
అదృశ్యమయిన నా
అందాల పాపను నాకు

అందింతువా?

అయితే విను ప్రభూ!

—తమ వీణను ఎవరు బ్రతికించారు? వీణను బ్రతికించు కోవాలని ఎంత ప్రయత్నించారు తనూ శామూ!

బుద్ధుడి అభయ వచనాలకు గోతమి అంటోంది.

ఇచ్చెదవా నా పాపను?
నవ్వించెదవా నా చంద్రుని?
పారద్రోలెదవా ఈ కారుచీకటిని?
ఉన్నదొక్కగా నొక్క పాప
వచ్చి నవ్వుల వెలుగుల
వెన్నెలతో నింపె నా మనసును
వెన్నెలనవ్వు తను నవ్వి
వెలిగించె నా జీవనజ్యోతిని

—వీణ తనకు ఒక్కతే బిడ్డ. కాని ఒక్కతే శాము ముద్దుల బిడ్డ. తమిద్దరికి ఒక్కతేబిడ్డ వీణ. ఒక్కపాప ఇంట్లో మసలుతూంటే పదిమంది ఉన్నంత సందడి. తమనునవ్వించి కవ్వించిన తమవీణ ఏదీ?

నవ్వించెదవా చంద్రుని?

—ఇంకెక్కడి చంద్రుడు? వీణ మట్టిలో కలిసి పోయింది. ఆమె జీవితం శూన్యమైన ఆకాశం. అక్కడ మినుకుమనే నక్షత్రపు ఆశకూడా లేదు. వీణ అందం, తెలివి, అల్లరీ అంతా ఒక్క పిడి కెడుబూడిద. ఒకే ఒక్క పిడికెడు పూడిద—

తెర పడగానే కన్నీళ్ళతో కళ్లు కనబడని మీర గ్రీన్‌రూమ్‌లో కుర్చీలో కూర్చుని వెక్కివెక్కి ఏడ్చింది. గోపీనాథ్ కంగారుగా-

"మీరా, ఏమిటిది? ఎందుకిలా ఏడుస్తారు? ఇది నాటకం మాత్రమే. కాస్త నిగ్రహించుకోండి" అని ఓదార్చాడు.

అతనికిది కేవలం నాటకమే! కాని తనకో? తన ప్రాణంలేని ఒకభాగాన్ని అగ్నికి సమర్పించిన తనకో?

విజయ పరుగెత్తుకుంటూ వచ్చి, మీర భుజంచుట్టూ చేలుతు వేసి "మీరా, మీరా ఏడవకు" అంది.

కన్నీటితో చెరిగిపోయినచోట రంగు పూసుకుని తన వ్యధను అణచుకుంటూ పైకి లేచింది.

చావు మొహ మెరుగని ఇంటి ఆవాలు తేలేక గోతమి దయామయుడయిన బుద్ధుడి సన్నిధికి తిరిగివచ్చింది. బుద్ధుడి అమృతవాణి ఆమె శోకాన్ని తొలగించి వెలుగునిచ్చింది.

చావులేని చోటు లేదు
బాధలేని బాట లేదు
అన్నమాట గోతమికి జ్ఞానోదయన్ని కలిగించింది.
ఎవరో ఇచ్చినారు మ
రెవరో పుచ్చుకున్నారు
ఏల అప్పు డా వికాసం? మ
రేల ఇప్పు డీ విచారం?

—గోతమి దుఃఖాన్ని పరిహరించటానికి ఆమెకు గౌతముని, మహాత్ముని దర్శనం లభ్యమయింది. మరి తనకో?

గోతమి బుద్ధుడి చరణాలమీద వాలిపోతూండగా తెరపడింది.

ఉత్తమ అభినయానికిగాను మీరకు మొదటి బహుమతి లభించింది. అధ్యక్షులు ఆమెను బహుమతి నందుకోటానికి స్టేజీమీదకు రమ్మని పిలిచినపుడు వింగ్స్‌లో నిల్చున్న మీర గోపీనాధ్‌తో—

"నాది అభినయం కాదు. కనుక నాకు బహుమతి వద్దు" అని చెప్పింది.

"అంత అద్భుతంగా నటించి ఇప్పుడు బహుమతివద్దంటారేం?"

"ప్లీజ్. నేను బహుమతిని తీసుకోలేను."

గోపీనాధ్ వెళ్ళి అధ్యక్షుల చెవిలో ఈ సంగతి చెప్పాడు. ఆయన అదే బహుమతిని 'రీఫండ్' నాటకంలో నటించిన వెంకటేశమూర్తికి ఇచ్చారు.

గోపీనాధ్ మళ్ళీ మీరతో "మీరలా ఎల్లా ఏడవగలిగారు? మీ కళ్ళలో నీరు చూసి కంగారుపడిపోయాను నేను" అన్నాడు.

కనుమరు గయిన కూతురి జ్ఞాపకాలు తుఫాను రేపుతూండగా కళ్ళలో నీళ్ళు తిరగటం ఆశ్చర్యమా?

గోపీనాథ్ మాటకు మీర విషాదంగా నవ్వింది. అధ్యక్షులు మీర అభినయాన్ని మెచ్చుకుంటూ-

"బహుమతి వద్దన్నారెందుకు?" అనడిగారు.

"నటనకు ప్రథమ బహుమతి నందుకునే అర్హత నాకు లేదు" అని సవినయంగా జవాబు చెప్పింది.

తరువాత మీరస్నేహితులంతా వచ్చి ఆమెను అభినందించారు.

"మీ అభినయం అద్భుతంగా ఉంది" అంటూ.

అభినయం! ఆమె హృదయంలో రేగుతున్న అగ్నిజ్వాలలను ఎవరు చూశారు?

మొదటి సంవత్సరం పరీక్షలు పూర్తయ్యాయి.

మీర మళ్ళీ పల్లెకు వెళ్ళిపోయింది. దసరా శలవుల్లో కూడా ఆమె పల్లెకు వెళ్ళలేదు. శాము రమ్మని వత్తిడి చెయ్యనూలేదు. తను దూరంగా ఉంటే నయినా భార్యలేని లోటు అతనికి కనిపించి మళ్ళీ పెళ్ళికి ఒప్పుకుంటా డేమోనన్న ఆశతో, చదువుకో వలసింది చాలా ఉందనిచెప్పి అక్కడే ఉండిపోయింది.

వెంకమ్మగారు మీరను అప్యాయంగానే ఆహ్వానించారు. కాని ఆమెకు లోపల అసమాధానంగానేఉంది. శాములాంటి భర్తనువదిలిపెట్టి సంవత్సరం పూర్తిగా చదువుపేరు చెప్పి బయటఊళ్ళో వుండి పోవడం ఆమెకు నచ్చలేదు.

శాము ఎంతో మంచికుర్రాడు. ఆమె చదువుకుంటానన్నా అడ్డు చెప్పలేదు. అలాంటివాడిని ఇలా నొప్పించటం మంచిదేనా? అప్సరసలాంటి భార్య ఉండికూడా లేనట్టేనా అతనికి?

"ఆయన వచ్చాకే భోంచేస్తాను." అని వెంకమ్మగారితో కబుర్లు చెబుతూ కూర్చుంది మీర. మీర చెప్పే విషయాలన్నీ ఆశ్చర్యమైనవే ఆమెకు!

"అబ్బ! శవాలు కొయ్యటానికి భయమెయ్యదూ?"

"మొదటిరోజు కాస్త భయంవేసింది. ఇప్పుడదేం లేదు."

"అబ్బాయిలూ, అమ్మాయిలూ కలిసే శవాలు కోస్తారా?"

"ఊఁ."

"ఆడవాళ్ళ శవాలు దొరుకుతాయా?"

"ఊఁ మరి లేకపోతే స్త్రీల దేహరచన ఎలా తెలుస్తుంది?"

"శవాల్ని నగ్నంగా పడుకోబెడతారా? లేకపోతే ఏదయినా కప్పుతారా?"

వెంకమ్మగారి మాటలకు పగలబడి నవ్వింది మీర. ఆమె నవ్వు పూర్తికాకముందే శాము ఇంట్లో కొచ్చాడు.

శాముకు మీరమీద బాగా కోపం వచ్చింది. శలవుల్లో ఆమె పల్లెకు రాకపోవటానికి కారణాన్ని సరిగ్గానే ఊహించాడు. ఇప్పుడామెను చూసి వ్యంగ్యంగా—

"ఏం? ఈ శలవుల్లో ఎక్కడికీ వెళ్ళలేదూ?" అనడిగాడు.

అతని మాటల్లో వ్యంగ్యం మీరకు అర్థమయినా ఏమీ తెలియనట్టుగానే—

"లేదండి-వచ్చేసారి శలవుల్లో విజయ పూనా రమ్మని పిలుస్తోంది. వెడదామనుకుంటున్నా, పూనా, బొంబాయి అన్నీ చూసి వస్తాను" అంది.

"మరి ఈమారు ఎవరూ పిలవలేదా?"

"ఊహుఁ లేదు."

భార్యాభర్తల వాగ్వివాదాన్ని వింటూ మౌనంగా కూర్చున్నారు వెంకమ్మగారు. ఆమెకు మనసులో మీరమీద చెప్పలేనంత కోపం వచ్చింది.

సాయంత్రం శాము పొలాలవేపు వెళ్ళగానే వెంకమ్మగారు మీరతో దెబ్బలాడారు.

"ఇదేమిటమ్మాయ్, ఇంటి ఇల్లాలివి ఇలా సంవత్సరం పొడుగునా బయటే ఉండిపోవటం న్యాయమా? శాము ఎంత చిక్కిపోయాడో చూశావా?"

శాము చిక్కిపోయాడని మీరకూడా అనుకుంది.

"నన్నేం చెయ్యమంటారు చెప్పండి? డాక్టరీపరీక్షకు చదువుకోవలసినది చాలా ఉండటంచేత శలవుల్లో రాలేకపోయాను."

"నాకేం బాగాలేదమ్మాయ్ ఇదంతా."

తను ఓ ఉద్దేశంతో దూరంగా వుంటే వీళ్లు మరోలా అనుకుంటున్నారు.

"మరి ఏం చెయ్యమంటారు నన్ను?"

"గృహలక్ష్మిగా ఇంట్లో మసులుతూ ఉండు."

మీర ఒక్క నిమిషం ఆగి అంది.

"మళ్ళీ పెళ్ళిచేసుకోమని చెప్పాను ఆయనతో."

వెంకమ్మగారు అదిరిపడ్డారు. తాము వినటంలోనే పొరపాటుందేమోనని—

"ఏమన్నావ్?" అన్నారు.

"మళ్ళీ పెళ్ళిచేసుకోమని చెప్పాను వారితో. ఆయన్ను ఒప్పించే బాధ్యత మీదే."

"అలా అంటా వేమిటమ్మా!"

"నేను చెప్పేది వినండి కాస్త. నా జీవితం మొదటినుండి వక్రమార్గంలోనే నడుస్తోంది. నాలోని అశాంతి పోగొట్టుకోవటాని కోసం చదువుతున్నాను. డాక్టరయ్యాక ఇక్కడికే వచ్చి జబ్బులతో బాధపడుతున్న రైతుల కుటుంబాలకు వీలయినంత సేవ చేస్తాను. ఆయన ఎంతో ఉదారహృదయంతో దీనికంతా సాయపడుతున్నారు. కాని....ఆయనతో కాపురం చెయ్యటానికి మాత్రం వేరే అమ్మాయిని తెచ్చి పెళ్ళి చేద్దామనుకుంటున్నా."

"మరి నువ్వో?"

"నేనేం లాభంలేదు. మీరు ఆయనతో చెప్పి ఒప్పించటానికి ప్రయత్నించండి. నేనూ ప్రయత్నిస్తాను" అంటూ మీర అక్కడి నుండి లేచి వెళ్ళిపోయింది.

రాత్రి మీర భోంచేసి గదిలో ఉండగా శాము వచ్చాడు. మధ్యాహ్నం భార్యను సరిగ్గా పలకరించనందుకు పశ్చాత్తాపం కలిగిందతనికి.

"ఏమండీ, ఇప్పటికయినా ఈ బీదవాడు గుర్తొచ్చాడా?"

"లేదండి. లేదు."

"మరెందుకొచ్చినట్టు?"

"రాక ఎక్కడికి వెళ్ళను?"

"ఎక్కడికయినా సరే, నానుండి దూరంగా...."

"ఎక్కడికయినా వెడితే ఎవరన్నం పెడతారు? మీరు కనుక నేను పెట్టే బాధలన్నీ ఓర్చుకుంటున్నారు గాని అందరూ అలా ఉంటారా?"

"మరేం చేస్తారు?"

"నువ్వు కాకపోతే మరొకతి అని మళ్ళీ పెళ్ళిచేసుకునేవారు."

"మళ్ళీ అదేమాట! ఇంకోసారలా అన్నావంటే...."

"ఏం చేస్తారు?"

"నోరు మూయిస్తాను."

"నా మాట వినండి. మీరింకా...."

శాము ఆమె దగ్గరగా నిలబడి "చాలిక" అన్నాడు.

"నా మాట...."

శాము అన్నంతపనీ చేశాడు. ఆమెకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. రెక్కలులేని కిన్నెరలా కనబడుతున్న మీరను చూపి ఆశతో—

"భిక్షాందేహి" అన్నాడు.

మీర నవ వధువులా సిగ్గుపడింది.

శాము రెండోపెళ్ళి గురించి వాదిద్దరిమధ్యా అపుడపుడూ చిలిపి కయ్యాలు వస్తూండేవి. కాని శాము దాన్ని తేలిగ్గా తీసుకునేవాడు. ఒక్కోసారి పనిగట్టుకుని మీరను పిలిచి ఏడిపించేవాడు.

మీరా నాకేం తోచటంలేదు. కాసేపు నా పెళ్ళిగురించి మాట్లాడుకుందాం రా" అని పిలిచేవాడు.

అతనలా అనగానే ఎక్కడలేని కోపమూ వచ్చేసేది మీరకు. చేతిలోని గిన్నె నేలమీదకు విసిరిగొట్టి తన కోపాన్ని ప్రదర్శించేది. శాము శాంతంగా—

"డాక్టర్లకు ఓర్పు ఎంతో ముఖ్యం. నువ్విలా రోగుల దగ్గర సహనం కోల్పోతే లాభంలేదు."

"మీరు రోగులుకారు."

"కాకేం! నేనో విధంగా రోగినే."

"మీ జబ్బు నేను నయంచెయ్యలేను. ఇంకో అమ్మాయిని చేసుకుంటే ఆమె నయంచేస్తుంది."

"నిన్నే మరోమారు ఎందుకని పెళ్ళిచేసుకోకూడదు?"

"ఛ! నేను చచ్చిపోతేగాని మీరు మళ్ళీ పెళ్ళిచేసుకోరేమో!" అంది బాధగా.

"మరీ మంచిది. అప్పుడు నన్ను పెళ్ళిచేసుకొమ్మని గొడవ పోట్టేవారే ఉండరు."

"మీతో మాట్లాడటం నాదే తెలివితక్కువ."

"తెలివి తక్కువవాళ్ళతో మాటలాడి నా బుర్ర చెడిపోతోంది."

"ఈసారి మైసూరుకి వెళ్ళి మళ్ళీ నేను తిరిగివస్తానేమో చూడండి."

"రాక ఎక్కడికి పోతావేం?"

"ఎక్కడికో, శ్మశానానికి."

శాము హాస్యధోరణి మాని గంభీరంగా—

"నువ్వు పరీక్ష పూర్తిచేసిరా. ఆ తరువాత ఆలోచిద్దాం" అన్నాడు. మీర ఆనందంతో కళ్ళు పెద్దవిచేసి,

"నిజమేనా?" అంది.

"నిజం."

"అబ్బ. మీరెంత మంచివారండి!"

"నాకేం నీ మెప్పు అక్కర్లేదులే."

* * *

అవధాన్లగా రమ్మాయి వెంకు పెళ్ళి నిశ్చయమయింది. వరుడికి మండ్యలో పంచదార ఫాక్టరీలో పని. నూట ఇరవయిరూపాయలు తెచ్చుకుంటున్నాడు. అవధాన్లగారింట్లో పెళ్ళిపనులు చురుగ్గా సాగుతున్నాయి. పల్లెలోని బ్రాహ్మణ కుటుంబాల్లోని ఆడవాళ్ళంతా పెళ్ళి పనుల్లో సాయపడుతున్నారు.

ముహూర్తం రోజుకు కావలసిన బియ్యం, కొబ్బరికాయల

ఖర్చంతా శాము భరించాడు. వెంకు దూరంగా వెళ్ళిపోతోందన్న బాధ ఉంది. వెంకుకు కన్యాధార చీరకూడా తనే తెచ్చి—

"ఈ చీర బాగుందా వెంకూ?" అనడిగాడు.

శాము తెచ్చిన విలువగల పట్టుచీర చూసి వెంకు చాలా సంతోషపడింది. కాని—

"నా చీరకోసం ఇంత ఖర్చుచేసేవా శామణ్ణా?" అంది.

"నాకో చెల్లెలుంటే చేసేవాడిని కాదా ఏం?"

అతని ఆప్యాయతను చూసి వెంకు కంట్లో నీళ్ళు తిరిగాయి. శాము అంటే ఆమె కెంతో అభిమానం. చిన్నప్పటినుండి అతని దగ్గర ఎంతో చనువు ఆ పిల్లకు. వెంకు తర్వాత ఆమె తల్లికి వెంట వెంటనే పిల్లలు పుట్టటంతో ఇంట్లో పెద్దవారి ప్రేమా, బుజ్జగింపూ కావలసినంత దొరకేదికాదు. పిల్లల్లోకంతా పెద్దది కావటంమూలాన్న ఎన్నోమార్లు పిల్లల్ని చూసుకునే బాధ్యత వెంకుమీద పడేది. తల్లికి సాయంగా ఇంటిబాధ్యతా, పిల్లలసేవా చూసుకోవాల్సి వచ్చేది. అందుకే ఇంట్లో చిన్నపిల్లలా మసలటానికి వీలయ్యేదికాదు.

కాని శామణ్ణ ఇంట్లో ఆమె చిన్నపిల్లయ్యేది. చిన్నపిల్లలంటే శాము కెంతో ఇష్టం. కాని వంశాని కంతా ఒక్కడిగా పుట్టిన అతనికి తమ్ముళ్ళతో, చెల్లెళ్ళతో ఆడుకునే భాగ్యం కలుగలేదు. పెళ్ళి చేసుకునే వయస్సుదాటినా పెళ్ళి చేసుకోకుండా ఉన్న శాముకు వెంకు అమాయకమయిన మాటలు వినటంతో ఎంతో ఆనందం లభించేది. పగలల్లా కష్టపడివచ్చిన అతనికి వెంకు సరళమయిన మాటలు సేద దీర్చేవి. ఒక్కరోజు వెంకు రాకపోతే తోచేదికాదు. అలాంటప్పుడు అతనే అవధాన్లగా రింటికి వెళ్ళి కాలక్షేపంచేసి వచ్చేవాడు. శాముకు పెళ్ళయి మీర ఇంటికి వచ్చాక వెంకు తల్లి వెంకుని శాము ఇంటికి తరచుగా వెళ్ళనిచ్చే వారు కాదు. నూతన దంపతులమధ్య అడ్డంగా ఉంటుందేమోనన్న భావన వెంకుకు తెలీకపోయినా వాళ్ళమ్మగారు—

"మీర వచ్చింది, ఇకనుండి అలా అస్తమానం వెళ్ళి కూర్చోకు" అనేవాడు.

మీరకు పాపపుట్టి వీణ నవ్వుతో ఇల్లు కలకల్లాడాక ఇహ వెంకు ఎవరిమాటా వినేది కాదు. వీణ తోడిదే లోకం ఆమెకు. మీరకూ దీనివల్ల కాస్త కష్టం తగ్గేది. అల్లరిపిల్ల వీణను పట్టుకోవటానికి సాయపడేది వెంకు.

వీణ చనిపొయ్యాక వెంకు పెద్దపిల్లవుతున్నకొద్దీ శాముఇల్లు క్రమక్రమంగా దూరమవుతూ వచ్చింది. కాని శామణ్ణ మీది ఆమె ప్రేమ, అభిమానం ఇసుమంతయినా తగ్గలేదు.

తన పెళ్ళికోసం అభిమానంతో శాము తెచ్చిన ఆకుపచ్చరంగు చీర చేతిలోకి తీసుకుని వెంకు శామణ్ణవేపు చూసింది.

పల్లెటూరి ఇల్లవటంవల్ల పైకప్పు చాలా కిందికి ఉంది. శాము అంత పొడుగూ ఉన్నాడు, బలిష్టంగాఉన్న అతని భవ్యమయిన ఆకారం ఆమెకు అతిప్రియమయిన దృశ్యం.

"మా శామణ్ణంత పొడుగు ఈ పల్లెలో ఎవరూ లేరు" అని గర్వంగా చెప్పుకునేది చిన్నప్పుడు.

కాని శాము ఇప్పుడు మొదటిలా లేడు. అతనిదేహం కృశించిపోయింది. అతని ఎర్రటి ఛాయ మలినమయింది. కళ్ళలో అపార వేదన చోటు చేసుకుంది.

వెంకు గద్గద కంఠంతో అంది.

"నీ చెల్లెల్నయ్యే పుణ్యం నా కెక్కడిది? వీ చెల్లెల్నయ్యేం చేసే బాగుండేది."

"అపుడు మాత్రం ఏం చేసేదానివి? ఇలాగే పెళ్ళిచేసుకుని వెళ్ళి పోయేదానివి కదా!"

"నిజమే! కాని నీ దుఃఖాన్ని కొంతైనా తగ్గించగలిగే దాన్ని." వెంకు నిట్టూర్చింది. ఆ మాటవిని చకితుడయ్యాడు శాము.

ఎవరిని తా నింకా పసిదానిగానే భావిస్తున్నాడో ఆమె ఇప్పుడు పెద్దదానిలా మనిషి సుఖదుఃఖాల గురించి మాటాడుతోంది.

"దుఃఖమా! నా కెలాంటి దుఃఖం?"

"నా కంతా తెలుసు శామణ్ణా, జానిపోయిన దగ్గర్నుండీ నువ్వు

గాని, మీరక్కకాని ఒక్క నిమిషంకూడా సుఖంగాలేరు. ఈ విష యం నాకు బాగా తెలుసు.”

“బొమ్మలతో ఆడుకోటం బాగా తెలుసు నీకు” అంటూ తేలిగ్గా తీసి పారెయ్యటానికి ప్రయత్నించాడు శాము.

“నువ్వు పొరబడుతున్నావు శామణ్ణా. నా కన్నీ తెలుస్తాయి. మా ఇంట్లోకన్నా మీ ఇంట్లో ఎక్కువకాలం గడిపాను నేను. నిజంగా నీ చెల్లెల్నే అయ్యుంటే ‘మా అన్నయ్యను చూపివస్తాను’ అనిచెప్పి రాగలిగేదాన్ని. ఇప్పు డలా రాగలనా?”

ఈ చిన్నపిల్లకు అప్పుడే ఎన్ని విషయాలు తెలిసిపోయాయి!

వెంకుముందు శాము పసిబిడ్డలా అయిపోయాడు. ఏం మాట్లా డాలో తోచలేదు, మాటమార్చే ఉద్దేశ్యంతో—

“అన్నట్టు నీ మొగుడిపేరు చెప్పు, వింటాను” అన్నాడు.

వెంకు అతనిమాట వినిపించుకోనట్టే “నీకు నమస్కారం చేస్తాను. అలా నుంచో” అని నమస్కారంచేసి వెళ్ళిపోయింది.

ఆడపిల్లలు ఎంతలో ఎంతగా ఎదిరిపోతారు అనుకున్నాడు శాము.

వెంకుపెళ్ళి అవధాన్లుగారి అంతస్తుకు తగినట్టు జరిగిపోయింది. ఈడూజోడూ బాగుంది. పీటలమీద కూర్చున్న వధూవరులను చూసి తృప్తిగా నిట్టూర్చాడు శాము. వెంకుకు మేనమామ లేడు. కాని అవధాన్లగారు దూరపు చుట్టరికాన్ని తీసుకువచ్చి శామును వెంకు మేన మామగా తేల్చారు. శాము అలంకరించిన వధువును కల్యాణమంట పంలోకి తీసుకువచ్చాడు. వెంకు పీటలమీద గంభీరంగా కూర్చుంది. అంత చిన్న హృదయంలో ఇంతటి ప్రేమా, మమతా ఎక్కడినుండి వచ్చాయా అనుకున్నాడు శాము.

శాము వరుడి దగ్గరగా కూర్చుని మాటల్లో “మీరు చాలా అదృష్టవంతులు” అన్నాడు వెంకు తల పైకెత్తి శామువేపు చూసి తల దించుకుంది. ఆమెకళ్ళు చెమర్చటం గమనించాడు శాము.

వెంకు పెళ్ళి మూడురోజులు జరిగింది. శాము—మీర పెళ్ళి పందిట్లో సంభ్రమంగా తిరిగారు.

వరుడు తనతోబాటే వెంకుని తీసుకువెడతా నన్నాడు. వారు ఊరికి వెళ్ళేరోజున పెళ్ళివారందరికీ శాము ఇంట్లో విందు జరిగింది. వెంకు శాము కాళ్ళకు నమస్కరించి "వెళ్ళొస్తా శామణ్ణా. నీ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకో" అంది, మీర వెంకుని దేవుడిగదిలోకి తీసుకెళ్ళి ఒడినింపింది. అందులోని జాకెట్టుగుడ్డ చూసి వెంకు—

"మళ్ళీ ఇదికూడా ఎందుకు మీరక్కా? శామణ్ణ నా పెళ్ళిలో సగంఖర్చు భరించాడు కదా!" అంది.

"చాల్చాలు తీసుకుందూ" అంది మీర.

వెంకు చుట్టూ చూసి గొంతు తగ్గించి మెల్లిగా—

"మీరక్కా, నేనోమాట చెబుతాను కోపం తెచ్చుకోరుగదా? వయసులో నేను మీకన్నా చాలా చిన్నదాన్ని...." అంది.

"ఏమిటో చెప్పు"

"శామణ్ణ మిమ్మల్ని ఎంతగా ప్రేమిస్తున్నాడో తెలుసా?"

"........................"

"బహుశా మీకు తెలిసివుండదు. కాని నాకు బాగా తెలుసు, అతని ప్రేమ చాలా లోతయినది. మీరు శామణ్ణను ప్రేమించండి. శామణ్ణ ఎల్లా అయిపోయాడో ఓ మారు సరిగ్గా చూడండి. మీకోసం కాకపోయినా శామణ్ణకోసం అతన్ని ప్రేమించండి."

"అయితే నేను ఆయన్ని ద్వేషిస్తున్నా నంటావా?"

"లేదు. మీరు ద్వేషించటం లేదు. నా కా విషయం తెలుసు. కాని శామణ్ణను వదిలిపెట్టయినా చదువుకోవాలా మీరు? ఎవర్ని ఉద్ధరించటానికోసం ఆ చదువు? ఎలాంటి అమూల్యమయిన నిధి మీకు దొరికిందో మీకు కొంచెంకూడా తెలిసినట్టులేదు. వజ్రాన్ని వదిలిపెట్టి గాజుముక్కకోసం ప్రాకులాడుతున్నారు మీరు."

"వెంకూ!"

"నే నెల్లాగూ ఇవ్వాళ వెళ్ళిపోతున్నాను. నా మనసులో ఉన్నదంతా మీ ఎదుట పెట్టేస్తాను. ఏడు జన్మల తపఃఫలంగా శాము మీకు దొరికాడు. అతనికన్నా మీకు చదువు ఎక్కువా? మీకోసం ప్రాణంకూడా ఇస్తాడు శామణ్ణ, మీరామాత్రం, అతనికోసం, ముష్టి

చదువును మానేయలేరా? అతన్నలా ఒంటరిగా వదిలేయటానికి మీ మనసు ఎలా వప్పుకుంది.

ఎదుట నుంచున్న వెంకు చెంప చెళ్ళు మనిపించా లనిపించింది మీరకు. కాని ఎంతో కష్టంమీద నిగ్రహించుకుంది.

"మీరు శాముకును ప్రేమించలేకపోతే మానె. కనీసం దయతో చూడలేరా? మీ రతన్ని అర్థం చేసుకోగలిగితే శాముకు సుఖపడతాడు. నే నిక వస్తాను" అంటూ బయటికి వచ్చేసింది వెంకు.

ఆ తరువాత ఎంతోసేపటివరకూ మీర శిలాప్రతిమలా దేవుడి గదిలోనే నుంచుండిపోయింది.

ఆమె శామును పెళ్ళిచేసుకుని ఇక్కడికి వచ్చేసరికి వెంకుకు తొమ్మిదేళ్ళకన్నా ఎక్కువ లేవు. ఆమె కళ్ళెదుట పెరిగి పెద్దయిన పిల్ల, తనకే నీతులు చెబుతోంది. వెంకు ఇలా మాట్లాడగలదని కల్లోగూడ అనుకోలేదు మీర. వెంకుభర్త నిజంగా అదృష్టవంతుడు. శాము తనమాట వింటే ఆ అదృష్టం అతనికే లభించేదికదా!

అందరిజాలి, సానుభూతి శాము మీదనే కాని తనను గురించి 'అయ్యో' అనేవారే లేరు. అందరూ శాముకోసం బాధపడేవారే! ఎవరికీ తనమీద సానుభూతి లేకపోగా, రకరకాలుగా వ్యాఖ్యానిస్తున్నారు. తను చేసిన మహాపరాధం ఏమిటి?

మీర హృదయం మొండిగా మరింత గట్టిపడింది.

—ప్రపంచమంతా నా దారికి అడ్డునిలిచినా సరే వెనకడుగు మాత్రం వెయ్యను. చదివి తీరుతాను. డాక్టర్నవుతాను. నా భర్తే నాకు అండగా ఉన్నప్పుడు మిగతావారి మాటను పట్టించుకోవాల్సిన అవసర మేమిటి? నా లక్ష్యాన్ని సాధించటంకోసం ఆఖరిదాకా పోరాడక తప్పదు.

పెళ్ళివారిని పంపి శాము ఇంటికొచ్చేసరికి మీర మొహం చిన్న బుచ్చుకుని ఓ చోట కూర్చుంది.

"అమ్మగారికి తిరగటం ఎక్కువయి అలసిపోయి నట్టుందే?"

మీర శామువేపు పరిశీలనగా చూసింది. వెంకు అన్న మాట

నిజమే. ధృఢంగా ఉన్నశాము బాగా చిక్కిపోయాడు. ఎముకలు కని పిస్తున్నాయి.

"ఇలారండి"

"వస్తే ఏమిస్తావ్?"

"డాక్టర్ల దగ్గరకొస్తే రోగులకు దొరికేది మందు మాత్రమే"

"నువ్వింకా డాక్టర్ కాలేదు. నేను రోగిని అసలే కాను"

"కొంతమంది తమ జబ్బేమిటో కూడా తెలుసుకోలేరు. ఇలా రండి"

శాము మీర వద్దకు వచ్చాడు. మీర అతని బుగ్గమీద చేత్తో తడిమింది.

"రేపు మైసూరుకి వెడదాం మనం."

"ఎందు కేమిటి?"

"మిమ్మల్ని డాక్టరుకు చూపించి మంచి మందు ఇప్పిస్తాను."

"మీ డాక్టర్లు 'శాంతి' అనే టానిక్ కూడా ఇస్తా రేమిటి?"

"మీ కిప్పు డొచ్చిన కష్ట మేమిటో?"

'అది నే నెలా చెప్పను' అన్నట్టుగా నవ్వాడు శాము.

మీర బలవంతంమీద మైసూరుకి వెళ్ళక తప్పలేదు. డాక్టరు గారు శామును పరీక్షించి 'శ్రమకు తగ్గ ఆహారం తీసుకొనటంలేదు. అందుకే ఇలా అయ్యారు.' అని చెప్పి టానిక్ రాసిచ్చారు. పళ్లూ పాలూ బాగా వాడమన్నారు.

పల్లెలో ఉన్నంతకాలం అతని ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించింది మీర, ఫలితంగా శాము మొదటిలా దృఢంగా తయా రయ్యాడు. పాలిపోయిన అతని మొహంలోకి రక్తం వచ్చింది.

శలవులయ్యాక మైసూరుకి బయలుదేరుతున్న మీరతో శాము-

"అమ్మగారి దర్శనం మళ్ళీ ఎప్పుడో?" అన్నాడు.

"వచ్చేసారి శలవులకు విజయతో పూనా వెడదా మనుకుం టున్నా. ఆ తరువాత సంగతి ఇప్పుడే ఎలా చెప్పను?"

మీర మాట విని శాము చిన్నబుచ్చుకున్నారు. మీర కొంటెగా నవ్వుతూ—

"పూనానుండి మీకేం తెమ్మంటారు?" అంది.

"నా కేమీ వద్దు."

"అలా కాదు చెప్పండి."

"పూనా దేనికి ప్రసిద్ధి?"

"పూనా దేనికి పేరుపొందిందో అదే తెమ్మన్నారా?"

"ఆc."

"పూనా అందమయిన అమ్మాయిలకు పుట్టినిల్లు. ఓ అమ్మాయిని తీసుకురమ్మంటా రేమిటి?"

"అలాగే తీసుకురా. ఆ అమ్మాయి మరాఠీ మాట్లాడనీ. నేను కన్నడం మాట్లాడతాను. నువ్వు విని సంతోషిద్దువుగాని."

"ప్రేమకు భాష ఆవశ్యకతలేదు."

"నేను నిన్ను ప్రేమిస్తున్నానని చెప్పటానికయినా ఓ భాష కావాలా?"

"అక్కర్లేదు. మౌనమే ప్రేమభాష. కళ్లే మాట్లాడేనాలుక."

"నా కళ్ళలోకి చూపి నేను నిన్ను ప్రేమిస్తున్నానో లేదో చెప్పు."

మీర ఎంతో తెలిసిన దానిలా అతని కళ్ళల్లోకి చూసింది. అతని కళ్ళలో ఆమెను అక్కడే బంధించి ఉంచుకోవాలన్న తీవ్రమయిన కోరిక కనిపిస్తోంది. బంధించే శక్తి గనుక ఉన్నట్టయితే మీర ఆ జన్మాంతం బందీగా ఉండక తప్పేదికాదు. మీర తల అడ్డంగా ఊపుతూ—

"మీకు నా మీద ప్రేమఉన్నట్టు కనిపించటంలేదు" అంది.

"ఎలా చెబుతావ్ ఆ మాట?"

"నా మీద ప్రేమఉంటే నేను చెప్పినమాట వినేవారు కదా!"

"నీ మాట ఎప్పుడు కాదన్నాను?"

"మళ్ళీ పెళ్ళి చేసుకోమన్నప్పుడు...."

నవ్వుతున్న శాము చటుక్కున కోపం తెచ్చుకున్నాడు.

"నీ కది తప్పితే మరోధ్యాస లేదా ఏం?"

"నా ఒక్క కోర్కె తీర్చారంటే ఎప్పుడూ మీ దగ్గరే వుంటాను."

"అక్కర్లేదు. దూరంగా వెళ్ళిపో నువ్వు" అంటూ శాము మీరను వెనక్కి నెట్టాడు. మంచంచివర కూర్చున్న మీర తూలి కింద పడిపోయింది. గాజులు పగిలిపోయాయి.

శాము లేచి మీరను లేవనెత్తి "అదికాదే పిల్లా. ఊరికే ముట్టు కున్నంత మాత్రాన కిందకు పడిపోవటమే?" అన్నాడు.

"ముట్టుకోవమట! గట్టిగా తోసేసి...."

"పొరబాటయింది. పడిపోతా వనుకోలేదు."

"నామాట వినేలా ఉంటేనే మీ తప్పు క్షమించగలను"

"రెండో పెళ్ళిమాట తప్పించి మరేది అడిగినా కాదనను."

మీర కోపంతో బయటికి వెళ్ళిపోయింది. శాము పిలుస్తున్నా వినిపించుకోలేదు.

తనమాట పట్టించుకోలేదన్న కోపం, అసమాధానాలతోనే మీర మైసూరుకి వెళ్ళిపోయింది. హాస్టలుకు వచ్చినరోజు ఆమె మనసు బాగాలేదు. భర్తనుగురించిన చింత ఆమెను వేధిస్తూనే వుంది. కాని కాలేజీతెరచి పాఠాలు ప్రారంభమవగానే మీర ఇంటి యోచనంతా పక్కకునెట్టి చదువులో మునిగిపోయింది....

ఆ రోజు రెండో సంవత్సరం వాళ్ళకు ఓ పీరియడ్ క్లాసు లేకపోవటంతో హాస్టలుకు వెళ్ళిపోదామని మీర, విజయ, యశోద వెడుతున్నారు. కారిడార్‌లో వెడుతూండగా ఖాళీగాఉన్న గదిలో గోపీనాథ్, ఓ స్నేహితుడి హస్తాన్ని పరీక్షిస్తూ కనబడ్డాడు.

మీరనుచూసి నవ్వి "నమస్తే" అన్నాడు గోపీనాథ్.

"నమస్తే, మీకు చెయ్యి చూడటంకూడా వచ్చునా?"

"ఏదో కొద్దిగా పుస్తకాలు చదివి నేర్చుకున్నది."

విజయ మీరను గుచ్చి గుచ్చి "మనంకూడా చెయ్యి చూపించు కుందాం" అంది. ఇక చేసేదిలేక మీర స్నేహితులతోబాటు లోపలికి అడుగుపెట్టింది.

"ఈమె విజయ. ఈమె యశోద ఈయన గోపీనాధ్, నాటకాల సందర్భంలో పరిచయం నాకు."

నమస్కారా లయ్యాక గోపీనాధ్ స్నేహితుడిచెయ్యి వదిలి అమ్మాయిలవేపు తిరిగాడు. విజయ కుతూహలంతో తన చిన్నిచేతిని ముందుకు చాపి,

"నా చెయ్యి చూడండి" అంది.

గోపీనాధ్ ఆ చేతినిపరీక్షగా చూడసాగాడు. పెన్సిల్‌ని చేతిలో పట్టుకుని గీతల్ని విడివిడిగా చూస్తూ—

"మీది చాలా చిన్నచెయ్యి. గీత లింకా సరిగ్గా డెవలప్ కానే లేదు. మీది ప్రేమ విశ్వాసాలతో నిండిన హృదయం. స్నేహార్ద్ర హృదయం. సంగీతంలో ఆసక్తి ఉంది........" అన్నాడు.

"నిజమే కాని నేను మంచి డాక్టర్నవుతానో లేదో చెప్పండి."

"మామూలు డాక్టరవుతారు. కారణ మేమి టంటే...."

"విజయకు పెళ్ళప్పు డవుతుందో చెప్పండి" కొంటెగా అంది మీర.

"చాల్చాలు ఊరుకో ఇక!" విజయమొహం సిగ్గుతో ఎర్రబడి పోయింది. గోపీనాధ్ తలెత్తి మొదటిమారు సిగ్గుతో కందిపోయిన విజయ మొహాన్ని చూశాడు.

ఎంత ముద్దుగా ఉందీ అమ్మాయి! గుండ్రటి మొహానికి రింగులు బాగా నప్పాయి. గోధుమరంగు దేహకాంతి. పెద్ద కళ్ళు. వాటిలోని ముగ్ధతవల్ల ఆమె మొహం పసిపాప మొహంలా కని పిస్తోంది. కట్టుకున్నది మామూలు నూలుచీరయినా మహారాణిలా ఉంది.

గోపీనాధ్ మళ్ళీ దృష్టి ఆమె చేతిమీదకు పోనిచ్చాడు. సన్నటి పొడుగాటి వేళ్ళు....

"ఇలాంటి వేళ్ళు గలవాళ్ళు ఏదో ఒక కళలో ప్రావీణ్యం సంపాదిస్తారు."

"విజయకు హిందూస్థానీ సంగీతం బాగా వచ్చును. మీకు తెలీదూ?" యశోద అడిగింది.

గోపీనాథ్ అడ్డంగా తల ఊపాడు. అతని మొహం చెమట పట్టిఉంది.

"పెళ్ళి విషయం చెప్పనే లేదు మీరు" మీర అడిగింది.

"చదువు పూర్తయేవరకూ పెళ్ళికాదు. ఆ తరువాత ఈ కాలేజీలోని వారితో ఒకరితో పెళ్ళి అవుతుంది."

"ఆ భాగ్యశాలి ఎవరోకదా?"

"ఆ సంగతి చెప్పలేదు. ఆ తరువాత సంసార విషయాల్లోనే ఎక్కువ ఆసక్తి చూపుతారు. కనుక మంచిడాక్టర్ కాలేరు. ఇది కెరీర్ గర్ల్ చెయ్యికాదు. సద్గృహిణి చెయ్యి."

"చాలు బాబూ. ఏమిటేమిటో చెబుతున్నారు మీరు...." చెయ్యి వెనక్కి తీసేసుకుంది విజయ. గోపీనాథ్ రుమాలుతో మొహం తుడుచుతున్నాడు.

తరువాత యశోద చెయ్యి చూపించుకుంది. స్నేహితుల బలవంతంమీద మీరకూడా చెయ్యి చూపించుకోక తప్పలేదు.

"మీకు డబ్బుకు కొదువలేదు. ధనవంతులు. మంచి డాక్టరవుతారు. మీకు అత్యంత ప్రేమపాత్రమయిన వారిని పోగొట్టుకున్నారు. లేదా పోగొట్టుకుంటారు. మీకు జీవితంలో అంతగా సుఖంలేదు. మీరు మంచి స్నేహితులు, మంచి విద్యార్థిని, మంచి డాక్టరవటంలో సందేహం లేదు. కాని ఎప్పటికీ మంచిగృహిణి అనిపించుకోలేరు"....

మీర అదిరిపడి చేతిని వెనక్కులాక్కుంది.

మా చేతులు చూపినందుకు మీకు ఎంత ఫీజు కట్టుకోవాలి?" విజయ అడిగింది.

"నాతో వచ్చి క్యాంటీన్‌లో కాఫీ-టిఫిన్ తీసుకోవాలి."

"మీ లెక్కలోనా? ఇదేంన్యాయం?" విజయ ప్రతిఘటించింది. యశోదకూడా విజయను సమర్థించింది.

"అయితే మీ ఇష్టం" అన్నాడు గోపీ.

"వెడదాం పదండి. రేపు మనం ఇప్పిస్తే సరిపోతుంది." పరిష్కారం సూచించింది మీర. అందరూ క్యాంటీన్ వేపు వెళ్ళారు.

ఆ రోజంతా గోపీనాథ్ అన్న మాటలే మీర చెవుల్లో ప్రతి ధ్వనిస్తున్నాయి.

"యు ఆర్ ఎ గుడ్ ఫ్రెండ్, గుడ్ స్టూడెంట్ బట్ నాట్ ఎ గుడ్ హౌస్‌వైఫ్."

అతని మాటల్లో నిజముందా? ఉన్నట్టే ఉంది. మీరకు ఎప్పుడూ సంసారమే సర్వస్వం అనిపించలేదు. వీణ ఉన్నప్పుడు మాత్రమే:.... చెరిగిపోయిన కల అది....

క్లాసులో పాఠాలుకూడా సరిగ్గా వినలేకపోయింది మీర. కాలేజి వదిలాక పరధ్యాన్నంగా ఉన్న మీరతో విజయ గోపీనాథ్ చాలా మంచివారు కదూ?" అంది. ఆమె మాటలతో తన ఆలోచనా ప్రపంచాన్నుండి బయటపడింది మీర. విజయ మాటలకు నవ్వుతూ కొంటెగా

"ఏం మిగతా అబ్బాయిలు నీకేం అపకారం చేశారమ్మా" అంది.

"అదికాదు. ఆయన చాలా గంభీరంగా ఉంటారు. అమ్మాయిలవేపు అదేపనిగా చూడరు. ఎవర్నీ ఏడిపించాలని ప్రయత్నించరు. క్లాసులోకూడా ఎంతో మర్యాదగా ఉంటారని ఆయన క్లాసు మేటే కాంతి చెప్పింది."

"ఊరికే చెయ్యిచూశారు కదా అని మంచివారయ్యారేం నీకు?" యశోద అందుకుంది.

అంతలో దూరంగా అబ్బాయిల గుంపులో గోపీనాథ్ కనిపించాడు.

"అడుగో, నీ హీరో అక్కడున్నాడు. నీ-సర్టిఫికేట్ నువ్వే స్వయంగా అందజేయి." మీర మరింత ఏడిపించింది.

"నీకూ తెలుసును ఆయన మంచివారని. కావాలని నన్ను ఏడిపిస్తున్నావు."

గుంపులో వెనకగాఉన్న గోపీనాథ్‌ని యశోద—

"మిస్టర్ గోపీనాథ్" అని పిలిచింది. గోపీనాథ్ ఆగి ఏమిటన్నట్టు చూశాడు.

"మిస్ విజయ పరాంజపె ఏదో అడగాలను కుంటున్నారు."

విజయ ఒళ్ళుమండింది. అతన్ని ఆపి పలకరించాల్సినంత ఆవశ్యకత ఏమొచ్చి పడిం దిప్పుడు?

ఆమె చెవుల రింగులు, రెండు జడలు-నూలుచీర, పసిపాప లాంటి మొహం....గోపీనాథ్ తడబడుతూ—

"ఏం కావాలండి" అనడిగాడు.

విజయకు అతనితో పనేమీలేదు. కాని యశోద అతన్ని ఆపి పలకరించాక "ఏమీలేదు" అనటానికి సంకోచం అడ్డుపడింది. విజయ అవస్థ కనిపెట్టి మీరర—

"ఈ సంవత్సరం పాసవుతుందో లేదో తెలుసుకోవాలనుంది విజయకు" అంది.

"పరీక్షల్లో బాగారాస్తే పాసవుతారు."

"ఆ మాట చెప్పటానికి మీరే కావాలి కాబోలు." విజయ అంది.

"మీ హస్తసాముద్రికం వివరంగా తెలుసుకోవాలని ఉందా మీకు?"

"ఎవరికి మాత్రం ఉండదు?"

"ఇంకోరోజు వీలుచూసుకుని చెబుతాను. మీకు మీరా?"

"నాకేమంత ఆసక్తిలేదు. యశోద...."

"వద్దు తల్లీ. చెయ్యి చూపించుకుని అవలక్షణ మనిపించు కోవాలని లేదు నాకు."

"ఒక్క విజయకే పామిస్ట్రీలో ఆసక్తి ఎక్కువయింది."

"సరే. నాకు తీరికగా ఉన్నరోజున చూసి చెబుతాను. ఇక వస్తాను" అంటూ వెళ్ళిపోయాడు గోపీనాథ్.

"విజయకు 'పామిస్ట్రీ' కన్నా 'పామిస్ట్'లో ఆసక్తి ఎక్కువయినట్టుంది" యశోద కవ్వించింది.

"చెయ్యి చూపించుకున్నాక ఎదురుగా కనపడినా విష్ చేస్తా నేమో చూడు కావాలంటే...." విజయ ఉడుక్కుంది.

"పాపం ఎందుకలా ఏడిపిస్తావు యశోదా? చిన్నపిల్ల ఏదో

భవిష్యం తెలుసుకోవాలని ముచ్చటపడుతోంది. సహజమే కదా?"
మీర పెద్దదానిలా ఇద్దర్నీ సమాధాన పర్చింది.

రెండో ఏడు పరీక్షలు చాలా కష్టమని మీరకు తెలుసు. ఎంత తెలివిగలవాళ్ళయినా రెండోఏడు పరీక్షల్లో తప్పుతారని అందరూ భయ పడుతూ ఉండేవారు. ఉదయం చదువుకోటానికి ఎక్కువగా తీరిక దొరికేది కాదు. రాత్రి రెండు గంటలదాకా చదువుకుని పడుకునేది. యశోద, మనోరమలుకూడా శ్రద్ధగా చదువుకుంటున్నారు.

కాని డాలీకిమాత్రం చదువుకోటానికి టైంలేదు. అ స్తమానం ముస్తాబుచేసుకుని, తనకోసం వచ్చే కజిన్‌తోబాటు వెళ్ళిపోయేది. డాలీ కజిన్ అనటం అమ్మాయిలకు హాస్యంగా తయారయింది.

"ఈమారు డాలీ పాసయితే ఆమె కజిన్‌మీద ఒట్టు" అనేది యశోద. పరీక్షలయిపోగానే విజయ, మీర పూనాకు బయలుదేరారు. విజయ పూనాలో ఉన్న తన మేనత్తకు ఇలా వస్తున్న సంగతి రాసింది. మీర శాముకు, ప్రయాణం సంగతి రాస్తూ "వీలయితే అందంగా ఉన్న అమ్మాయిని తెస్తాను" అని రాసింది.

మీర, విజయా సామాన్లతో ప్లాట్‌ఫారమ్ చేరుకున్నారు. పూనా వెళ్ళే రైలు ఇంకా లైనుకు రాలేదు. సామాన్లు ఓ చోటబెట్టి చుటూ చూడసాగారు.

"ఆరసీకెరే రైలు ఇంకా ఎప్పుడు వస్తుందో!" మీర అడిగింది.

"మీరా! అక్కడున్నది గోపీనాథ్ కాదూ!"

"బావుంది నీకు ఎక్కడెక్కడా గోపీనాథ్ రూపమే కనిపిస్తున్నట్టుందే?" మీర చిలిపిగా అంది.

"అటు చూడు, అదిగో మనల్ని చూసి నవ్వారు. ఇటువేపే వస్తున్నారు...."

విజయ మాట నిజమే. గోపీనాథ్ విష్‌చేస్తూ దగ్గరకొచ్చి—

"ఊరికి బయల్దేరినట్టుందే" అంటూ పలకరించాడు.

"విజయ పుట్టింటికి వెడుతున్నాం."

"అంతే."

"పూనా వెళుతున్నాం. అక్కడ విజయ మేనత్త ఉన్నారు. అలాగే బొంబాయి వెళ్ళొస్తాం. అక్కడ మా అన్నయ్య గోపాల్ ఉన్నాడు."

"సంతోషం. విష్ యూ ఎ హేపీ జర్నీ! మీరే అదృష్ట వంతులు."

"ఏం విజయతో ప్రయాణం చేస్తున్నాననా?"

ఆడపిల్ల మొహంలా ఎర్రబడింది గోపీ మొహం.

"కాదు....మీరు....ఊళ్ళంతా తిరిగి వస్తారు కదా" అని.

"మా విజయ చెయ్యి చూడనేలేదు మీరు."

"ఇప్పుడు చూపించుకోనా నా చెయ్యి?" విజయ అడిగింది.

"మీరు వచ్చాక...."

"వద్దులెండి. మీ కెందుకు శ్రమ?"

"శ్రమేముంది? మీరు వచ్చాక వద్దన్నా వదల్ను." గోపీ ఉద్విగ్నంగా అన్నాడు.

"మీరు శలవుల్లో ఎక్కడికీ వెళ్ళరా?"

"ఊహుఁ ఓ స్నేహితుడిని రైలెక్కించటానికి వచ్చాను. అకస్మాత్తుగా మీరు కనిపించారు" అంటూ విజయవైపు చూశాడు.

ఆమె బుగ్గలమీద గోపీగడ్డం, పెదవుల నీడ పడింది. స్వచ్ఛ మయిన బుగ్గలమీద పడిన నీడను చూసి అసూయకలిగింది గోపీకి.

అదే సరళత-ముగ్ధత.

గోపీ మత్సరంతో వెనక్కి జరిగాడు. అతని క్రాపు నీడ ఆమె మెడమీద పడింది. గాలికి క్రాపు అల్లల్లాడినపుడు ఆమె మెడమీద నీడకూడా కదులుతోంది.

విజయ మెళ్ళో పగడాల దండ వేసుకుంది. ఆమె శరీర ఛ్ఛాయకు పగడాలదండ రంగు బాగా నప్పింది.

విజయ మౌనగౌరిలా నుంచుని వాళ్ళిద్దరి మాటలూ వింటోంది. ఇంగ్లీషులో ప్రారంభమయిన సంభాషణ రానురాను కన్నడంలోకి దిగింది. విజయకు ఇప్పుడు కన్నడం కొద్దికొద్దిగా అర్థమవుతోంది. తప్పులతో తడబడుతూ మాట్లాడేది కూడా.

గోపీ మీరతో మాట్లాడుతున్నా అతని దృష్టి అంతా విజయ మెడమీదే ఉంది.

ఎంత అందంగా ఉంది? ఎంత మృదువుగా ఉంది?

తన నీడ తనకన్నా పుణ్యం చేసుకుంది!

ట్రెయిను ట్రైనులో కొచ్చింది. గోపీ ఎక్కి వాళ్ళకి చోటు చేసిచ్చి సామాన్లు సర్ది పెట్టాడు.

"ఏదయినా పత్రికలు తెచ్చిపెట్టనా?"

"కన్నడం వారపత్రికలు తెచ్చిపెట్టండి" అంటూ పర్సు తీసింది మీర. గోపీ తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు.

మళ్ళీవచ్చి కన్నడపత్రికలు మీరచేతి కిచ్చి హిందీపత్రిక ఒకటి విజయచేతి కిస్తూ "మీకు హిందీ వచ్చును కదూ," అన్నాడు.

"ఆఁ" అంటూ పత్రిక పేరు చదివి కిలకిలా నవ్వేసింది విజయ.

"ఏమిటి? ఏం పుస్తకం అది?" గోపీ కంగారుపడిపోయాడు.

ఇంకా నవ్వుతూనే విజయ—

"హిందీ చందమామ తెచ్చిచ్చారు నాకు" అంది.

"హిందీది అదొక్కటే ఉందక్కడ...."

"పిల్లల పత్రిక ఇది"

"ఇలా ఇవ్వండి. ఇది ఇచ్చేసి మరేదైనా ఇంగ్లీషుపుస్తకం తెచ్చిపెడతాను."

"వద్దు. ఇదే ఉండనివ్వండి, మీరు మొదట తెచ్చిందే చాలు నాకు" అంటూ పత్రిక సంచిలో దాచుకుంది విజయ.

"కాలేజి తెరిచాకనే మళ్ళీ దర్శనం" అంటూ కిటికీమీద చెయ్యిపెట్టాడు గోపీ. అంతకు ముందే అక్కడ చెయ్యిపెట్టిన విజయ వెంటనే తన చేతిని వెనక్కి లాక్కుంది.

"సారీ."

అత నెందుకు సారీ అన్నాడో మీర కర్థం కాలేదు. విజయ మొహం మాత్రం అరుణోదయరాగాన్ని జ్ఞప్తికి తెస్తోంది.

"మీ సాయానికి చాలా థ్యాంక్స్" మీర అతనికి వీడ్కోలిస్తున్నట్టు మాట్లాడింది.

కాని అదెందుకో గోపీకి అక్కడినుండి కదలా లనిపించ లేదు. బరువుగా "విష్ యూ ఏ హేపీ జర్నీ" అంటూ కదిలి వెళ్ళి పోయాడు.

వెలుగుపోయి చీకటి వ్యాపిస్తోంది. మైసూరినుండి దావణగెరె వరకూ కన్నడం వినిపిస్తూనే ఉంది. తరువాత కన్నడం రూపాంతరం చెందసాగింది. ధారవాడ వెళ్ళిపోయాక కన్నడం, మరాఠి వినిపించ సాగాయి కంపార్టుమెంటులో. బెళగాంవ్ దాటాక ఇహ కన్నడం మాటే లేదు.

విజయ ప్రయాణం విసుగనిపించినపుడల్లా చందమామ తీసి చూస్తోంది. అందులో ఏం చదువుతోందో తెలీదు. చదివే మిషతో కలకంటోంది. అపుడపుడూ చిరు నవ్వొకటి ఆమె పెదవులమీద మెరిసి మాయమవుతోంది.

"చందమామ అన్నిసార్లు చదువుతున్నా వేమిటి?" అని మీర ఏడిపిస్తూనే ఉంది.

పూనాలో విజయ మేనమామ కేత్కర్ స్టేషన్‌కు వచ్చారు. విజయ ఆయనకు మీరను పరిచయం చేసింది.

పూనాలో పదిహేను రోజులున్నా రిద్దరూ. అక్కడి వేష్వా పార్కు, సాంబాజీపార్కు, పార్వతికొండ అన్నీ చూశారు. దాహం వేసినపుడల్లా దారిప్రక్కలోని 'రమణీయ రసవంతి'లోకి దూరి మంచుగడ్డవేసిన చెరకురసం తాగేవారు.

పూనానుండి బొంబాయి వెళ్ళారు. బొంబాయి మహానగరాన్ని చూసి ఆశ్చర్యపడింది మీర. ఆ సందడి, ట్రాములు, బస్సులు తల తిరిగేటంతటి సందడి! భరించలేనంత వేడి!

గోపాల్ ఇంట్లో దిగారు విజయా, మీర. గోపాల్ ఇంటిని చూసి "ఎంత చిన్నయిల్లో" అని ఆశ్చర్యపోయింది మీర.

"ఇంతపెద్ద ఇల్లు దొరకటం మా పూర్వజన్మ పుణ్యఫలం" అన్నాడు గోపాల్. రాధ నలుగురిపిల్లల తల్లి అయింది. పెద్దవాడు కిశోర్‌కు పదేళ్ళు.

గోపాల్ మొదటిలా ఉత్సాహంగా లేడు. "ఏం సంసార తాపత్రయాలో" అనుకుంది మీర మనసులోనే.

బొంబాయిలో చూడాల్సినదంతా చూసేశారు.

మలబార్‌హిల్స్, మెట్రో, జోగేశ్వరి. అరెకాలోని, మింట్, మెరీన్‌డ్రైవ్, గేట్‌వే ఆఫ్ ఇండియా, చౌపాతి, తాజ్, బులార్డ్ పేర్, సాంతాక్రూస్ ఏరోడ్రోమ్....

చుట్టి, చుట్టి అలసిపోయా రిద్దరూ.

ఊరికి వెళ్ళేముందు గోపాల్ ఇంట్లో విందుభోజనా లయ్యాయి. విజయాకూ, మీరకూ పిల్కుచీరలు పెట్టింది రాధ.

బొంబాయినుండి తిన్నగా మైసూరు వచ్చేశారు. అప్పటికి పరీక్షాఫలితాలు తెలిశాయి. మీర, విజయ, యశోద పాసయ్యారు. యశోదఅన్నట్టు డాలీ పరీక్షపోయింది.

ఇంకా వారంరోజులు శలవుండటంవల్ల, మైసూర్లో ట్రెయిన్లు మారి పల్లెకు బయలుదేరింది మీర.

గుమ్మంలో రైతులతో మాట్లాడుతూ నుంచున్న శాము మీరను చూసి ఆశ్చర్యంతో—

"ఈమారు రానని రాశావేః" అన్నాడు.

"పూనా వెళ్ళొచ్చాం. ఇంకా వారం శలవుంది...." అంటూ లోపలికి వెళ్ళిపోయింది. శాము రైతుల్ని పంపివచ్చేసరికి మీర ఎక్కడా కనిపించలేదు.

"మీర ఏదత్తయ్యా," అడిగాడు వెంకమ్మగార్ని.

"స్నానం చేసి మూడురోజు లయిందట. స్నానం చేస్తానని వెళ్ళింది."

మీర స్నానంచేసి ముగించి వచ్చేసరికి ముప్పావు గంటయింది. తలలో పేరుకున్న దుమ్మును వదిలించుకోటానికి తలకు స్నానం చేసింది. తనకోసం ఎదురుచూస్తున్న శాముతో—

"ఇప్పుడే వస్తున్నా. ఒక్క నిమిషం" అంటూ గదిలోకి పరిగెట్టింది. ఇద్దరూ కలిసి భోజనానికి కూర్చున్నారు. శాముకు మీరను ఎంత చూసినా తృప్తిగాలేదు.

ఆమె ఒంటినుండి మైసూర్‌సాండిల్‌సోపు పరిమళం వస్తోంది. జుత్తుసంగతి చెప్పక్కర్లా. ముడికి అందక ఉంగరాల జుత్తంతా నుదుటిమీద, పక్కలా ఎగురుతోంది. కంగారు కంగారుగా నుదుటి మీద నయాపైసా అంత బొట్టుపెట్టుకుంది- 'దేవుడి ప్రసాద' మని ఇచ్చిన మల్లెపూలదండ ముడిమీద వేలాడుతోంది. ప్రయాణంలో అలసి రంగు కాస్త తగ్గినా మొహం ఆరోగ్యంతో కళకళలాడుతోంది.

మీర శాము కళ్ళకు ఎప్పుడూ కొత్తగానే కనిపించేది. పెళ్ళయి సుమారు ఎనిమిది తొమ్మిదేళ్ళు గడిచిపోయినా, పెళ్ళికిముందు ఆమెను టికెట్ అమ్మటానికి వచ్చినపుడు-చూపినపుడు మనసులో మెదిలిన భావాలే ఇప్పటికీ స్థిరంగా ఉన్నాయి.

ఇప్పటికీ అదే ఆకర్షణా! అదే మొహం!

పెళ్ళినాటి రాత్రి గదిలోకి వచ్చినప్పుడున్న ఆకర్షణ ఇప్పటికీ మిగిలి ఉంది.

ఒక్కోసారి తనను ప్రేమిస్తున్నట్టే మాట్లాడుతుంది. ఒక్కోసారి ద్వేషిస్తున్నట్టుగా దూరమయిపోతోంది. ఒక్కోమారు పసి పిల్లాడిని బుజ్జగించినట్టు బుజ్జగిస్తుంది, మరోమారు ఆమె పసి పాపాయిలా గారాలుపోతుంది. అతి తెలివిగా మాట్లాడే ఆమె అంద మయిన నోరు అతి మూర్ఖంగాను మాట్లాడగలదు. ప్రేమ, జాలి, మమత, స్నేహాలను వెదజల్లే కళ్ళే ఒక్కోసారి తిరస్కారాన్ని తాత్సారాన్ని కుమ్మరిస్తాయి. అతని మెడలో మాలగాఉండే సుందర బాహువులే ఒక్కొక్కప్పుడు దగ్గరకు వెళ్ళిన అతన్ని దూరంగా తోస్తాయి.

ఎలుకను ఆడించే పిల్లి ఆమె. సుందరి కాని అతి క్రూర.

"ఏమిటలా చూస్తారు నావేపు? కంచంవేపు చూసుకుని భోం చెయ్యండి." వెంకమ్మగారికి వినిపించకుండా మందలించింది మీర.

"నిన్ను చూసి చాలారోజు లయింది కదూ? సుమారు ఓ సంవత్సరం కావస్తోంది. నీ మొహం ఎలా ఉందో మర్చిపోయాను. అందుకే జ్ఞప్తికి తెచ్చుకుంటు...."

"భోంచేశాక సావకాశంగా జ్ఞప్తికి తెచ్చుకుందురుగాని. మీరు వద్దనే వరకు మీ ముందే కూర్చుంటాను."

"తరువాత మాట తప్పకూడదు."

"ఉహుఁ. తప్పను."

భోంచేశాక మీర అంది:

"పూనానుండి అందమయిన అమ్మాయిని తెద్దామనుకున్నానా, దొరకలేదు సుమండీ?"

"పొరబడుతున్నావ్. సౌందర్యవతివి తెచ్చావ్ నువ్వు."

"ఏదీ, ఎక్కడ?"

"ఇదిగో" అన్నాడు శాము మీరను చూపి.

"హుఁ నేను ఓ వారం మాత్రమే ఉండేదాన్ని ఇక్కడ. ఆ తరువాత ఎగిరిపోతాను."

"ఏం ఫరవాలేదు, ఈవారం నేను చెప్పినట్టు వింటే చాలును నాకు. పక్షులు పగలంతా ఎక్కడెక్కడ తిరిగినా సాయంత్రమయ్యే సరికి తమ గూటికే తిరిగి వస్తాయని నాకు తెలుసు."

"మా సీనియర్ ఒకతను నా చెయ్యిచూసి చెప్పాడు 'మీరు ఎప్పటికీ మంచి గృహిణి కాలేరు' అని. నిజంకదూ అతని మాట?"

"ఎలాగా?"

"ఎలాగేమిటి? మంచిగృహిణి భర్తని వదిలిపెట్టి చదువుకోడానికి వెళ్ళదు. భర్తను రెండోపెళ్ళి చేసుకోమని వేధించదు. మీరు మంచి గృహస్థులు. నే నెలాంటిదాన్నయినా నన్నే కట్టుకుని వేగుతున్నారు."

"నిన్ను ఏడిపించలేనపుడు నే నయినా ఏడవకపోతే ఎల్లా?"

"ఎందుకొచ్చిన బెడద? హాయిగా ఇంకో పిల్లని...."

"మళ్ళీ మొదలెట్టావ్ నీ పాతపాట?"

"నాకోసం, మీకోసం."

"మంచంమీదనుండి కిందకు తోసెయ్యటం మరిచిపోయావా? ఇంకా ఇలా మాట్లాడావంటే ఈమారు చెరువులోకి పారేసివస్తాను."

"అలాగే చేసి పుణ్యం కట్టుకోండి."

"నన్నెందు కిలా హింసిస్తావు మీరా? నువ్విక్కడో వారమే కదా ఉంటావు? ఈ వారమయినా సంతోషంగా గడపనియ్యవా? పనికి మాలిన మాటలతో నన్ను విసిగించి, నువ్వు చిరాకుపడటం దేనికి?"

అతని కంఠంలోని బాధను గుర్తించిన మీర "ఈ సారికి వదిలిపెడుతున్నాను మిమ్మల్ని" అంది.

కాలేజిలో మూడవ సంవత్సరం చదువు ప్రారంభమయింది. ఉదయం హాస్పిటల్ డ్యూటీ ఉండేది. రోజూ ఉదయం ఎనిమిదిన్నర నుండి పదిదాకా నోటీస్ బోర్డులోని సూచనప్రకారం ఒక్కో గ్రూపు వార్డులోకి వెళ్ళి అక్కడి రోగుల రోగాల ఇతిహాసం, రోగచిహ్నాలు, వాటి పరిహారాల మార్గాలు వీటిని తెలుసుకునేవారు. ఒకరోజు కృష్ణ రాజేంద్ర హాస్పిటల్‌కు వెడితే మరోరోజు చెలువాంబా హాస్పిటల్‌కు వెళ్ళాల్సి వచ్చేది.

మెడలో స్టెతస్కోపు వేసుకుని తిరుగుతూంటే మీరకు గర్వ మనిపించేది.

ఇహ రోగుల రోగాల ఇతిహాసాలు రకరకాలుగా ఉండేవి. ఒకే జబ్బున్న ఇద్దరు రోగులకు ఒకేమందు పనిచేసేది కాదు.

స్పెషల్ వార్డు, జనరల్ వార్డు అన్నిటిలోనూ విద్యార్థులు స్వేచ్ఛగా తిరుగుతూండేవారు. కాని స్పెషల్ వార్డులలో కొంతమంది విద్యార్థుల్ని లోనికి అడుగుపెట్టనిచ్చేవారు కాదు.

ఓసారి పల్లెటూరినుండి ఓ గౌడు హాస్పిటల్‌కు వచ్చాడు. అతని గొంతుమీద పెరిగిన కొబ్బరికాయంత గడ్డను చూపించుకోవ టానికి వచ్చాడు.

సర్జన్ వెనకాల విద్యార్థినీ విద్యార్థులు బయలుదేరారు. సర్జన్ అతని గడ్డని పరీక్షించి విద్యార్థులవేపు తిరిగి,

"ఈ రైతు ఇంతకుముందే వచ్చి ఆపరేషన్ చేయించుకుంటే బావుండేది. అప్పుడు నిర్లక్ష్యం చేసి ఇపుడు గడ్డ బాగా ముదిరాక బాధకు తట్టుకోలేక వచ్చాడు. ఇపుడు ఆపరేషన్ చెయ్యటం కష్టం. ఎందుకంటే కంఠంలో రక్తం సరఫరా ఎక్కువగా అవుతుంది. ఆపరేట్ చేసేటపుడే అతి రక్తస్రావంతో ఇతను చనిపోవచ్చును.

అయినా నా చేతనయినంతవరకూ ప్రయత్నిస్తాను" అని ఇంగ్లీషులో చెప్పి, గౌడువేపు తిరిగి అతని భుజం తట్టి నవ్వుతూ—

"నేను ఆపరేషన్ చేస్తాను. నువ్వేం భయపడకు" అన్నారు.

"ప్రాణానికేం ముప్పు లేదుగదా బాబూ?"

"ఏం భయంలేదు."

డాక్టర్ అభయవచనాలు గౌడు కెంతో సంతృప్తిని కలిగించాయి. నిర్ణీతమైన రోజున ఆపరేషన్ ప్రారంభించారు. విద్యార్థులు మాస్కులు ధరించి ఊపిరి బిగబట్టి సర్జన్ చాకచక్యాన్ని చూస్తూ నిల్చున్నారు. గౌడుకు క్లోరోఫామ్ ఇచ్చి తెలివి తెప్పించారు.

గడ్డకు చాకువేసి అరంగుళం కత్తిరించేలోగానే ఆపరేషన్ టేబులంతా రక్తంతో తడిసిపోయింది.

సర్జన్ వేళ్ళు కొయ్యబారి పోయాయి. కళ్ళు కుంచించుకుపోయాయి. గడ్డలో నూరోవంతుకూడా ఇంకా తెగలేదు. అంతలో రక్తం ప్రవాహంలా ప్రవహించసాగింది. సర్జన్ నిట్టూరుస్తూ—

"ఆపరేషన్ చెయ్యటానికి కుదరదు. ఆపరేషన్ పూర్తయ్యేసరికి ఇక్కడే చనిపోతా డతడు. పోనీ బాధను అనుభవిస్తూనే కొంతకాలం బ్రతకనీ" అంటూ నర్సువేపు తిరిగి—

"బ్యాండేజ్ కట్టెయ్యండి" అంటూ చేతులు కడుక్కుని బయటకు నడిచారు. విద్యార్థుల గుంపూ ఆయన వెనుకనే నడిచింది. ఓ సిగరెట్ వెలిగించి పొగ వదుల్తూ సర్జన్ అన్నారు:

"అతనికి తెలివి వచ్చాక చాలా నిరాశ చెందుతాడు. నిజమే! కాని నేనేం చెయ్యను? నా చేతుల్తో అతన్ని చంపలేను. ఆపరేషన్ విజయవంతంగా చెయ్యలేకపోయానే అన్న వ్యథ మిగిలిపోయింది.

గౌడు భార్యాపిల్లలకు ఎంతో భరోసా యిచ్చాను నేను. ఇప్పుడదంతా నిరర్థకమయిపోయింది. నా బుద్ధికుశలత, నైపుణ్యం అంతా ఈ కేసులో వ్యర్థమయిపోయాయి."

విద్యార్థులింకా మాట్లాడుతూండగానే ట్రాలీలో జ్ఞానహీనుడయిన గౌడుని తీసుకుని వెళ్ళి వార్డులో పడుకోబెట్టారు.

విద్యార్థులంతా అక్కడినుండి కదిలారు.

ఆశ - భరోసా ఇవి రెండే రోగిని కాపాడే జీవ మంత్రాలు. సర్జన్ విద్యార్థులతో చెప్పేవారు—

"రోగి ఆఖరిశ్వాస పీలుస్తున్నప్పుడుకూడా అతనికి ధైర్యం, ఆశా యివ్వండి. రోగి కాని, వైద్యుడు కాని సహనం, భరోసా కోల్పోకూడదు. నిరంతరం ప్రయోగాల్లోనే వైద్యుడి జీవితం సాగుతుంది. కాని దానివెనుక భరోసా వుండితీరాలి. ఆత్మ విశ్వాసాన్ని పోగొట్టుకోకూడదు. ప్రపంచంలో మనం చెయ్యలేనిది ఏమీ లేదు. కళ్ళు లేనివారికి కళ్ళు, చేతులు, కాళ్ళు లేనివారికి కాళ్ళూ చేతులూ ఇచ్చి విజ్ఞానం మెల్లి మెల్లిగా నిసర్గాన్ని గెలుస్తోంది. నిసర్గం మన చేతిలో కీలుబొమ్మ కాకపోయినా మన ఆధీనంలోనే ఉంది.

సర్జన్ మాటలు వింటూ తన్నుతానే మర్చిపోయేది మీర.

విజయ పరాంజపెకూడా తన్నుతానే మర్చిపోయింది. కాని మరో విధంగా పూనా, బొంబాయి వెళ్ళొచ్చాక విజయ చాలా మారిపోయింది. మునుపటిలాగే కాలేజికి వచ్చేది. మునుపటి స్నేహంతోనే మీరతో మాట్లాడేది. కాని ఆమెలో ఏదో మార్పు వచ్చిందనిపించింది మీరకు.

క్లాసులో పాఠాలు వింటూండగానే విజయకళ్ళు కలల్లో విహరించేవి. రోజురోజుకూ పరధ్యానం ఎక్కువవసాగింది.

ఓ రోజు చెలువాంబా హాస్పిటల్ జనరల్ వార్డులో మీర రోగుల టెంపరేచర్ చూస్తోంది. విజయ వార్డులోకి రాకుండా బయట కారిడార్‌లో నిల్చుంది.

గోపీనాథ్ తన స్నేహితుడితోబాటు అటే వచ్చాడు.

"నమస్తే. మీరు తిరిగొచ్చాక కలవనేలేదు."

"నమస్తే."

"మీర ఏదీ? రాలేదా?"

"వచ్చింది. చార్జిషీట్స్ చూస్తోంది."

"మనమూ వెడదాం రండి" అంటూ గోపీనాథ్ పక్కకు చూశాడు. అతని స్నేహితుడు లోపలికి వెళ్ళిపోయాడు.

"మీరు వెళ్ళండి. నాకు కొద్దిగా తలనొప్పిగా ఉంది."

"మీరు వచ్చేలా ఉంటేనే వెడదాం."

"నేను రాలేను."

"అయితే నేనూ వెళ్ళను."

"అలా అంటే ఎలా? ఎంతకయినా ఫోర్త్ ఇయర్ స్టూడెంట్ మీరు. మీకు బాధ్యత ఎక్కువకదా!"

"ఒక్కరోజు వెళ్ళకపోతే ఏం ఫరవాలేదులెండి."

"సరే, మీ ఇష్టం."

ఇద్దరూ మాట్లాడుకుంటూనే ముందుకు వెళ్ళారు.

విజయ చెయ్యి మెడలోని దండతో ఆడుకుంటోంది. ఎత్తుగా ఉన్న గోపీనాథ్ పక్కన పొట్టి విజయ చిన్న పిల్లలా కనిపిస్తోంది.

"నే నింకా మీ అప్పు తీర్చనేలేదు."

"ఏమిటి?" అంది విజయ తలెత్తి.

"తీరిగ్గా మీ చెయ్యిచూసి చెబుతానని చెప్పాను. మరిచి పోయారా?"

విజయ సిగ్గుపడింది. తల వంచుకునే—

"ఓ అదా! ఫరవాలేదులెండి. నా కిపుడు చెయ్యి చూపించు కోవటంలో ఆసక్తి లేదు" అంది.

"నాకు మీ చెయ్యి చూడాలని ఉంది. ఇన్ మై ఓన్ ఇంట రెస్ట్...."

విజయ తల అడ్డంగా తిప్పుతూ "ఉహు" అంది.

"మీ రింత మొండివారని అనుకోలేదు నేను. మీరు చాలా సబ్ మిసివ్ అనుకున్నాను."

"పోనీ ఇప్పుడైనా తెలిసిందికదా నేను సబ్‌మిసివ్ కాదని?"

"ప్లీజ్...." గోపీనాథ్ బలవంతం చేశాడు.

"అలాగే. కాని ఈహాస్పిటల్ కాంపౌండులో కాదు, తరువాత మన చుట్టూ ఓ గుంపు తయారవుతుం దంతే."

"గాయత్రీ భవన్‌కు వెడదామా?"

ఇద్దరూ గాయత్రీ భవన్‌కు వెళ్ళారు. విజయ మనసులో రక రకాల ఆలోచనలు రేకెత్తుతున్నాయి.

ఇదేం పిచ్చి తనకు? ఏదో ప్రవాహంలో కొట్టుకుపోతున్న దానిలా ప్రవర్తిస్తుందేం? తన లక్ష్యం, ఆదర్శం అన్నిటినీ మరిపించి తన్ని ఇంత దీనపరిస్థితిలోకి తెచ్చిందేమిటి?

గోపీనాథా? అతని అందమయిన మొహమా? ఎత్తుగా ఉన్న అతని భవ్యమయిన విగ్రహమా? ఇద్దరూ జంటగా హోటల్ మెట్లు ఎక్కారు. గోపీ కాళ్ళు మటుకు రెండు మూడు మెట్లను ఒకేసారి దాటేస్తున్నాయి.

గోపీనాథ్ ఎలాంటి కుర్రాడో? అతనితో ఇలా రావటం తగునా? తను రాకుండా ఉండాల్సింది. తన దుర్బలతను బయట పెట్టుకున్నట్టయింది. అతనితో ఇలా వచ్చేయటం తప్పు కాదూ? అబ్బాయి లెవరయినా చూశారంటే ఏడిపించి వదిలిపెట్టరూ? ఇంత ధైర్యం ఎక్కడినుండి వచ్చింది? అన్నిటినీ మరిపించి తనను ఇక్కడికి లాక్కొచ్చిన శక్తి ఏమిటి?

విజయ తన ఆలోచనలలో లీనమయింది. వంచిన ఆమె మొహం అతనికి కనిపించటం లేదు. నల్లటి మబ్బులాంటి జుత్తు. భుజం మీద రెండుగా చీలిన నల్లటి జడల జలపాతం, ఊగుతున్న రింగులు - ఇంతే కనిపిస్తోం దతనికి.

ఈ అమ్మాయిలో తనకు కనిపించిన ఆకర్షణ ఎక్కడుంది? తన జాతికాదు, కులంకాదు. తన మనః స్థిమితాన్ని కదిలించివేసిన ఈ అమ్మాయి ఎవరు? ఐదడుగులు మాత్రమే ఉన్న ఈ అమ్మాయి శక్తి అంత బలమైనదా? ఎప్పుడూ అమ్మాయిల విషయంలో ఆసక్తి లేదు తనకు. అమ్మాయిలంటే ద్వేషం లేకపోయినా మిగతా కుర్రకారులా అమ్మాయిల వెంటబడే అలవాటూ లేదు. కాని ఇప్పుడు జరుగుతున్న దేమిటి? ఏదో మిష పెట్టుకుని అమ్మాయిలను పలకరించాలని తాపత్రయబడే కుర్రాళ్ళంటే తిరస్కారం అతనికి. కాని ఇప్పుడో?

ఇద్దరూ మెట్లెక్కి చిన్న గదిలో కూర్చున్నారు. బాయ్ వచ్చి "ఏం తెమ్మంటారు సార్?" అన్నాడు.

"ఏం తీసుకుంటారు మీరు?"

"నాకేమీ వద్దు. మీకేం కావాలో తెప్పించుకోండి."

"రెండు కాఫీలు తీసుకురా."

"నేను మహారాష్ట్రియన్ అని మర్చిపోయారా? టీ తప్ప కాఫీ తాగను నేను."

"సరి. అయితే రెండు టీ తీసుకురా."

"మీకూ్కడా టీ ఎందుకు? ఇటువేపు ఎవరూ టీ తాగరు."

"ఫరవాలేదు. మీకు కంపెనీ యివ్వటానికోసం తాగుతాను."

సర్వర్ రెండు కప్పుల్లో టీ తెచ్చిపెట్టాడు.

గోపీ ఆసక్తితో "ఏదీ మీ చెయ్యి చూపండి" అన్నాడు. విజయ టేబుల్‌మీద తన అరచెయ్యి పెట్టింది.

"కాస్త ఆగండి" అంటూ గోపీ తన జేబులోనుండి సిల్కు జేబురుమాలు తీసి టేబుల్‌మీద పరిచి "ఇప్పుడు చెయ్యి చూపండి" అన్నాడు.

దేవుడి పూజకు సిద్ధమవుతున్న భక్తుడిలా ఉన్నా డతడు. విజయ జేబురుమాలు మీద చెయ్యి చాపింది. గోపీ జేబులోనుండి పెన్సిల్‌ముక్క తీసి ఆమె చేతిలోని గీతల్ని పరీక్షించనారంభించాడు.

చెయ్యిచూసే మిషతో అతను ఆమె చేతిని పట్టుకోలేదు. ఎంత సభ్యత! ఎంత గౌరవంగా ప్రవర్తిస్తున్నాడు అనుకుంది విజయ. గోపీ తల వంచుకుని ఆమె చేతిలోని రేఖల్ని పరీక్షిస్తున్నాడు. ఆమె తిన్నగా అతని మొహాన్నే చూస్తూ కూర్చుంది.

వత్తుగా పెరిగిన జుత్తు, నల్లటి ఒత్తయిన కనుబొమలు, అంత పెద్దవికాని కళ్ళు, నిండు పెదవులు, చామన చాయ, రోమాలున్న చేతులు - వీటిని చూస్తూ మైమరచింది విజయ.

ఆమెకన్నా ఒకటిరెండేళ్ళు పెద్దవాడయి ఉండవచ్చు అతడు. అంతే. అతన్ని చూస్తూంటే ఏదో భావనలతో ఆమె హృదయం కరగి పోసాగింది.

ఎవ రితను? ఇతని కోసం తన హృదయం ఆరాట పడుతుం దెందుకు? ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి తన కేమీకాని ఇతని కోసం త నెందుకు తపించాలి?

గోపీ పెన్సిలుతో ఆమె గీతలను పరీక్షించి చూస్తున్నాడు - పొడుగాటి వేళ్ళు, గాజులులేని చెయ్యి, మోచేతుల వరకూ ఉన్న జాకెట్, పగడాల దండ....

అక్కడినుండి ఆమె మొహాన్ని చూసే సాహసం కలగలేదు. అలా చేస్తే ఆ కళ్ళు తన్ను ఆకట్టుకుని, చూపు మరల్చకుండా చేస్తాయని అతనికి తెలుసు. అతనికళ్ళు వీరుడిని ఎదిరించలేక పారిపోయే పిరికివాడిలా ఆమె మొహాన్నుండి తప్పించుకుంటున్నాయి. అతి ప్రయాసతో తన చూపు మరల్చుకుంటున్నా డతడు.

ఆమె చేతిలో అతని కేం కనిపిస్తోందోకాని ఇంతవరకూ ఒక్క మాటకూడా మాట్లాడలేదు. అతని చూపు ఆమె అరచేతిమీద లగ్నమయింది. ఆమె అరచెయ్యి పిగ్గుపడింది. దానిమీద స్వేద బిందువులు నిలిచాయి. ఇహ మొహంవేపు చూస్తే....

విజయ చేతిని వెనక్కి లాక్కుని, రుమాలుతో తుడుచుకుని మళ్ళీ చెయ్యి చాపింది.

"మీరేం చెప్పటం లేదు. ఊరికే చూస్తున్నారు. లేదా నా చేతిలో ఎన్ని ఎముక లున్నాయి. ఎన్ని నరా లున్నాయి అని పరీక్షిస్తున్నారా?"

"అలా కాదు. మీకు సరిగ్గా చెప్పాలంటే గీతల్ని బాగా స్టడీ చెయ్యాలి."

"మీరేం చెప్పినా నమ్మాల్సిందేగా?"

"ఈ వేలికి దెబ్బ తగిలిం దేమిటి?"

"ఉదయం బంగాళా దుంపలు తరుగుతూంటే వేలు కోసుకున్నాను."

"అయితే మీరు బలే మంచి డాక్ట రవుతారు లెండి! ఒక్క బంగళాదుంప తరగటం చేతకానివాళ్ళు శవాన్ని కొయ్యగలరా? మీరు డాక్టరయితే ఆపరేషన్ చేశాక మీచేతులు, కాళ్ళకు మందు రాసేవాళ్ళు రెడీగా ఉండాలి."

"మీరు చేతిలో రేఖలు చూపి చెప్పండి చాలు. గాయాలు చూడక్కర్లేదు."

"ఈ రోజు ఇక మీ చెయ్యి చూసి చెప్పలేను. దానికి చాలా ఏకాగ్రత అవసరం. మరో రోజు చూస్తాను. క్షమించండి."

"అయితే అబద్ధాలుచెప్పి నన్నెందు కిక్కడికి తీసుకొచ్చారు?"

"ఆ తప్పుకు జరిమానా - ఈ టీ తాగండి" అంటూ టీ కప్పు ఆమెకు అందించాడు. విజయ టీ తాగబోయింది. అతను ఆమె మొహంవేపు స్థిరంగా చూస్తూ కూర్చున్నాడు. విజయ నవ్వి తన టీ కప్పు కింద పెట్టి, ఇంకో కప్పు అతనికి అందించి—

"నేను తాగితే మీరూ తాగినట్టేనా ఏం? తీసుకోండి" అంది. తన చూపుల్లోని అసభ్యతకు—సిగ్గు పడ్డాడు అతడు. ఆమె ఇచ్చిన టీ అందుకున్నాడు.

"ఇద్దరం ఒకే మారు తాగుదాం. వన్, టూ, త్రీ-అఫ్" అంటూ విజయ టీ కప్పు ఖాళీచేసి క్రింద పెట్టింది. గోపీ కోటుచేతిని వెనక్కితోసి టైము చూసి "ఇక వెడదాం" అన్నాడు.

"వెడదాం. మీ రింకా ఇంటికి వెళ్ళి భోంచేసి రావాలేమో" అంది విజయ.

"మీరు?"

"నే నివ్వాళ హాస్టల్లో మీర గెస్టుని."

విజయ హాస్టల్ వేపు నడిచింది. అతను తన సైకిల్ తీసుకోటానికి కాలేజివేపు వెళ్ళాడు.

విజయ మీర గదికి వచ్చేసరికి మీర ఇంకా రాలేదు.

విజయ మీర మంచంమీద నడుం వాల్చింది. మీర లోపలికి రాగానే—

"కొంటెపిల్లా, నీకోసం హాస్పిటలంతా వెతికాను. అంత తొందరగా పారిపోయొచ్చావేం?" అంది.

"సారీ. నీకు చెప్పాల్సింది."

"నువ్వు చెప్పక పోయినా, గోపీనాథ్ ఫ్రెండ్ కేశవన్ చెప్పార్లే."

విజయ మీర చూపు తప్పిస్తూ, "ఏం చెప్పారు?" అనడిగింది.

"గోపీ, విజయ మాట్లాడుతూ ఉండటం చూశాను. ఇద్దరూ

కలిసి వెళ్ళినట్టున్నారు అని చెప్పారు. సరే రాధ తన కృష్ణుడివెంట వెళ్ళిందికదా! ఇహ నేనెందుకు బుర్ర బ్రద్దలు కొట్టుకోవటం అని ఇటు వచ్చేశాను."

"ప్లీజ్! నన్ను ఏడిపించకు మీరా."

మీర మంచంమీద కూర్చుని విజయ చెవిలో—

"విజయా, అతను ముద్దు పెట్టుకున్నాడా నిన్ను?" అంది మెల్లిగా.

విజయ అదిరిపడి లేచి కూర్చుని "ఏమన్నావు?" అంది.

మీర అద్దం తెచ్చి విజయ చేతిలో పెట్టింది. అద్దంలోని ఆమె రెండు బుగ్గల్లోనూ ఎర్ర గులాబీలు విచ్చుకున్నాయి. అద్దం మీరకు తిరిగిచ్చేసింది.

"నా ఊహ కరక్టేనా?"

"ఉహుఁ" అని గడ్డంగా తల తిప్పింది విజయ.

"అయితే బుగ్గలలా కందిపోయాయేం?"

"........................"

"కళ్ళతో ముద్దు పెట్టుకున్నాడేమో కదూ? ఊరికే చూపినంత మాత్రానికే ఇలా అయిపోయావే! ఇహ...."

"ప్లీజ్, మీరా....ఊరుకో!"

"గోపీనాథ్‌తో ఎందుకు వెళ్ళావు?"

"చెయ్యి చూస్తానన్నారు. వెళ్ళాను."

"చెయ్యిచూచి ఏం చెప్పారు."

"ఏం చెప్పలేదు."

"చెయ్యి చూశారా అసలు? లేకపోతే నీ మొహం చూస్తూ కూర్చున్నారా?"

"నాకేం తెలీదు."

"పద భోంచేసి వద్దాం. కాలేజీకి టైమవుతుంది" అంటూ బలవంతంగా విజయను లేవదీసింది.

* * *

ఈ మారు శలవుల్లో పల్లెకు వెళ్ళినపుడు శాముతో గట్టిగా

దెబ్బలాడింది మీర. అప్పటినుంచి మళ్ళీ పెళ్ళి చేసుకోమని వేధించ సాగింది. ఆమెబాధ పడలేక, విసిగిపోయి శాము-

"నువ్విలా నన్ను చంపుకుతినేలా అయితే శలవుల్లో ఇక్కడికి రావద్దు" అని కోప్పడ్డాడు.

కాని మీరా అతని బెదిరింపులకు లొంగిపోలేదు. ఈవిషయంలో ఆమె పట్టుదల చూసి శాము-

"నీ బాధ పడలేక నేను మళ్ళీ పెళ్ళి చేసుకోవాలంతే!" అన్నాడు.

"ఎలాగయినా సరే! మీరు పెళ్ళి చేసుకోవడమే నాకు కావలసినది."

"ఇప్పు డలాగే అంటావు. తరువాత నీకూ, నాకూ కూడా సుఖముండదు. మీ రిద్దరూ దెబ్బలాడుతూ కూర్చుంటే నా గతేమిటి?"

"మేము దెబ్బలాడుకోం. ఆమె దెబ్బలాటకు వచ్చినా నేను ఊరుకుంటాను."

"నువ్వా? ఊరుకోవటమా?" శాము రెట్టించాడు.

"కావాలంటే పరీక్షించి చూడండి" మీర బ్రతిమాలుకుంది.

"ఒకవేళ ఆమె నిన్ను ఇల్లువదిలి పొమ్మంటే?"

"పోతాను. నా వైద్యవృత్తి నాకుండనే ఉందికదా!"

"నన్నెందు కిలా హింసిస్తావ్ మీరా?" శాము కంఠంలో బాధ ధ్వనించింది.

"చెప్పనా? మిమ్మల్ని చేపట్టి నేను మీకు చాలా అన్యాయం చేశాను. మీ రిక ఎవర్ని పెళ్ళిచేసుకున్నా మీరు సుఖపడేవారు. నా తప్పు దిద్దుకుంటే కాని నాకు మనశ్శాంతి ఉండదు. మీరు పెళ్ళి చేసుకోండి. మిమ్మల్నేమీ కోరను నేను."

శాము మాట్లాడలేదు.

తను ఎందు కింత ఆమెకోసం తహతహ లాడుతున్నాడు? మీర అందగత్తె. కాని, అంతకన్నా అందగత్తెలు లేనేలేరా? ఏ విషయంలోనూ తనతో ఏకీభవించక ఎదురుతిరిగే స్వభావమే తన నింతలా ఆకర్షిస్తోందేమో! ఆ మనస్తత్వాన్ని జయించి, ఆమెను మచ్చిక చేసి

తన ప్రేమతో బంధించాలన్న కోర్కె తనలో బలంగా నాటుకుందేమో!

ఒక విధమయిన పోరాటం శాము మొహంలో కనిపిస్తోంది. చేతిలో నెపమాత్రానికి పుస్తకం పట్టుకుని కూర్చున్న మీర ఆత్రంగా శామువేపే చూస్తోంది.

"సరేగాని నాకు పిల్ల నెవరిస్తారు?"

"మీరు 'ఊఁ' అంటే చాలు నాలుగుపెళ్ళిళ్ళు చేయగలను."

"బాబోయ్. వద్దుదేవీ! ఇదో చేతులు జోడించి మొక్కుతున్నా. ఒక్క పెళ్ళితోనే నా పని ఇలా ఉంది. ఇహ నాలుగయితే, నలుగురు చేరి నాలుగు భాగాలుగా చీల్చేస్తారు నన్ను."

"పెళ్ళంటేనే భయపడేలా చేశాను మిమ్మల్ని. కాని అందరూ నాలా ఉండరు. మంచి భార్యలూ ఉంటారు."

శాము మీరతో వాదించి, వాదించి అలసిపోయాడు. మూడు న్నర సంవత్సరాలు మీర అతన్ని వేధించిన ఫలితంగా శాము రెండో పెళ్ళికి 'ఊఁ' అనక తప్పలేదు.

"నీ యిష్టప్రకారం కానియ్. నేను నీ చేతిలోని కీలుబొమ్మని మాత్రమే" అని శాము అన్నపుడు మీర ఆశ్చర్యానందాలతో—

"అయితే ఒప్పుకున్నట్లేనా!" అంది.

"నీ బాధ భరించలేక, ఇలాగయినా నీ హింస తప్పుతుంది కదా అని ఒప్పుకుంటున్నా."

మీర లేచివచ్చి అతని చెంపమీద తట్టి "మంచి అబ్బాయి" అంది. శాము మొరటుగా ఆమెచేతిని తోసివేసి "చాలించు నాటకం" అన్నాడు.

"ఇహ మీరు నిజంగా కోపం తెచ్చుకుని నన్ను కొట్టినా బాధ పడను" అంది మీర.

"నిన్ను కొట్టడం కూడానా? నీ చేత దెబ్బలు తినకుండాఉంటే అది నా పుణ్యం."

"నా చేతిలో దెబ్బలు తిన్నట్టే మాట్లాడుతున్నారే!" మీర కోపంగా అంది.

"చేతితో కొడితేనా దెబ్బ? నువ్వు నోటితోనూ కొట్టగలవు. మాటలతోనూ కొట్టగలవు!"

శాము మాటల్లోని వ్యంగ్యం ఆమెని బాధపెట్టింది. అతన్ని మళ్ళీ పెళ్ళి చేసుకోమని ఎందుకు పోరుతోంది? తననుండి అతనికి మనశ్శాంతిగాని, వంశాంకురం కాని దొరకలేదు, ఆ లోటుని పూర్తి చెయ్యటానికి కదా తనింతగా బ్రతిమాలుతున్నది!!

మీర తన చిరకాలపు గురిని సాధించటానికి పూనుకుంది. చిన్నప్పటినుండి డాక్టరవాలన్న ఆమెకోర్కె కొంతకాలంలోనే నెర వేర బోతోంది.

కాని శాము?

వైద్యవృత్తితో ఆమెకు శాంతి సమాధానాలు దొరకగలవన్న భరోసా ఉంది.

కాని శాము? గాడిదచాకిరీ చేస్తూ, తింటూ, డబ్బు సంపాదించ టమే అతని జీవిత పరమార్థమా?

ఆమె పల్లెకన్నా పట్నంలోనే ఎక్కువకాలం గడుపుతోంది. ఆమె డాక్టరయి పల్లెలోనే ప్రజలసేవ చేసినా ఆమెవల్ల అతనికేం సుఖం? అతని అపారమయిన సంపద అన్యులపాలవకతప్పదా? అది అతని పిల్లలకే చెందాలని ఆమె అనుకోవటమే తప్పా?

శాము పిల్లలు ఆమె పిల్లలు కావటం సందేహమే! కాని అతని భార్యగా వచ్చే మనిషితో తను సహకరిస్తే సవతులు కాకుండా అక్కా చెల్లెళ్ళలా మెలగటం సాధ్యంకాదా? శాము సుఖంకోసం, అతని మంచికోసం, ఆస్తికోసం ఆమె అతన్ని పెళ్ళి చేసుకోమని కోరుతోంది. ఇందులో అపరాధ మేముంది?

మీరకు దుఃఖం పొంగివచ్చింది.

తన వీణ బ్రతికిఉంటే?

మీర మోకాలిమీది తల ఆన్చి వెక్కివెక్కి ఏడ్చింది. ఆమె ఏడవటం చూసి శాము చకితుడయ్యాడు. బద్ధకంగా వెనక్కివాలి కూర్చున్న అతను తటాలున లేచివచ్చి, ఆమెభుజం పట్టుకుని కుదు పుతూ "మీరా" అన్నాడు.

"వీణ ఉంటే నేను మిమ్మల్నిలా బాధపెట్టేదాన్ని కాదు. ఆ ఒక్క జ్యోతి పది దీపాలను వెలిగించేది" అంటూ మీర ఏడవ సాగింది. వీణ పేరురాగానే శాము మెత్తబడ్డాడు.

"పోనీ, ఏడవకు. గడిచినదాన్ని తల్చుకుని ఏడ్చి లాభమేమిటి? నువ్వు చెప్పినట్టే కానీయమన్నానా....

"మీ కోసమేకదా నేను చెపుతున్నది. మీరేమో నా మీదే నింద మోపుతున్నారు.

"ఆడవాళ్ళు ఏడవాలనుకుంటే భర్త గుండెలుమీద తలవాల్చి ఏడవాలి. నీకు తెలీదూ?" శాము నవ్వించడానికి ప్రయత్నించాడు.

"మీది రాతిగుండె కన్నీటికి కరగదు."

"ఎప్పుడో కరిగిపోయిందది. ఇంకా కొత్తగా కరగటాని కేమీ లేదు. ఆc. నా పెళ్ళివిషయంలో మరో మాట. తరువాత ఏం గొడవ లొచ్చినా సర్దుకుపోయే బాధ్యత నీది?"

"అలాగే."

"మరోమాట. ఏమనుకోకు. నాకు పట్నవాసపు పిల్ల వద్దు.పల్లెటూరి పిల్లయితే చాలు,"

మీర మనస్సులో కూడా అదే ఆలోచన వచ్చింది. పట్నవాసపు పిల్లయిన తన్ను చేసుకుని ఏం సుఖపడ్డాడు. పాపం? పల్లెటూరి వాతావరణాని కలవాటుపడ్డ పిల్లనే తెచ్చి చెయ్యాలనుకుంది ఆమెకూడా. ఇపుడు శాము మాటలు ఆమె నిశ్చయాన్ని దృఢపరిచాయి.

తన చెంపలమీది కన్నీటిని తుడుచుకోకుండానే మీర శామును ముద్దుపెట్టుకుని 'థ్యాంక్స్' అంది.

తన మెడను చుట్టిన ఆమె చేతులను లాగేస్తూ శాము "నాకేం లంచం యివ్వక్కర్లేదు నువ్వు" అన్నాడు.

"ఇది లంచంకాదు. మనిద్దరం రాజీపడ్డందుకు గుర్తు"అంటూ కన్నీటిని తుడుచుకుంది మీర.

ఈ విషయం విని వెంకమ్మగారికి దుఃఖమూ, సంతోషమూ ఏకకాలంలో కలిగాయి. మీరతో శాము సుఖపడటంలేదని ఆమెకు

తెలుసు. అందుకే అతను మళ్ళీ పెళ్ళిచేసుకోవటం మంచిదే అని పించినా, అన్నివిధాలా యోగ్యురాలయిన మీర అతనికి తగిన భార్య కాలేకపోయిందే అన్న వ్యథా కలిగింది.

"తొందరపడకమ్మా. నెమ్మదిగా ఆలోచించు. తరువాత పశ్చా త్తాపపడి లాభం లేదు" అన్నారు.

మీర నవ్వి "నేను బాగా ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చాను" అంది.

"అయితే సరే."

"ఆయనకు ఈ మారు పల్లెటూరిపిల్లే కావాలిట. మీకు తెలిపిన వాళ్ళెవరయినా, మంచి సంప్రదాయంగల కుటుంబంలోని పిల్ల...."

"అలా అయితే ఎవరో ఎందుకు? శాముకు మేనమామ కూతురు సరస్వతి ఉందికదా? నీ పెళ్ళికిముందు శాముకు సరస్వతి నివ్వాలని ప్రయత్నించారు వాళ్ళు. ఆ పిల్ల కింకా పెళ్ళికాలేదు. పల్లెటూరిలోనే పుట్టి పెరిగిన పిల్ల. ప్రయత్నించవచ్చు" అన్నారు వెంకమ్మగారు.

"ఆయ న్నడిగి చూస్తాను. నా పెళ్ళికివచ్చినట్టుంది కదూ? పిల్ల చూడటానికి బావుంటుందా?"

"అందగ త్తెల్లో జమకట్టలేం. సుమారుగా ఉంటుంది. మంచి పిల్ల. మంచి కుటుంబం.

రాత్రి శాము దీపం తీసేసి పక్కమీద పడుకున్నాడు. ఇంకా నిద్రపోలేదు. మీర-

"నిద్రా?" అనడిగింది.

"లేదు."

"ఓ మాట అడగనా?"

"ఓ శలవివ్వండి."

"మీ మేనమామ కూతురు సరస్వతి ఎలా ఉంటుంది?"

"ఉంటుంది. అందరిలాగే!"

"ఆ పిల్ల మీకు నచ్చితే ప్రయత్నిద్దామని."

"సరస్వతా? నే నెప్పుడూ ఇష్టపడలేదు తనని."

"ఇష్టపడి నన్ను చేసుకుని ఏం సుఖపడుతున్నారు? ఆ పిల్లయితే

స్నేహం, బంధుత్వం అన్నీ నిలుస్తాయి. ఆలోచించి చెప్పండి."

"నా ఆలోచనకు ఓ విలువ నిస్తున్నావా అసలు?"

"మళ్ళీ పాతపాట పాడకండి."

"నాకు నిద్రొస్తోంది.

"చెబుదురూ...."

శాము నిద్రపోతున్నట్టు నటిస్తూ మాట్లాడలేదు. మీర రెండ నిమిషాలు చూసి లేచి అతని మంచంమీద కూర్చుంది.

"నాటకం చాలించి చెబుదురూ"

శాము మౌనాన్ని వదల్లేదు. మీర కోపంగా లేచి పోబోయింది. శాము ఆమె కొంగు గట్టిగా పట్టుకున్నాడు.

"వదలండి-నిద్రపోతున్నా చెయ్యి కొంగు గట్టిగా పట్టుకో గలదు. ఇదెలాంటి నిద్రబాబు?"

శాము కొంగుమాత్రం వదల్లేదు.

మరుసటిరోజు ఉదయం శాము మీరతో తన అభిప్రాయం చెప్పాడు.

"చూడు మీరా. నిన్ను పెళ్ళి చేసుకునేముందు నేను ఎన్నెన్నో అనుకున్నాను. పిల్ల ఇలా ఉండాలి, రూపంలో అప్సరస కావాలి అని అనుకున్నా. ఇప్పు డలాంటి దేమీ లేదు. సరసి అయినా సరే, మరొ కత్తె అయినా సరే! నీ యిష్టం, తరువాత కలిసి మెలసి ఉండాల్సింది మీరే కదా? నీకు సరస్వతి నచ్చితే నాకూ నచ్చినట్టే."

శాము మాట విని మీర సరస్వతినే నిశ్చయిద్దామని తీర్మా నించుకుంది.

* * *

ఎన్నడూ లేనిది మీర తమపల్లెకు రావడం సావిత్రమ్మగారిని అమితంగా ఆశ్చర్యపరిచింది. పెళ్ళయిన కొత్తలో వీణ పుట్టడానికి మునుపు శాము, మీర వాళ్ళ పల్లెకు వెళ్ళారు. వీణ పుట్టాక సావి తమ్మ, శీనప్పగారు శాము ఇంటికి వచ్చారుగాని సరసి రాలేదు. శాము మీరను పెళ్ళి చేసుకున్నాక సరసి వాళ్ళింటివేపు తిరిగి చూడలేదు. తనని శాము కిచ్చి పెళ్ళిచేయాలని తల్లిదండ్రులు ప్రయత్నించటం

ఆమెకు తెలుసు. కాని శాము తనను తిరస్కరించి మీరను పెళ్ళిచేసుకున్నప్పుడు శాముమీదకన్నా మీరమీదనే ఎక్కువ ద్వేషం కలిగింది.

'పట్నవాసం పిల్ల. మా శాము మావయ్యకి మంత్రంవేసింది, పై పై మెరుగులకు బలయిపోయాడు' అన్న నిశ్చయానికి వచ్చింది. శాము అపార ఐశ్వర్యానికి యజమానురాలుగా మీర ఆ ఇంట్లో అడుగుపెట్టడం సరసిలో అసూయను రేకెత్తించింది. వీణ చనిపోయి మీర మళ్ళీ చదవటానికి మొదలుపెట్టినపుడు సరసి వ్యంగ్యంగానవ్వి-

"కుక్కతోక ఎప్పటికయినా వంకరే" అని వ్యాఖ్యానించింది. "అలాగే కావాలి శాము మావకు" అనికూడా అనుకుంది.

శాముకు పెళ్ళయి ఇన్నేళ్ళు గడిచినా సరసికి మాత్రం పెళ్ళి కాలేదు. సరసి మీరకన్నా మూడు నాలుగేళ్ళు చిన్నది. ఆమె జాతకం ప్రకారం మామగారు లేనిఇల్లు కావాలి. దీనివల్ల ఆమెకు సంబంధం కుదరటం ఆలస్యమవుతూ వచ్చింది. ఆమె పెళ్ళిగురించి తల్లిదండ్రులు బెంగపెట్టుకున్నారు. తగిన వరునికోసం వాళ్ళు వెతుకుతూనేఉన్నారు.

మీర బస్సుదిగి శీనప్పగారింటికి వచ్చేసరికి సాయంత్రం ఆరయింది. ఇంటిముందు ఎవరూ లేరు. పెరట్లో పాలు తీస్తున్నారు. సరసి దూడను పట్టుకుని నుంచుంది.

మీరను చూసి సావిత్రమ్మగారు ఆశ్చర్యానందాలతో "రామ్మా. రా. శాముకూడా వచ్చాడా?" అన్నారు.

"లేదు. నే నొక్కత్తెనే వచ్చాను" అంటూ సరసివేపు చూసి చిరునవ్వు నవ్వింది. సరసి బలవంతంగా మొహంమీదికి చిరునవ్వు తెచ్చుకుంది. ఆమెకళ్ళు అసూయతో తీక్షణంగా మీర వంటిమీద చీర, నగలను పరీక్షిస్తున్నాయి.

మీర చిన్నచిన్న ఆకులున్న తెల్లటి షిఫాన్ చీర కట్టుకుని, ఆకుపచ్చ జాకెట్ తొడుక్కుంది. బస్సులో రావటంవల్ల ఆమె ఉంగరాల జుత్తు చిందరవందరగా ఉంది. ఎడమచేతికి రిస్టువాచ్, కుడిచేతికి నాలుగు బంగారు గాజులు, మెడలో బంగారుతో చుట్టిన నల్లపూసలు, చెవుల్లో వజ్రపు దుద్దులు, కాళ్ళకు నాత్తరకపు జోళ్ళు, చేతిలో చర్మపు సూట్ కేస్——

చూస్తూ చూస్తూ సరసి కళ్ళు ఎర్రబడ్డాయి. "ఇదీ ఒక అం
మేనా!" అని నాలుక అంటున్నా మనసుమాత్రం "అబ్బ ఎం
అందంగా ఉందో!" అంటూనే ఉంది.

సరసి సాదా నేతచీర కట్టుకుంది. చేతులకు మాసిన గా
గాజులు, మెడలో పూసలదండ, చెవులో ఎర్రటి ఒంటిరాయి దుద్దు

మీర ముస్తాబుతో తనని పోల్చుకుని ఏడుపు వచ్చినం
పనయింది సరసికి. తల్లి పాలుతీయటం కాగానే దూడను కట్టే
లోపలకు వెళ్ళిపోయింది. సావిత్రమ్మగారు ఎంతో సంబరపడుతూ
అపుడే తీసిన పాలతో చిక్కటికాఫీ చేసిచ్చారు మీరకు.

"శామణ్ణ రాలేదేమమ్మా!"

"మీతో నాకు కాస్త పనివుంది. అందుకు నేనే వచ్చాను."

"నాతోనా?"

"ఊం. మీరు సరేనంటే చెపుతాను."

"ఏమిటో చెప్పు. చూద్దాం"

"సరస్వతికి ఎక్కడయినా సంబంధం కుదిరిందా?"

సావిత్రమ్మగారు నిట్టూర్చి "పెళ్ళయ్యే గీత ఉందో లే
తెలీదు. చూస్తూనే ఉన్నాం. ఇంతవరకూ ఏదీ స్థిరపడలేదు"అన్నా

"నేనో సంబంధం చెబుతా, చూస్తారా?"

"ఎవరమ్మా అది? మాకు తెలీని సంబంధమా?"

"మీకు బాగా తెలిసినవారే!"

సావిత్రమ్మగారు ఆశ్చర్యపోయారు. కుతూహలంతో "అ
కాస్తో కూస్తో ఉన్నవారేనా?" అనడిగారు.

మీర నవ్వి "బాగా ఉన్నవారే-కాని రెండోపెళ్ళి" అంది.

"వయస్సు?"

"ఫరవాలేదు. సరస్వతికి సరిగ్గానే ఉంటారు. కాని ఓ సం
తేమంటే మొదటిభార్య బ్రతికే ఉంది...."

"అయితే మళ్ళీ పెళ్ళెందుకు?"

"మొదటి పెళ్ళానికి పిల్లల్లేరు. ఇక పుట్టదుకూడా. అందు

ఆస్తి పరాయివాళ్ళకు పోకూడదని మళ్లీ పెళ్ళిచేసుకోవా లనుకొం టున్నారు.”

“మొదటి భార్య ఈ పెళ్ళికి ఒప్పుకుంటుందా?”

“ఆఁ ఆమే భర్తకు బలవంతంగా మళ్లీ పెళ్ళి చేయటానికి పూనుకుంది.”

“ఎవరమ్మా ఆ పుణ్యాత్మురాలు? తను బ్రతికుండగానే పిల్లల కోసం భర్తకు పెళ్ళిచేసే మనిషి! నే నామెను చూశానా?”

“ఓ చూడకేం! ఇప్పుడూ చూస్తూనే ఉన్నారు.”

“సావిత్రమ్మగారు తెల్లబోయి ‘మీరా’ అని కేక పెట్టారు. ఒక్క నిమిషం మాట్లాడేశక్తిని కోల్పోయా రామె. మీర హృదయం ఆమెకు అర్థమయింది. గద్గద కంఠంతో,

“ఇదేమిటమ్మా మీరా? అంత తొందరేమొచ్చింది? నీకు పిల్లలు పుట్టే వయస్సు దాటిపోయిం దనుకున్నావా? ఇవాళ కాకపోతే రేపు నీకూ పిల్లలు పుడతారు. తొందరపడకు” అన్నారు.

“ఉహూఁ. ఇక నాకు పిల్లలు పుట్టరు. నా కది తెలుసు, మీరూ, మీ వారు, సరస్వతీ ఆలోచించి రేపు సాయంత్రంలోగా మీ అభి ప్రాయం చెప్పండి నాకు.”

మీర సరళ స్వభావం చూచి, ఏం చెప్పాలో తోచలేదు సావిత్రమ్మ గారికి.

“మీరా, ఏకంగా నువ్విలా వచ్చేయటమేనా? మూడో మనిషి ద్వారా కబురు పెట్టాలి గాని!”

“ఇలా రావటం తప్పంటారా?”

“తప్పని కాదుగాని, సంప్రదాయం కాదుగదా?”

“పోనివ్వండి. పని జరగటమే కదా మనకు కావలసినది. ఇంతకూ మీ రేమంటారు?”

“సరసి శాముభార్య కావాలని ఎంతగానో కోరుకున్నాను ఒకప్పుడు. ఇపు డింకేం చెబుతాను? పేదవాడికి పెన్నిధి దొరికి నట్టుంది నా పని.”

“సరస్వతి ఏమంటుందో?”

"రాణీ వవుతావా అంటే ఏ పిల్ల మాత్రం వద్దంటుంది? గంతేసి ఒప్పుకుంటుంది. ముందు ముందు మీ రిద్దలూ అక్కచెల్లెళ్ళల్లా కలసిమెలిసి ఉండాలి,"

"ఆ సంగతి నాకు వదిలేయండి. సరస్వతి ఏది? తనతో నేనే చెపుతాను."

"సరసీ....సరసీ....

తలుపువెనక నుంచుని వా రిద్దరి మాటలూ వింటున్న సరసి, తల్లి పిలుపు వినగానే అక్కడనుండి పెరట్లోకి పారిపోయింది. ఆమె ఆనందంతో పరవశించిపోయింది.

తను శాము పెళ్ళాం కాబోతోంది! అంతటి అందగాడు తన భర్త! అన్నిటికన్న మిన్నగా ఇకముందు అతని ఐశ్వర్యాని కంతటికి తనూ, తన పిల్లలూ వారసులు!

మీర తనను వెతుక్కుంటూ వస్తుందని సరసకి తెలుసు. అందుకే ఏమీ ఎరగనిదానిలా ఆవుకు మేత వేస్తూ నిలుచుంది.

"సరసీ" మీర పిలిచింది.

ఆమె నిష్కపటమయిన మొహం, నిండుదనం, ఠీవీ సరసిని ఆకట్టుకున్నాయి. కాని ఆ మొహమే కదా, తను చిన్నప్పటినుండి కోరుకున్న శామును దూరం చేసింది.

"మా పల్లెకి వస్తావా సరసీ?"

"వస్తే ఏమిస్తారు నాకు?"

"మీ శాము మావయ్యను ఇస్తాను నీకు" అంటూ నవ్వింది మీర. ఆ నవ్వులో మాత్సర్యం లేశమాత్రమూ లేదు. పసిపిల్లలాంటి నవ్వు అది. తన భర్తను నవ్వుతూ మరొకరికి అప్పజెప్పే ఈ ఆడ దాని మనసు అర్థంకాలేదు సరసికి.

శాము, అతని విశాలమైన ఛాతీ, ఉక్కులాంటి చేతులు, ఆరోగ్యంతో మిసమిసలాడే అందమయిన మొహం, అపార సంపత్తు ...

చిరునవ్వుతో మీరవేపుచూపి తల ఊపింది సరసి.

* * *

మీర తమ పల్లెకు తిరిగివచ్చేసరికి ఓ ఉత్తరం ఆమెకోసం

ఎదురు చూస్తోంది. శాము ఇంట్లోలేడు. అడ్రస్ చూసే అది విజయ ఉత్తరమని గ్రహించి ఆత్రంగా చించి చదివింది.

"మీరా,

నే నెపుడూ నీకు ఉత్తరం రాయలేదు, కాని ఇవాళ ఏంచెయ్యాలో తోచక నీకు ఉత్తరం రాస్తున్నాను. నా భావుకత నీకు నచ్చదని తెలుసు. కాని ఏం చెయ్యను? దేవుడు నాహృదయాన్ని పాషాణంగా సృష్టించి ఉంటే బావుండేదేమో!

కాలేజికి శలవులిచ్చినప్పటినుండి గోపీని చూడలేదు. అతన్ని చూడలన్న కోరిక రోజు రోజుకి తీవ్రమవుతూ వచ్చింది.

ఈ రోజు స్నేహితురా లింటికి వెడదా మని డ్రస్ చేసుకుం టుండగా చిన్నచెల్లి ఉష వచ్చి "అక్కా ఎవరో వచ్చారు. డ్రాయింగ్ రూంలో కూర్చోబెట్టాను!" అంది.

"ఎవరూ? ఆడవాళ్ళా?"

"కాదు, నీ క్లాసేనట. పొడుగ్గా అందంగా ఉన్నారు" అంది కొంటె పిల్ల. దాని బుగ్గమీద చిన్నగా దెబ్బవేసి డ్రాయింగ్ రూము లోకి వెళ్ళాను. అక్కడ కుర్చీలో కూర్చున్నారు గోపీ. నన్ను చూడ గానే లేచి "నమస్తే" అన్నారు. మా నాన్నగారు ఇంట్లో లేరు. ఆయన ఉదయం ఎనిమిదింటికే ఫ్యాక్టరీకి వెళ్ళిపోయారు. పన్నెండు దాటాకగాని రారని తెలుసు.

"ఉషా, ఓవల్టిన్ చేయించి తీసుకు రామ్మా" అని చెల్లితో చెప్పి ఆయనకు ఎదురుగా కుర్చీమీద కూర్చున్నా.

"నేనేం నీ దగ్గరగా రాలేదు. అవునా?"

"ఏం?" ఆశ్చర్యంతో అడిగాను. ఆయన మాట్లాకుండా తమ చెంపముట్టి చూపించారు.

"నా మనసులోనిది మీ కెలా తెలిసింది?"

"ఇద్దరిదీ ఒకే కోరిక గనుక."

"అబ్బ! ఇక్కడికి రావటానికి మీ కెంత సాహసం! ఎవరో రౌడీ వచ్చి గొడవ చేస్తున్నాడని అమ్మతో చెప్పి మిమల్ని ఇంటినుండి బయటకు పంపితే?"

"ఓ! అలాగే. నేను సిద్ధంగా ఉన్నాను" అన్నారు నా పగడాల దండవేపే చూస్తూ.

"మీ రెప్పుడూ నా మెడలోని దండనే చూస్తా రెందుకు?"

"నేనే ఆ దండనయితే...."

ఉష ఓవల్టిన్ తెచ్చిపెట్టి వెళ్ళింది, నేను కప్పు ఆయనముందు పెట్టి "తీసుకోండి" అన్నాను. ఆయన ఓవల్టిన్ తాగి కప్పుకిందపెట్టి "ఇక వస్తాను" అన్నారు.

"అసలు ఎందుకొచ్చారు మీరు?"

"నిన్ను చూడాలనిపించింది. వచ్చాను."

"ఇక్కడ మా నాన్నగారు ఏమైనా అంటారేమో అనిపించ లేదూ?"

"అనిపించింది. కాని నిన్ను చూడాలన్న కోరిక బలంగా ఉం డటంచేత వచ్చేశాను. మీ నాన్నగారు చాలా సనాతనం మనిషా!"

"ఆ. కొంచెం మలాంటి వారే! నేను మీతో మాట్లాడుతున్నా నని తెలిస్తే చంపేస్తారు."

"నాతో ఉత్త మాటలేనా? మరేమీ లేదూ?"

"లేదు."

"విజయ్. నువ్వు ఎంత అందంగా అబద్ధాలు చెప్పగలవ్?"

"అలా అనకండి. నాకు బాధగా ఉంటుంది."

"బాధా ఎందుకూ?"

నేను మెడలోని హారం చూపి,

"దీనికిబదులు నీ చేతులహారం...." అంటూండంగానే ఆయన లేచివచ్చి "నీ కోర్కె పూర్తి చేస్తాను" అంటూ దగ్గరగా వచ్చారు. అపుడే ఉషవచ్చి ఖాళీకప్పు తీసుకుని వెళ్ళిపోయింది.

"అంత సాహసం చెయ్యకం డిపుడు" అన్నా న్నేను.

"మరెపుడు?"

"దైవకృప కలిగినపుడు."

ఆయన ఒక్కనిముషం ఆలోచిస్తూ నుంచుని తరువాత—

"వస్తాను. కాని నిన్ను చూడాలనిపించినపుడు ఎవరి భయమూ నన్ను ఆపలేదు." అని వెళ్ళిపోయారు.

ఆయనతో "మానాన్న చండశాసనులు. ఇక్కడికి రాకండి" అని ఎలా చెప్పను మీరా? నా కాళ్ళమీద నేను నిలబడటాని కింకా రెండేళ్ళు కావాలి. ఆయనకూ ఓ సంవత్సరం చదువుంది. నా సర్వస్వాన్ని "రావద్దని" ఎలా చెప్పను? నాన్న ఉండగా అతను రావటం జరిగితే పెద్ద గొడవ అవుతుంది. తప్పదు. ఇపుడే ఈ రభస జరగటం నా కిష్టంలేదు. ఆయన రావాలని, ఆయన్ని చూడాలని ఎంతగా కోరుకుంటున్నానో అంతగానూ భయపడుతున్నా. నా కేదైనా దారి చూపగలవా?

నీ

విజయ."

ఉత్తరం చదివి మీర 'పిచ్చిసన్నాసులు. ఏ ముహూర్తంలో వాళ్ళిద్దరికీ పరిచయం చేశానోకాని' అనుకుంది. వెంటనే విజయకు ఉత్తరం రాసింది.

"విజయా,

గోపినుండి తప్పించుకోవటానికి నీకు ఒక్కటే మార్గం ఉంది. కాలేజి తెరిచేదాకా పూనాలో ఉండిపో. అతడు నీకోసంపూనా రాలేడు కదా? వచ్చినా నీ అడ్రసు తెలియదు కదా? అపుడే అందరి కళ్ళలో పడటం మంచిది కాదు. ఇద్దరి చదువులూ పూర్తయ్యే దాకా ఆగక తప్పదు. నీ చెంపలూ, పెదవులూ క్షేమంగా ఉన్నాయి కదా? పూనా నుండి నీ ఉత్తరంకోసం ఎదురు చూడనా?

మీర."

ఉత్తరం రాసి బోరడి చేతికిచ్చి పోస్ట్ చేయించి నిట్టూర్చింది మీర. సాయంత్రం శాము రాగానే తను తెచ్చిన శుభ వర్తమానం అందచేసింది. శాము నిర్వికారంగా

"సరే! ఎలాగోనీళ్ళలో పడటమంటూ జరిగింది. ఇహ మునగటమూ తేలటమూ వాళ్ళవాళ్ళ బలాల్ననుసరించి ఉంటుంది" అన్నాడు.

"ఏమిటది? ఏదో జరగకూడనిది జరిగినట్లు మాట్లాడుతారేం?" అని కసురుకుంది మీర.

* * *

శాము రెండో పెళ్ళి సరళంగా, నిరాడంబరంగా జరిగిపోయింది. రెండోసారి కంకణం కట్టుకుని పెళ్ళి కొడుకయిన శాము ఏమాత్రం ఉత్సాహంగా లేడు. ఈ పెళ్ళిని తనకు ఓటమిగా భావించాడు శాము. పురోహితులు చెప్పినదాన్ని యాంత్రికంగా చేస్తున్నాడు.

శాము ఉదాసీనత సరసిని రెచ్చగొట్టింది. శాముకు రెండో పెళ్ళయినా సరసి కది మొదటిదే నన్న సంగతి పూర్తిగా విస్మరించాడు. ఆమె చెయ్యి పట్టుకుని 'సప్తపది' నడిచినపుడు, మాంగల్యం కడుతున్నపుడు, కుంకుమా, గంధంరాసినపుడు అతని మొహంలో ఒక్కసారైనా ఉల్లాసం కనిపించలేదు. తనకున్నంత ఉత్సాహం, ఆనందం అతనికి లేవని గ్రహించిన సరస మనసు చిన్నబోయింది.

మీరను పెళ్ళిచేసుకునేటప్పుడు అతనెంత ఉత్సాహంగా ఉన్నాడు మీర పేరు వింటే చాలు, పచ్చగడ్డిని చూపిన దూడలా అయిపోయేవాడు. ఆమె పెళ్ళిలో తనతల్లే శాముతల్లి నగలతో మీరను అలంకరించింది. ఆ నగలన్నీ ఏమయ్యాయ్? వాటిలో తనకేమీ భాగంలేదా?

లగ్నానికి ముందు మీరవచ్చి సరసి చేతులకు ఓ జత గాజులు, మెడలో రెండు పేటల గొలుసు వేసి వెళ్ళింది. "మిగతా నగలన్నీ ఏమయ్యాయ్?" అని అడగాలన్న తన మనసులోని కోరికను బలవంతంగా అణచుకుంది సరసి.

పెళ్ళయి పోయింది. పెళ్ళి జరుగు తున్నపుడు శాము దృష్టి పక్కనే ఉన్న సరసి మీదలేదు, పెళ్ళిపందిట్లో ఉత్సాహంగాఉన్నట్టు కనిపిస్తూ పెదవులకు నవ్వును పులుముకుని తిరుగుతున్న మీరమీదనే ఉన్నాయి. సరసి ఒకటి రెండుమార్లు శాముపేపు ఓరగా చూసినపుడు అతనిదృష్టి మీరమీద ఉండటం గమనించి కుపితురాలయింది.

తనకు పెళ్ళి చేయటంలో మీరకు నిజంగా ఉత్సాహం ఉందా లేదా అని పరీక్షగా చూస్తున్నాడు శాము.

శాముకు రెండో పెళ్ళిచేయటం నిజానికి తన ఓటమేనన్న సం

గతి మీరకు తెలుసు. పైకి గెలిచి నట్టు కనిపిస్తున్నా అంతర్యంలో ఆమె ఓడిపోయింది. విధిలేక ఓటమిని శరణు జొచ్చింది మీర. శాము సరసి మెడలో మాంగల్యం కట్టేటపుడు ఒకే ఒక్క క్షణం ఆమె మనసు కలుక్కుమంది.

రాత్రి పడుకునేగదిని స్వయంగా మీరే అలంకరించింది. రోజూ మీరా, శాము పడుకునేగది ఈ రోజు వధూవరులకు శయ్యాగృహమైంది. మీర చేతిచలువతో పూలపాన్పు అమరింది. సరసిని మీరే స్వయంగా తీసుకొచ్చి శాముకు అప్పజెప్పింది.

"మా అమ్మాయిని మీ కప్పజెప్పుతున్నాం" అని మీరనవ్వుతూ అన్నపుడు శాము మీర వేపే చూస్తున్నాడు. సరసి అక్కడ లేకపోయి నట్టయితే శాము మీరనే పూల పాన్పుమీదికి లాక్కునే వాడు. అతని అంతర్యంలోని అభిలాష కళ్ళలో ప్రతిఫలిస్తోంది. ఇంకో క్షణం తాను అక్కడే వుంటే పరిణామం సవ్యంగా ఉండదని గ్రహించిన మీర త్వరగా అక్కడినుండి వెళ్ళిపోయి మరోగదిలో ఒంటరిగాకూర్చుంది.

అకారణంగానే ఆమె మనసు వ్యగ్రమైంది. తను శామును ప్రేమించటంలేదు కనక అతను మరోపెళ్ళి చేసుకున్నా తనకేవిధమైన వ్యథా కలగదు. శాము పదిపెళ్ళిళ్లు చేసుకున్నా తన మనసు అణుమాత్రమయినా చలించదని భావించిం దామె. కాని ఈరోజు తన మనస్సు వికలమైం దెందుకు?

మీర లాంతరువత్తి పెద్దదిగాచేసి బీరువాలోనుండి 'అనాటమీ' పుస్తకం తీసుకుంది. మనసులోని అస్థిరతపోయి పూర్తి 'అనాటమీ'లో లీనమయింది.

ఉదయం ఆరింటికి శామువచ్చి తన చేతిలోని పుస్తకం లాక్కున్నప్పుడు అదిరిపడి అతనివేపు చూసింది. బలవంతపు చిరునవ్వుతో ఆమె పదవులు విచ్చుకున్నాయి.

"రాత్రంతా నిద్రపోలేదు కదూ?"

"ఏదో చదువుతూ కూర్చున్నా. నిద్రరా లేదు. సరసి ఏది?"

"పడుకుంది. నాకు మెలకువ వచ్చింది లేచేశాను."

"రాత్రంతా జాగరణ చెయ్యలేదు గదా?" కొంటెగా అడిగింది మీర.

"నేనేం కొత్త పెళ్ళికొడుకుని కానుగదా! నువ్వెందుకు నిద్ర పోలేదో చెప్పు?"

"నిద్ర రాలేదుగనక. సరసి ఎలాంటి పిల్ల?"

"మంచిపిల్ల చెప్పినట్టు వింటుంది. నీలా మొండిఘటం కాదు. పట్టుబట్టదు. మూర్ఖురాలు కాదు...."

అంతవరకూ అణచుకున్న దుఃఖం పొంగి పొరలింది మీరకు. కళ్ళలో గంగాయమునలు అవతరించారు. శాము మీరను ఏడిపించాలని ప్రయత్నించాడు కాని మీర నిజంగా ఏడుస్తుం దనుకో లేదు. మీర కళ్ళలో నీరు చూడగానే గది తలుపువేసి దగ్గరగావచ్చి కూర్చుని—

"మీరా, నువ్వే గెలిచావుకదా ఎందు కేడుస్తున్నావు?"

"ఊహుఁ కాదు. ఓటమి నాదే.మిమ్మల్ని చౌకగాఅమ్మేశాను."

"నా వెల ఎంతో తెలుసా? ఓ తియ్యటి ముద్దు."

"సరసి కావలసినన్ని ఇవ్వలేదూ?" మీర కళ్లు తుడుచుకుంటూ అడిగింది.

శాము మీర పక్క వేసి లాంతరు ఆర్పి,

"ఇక పడుకుని నిద్రపో. నీ మీద నాకు ద్వేషం లేదని తెలుసుగా?" అన్నాడు. మీర పడుకుంటూ "తెలుసు" అంది.

"పన్నెండింటిదాకా నువ్వు కదలకూడదు. మెదలకూడదు" అంటూ కుర్చీమీద కూర్చున్నాడు.

"మరి మీరో?"

"నీకు నిద్ర పట్టేదాకా నే నిక్కడే కూర్చుంటాను."

అయిదు నిమిషాల్లోనే మీరకు నిద్ర పట్టింది. శాము మీరనే చూస్తూ కూర్చున్నాడు. అతని మొహం అనేక భావాల రణరంగ మయింది.

మీర నిద్రపోయాక శాము లేచి తలుపు దగ్గరగా లాగి బయటికి వచ్చాడు. సరసి శాము కోసం ఎదురు చూస్తూ హాల్లో కూర్చుంది.

కొత్తభార్య వచ్చిన రోజునయినా మొదటి పెళ్ళాన్ని వదిలి ఉండలేరా ఈయన. సరస్వతి కళ్ళలో అసమాధానం తొంగిచూసింది. శాము ఆమె చేతులను నెమ్మదిగా విడిచించుకున్నప్పుడే సరసి మేలు కుంది. దాంపత్య జీవితంలో ఓడిపోయి మీర తనకు శరణాగతురా లయిందని అనుకుంటోంది సరసి ఇంతవరకూ. కాని ఇప్పు డామెకు తన ఊహ తప్పు, మీర ఓడి పోలేదు, తన ప్రతిస్పర్ధిగా ఇంకా నిలిచే వుంది అనిపించింది. ఇప్పుడూ, తరువాతాకూడా భర్త ప్రేమ ఆమెవేపే మొగ్గు చూపుతుంది. మరి ఈ ఇంట్లో తన స్థానం ఏమిటి?

శాము సరసివేపు చూపి చిరునవ్వు నవ్వి "అప్పుడే లేచే శావా?" అన్నాడు. సరసి తన మొహంలోని అసమాధానాన్ని కనిపించ నీయకుండా, మొహం పక్కకు తిప్పుకుని "ఊఁ" అంది.

అదేరోజున మధ్యాహ్నం బస్సుకు సరసి తల్లిదండ్రులు తమ పల్లెకు బయలుదేరారు. మీర అప్పటి కింకా నిద్ర లేవలేదు. రాత్రంతా నిద్ర లేనందువల్ల గాఢమయిన నిద్రలో మునిగి ఉంది.

తల్లీ దండ్రీ ఊరికి వెడుతున్నప్పుడు సరసి మూసిన తలుపుల వేపు చూస్తూ "అంతా ఉత్తదే! అమ్మా నాన్నా ఊరెడుతూంటే మెలకువ రానంత నిద్రా? పొగరు!" అని మనసులోనే అనుకుంది.

సావిత్రమ్మ శాముతో "వెళ్ళొస్తాం శామణ్ణా! ఇంక సరసి భారమంతా మీదే. అదేమయినా పొరపాటుగా ప్రవర్తిస్తే నువ్వూ, మీరా క్షమించి సరిదిద్దుకోవాలి. మీర ఏదీ?" అని అన్నారు.

"నిద్రపోతోంది. నేను చెబుతాలెండి."

"కులాసాగా ఉందికదా?"

"ఆ. ఏదో పెళ్ళి హడావిడిలో రెండు రోజులుగా నిద్రలేదు కదా! నిద్ర వచ్చేసింది. అంతే. నేను చెబుతాను తనతో."

సరసికి భర్తమీద మితిలేని కోపం కలిగింది. వెళ్ళి లేపరాదూ మీరని? అంత అమూల్యమైనదా ఆమె నిద్ర?

సావిత్రమ్మ, శీనప్పగారూ వెళ్ళిపోయారు. సరసికి ఏమీ తోచటంలేదు. పుట్టింట్లో ఉన్నట్టు ఇక్కడ పనీ పాటా లేదు. గది లోకి వెళ్ళి కిటికీలో నుండి బయటకు చూస్తూ కూర్చుంది. శాము

అత్తగార్నీ, మామగార్నీ బస్సు ఎక్కించి ఇంటికి వచ్చాడు. భర్త గదిలోకి రాగానే సరసి లేచి నుంచుంది.

"సరసీ, నీకోమాట చెప్పాలి. ఏ విధంగానూ మీర మనసు నొప్పించకు."

"నేనేం చేశా నిపుడు?"

"ఇప్పు డేదో చేశావని కాదు నే ననటం. మీర జీవితంలో చాలా దెబ్బ తింది. పైకి నవ్వుతున్నా జానిని పోగొట్టుకున్న దగ్గ ర్నుండి తను సుఖంగా లేదు. మీరిద్దరూ సుఖంగా ఉండాలని నా ఆశ"

"నాకేం పనిగట్టుకుని దెబ్బలాడాలని లేదు."

"అరె, అప్పుడే నాతో దెబ్బలాట మొదలెట్టేశావే" అని నవ్వుతూ సరసి బుగ్గమీద చిటికవేసి బయటికి వచ్చాడు శాము.

మీర అప్పుడే నిద్ర లేచింది.

"వాళ్ళు వెళ్ళిపోయారా?"

"ఆ. నేను కావాలనే లేపలేదు నిన్ను."

"ఛ! ఎంతపనిచేశారు? వాళ్ళేమనుకుంటా రసలు? నన్ను నిద్రలేపితే ఏం కొంప మునిగిపోయేది?"

"సరేగాని ముందు భోజనానికి పద. మా దయింది."

'మాది' అన్నపదం చిత్రంగా వినిపించింది మీరకు. హృద యంలో ఎక్కడో చురుక్కుమంది. అయినా కొంటెగా "మాది అంటే?" అంది.

"నాదీ, సరసిదీనూ. పద భోంచేద్దూగాని."

"నాతో మళ్ళీ భోంచేస్తారా ఏం?"

"ఉహుఁ, చూస్తూ కూర్చుంటాను. నువ్వు సరిగ్గా భోం చేస్తావో లేదోనని."

"నేనేం సత్యాగ్రహంచేయటం లేదే" అంటూ మీర లోపలికి వెళ్ళింది.

మీర భోంచేసి రాగానే శాము ఆమెచేతి కో ఉత్తరం ఇచ్చాడు. మీర ఆత్రుతగా తీసి చదివింది.

"మీరా,

నీ సలహా ప్రకారం గోపీకి భయపడి పూనా పారిపోయి వచ్చాను. కాని అతని జ్ఞాపకాలనుండి తప్పించుకోగలనా? అవికూడా నన్ను వెన్నంటివచ్చాయి. ఇక్కడికి రాగానే మళ్ళీ వెనక్కి తిరిగి వెళ్ళిపోవా లనిపించింది. నేను ఊళ్ళోలేనని తెలిస్తే ఆయన ఎంత నిరాశచెందుతారో ఊహించలేకుండా ఉన్నాను. గోపీలేని ఊరు శూన్యంగా అగుపిస్తోంది నాకు. ఎప్పుడు కాలేజీ తెరుస్తారా, ఎప్పుడు మైసూరు వెళ్ళిపోదామా అని చూస్తున్నా. మీరా, నువ్వు ఎవరినయినా ప్రేమించిఉంటే నా బాధ నీ కర్థమవుతుంది.

విజయ."

ఉత్తరం చదివి మీర బాధపడింది. విజయ హృదయాన్ని ఆకర్షించిన గోపీమీద కోపం వచ్చింది. అత న్నుండేగా ఆమె కిన్ని బాధలు. మీర వెంటనే విజయకు ఉత్తరం రాసింది.

"విజయా,

'నువ్వెవరినయినా ప్రేమించి ఉంటే' అన్నావు. నేను ఇంత వరకూ ఎవర్నీ ప్రేమించలేదనే అనుకుంటూ వచ్చాను. నాలోని అమితమయిన అభిమానం, గర్వం, అహంకారాల కింద నా హృద యంలోని ప్రేమ తలెత్తలేక అణగారిపోయింది. నే నెవర్నీ ప్రేమిం చటంలేదనే అనుకున్నాను. కాని అది నిజంకాదు. నా కిపుడిపుడే తెలిసివస్తోంది——నేనూ ప్రేమిస్తున్నానని. కాని ఎవరిని? అని ప్రశ్నిం చకు. అడిగినా నీకు జవాబుదొరకదు. గోపీనిమాత్రం కాదు. భయ పడకు.

మీర."

* * *

మళ్ళీ కాలేజీ తెరిచినరోజున విజయ మీరను చూసి ఆదుర్దాతో, "ఇలా చిక్కిపోయావేమిటి మీరా?" అంది.

"నా సంగతలా ఉంచు నువ్వెప్పుడొచ్చావు. పూనానుండి?"

"నిన్న రాత్రి."

"మళ్ళీ గోపీ మీ ఇంటికి వెళ్ళలేదు కదా?"

"వెళ్ళారట. ఉష చెప్పింది. 'అక్కయ్య పూనా వెళ్ళింది' అని చెప్పి పంపించేసిందట."

"ఈరోజు గోపీ కనిపించనీ, అడుగుతాను ఇంటికెందు వెళ్లారని."

"వద్దు మీరా ఆయన్నేమీ అనకు, నీకు పుణ్యముంటుంది. మీరా! ఈ ప్రవాహాన్నిక అడ్డుకోవటం నా తరం కాదు. అతన్ని ఎప్పటికి చూస్తానా అని తపించిపోతున్నా."

మీర ప్రేమగా "నువ్వూ, నీ గోపీ ఏ గోతిలోనైనా దూకండి. నాకేం?" అని తిట్టింది.

హాస్టల్ ఆవరణలో అడుగు పెడుతూండగానే గోపీ కనిపించాడు. నస్యం కలర్ ప్యాంట్, అదేరంగు కోటు వేసుకుని, మెడలో స్టెతస్కోప్ వేసుకుని నుంచున్నాడు. విజయవేపు కన్నెత్తి చూడకుండా మీరనుమటుకు విష్ చేసి తన సహపాఠి కాంతతో—మాట్లాడుతున్నాడు.

"ఏం చెయ్యనే మీరా, గోపీకి కోపమొచ్చినట్టుంది."

"నువ్వూ మాట్లాడకుండా ఊరుకో. సరిపోతుంది."

"ఆయన కాంతతో ఎలా నవ్వుతో మాట్లాడు తున్నారో చూశావా?"

"ఛ! ఆడవాళ్ళకు అంత అసూయ పనికిరాదు సుమా."

"ఆయన కోపం పోగొట్టటమెలాగో చెబుదూ."

"వెళ్ళి క్షమాపణ వేడుకో."

"ఎలా?"

మీర గబగబ గోపీ దగ్గరకు వెళ్ళి "మీరు ఏవార్డుకు వెడుతున్నారు?" అనడిగింది.

"కాంతరాజా వార్డుకు."

"నేను బెలువాంబా హాస్పిటల్‌కు వెళ్ళాలి. మాలో కాంతరాజా వార్డుకు వెళ్ళేవా రెవరూ లేరు. విజయ వంటరిగా వుంది. దయచేసి మీరు ఆమెతో...."

గోపీ విజయవేపు చూశాడు. పసిపాపలాంటి ఆమె మొహాన్ని చూడగానే అతని మొహం ప్రసన్నమయింది. విజయ అనుమా విస్తూనే అతనితో బయలుదేరింది. వార్డులోని రోగుల కేస్‌హిస్టరీస్ రోగలక్షణాలు, టెంపరేచర్, వారికిస్తున్న ఆహారం అన్నిట్నీ పరీ క్షించి బయటికివచ్చారు. అంతవరకూ ఇద్దరూ వక్కమాట కూడా మాట్లాడుకో లేదు. బయటికి రాగానే గోపీ,

"నే నిక వెళ్ళనా?" అన్నాడు.

అతని ముభావాన్ని చూసి విజయ కళ్ళలో నీరు తిరిగింది.

"వెళ్ళండి కావాలంటే"

"కావాలంటే వెళ్ళచ్చు, లేకపోతే?"

"మీ ఇష్టం."

"నే నెందు కుండాలి? నానుండి తప్పించు కోవటానికి మను షులు హూనాదాకా పారిపోతారు....ఓ విజయ్ డార్లింగ్, ఏడవకు. ఇక్కడ ఏడిస్తే నేనేమీ చెయ్యలేనుకదా! ఇదిగో కర్చీఫ్ తీసుకో"

"అక్కర్లేదు"

"అయితే నేనే కళ్ళు తుడుస్తాను" అంటూ ముందుకొచ్చాడు గోపీ. విజయ ఒక్కఅడుగు వెనక్కివేసి "ఊరుకోండి, మీరన్నంత పనీ చెయ్యగలరు" అంది.

"ఎలా ఊరుకోమంటావ్?" అంటూ ఆమె మెడలోని పగ డాల దండవేపు చూశా డతను.

విజయ నవ్వుతూ "మీ కెపుడూ నా దండమీదే కళ్ళు. రేపటి నుండి తీసేస్తాను దాన్ని" అంది.

"ఆ పని మాత్రం చెయ్యకు."

"నామీద కోపం పోయిందా?"

"ఉహుఁ, అంత సులభంగా పోదుమరి."

"మరేం చెయ్యమంటారు?"

"చెప్పి లాభంలేదు. నా క్కావలసినది దొరకదు."

"దూరంనుండి ఇచ్చేదయితే ఇస్తాను."

గోపీ నవ్వి "నెరజాణ" అన్నాడు.

"ఆ రోజు మీరు మాఇంటికి వచ్చినపుడు నే నెంత భయ
పడ్డానో తెలుసా?"

"ఏం చెయ్యను మరి? నిన్నుచూపి యుగా లయినట్టనిపి
చింది. ఇంకోక్షణంకూడా ఉండలే ననిపించింది. వెంటనే వచ్చే
శాను, తరువాత నా ధైర్యాన్ని తల్చుకుని నాకే ఆశ్చర్యం వేసింది.

"ఈ సంవత్సరం ఫరవాలే దనుకోండి. హౌస్ సర్జన్ ప
య్యాక వేరేచోట్లో ఉద్యోగం దొరికినపు డేం చేస్తారు?"

"అపుడు నా గర్ల్‌ని నావెంట తీసుకుని వెడతానుకదా?"

"నేనేం మీతో రాను."

"నువ్వేనేమిటి నా గర్ల్‌వి?"

అతని మాట విని విజయ మొహం ఎర్రబడింది.

"నాతో రావా నువ్వు?" గోపీ మృదువుగా అడిగాడు.

"మీతో ఎక్కడికయినా సరే రాగలను."

"మనిద్దరి కోర్స్ పూర్తయితే చాలు. ఇక మనల్నె
అడ్డుకోలేదు."

"నే నిక వెడతాను" అంటూ ఫుట్‌పాత్‌మీద నుంచుం
విజయ.

"వెళ్ళు నిన్నెవరు కట్టేశా రిపుడు?"

"మీరే" అని నవ్వి వెళ్ళబోయి ఆగిపోయింది విజయ.

"ఓ మాట...."

"ఏమిటి?....

"ఆ రోజు మీరు నా చెయ్యిచూపి ఏదో చెప్పారు?"

"దేన్నిగురించి?"

"అదే....'ఈ కాలేజీలోనే ఒకర్ని పెళ్ళిచేసుకుంటావు' అని
అది నిజంగా చెప్పారా, హాస్యానికి అన్నారా?"

గోపీ నవ్వుతూ "నిన్ను కాస్త ఏడిపిద్దామని చెప్పా నంతే
అదే నిజమవుతుందని అప్పు డనుకోలేదు."

"ఇప్పుడు మాత్రం నిజమయిందని ఎవరన్నారు? మీ మాటన
అబద్ధం చెయ్యటాని కోసమయినా...."

"ఊం, అంత ధైర్యముందా?"

"ఎందుకుండదు?"

"నిన్ను 'కిడ్నాప్'చేసి...." అని గోపీ వివరించబోయాడు. విజయ నవ్వి "అంత సాహసం చెయ్యకండి మహానుభావా" అంది.

"ఏం?"

"మీతో ఎలోప్ చెయ్యటానికి రెడీ నేను."

తాము నుంచున్నది నడిరోడ్డన్న సంగతి గుర్తు తెచ్చుకుని గోపీ దీర్ఘంగా నిట్టూర్చి "ఊం. వెళ్ళు, నువ్వున్నంతసేపూ నా కళ్ళు మండుతూవుంటాయి" అన్నాడు.

"ఇది మరీబావుంది. మీ కళ్ళకు ఇంపుచెయ్యాలని ఉదయం ఓ గంట అద్దముందు కూర్చున్నాను తెలుసా? మీరేమో ఇలా అంటున్నారు?"

"ఏం లాభం? కంటికి కనిపించేది నా చేతికి అందదే!"

విజయ కొంటెగా చూస్తూ అంది; "నన్ను అశరీరురా లనుకుంటున్నారా?"

"ఏమో నాకెలా తెలుస్తుంది? పరీక్షించటానికికూడా వదల్లేదు కదా నువ్వు!"

"సరి ఇలా మాట్లాడుతూ కూర్చుంటే దీనికి అంతే ఉండదు" అంటూ ముందుకు అడుగువేసింది విజయ.

* * *

శలవుల్లో పల్లెకు వెడదామా వద్దా అని ఆలోచిస్తోంది మీర. ఈమారు పల్లెకు వెళ్ళాలని మొదటిలా ఆదుర్దా లేదు. 'సరసి ఉంది కదా' అని నిశ్చింతంగా ఉన్నా, తాము సరసిల జీవన వాహినుల సంగమం ఎలా ఉందో చూడాలన్న కుతూహలంకూడా లేకపోలేదు. ఇలా అనుకుంటూ ఉండగా తామునుండి శలవు లివ్వగానే తప్పక రావలసిందని ఉత్తరం వచ్చింది. సరసి లేనపుడుకూడా అంత బలవంతం చేసి పిలవలే దతను.

ప్రాక్టికల్ పరీక్షలుకూడా అయిపోయాయి. రేపు ఊరికి వెడుతుందనగా ముందురోజు సాయంత్రం మీర, విజయ వాకింగ్‌కి వెడదా

మనుకున్నారు. మీర కొంచెం ఆలోచించి గోపీనికూడా రమ్మని ఆహ్వానించింది.

"అతను వచ్చేలాఉంటే నేను రాను" అంది విజయ.

"రాకు, నేను గోపీ ఇద్దరే వెడతాం."

"గోపీ వద్దు మీరా"

"ఎందుకమ్మా? మీ ఇద్దమధ్యా నే నుంటాననా? పోపీ నేను తప్పుకుంటానులే."

"మన మిద్దరమే వెడదాం. ఆయన వద్దు మొర్రో అని నేనంటూంటే!"

"గోపీ నా స్నేహితుడు. రమ్మన్నాను. నీ ఇష్టం." అంది మీర.

సాయంత్రం ముగ్గురూ బయలుదేరారు. మీరా, గోపీ ఏదో మాట్లాడుతున్నారు. విజయ మౌనంగా తలవంచుకుని గోపీ అడుగులు వెయ్యటాన్ని గమనిస్తూ నడుస్తోంది.

చాలాదూరం నడిచాక చెట్లకింద కూర్చున్నారు.

"రేపే ఊరికి వెడతారా మీరు?" గోపీ అడిగాడు.

"అవును, శలవుల్లో మీరెక్కడికి వెళ్ళరా?"

"ఉహుఁ. మిస్ విజయ పరాంజపె క్రితంసారి లాగానే ఈసారికూడా పూనా వెడతా రనుకుంటాను." కొంటెగా అన్నాడు గోపీ.

గడ్డిపరక నములుతున్న విజయ ఒక్కనిమిషం మౌనంగా ఉండి తరువాత చెప్పింది.

"మీరు చెప్పాచెయ్యకుండా ఇంటిమీదకు దాడిచేస్తే మరేం చెయ్యను? ఒకవేపునుండి మీరు, ఇంకోవేపునుండి నాన్న నా మీద దండెత్తితే నా గతేమిటి? అలాంటి సమయాల్లో పలాయనమంత్రం జపించక తప్పదు మరి."

"ఈసారి మటుకు అలా చెయ్యకండి, గోపీనాధ్. పోయిన సారి పూనా వెళ్ళమని సలహా ఇచ్చింది కూడా నేనే మీ ఇద్దరి కోర్స్ పూర్తయ్యేదాకా ఏ గొడవా లేవదియ్యకండి."

"తరువాతనయినా ఇల్లు రణరంగంకాక తప్పదనుకుంటా." గోపీ అనుమానిస్తూ అన్నాడు.

"మీ వాళ్ళు చాలా పాతకాలపువారా?"

"ఆఁ. అందులో మరాఠీ అమ్మాయిని చేసుకుంటా నంటే అసలు ఒప్పుకోరు. నాకు బాగా తెలుసు. నా చదువెలాగూ పూర్తయ్యింది. ఎక్కడయినా సరైనచోట ఉద్యోగం దొరికేవరకూ హౌస్ సర్జన్‌గా ఉంటాను. విజయ ఇక్కడే ఉంటుందికదా. అదొక్క తృప్తి వుంటుంది నాకు."

"గోపీ ఎలా చెయ్యమంటే అలా చేస్తాను. చదువు మానెయ్యమంటే చదువు మానేస్తాను."

"చదువు మానేస్తావా? నాలుగున్నరేళ్ళ చదువు వ్యర్థమయిపోదూ?"

"అది సరికాదు విజయ్. నువ్వు చదువు పూర్తిచెయ్యి. ఆ తరువాత ఇద్దరం డాక్టర్లయి ప్రాక్టీసు పెడదాం."

"నా కేమిటో ఏమీ అక్కర్లే దనిపిస్తోంది."

"ఒక్క గోపీతప్ప...." మీర రెచ్చగొట్టింది.

"కెరియర్ గర్ల్ చెయ్యికాదని అపుడే చెప్పానా లేదా? నాలుగు తగిలించి అయినా చదివిస్తాను. తెలుసా?"

"గోపీ మాటలోఅన్నా కొడతానన్నారుకదా! మీరు చేస్తున్న అతిముద్దువల్ల విజయకు రెక్కలొచ్చేశాయి."

"ముద్దా? లేదే!" అంటూ గోపీ విజయవేపు చూశాడు. ఆ నిమిషంలో మీర అక్కడున్న విషయమే మర్చిపోయారు.

"ఈ మారుమాత్రం క్రితం మారు చేసినట్టు చేయకండి."

"ఏమన్నారు?" అంటూ మీరవేపు తిరిగాడు గోపీ.

"క్రితం సారిలాగా వాళ్ళింటికి వెళ్ళకండి అంటున్నా. వాళ్ళ నాన్నగారి దృష్టిలో పడకండి."

"కాలేజీ తెరిచేదాకా నా గతేమిటి?"

"మీకూ కాలేజికి ఏం సంబంధం?"

"హౌస్ సర్జన్‌గా వుంటే విజయను చూడటానికి ఇబ్బ
లేదు కదా! కాలేజీ తెరిచేదాకా...."

"పోస్ట్‌మ్యాన్ ఉన్నాడు కదా...." విజయ పరిహారం సూ
చింది.

"ఒక్క ఊళ్లోనే ఉండి ఉత్తరం రాసుకోవటమా?" పీ
అంది.

"ఒక్క కాలేజీలోనే చదువుకుంటూ ఉత్తరాలు రాసుకోవ
లేదూ?" గోపీ అర్థగర్భితంగా నవ్వాడు.

ఆకాశంలో అక్కడక్కడా నక్షత్రాలు మెరుస్తున్నాయి. పీ
ఇక వెడదామని లేచింది. మీరను హాస్టల్‌దగ్గర విడిచి, గ
విజయ బయలుదేరారు. మీర—

"విజయను జాగ్రత్తగా ఇంటిదగ్గర దిగబెట్టాలి" అ
గోపీతో.

"అహఁ. అదేంమాట! విజయ్‌నుండి అపాయం న
గానీ...."

"ఏం, నేను తినేస్తానా మిమ్మల్ని?"

"పదం డిక-షైమవుతోంది" అంటూ హెచ్చరించింది మీ

* * *

మీరకోసం శాము స్వయంగా స్టేషనుకు వచ్చాడు—ఇం
భార్య వచ్చినా తనను మర్చిపోలేదని చూపించటానికోసం వచ్చా

బండిలో కూర్చున్నాక శాము అడిగాడు:

"పరీక్షలు ఎలా రాశావ్?"

"బాగానే రాశాను. సరసి ఎలా ఉంది?"

"నువ్వే చూసి చెబుదూగానీ"

ఇల్లు చేరేదాకా శాము, మీర పరీక్షలగురించి మాట్లాడుకున్నా
బండి ఇంటిముందు ఆగేటప్పటికి సరసి గుమ్మంలో నుంచుంది. పీ
దూరంనుండే సరసిని చూసింది.

మనసుకు కలిగిన తృప్తి ఆనందాలవల్ల సరసి కొద్దిగా ఒ
చేసింది. మొదటి చామనచాయ కొంచెం తేటపడింది. పెళ్ళయా

కట్టూ బొట్టుల్లో మీరను అనుకరించటానికి ప్రయత్నించినందువల్ల ఎంతో మెరుగయింది, ఆమెకు లభించిన తృప్తివల్ల మొహంలోకి కాంతి వచ్చింది.

"సరసి ఎలా ఉందిపుడు?"

"చాలా బావుంది. ఇంత మార్పుంటుందని ఊహించలేదు."

ఇంట్లో చాలామార్పు వచ్చినట్టనిపించింది మీరకు. తను కొద్ది రోజులు మాత్రమే అక్కడవుండి వెళ్ళటానికి వచ్చిన అతిథి అన్న భావన కలిగింది. వెంకమ్మగారు ఎప్పటి ఆదరభావంతోనే,

"రా తల్లి, నువ్వువస్తే ఇల్లు కళకళలాడుతుంది" అంటూ ఆహ్వానించారు.

భోజనాలయ్యాక మీర తన గదిలోకి వెళ్ళింది. ఇంతకుముందు ఆమెదిగా ఉన్న గది ఇప్పుడు శాము, సరసిల దయింది. మంచం మీద తనపక్క పర్చుకుంటున్నపుడు వెంకమ్మగారు-

"మధ్యాహ్నం ఏం టిఫిన్ చెయ్యమంటావు?"

మీర నవ్వి "ఇంతవరకూ నేనే ఉన్నానటండి?" అంది.

"నువ్వు లేనప్పుడు సరే అనుకో, ఇంటి యజమానురాలివి నువ్వేది చెపితే అది చేస్తాను."

"అరటికాయలుంటే బజ్జీలు చెయ్యండి."

వెంకమ్మగారు వెళ్ళి పోయారు. మీర 'మూలాన్ రోజ్' పట్టుకుని పడుకుంది. తలుపుమీద ఎవరో కొడుతున్న చప్పుడయితే లేచివెళ్ళి తలుపుతీసింది. శాము లోపలికొచ్చాడు.

"భోంచెయ్యగానే పడుకునే అలవాటు వదలేశా రేమిటి?"

"లేదు."

"మరి...."

"పడుకుందామనే వచ్చాను."

"ఓ" అంది మీర. ఏదో చెబుదామని నాలుకదాకా వచ్చిన మాటను మింగివేసింది.

ఆమె ఆశ్చర్యాన్ని గమనించనివాడిలా, శామువెళ్ళి ఆమె పక్కమీద పడుకున్నాడు.

"సరసి ఏం చేస్తోంది?"

"ఏమో! నాకేం తెలుసు? నేను చూడలేదు."

మీర కుర్చీమీద కూర్చుని చదువుకోవటానికి ప్రయత్నించింది. శాము కళ్ళు మూసుకుని నిద్రపోవటానికి ప్రయత్నిస్తున్నాడు.

తను ఊరికి రాగానే సరసి నలా వదిలేసి తన దగ్గరకు పరిగెత్తుకు వస్తే సరసి ఏమనుకుంటుంది? శాము చేస్తున్నది మంచిపని కాదు.

మీర లేచివెళ్ళి "నాకు నిద్దరొస్తోంది" అంది.

"నిద్రపో. ఎవరొద్దన్నారు?"

"మీరిక్కడుంటే నాకు నిద్రపట్టదు. మీరు మీ గదికి వెడతారా?...."

"ఇదే నా గది." శాము మొండిగా జవాబిచ్చాడు.

"వెంటనే వెళ్ళకపోయారంటే మిమ్మల్ని బయటకు గెంటేస్తాను." మీర కోపంగా అంది.

"ఏదీ చూద్దాం. గెంటెయ్."

"మీర శాము భుజం పట్టుకుని లాగింది. శాము నవ్వుతూ కుడిచేతితో ఆమెను దగ్గరకు లాక్కుని,

"చేతనయితే, అంత బలముంటే విడిపించుకో" అన్నాడు.

సరసికీ, మీరకూ ఎంత తేడా? శాము గీచిన గీటు దాటేది కాదు సరసి. నమ్రంగా, వినయంగా శాము చెప్పిన పని చేసుకుపోయేది. సరసికి స్వంత అభిప్రాయాలంటూ ఉన్నాయా అసలు అనుకునేవాడు శాము. శాము ఇష్టమే ఆమె ఇష్టం. ఆమె యాంత్రిక చలన వలనాలు, చెప్పినట్టు వినే స్వభావం ఎన్నో మార్లు శాముకు చిరాకు కలిగించేవి.

"సరసీ, నీకిది ఇష్టమేనా?"

"ఊఁ."

"అక్కడికి వెళ్ళకు."

"అలాగే."

"ఈ చీర బావుంది కదూ?"

"అవును."

సరసి తను చెప్పినదానికంతా డూడూ బసవన్నలా తల ఊపు తుంటే శాముకు మీర గుర్తుకొచ్చేది. శాముతో తన అభిప్రాయాలు కలవనప్పుడు మీర శాముతో దెబ్బలాటకు దిగేది. మీరతో దెబ్బలాడి ఆమెకు కోపం తెప్పించటం శాముకు అత్యంత ప్రియమైన విషయం. ఆమె ప్రతిఘటన ఎక్కువయినప్పుడల్లా అతని ఆనందంకూడా ఎక్కువయ్యేది. మీర కోపం తారస్థాయినందుకున్నప్పుడు ఆమెను తనవశం చేసుకుని ఆమె మీద తన అధికారాన్ని స్థాపించేవారు. ఒక్కోసారి ఆమె కోపగించుకున్నట్లల్లా తను దైన్యంతో ఆమె అనుగ్రహాన్ని సంపాదించేవాడు. ప్రణయరంగంలో గెల్చినా ఓడినా శాము సుఖి.

సరసితో యుద్ధప్రమేయమే లేదు. ఆమె సంపూర్ణ శరణాగతురాలు. ప్రతీ పనిలోనూ శాముకు క్రీతదాసి. మీర తెరలు తెరలుగా తేలివచ్చే సముద్రమైతే సరసి శాంతంగా ప్రవహించే నది. శాముది సాహస ప్రకృతి. తుఫానులో విజృంభిస్తున్న సముద్రంలోకి దూకి అలలను చీల్చి వాటి మీద విజయాన్ని సాధించటంలోనే అతనికి ఆనందం లభించేది. శాంతంగా ఉన్న నదిలో ఈతకొట్టటంలో అతనికేవిధమైన రోమాంచనమూ కలిగేది కాదు.

ఈసారికూడా అలాగే అయింది. శాము చేతిలో ఓడిపోయినది మీర. అప్పుడు ఎనలేని తృప్తి కలిగింది శాముకు.

బిడ్డను ఏమార్చి బయటకు వెళ్ళిన తల్లి ఇంటికి రాగానే ఆమె వెంట వెంటనే తిరిగే బిడ్డలాగా, శాము మీరతోనే కాలం గడుపుతున్నాడు. ఒక్క నిమిషం ఆమె కనిపించకపోయేసరికి 'మీరా' అని కేకలు పెడుతూ గొడవ చేసేసేవాడు.

ఓ రోజున మీర కావాలనే శాముకు కనిపించకుండా అవధాన్ల వారింటికి వెళ్ళింది. సరసి తాంబూలం తెచ్చిపెట్టింది భర్తకు.

"మీర ఏది? కనిపించటంలేదే!" అన్నాడు శాము.

చెళ్ళున చెంపదెబ్బ కొట్టినట్టయింది సరసికి. ఆమె కోప మాత్సర్యాలను అణచుకుంటూ,

"నేను చూడలేదు" అంది. శాము ఊరుకున్నాడు. సరసి మళ్ళీ అడిగింది.

"చిలకలు చుట్టియివ్వనా?"

"వద్దులే."

సరసికి చిలకలు చుట్టియివ్వటం ఇష్టం లేకపోతే శాము బల వంతం చేసేవాడేమో!

భర్తమాట విని సరసి రెచ్చిపోయింది. ప్రతీ విషయంలోనూ తనంటే ఇంత తాత్సారమా? శలవులకని మీర వచ్చినప్పటినుండి ఆమెతోనే కాలం గడుపుతున్నాడు. మీర లేనపుడు మాత్రం తను కావాలి. ఆమె వస్తే ఇహ తన్ను కన్నెత్తికూడా చూడడు! ఇదేం న్యాయం? తన నిలా అవమానించాలన్న ఉద్దేశంతోనే ఈ యింటికి తెచ్చుకున్నారేమో. ఈ భాగ్యానికి తను ఇక్కడెందుకు? పుట్టింట్లో పట్టెడు మెతుకులే కరువయ్యాయా?

"నేను చిలకలు చుట్టియిస్తే మీకు నచ్చదా?" ఆమె మాటల్లో వ్యంగ్యంగా తొంగి చూపింది.

శాము తలెత్తి సరసివేపు చూశాడు. ఆమె అతన్ని ఎదిరించటం ఇదే మొదటిసారి. ఆమె మొహంలో మాత్సర్యం స్పష్టంగా కనిపిస్తోంది. శాముకు ఆమెను మరింత ఏడిపించా లనిపించింది.

"అవును, నువ్వు చిలకలు చుట్టిస్తే నాకు నచ్చదు."

"మీర చుట్టిస్తే?"

"వాటి రుచే వేరు."

"మరి సంవత్సరమంతా ఆవిడే ఉంటారేమిటి?"

"లేదు. అందుకనే, వచ్చినప్పుడన్నా వీలయినంత సేవ చేయించుకుందామని...." శాము నవ్వుతూనే అన్నాడు.

"ఆవిడ లేనపుడు నేను కావా లన్నమాట. ఈ భాగ్యానికి నన్నెందుకు పెళ్ళి చేసుకున్నారు?" అని రుసరుస లాడుతూ సరసి లోపలికి వెళ్ళిపోయింది. మీర వచ్చినప్పటినుండి ఆమెకూ తనకూ మధ్య అతను చూపిస్తున్న స్నేహ విశ్వాసాలలోని భేదభావాన్ని చూపి

రోపిపోయి అన్న మాట లవి. ఇంట్లో అందరికీ తనంటే నికృష్ట భావమే అన్నమాట ఆమె మనసులో నాటుకుంది.

వెంకమ్మగారు అన్నారు. "నువ్వు ఇంటి యజమానురాలివి. నువ్వేది చెపితే అదే చేస్తాను" అని. అలా అన్నది తన్ను గురించి కాదు, మీర నుద్దేశించి. ఇంట్లోని నౌకర్లకంతా మీర "అమ్మగారు" తను కేవలం "సరసమ్మగారు" మాత్రమే. ఇక శాము సంగతి చెప్ప నక్కర్లేదు. అతని కెప్పుడూ మీర నామస్మరణే! ఇంట్లో అందరూ ఆమెను మెప్పించాలనీ, ఆమె నోటివెంట ఓ మంచిమాట వినాలనీ పాటుపడేవారే! కాని ఆమెకు మాత్రం దాని లక్ష్యమే లేదు. తను రాణీ మిగతావాళ్ళంతా తన సుఖసంతోషాల కోసం శ్రమించే నౌకర్లు అన్నట్టు ఠీవిగా మెలగుతుంది. ఇదంతా ఎలా భరించటం? ఊహుం, ఇక దీన్నంతా సహించలేదు తను.

సరసి కళ్ళలో నీరు ప్రవహించలేదు. దానికి మారుగా ఆమె మొహంలో ఒక విధమయిన దృఢనిశ్చయం చోటు చేసుకుంది.

మీర మైసూర్లో చదువుకుంటూండగా ఇంట్లో ఎంత హాయిగా వుండేవారు! ఆమె రావటంవల్లనే ఈ అశాంతి. ఎప్పటికి శలవు లయి పోతాయో గదా అనుకుంది సరసి.

అవధాన్ల వారింటినుండి మీర ఇంటికి తిరిగి వచ్చేటప్పటికి ఇంట్లో ఆమె నిరీక్షించిన వాతావరణం కనిపించలేదు.

శాము ఉయ్యాల మీద కూర్చుని తమలపాకులు వేసుకుంటు న్నాడు. సరసి గదిలో తలుపులు వేసుకుని పడుకుంది.

మీర రాగానే శాము అడిగాడు:

"ఎక్కడికి వెళ్ళావ్ మీరా?"

"అవధాన్ల వారింటికి. అబ్బబ్బ, ఒక్క నిమిషం కనిపించక పోతే ముసలిమొగుడిలా తనిఖీ చేస్తారేం?"

"ఈ ఎండలో ఎందుకు వెళ్ళావ్?"

"లేకపోతే మీ ముందు కూర్చుని కబుర్లు చెప్పాలా? ఆ పనికి సరసి ఉందిగా!"

"సరసి రానేలేదు."

"ఏది మరి?"

"పడుకుందేమో! ఓ మాట విను."

"మీర గదిలోకి వెళ్ళి దభీమని తలుపు వేసుకుంది. లోపలి నుండి ఏదో హిందీ పాట కూనిరాగం తీస్తుండటం శాముకు విని పిస్తూనే ఉంది.

మరుసటి రోజునుండి సరసి తన అసమాధానాన్ని స్పష్టంగా వ్యక్తం చేయసాగింది. శామునుండి నౌకర్లదాకా అందరూ తన్ని తక్కువగా చూస్తున్నారన్న భావాన్ని ఆమె భరించలేక పోయింది. పెళ్ళయిన కొత్తలో ఈ విధమయిన తేడాని అంత పట్టించుకోలేదు సరసి. అదీకాక పెళ్ళయిన కొద్దిరోజులకే మీర మైసూరుకి వెళ్ళ టంతో ఈ అంతరాన్ని ఆమె గుర్తించే అవకాశం లేకపోయింది. ఇప్పుడు ఈ భేదభావం ఆమెను అమితంగా బాధపెట్టసాగింది. ఇంత వరకూ మీరతో స్నేహంగా ఉన్న సరసి ఇప్పుడు మీరను తప్పించుకు తిరగసాగింది. అదీకాక శాము మొదట తనను కాదని మీరను చేసు కున్నపుడే ఆమెకు మీరమీద అసూయ కలిగింది. అలా కాకుండా శాము మొదట తననే పెళ్ళిచేసుకుని ఉంటే తను ఈ ఇంటికి ఏకైక సామ్రాజ్ఞిగా ఉండగలిగేది. సవతిపోరు లేకుండా శాము హృదయానికి రాణిగా ఉండేది.

సరసి ప్రవర్తనలో వచ్చిన మార్పును మొదట గమనించింది మీరే.

ఓ రోజు వంట కాగానే వెంకమ్మగారు అందర్నీ భోజనాలకు లేపారు. శాము, మీర వచ్చినా సరసి రాలేదు. మీర వెళ్ళి పిలిచింది.

"నా కాకలిగా లేదు. మీరు భోంచెయ్యండి. నేను మెల్లిగా తింటాను" అంది సరసి.

"కొద్దిగానే తిందూగానిరా!"

"ఉహుఁ" అంది సరసి.

మీర చేసేదిలేక వెళ్ళి శాముతో "ఆకల్లేదట. రానంటోంది" అంది.

"ఆకలయినప్పుడే తింటుంది" అన్నాడు శాము.

"అలా కాదు. మీరు వెళ్ళి పిలవండి. వస్తుందేమో!"

"అక్షతలుకూడా తీసుకు వెళ్ళమంటావా?" అని నవ్వులాటగా తేల్చివేశాడు శాము.

భర్తే వచ్చి తన్ను రమ్మని బ్రతిమలాడుతాడని నిరీక్షించిన సరసికి ఆశాభంగమయింది. ఇంతకుముం దోసారి ఆకల్లేదన్నపుడు "అందరం కలిసే కూర్చుందా"మనలేదూ!

ఆమె తలమీ దేమయినా కిరీటం ఉందా?

ఆ రోజునుండి సరసి అప్పుడప్పుడూ ఏదో కారణం చెప్పి అందరితో భోజనానికి, టిఫిన్‌కి రావటం తప్పించుకునేది.

ఇలాంటి పరిస్థితుల్లో అనుకోకుండా జరిగిన ఓ సంఘటనవల్ల ఆమె మనసు విరిగిపోయింది. విషయం చాలా చిన్నదే!

ఆ రోజు సరసి దేవాలయానికి వెళ్ళి తిరిగి వచ్చేసరికి బోరడు కాంపౌండ్‌లోని 'నిశారాణి' పొదను వేళ్ళ సమేతంగా పెళ్ళగించేస్తున్నాడు. అది చూసి ఆమెకు ఒళ్ళు మండిపోయింది.

సరసికి 'నిశారాణి' పూలవాసనంటే చాలా యిష్టం. అందు కోసమే ప్రత్యేకంగా తను వచ్చేటపుడు పుట్టింటినుండి 'నిశారాణి' తెప్పించి కాంపౌండ్‌లో వేయించింది. రాత్రి గాలి వీచినపుడల్లా పూల ఘాటయిన వాసన ఆమె గదిలోకి తేలివచ్చేది.

ఈ సంగతి తెలీని మీర గుబురుగా పెరిగిన పొదను చూసి—

"బోరా, అదంతా శుభ్రంగా తీసిపారెయ్యి. ఆ వాసనకు పాములు వచ్చేస్తాయి" అంది.

బోరడు అమ్మగారి ఆజ్ఞను శిరసావహించాడు.

సరసి కళ్ళెఱ్ఱచేసి కోపంగా "ఎందు కా పొద తీసేస్తున్నావ్? బుద్ధుందా అసలు?" అంది.

"అమ్మగారు తీసేమన్నారు సరసమ్మగోరూ!"

"నే చెప్పలేదూ తియ్యకూడదని?"

"మరి పెద్దమ్మగారు తీసెయ్యమన్నారుగందా" అంటూ బోరడు పొదను వేళ్ళసమేతంగా పీకి బయట పారేశాడు.

నిశారాణి సరసికి చాలా ఇష్టమనిగాని, వాళ్ళ ఊరినుండి తెచ్చి

వేసుకుందన్న సంగతిగాని తెలీని మీర అడవిలా పెరుగుతున్న పొదను చూసి అది పాములకు ఆశ్రయ మవుతుందేమోనన్న భయంతో బోరడితో పొద కత్తిరించి వెయ్యమని చెప్పింది.

కాని సరసి దాన్ని పొరపాటుగా అర్థం చేసుకుంది. మీర తన్ని అవమానించాలనే ఈ పనిచేసిం దని భావించింది. చెట్టు పోయిందన్న బాధతో ఆమెకు ఏడుపొచ్చింది.

శాము రాత్రి ఇంటికి వచ్చేసరికి ఏడ్చిఏడ్చి ఆమె కళ్ళు ఎర్రగా వాచిపోయి ఉన్నాయి. మీర ఎంత పలకరించినా సరసి జవాబు చెప్ప లేదు. శాము రాగానే మీర—

"సరసి ఎందుకో ఏడుస్తోంది. అడిగితే చెప్పటంలేదు" అని చెప్పింది.

శాము వెళ్ళి సరసిని పలకరించాడు.

"ఏడుస్తున్నా వెందుకు?"

"బోరడు నిశారాణినంతా పీకి పారేశాడు. నేను ఎంతో ఆశ పడి ఊరినుండి తెప్పించి వేశాను."

"వద్దని చెప్పలేక పోయావా?"

"నేను చెప్పాను. కాని...." సరసి ఆగిపోయింది.

"నువ్వు చెప్పినా ఎందు కలా చేశాడు?"

"మీర తీసెయ్యమన్నారట."

శాము అప్రతిభుడయి నిల్చుండి పోయాడు. మీరా, సరసి స్నేహంగా వున్నారనే అత నింతవరకూ అనుకుంటున్నాడు. ఇంత చిన్న విషయానికి ఏడవాలా? క్షణంలో తేరుకుని శాము—

"నువ్వు వేయించావని మీరకు తెలుసుండదు. తెలిస్తే అలా తీయించేది కాదు."

"ఏమో ఎవరికి తెలుసు?"

"సరసీ!" శాము గట్టిగా కేకపెట్టాడు.

"అవును. మీకు ఆమె ఏం చేసినా తప్పుగా అనిపించదు. నేనో మాట అంటే తప్పుగా కనిపిస్తుంది."

"మీరను ఇక్కడికే పిలిచి అడగనా?"

"మీ ఎదుట చేసినతప్పు వప్పుకుంటారా ఆవిడ? వప్పుకున్నా ఇహ నేం లాభం? సెట్టెలాగా పోనేపోయింది."

సరసి మాట లక్ష్యం పెట్టకుండా, శాము "మీరా!...." అని పిలిచాడు.

ఏ సంగతీ తెలీని మీర లోపలికి అడుగుపెట్టింది.

"విశారాణి నెందుకు కొట్టించావ్ మీరా?"

"బాగా గుబురుగా పెరిగింది. పాములు చేరతాయని...."

"సరసి చాలా ఇష్టపడి దాన్ని వాళ్ళ ఊరినుండి తెచ్చి వేసు కుందట...."

"అలాగా, నా కా సంగతి తెలియదే! పోనీ వేరే తెప్పించి వేద్దాం. బోరడితో చెబితే రేపే తెచ్చివేస్తాడు."

"చేసేది చేసేసి రేపే తెప్పిస్తారట వేరే." సరసి వ్యంగ్యంగా అంది.

మీర చకితురా లయింది. ఆమెకు సరసిపట్ల స్నేహం లేక పోయినా తిరస్కారం మాత్రం లేదు. ఆమెను పెద్దగా పట్టించుకో కుండా ఉండిపోయేది మీర. సరసికూడా ఇదివరకూ తన అసూయను పైకెన్నడూ చూపలేదు. లోలోపలనే రాజుకుంటున్న మాత్సర్యాగ్ని ఇవాళ భగ్గుమన్నది.

"నేను కావాలనే ఈ పనిచేశానని అనుకుంటున్నావా?"

సరసి మీర మాటకు బదులు చెప్పలేదు. శాము ఇద్దరిమధ్యా మూగవాడిలా నిలబడ్డాడు. సరసి కావాలనే యీ ప్రసంగాన్ని పెంచు తోందని అతనికి అర్థమయింది.

"నమ్మితే నమ్ము. లేకపోతే లేదు. నేను నీ కిష్టమని తెలియక అలా చేశాను. నా తప్పు మన్నించు" అని అక్కడి నుండి వెళ్ళి పోయింది మీర. ఆమె కళ్ళలోని నీరు శాముదృష్టి తప్పించుకోలేదు.

ఇరవయి రెండు, ఇరవయి మూడేళ్ళయినా పెళ్ళికాక పల్లె టూళ్ళో మగ్గుతున్న సరసిని, వంశాన్ని ఉద్ధరించటం కోసం తెచ్చి పెళ్ళి చేసింది మీర. దానికి సరసి ఇస్తున్న ప్రతిఫలం ఇదేనా?....

స్వార్థాన్ని మరిచి తనకు మళ్ళీ పెళ్ళి చేసినందుకు ఆమెకు దొరికిన బహుమానం ఎటువంటిది?

మధ్యాహ్నం నుండి పనిచేసి అలసివచ్చిన శాముకు బాగా ఆకలిగా వుంది. అలసట, ఆకలి కోపాలతో శాము ఒళ్ళు మరిచి పోయాడు. ముందుకు ఒక్క అడుగువేసి ఆమె చెంపమీద చెళ్ళుమని ఓ దెబ్బవేసి—

"పెద్దాచిన్నా ఉండక్కర్లా? నోటికి ఎంత మాటొస్తే అంత మాటా అనెయ్యటమేనా? మీర మంచిమనసు వల్లనే నువ్వీనాడు ఈ ఇంట్లో వున్నది గుర్తుంచుకో" అని గద్దించి బయటకు వెళ్ళిపోయాడు. సరసి భోజనం కూడా చెయ్యకుండా ఏడుస్తూ పడుకుంది.

ఆఖరికి శాముకూడా మీర పక్షాన్నే వహించాడన్న ఉక్రోశంతో ఆమె ఉన్మత్తురాలయింది.

శాము సరసిని కొట్టాడని తెలిసి మీర శాముతో దెబ్బలాడింది.

"సిగ్గులేదూ మీకు? ఆడదాని మీద చెయ్యి చేసుకుంటారా?"

కోపంలో శాము సరసిమీద చెయ్యి చేసుకున్నా, ఆ తరువాత అతనికి పశ్చాత్తాపం కలిగింది. మీర తనను మందలించినపుడు దీనంగా,

"నేనేం చెయ్యను మీరా? నీ మీ దెపుడయినా చెయ్యి చేసుకున్నానా? సరసిని కొట్టకుండా వుండలేకపోయాను అంతే."

"మీరెన్ని చెప్పినా మీరు చేసింది తప్పే!"

"నిజమే నాది తప్పే!"

"ఆమాట సరసితో చెప్పి ఆమెచేత అన్నం తినిపిస్తేనే మీతో మాట్లాడుతాను...."

"లేకపోతే....?"

"లేకపోతే వెంటనే మైసూరికి వెళ్ళిపోతాను."

"మీరా....!"

"నేను పది లెక్క పెడతాను. అంతలో మీరామె క్షమ పొందాలి."

"మీరా....!!"

"ఒకటి....రెండు....మూడు...."

శాము ఎవరో బలవంతంగా తోస్తున్నవాడిలా సరసి గదిలోకి అడుగు పెట్టాడు.

సరసి వెక్కి-వెక్కి ఏడుస్తోంది. శాము మంచంమీద కూర్చుని మృదువుగా "సరసీ!" అన్నాడు. ఆమె తలెత్తి చూడలేదు. శాము ఆమె భుజం పట్టి తనవేపుకు తిప్పుకుంటూ—

"సరసీ, నాది తప్పే! లే అన్నం తిను" అన్నాడు.

తన గడ్డాన్ని పట్టుకున్న అతని చేతిని విసిరికొట్టి సరసి—

"నే నుంటేనేం, చస్తేనేం? మీరూ, మీ మీరా సుఖంగా ఉండండి" అంది. మీరపేరు వినగానే తోక తొక్కిన త్రాచులా, ఆమెను వదిలిపెట్టి పైకి లేచాడు శాము.

"అనవసరంగా ఆమె పేరెందుకెత్తుతావ్?"

"మీ కామె సర్వగుణ సంపన్నురాలు."

"అవును."

"మీ రామెను నెత్తికెక్కించుకుని పూజించినా ఆవిడ మిమ్మల్ని వదిలి చదవటానికి వెడుతుందేం! మొగుణ్ణి వదిలివెళ్ళే మనిషి మీకు సర్వగుణ సంపన్నురాలు."

"సరసీ, నోర్ముయ్."

"ఉన్నమాటంటే ఉలు కెందుకు?"

"సరసీ, నేనిపుడు క్షమించమని అడిగింది మీర మాటకోసమే! మళ్ళీ నన్ను రెచ్చగొట్టి మళ్ళీ దెబ్బలు తినకు. అన్నానికి లేచిరా."

"నా కక్కర్లేదు. మీరు తినండి."

మాటకు మాట అప్పజెప్పుతున్న సరసిని చూసి ఒక్క-క్షణం నివ్వెరపోయాడు శాము. వెంటనే రౌద్రంగా—

"వస్తావా. లేదా?" అన్నాడు.

"ఉహుఁ" అంది సరసి మొండిగా.

శాము మళ్ళీ నాలుగు అంటించాడు. సరసి రాయిలా నుంచుంది.

మీర పరుగెత్తుకువచ్చి ఇద్దరిమధ్యా నిల్చుని శాముచేతిని గట్టిగా పట్టుకుంది.

"ఆమెను కొట్టారంటే నామీద ఒట్టే"

"కొట్టించేసి ఏమీ తెలియనివారిలా రాకండి" అంది సరసి

'పిచ్చివాడి పిచ్చి కుదర్చవచ్చును కాని మూర్ఖులతో వాదించ లేం' అనుకుంది మీర.

"పద మీర! సామెత వినలేదూ, మూర్ఖులతో సావాసంకన్నా పండితులతో సంవాదం మేలని? పద" అంటూ శాము మీరను చెయ్యిపట్టి లాక్కుని బయటికి వెళ్ళిపోయాడు.

"అవును. నేను మూర్ఖురాల్నే. ఆమె మహా పండితురాలు. ఆవిడతోనే సంసారం చెయ్యండి" అంటూ దభీమని తలుపు వేసుకుంది సరసి.

ఆరోజు సరసి భోంచెయ్యలేదు. వెంకమ్మగారు ఎంత బతిమాలినా లాభం లేకపోయింది.

"గది తలుపులన్నా తీయించండి. మనమీద కోపంతో ఏం చేసుకుంటుందో?"

"పీడా వదిలిపోతుంది. రెండో పెళ్ళి వద్దుమొర్రో అని మొత్తుకుంటే విన్నావా? ఆ శనిని నాకు ముడేసేదాకా నిద్రపట్ట లేదు నీకు. ఇప్పుడు అనుభవించు" అని మీరమీదనే ఎగిరాడు శాము.

భర్తకు మరోపెళ్ళి చేసినంతమాత్రాన ఇటువంటి పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందని మీర కల్లోకూడా అనుకోలేదు. సవతులయినంతమాత్రాన అస్తమానం దెబ్బలాడుకోవాలా? అక్క చెల్లెళ్ళలా కలసి మెలసి కాపురం చెయ్యటానికి వీలుండదా?

మీర ఎన్నోవిధాల ఆలోచించి ఈపని చేసింది. కాని ఇప్పుడు జరుగుతున్న దేమిటి?

ఒకటి రెండురోజులు ఇంట్లో అశాంతి తాండవమాడింది. ఆ వాతావరణంలో మార్పుతేవటానికి సరసి కొంచెంకూడా ప్రయత్నించలేదు. కాని శాము, మీర ఎంతో ప్రయత్నంచేసి సరసిని మామూలుగా పలకరించేవారు.

సరసికి శాముమీద ఏమాత్రం కోపంలేదు. మీరవల్లనే అతను మొదట తన్ను పెళ్ళిచేసుకోలేదు. ఇప్పుడూ ఆమెవల్లనే తనను చిన్న

చూపు చూస్తున్నాడని దృఢంగా నమ్మింది. ఆ కారణంచేతనే సరపి భర్తతో రాజీపడినా మీరతో మాత్రం మొదటిలా మాట్లాటం మానే పింది.

ఈ పరిస్థితులవల్ల శలవు లెప్పుడయిపోతాయా అని ఎదురు చూడసాగింది మీర. శలవులంతా ముళ్ళమీదున్నట్టుగా గడిపి కాలేజి తెరవటాని కింకా రెండురోజు లుండగానే మైసూరు వెళ్ళిపోయింది.

ఆఖరి సంవత్సరం పరీక్షలవటంవల్ల మీర ప్రయత్న పూర్వకంగా చికాకులన్నిటినీ మరిచి చదువులో మనసును లీనం చేపింది. హాస్పిటల్‌లో హౌస్‌సర్జన్‌గా వున్న గోపీ విజయను హెచ్చరించాడు.

"ఇంకో సంవత్సరం శ్రద్ధగా చదివి పాసవాలి విజయా. ఆ తరువాత మనం యుద్ధభేరి మ్రోగించాల్సి ఉంటుంది."

విజయ గోపీ మాటకోసం చదువుతోందే గాని మొదటి ఉత్సాహం, ఆసక్తి లేనేలేదు.

"చదవక తప్పదంటారా?" అనడిగింది విజయ.

"అలా అడిగితే ఏం చెప్పగలను? ఇన్నిరోజులూ కాలేజీలో చదివినదంతా వృథా అవదా? నువ్వు మెడిసన్ పూర్తి చెయ్యక పోతే...."

"ఏ చేస్తారేమిటి?"

"నాకు పిల్లనిస్తామని బోలెడంతమంది వస్తున్నారు. వాళ్ళలో ఎవరో ఒకర్నిచూసి పెళ్ళిచేసుకుంటాను" అని బెదిరించాడు గోపీ.

"అలాగా? చాలా సంతోషమండి. తమరి పెళ్ళెప్పుడట?" అనేది విజయ కొంచెంకూడా తొణక్కుండా.

"నీ పరీక్షలయ్యాక."

"నా పరీక్షలతో మీ పెళ్ళెందుకు ముడిపెడతారు?"

"సరే, నీతో సరసమాడుతూ కూర్చోటానికి టైములేదు నాకు."

"మరెవరితో సరసమాడటానికి టైముంది? ఆ నర్స్...?"

"వద్దు విజయ్. అనవసరంగా నన్ను రెచ్చగొట్టకు."

"ఏం చేస్తారేమిటి?"

"చుట్టూ ఎవరున్నారని చూడకుండా నిన్ను పట్టుకుని ముద్దు పెట్టేసుకుంటాను."

"ఆఁ. అపండిక. అన్నట్టు మీ నాన్నగారితో ఏం చెప్పావు?"

"నేనిప్పట్లో పెళ్ళిచేసుకోనని చెప్పాను. ఉద్యోగం దొరికేదాకా పెళ్ళిసంగతి ఎత్తకండి అని గట్టిగా చెప్పాను."

గోపీకోసమైనా ఆమె తన చదువు పూర్తిచెయ్యక తప్పదు. కనుకనే మొదటిలా కబుర్లతో కాలక్షేపం చెయ్యక శ్రద్ధగా చదవ సాగింది.

ఓ రోజు మధ్యాహ్నం మీర కాలేజీనుండి హాస్టల్‌కు వచ్చే సరికి టేబుల్‌మీద ఓ ఉత్తరం ఆమెకోసం ఎదురుచూస్తోంది. మీర తీపి చదువుకుంది.

"మీరా.

ఈమధ్య సరసి ఆరోగ్యం బావుండటంలేదు. మైసూరికి తీసు కుని వద్దామనుకుంటున్నాను. మంచి డాక్టరుకు చూపించే బాధ్యత నీదే."

ఉత్తరం చదివి మీర కలవరం చెందింది. వెంటనే సరసిని తీసుకురమ్మని శాముకు ఉత్తరం రాసింది.

శాము సరసిని తీసుకొచ్చాక అతని ఆరాటంచూసి మీరకు నవ్వు వచ్చింది. నీరసంగావున్న సరసిని తనే ఎం. ఒ. కి చూపించి సలహా తీసుకుంది.

"కంగారుపడకండి. రెండు నెల్లయింది. పాలూ పళ్ళు బాగ తీసుకోండి" అని సరసితో చెప్పి ఎం. ఒ. మీరవేపు తిరిగి—

"ఈమె నీకేమవుతారు?" అనడిగారు.

ఒక్కక్షణం మీర తటపటాయించి మరుక్షణమే జవాబు చెప్పింది.

"నా చెల్లి."

ఆరోజే శాము సరసితో పల్లెకు వెళ్ళిపోయాడు. సరసి కడుపుతో ఉందన్న వార్త మీరను ఆనందంలో ముంచివేసింది. తను ఏ ఉద్దేశంతో అయితే అతనికి మళ్ళీ పెళ్ళిచేసిందో, అది నెరవేరుతుం

కదా అన్న తృప్తి కలిగింది. అయినా అంతర్యపు లోతుల్లో 'నా వీణ బ్రతికి వుంటే...?' అన్న బాధ పొడసూపింది.

కాని మీర వెంటనే ఆ బాధను తలెత్తనీయకుండా అణచి వేసింది. సరసి కడుపుతో ఉందని తెలిసిన తరువాత రెండు మూడు రోజులు మీరకు ఎక్కడెక్కడా వీణరూపమే కనిపించేది. వీణ ఆటలు, అల్లరీ అన్నీ ఆమె మనసులో మంటలా పైకిలేచాయి. కాని అంతా రెండురోజులు మాత్రమే. తరువాత మళ్ళీ ప్రశాంతత నెల కొంది.

సరసి ఆరోగ్యం గురించి విచారిస్తూ సలహాలిస్తూ మీర అపు డపుడూ ఉత్తరాలు రాసేది. సరసి ఆ సలహాలను స్వీకరించినా మళ్ళీ ఉత్తరం రాసేపాటి సౌజన్యం చూపలేదు. మీర సరసినుండి ఉత్తరాల కోసం ఎదురు చూసేదికాదు. తనకు తెలిసినంతవరకూ ఔషధోప చారాల్లో సలహాలిస్తూ ఉండేది.

సరసి కడుపుతో ఉందని తెలిసినప్పటినుండి శాము సరసిని చాలా ఆదరభావంతో చూసేవాడు. అతనికి పిల్లలంటే అంతా ఇంతా ప్రేమ కాదు. అతని ఆశలన్నీ మూర్తీభవించినట్లుగా జాని ఆ ఇంటిని అయిదేళ్ళు వెలుగుతో నింపి మాయమయింది.

ఇప్పుడు మళ్లీ తను తండ్రి కాబోతున్నానని తెలిసి అతని హృదయం ఆనందంతో పరవళ్ళు తొక్కింది.

పరీక్ష పూర్తిచేసుకుని మీర పల్లెకు వచ్చేసరికి సరసి మగ పిల్లాడిని కని పుట్టింట్లో ఉంది. పరీక్షల హడావిడివల్ల మీర నామ కరణానికి వెళ్ళలేదు. రెడీమేడ్ స్వెటర్, టోపీ, మేజోళ్ళు పిల్లాడి కని పంపింది.

మీర ఇంటికిరాగానే శాముతో

"ఎలాగ ఉన్నాడు కుమార కంఠీరవుడు?" అనడిగింది.

"బాగానే ఉన్నాడు."

"ఎవరి పోలిక? మీలా ఉన్నాడా? సరసిలా ఉన్నాడా?"

"అందరూ నాలాగే ఉన్నాడని అంటారు మరి, ఎల్లుండి వెడదాం అక్కడికి. నువ్వేచూసి చెబుదూగానీ."

"పేరేం పెట్టారు?"

"మా నాన్న పేరు. సుబ్రమణ్యం అని."

మీర తమ బాబుకోసమని తెచ్చిన చొక్కాలు, ఆటవస్తువు అన్నీ తీసి శాముకు చూపుతోంది.శాము వాటివేపు చూడకుండా మీర చూస్తున్నాడు.

"మీరా, నిన్ను చూస్తుంటే చాలా బాధగా ఉంది. జా ఉంటే..."

"పాతగాయాన్ని రేపకండి."

"సుబ్రమణ్యానికి ఆటవస్తువులు తెచ్చి నువ్వు ఆనందించా రావటంచూసి నా కడుపు కరుక్కుపోతోంది."

మీర గంభీరంగా "జీవితంలో దేన్నయితే నేను మహ రంగా ఎంచుకున్నానో ఆ ఆదర్శాన్ని సాధించటంలో మీరు నా సాయం చేశారు. జీవితాన్నుండి నేను మరేమీ ఆశించటంలేదు అంది.

ఆ జవాబు విని స్థాణువులా ఉండిపోయాడు శాము.

మీరా శాము సరసిని, బాబునూ చూడటానికి వాళ్ళపల్లె వెళ్ళారు. ఇంటికి వెళ్ళగానే మీర సరసి పడుకున్న గదిలోకి వె ఉయ్యాల్లో ఆడుకుంటూ పడుకున్న బాబును ఎత్తుకునివచ్చి శా చేతికిచ్చి—

"ఇప్పటికి సంతృప్తి కలిగింది నాకు" అంది.

శాము అన్నట్టు సుబ్రమణ్యం ముమ్మూర్తులా శాము పోలి పావిత్రమ్మగారు మనవడిని చిన్నశామూ అనే పిలిచేవారు.

మీర బాబుని ఎత్తుకున్నప్పుడు ఆవిడ—

"శాము చిన్నప్పుడు అచ్చం ఇలానే ఉండేవాడు" అన్నార

మీర బాబుకోసం తెచ్చిన చొక్కాలూ అవీ చూపి సావిత్రవ గారు—

"ఎందుకమ్మా ఇన్ని కొన్నావు? అన్నీ రెండ్నెలల్లో బిగుత పోతాయి" అన్నారు.

"అయితేనేం సుబ్రమణ్యానికి కాకపోతే వాడిచెల్లెలో తమ్ముడో వేసుకుంటారు."

మీర మాట విని మంచంమీద పడుకున్న సరసి కిలకిలా నవ్వింది. ఆమెలోని సవతి మాత్సర్యం అడుగునపడి మాతృత్వం తల ఎత్తింది.

రెండురోజు లుండి వచ్చేశారు శాము మీరా. సుబ్రమణ్యానికి మూడునెల్లు నిండేలోగానే శాము నాలుగయిదుసార్లు అక్కడికి వెళ్ళి వచ్చాడు. బాబుకు మూడు నెల్లు నిండగానే అత్తమామలకు నచ్చ జెప్పి భార్యా పిల్లల్ని తనఊరికి ప్రయాణం కట్టించాడు.

బాబు నెత్తుకుని వస్తున్న సరసికోసం ఎదురుచూస్తూ మీర గుమ్మంలో నుంచుంది. తను వీణను ఎత్తుకుని వచ్చినరోజు ఆమె కళ్ళకు కట్టినట్టు కనిపిస్తోంది. పల్లెటూరి ఆడవాళ్ళూ పిల్లలూ అప్పటి లాగే ఇప్పుడూ శాము కొడుకుని చూట్టానికోసం గుంపులు గుంపులుగా నిలబడ్డారు.

సరసి, శాము, బాబునెత్తుకున్న సావిత్రమ్మగారు అందరూ బండి దిగారు. శాము రైతులు బాబునుచూసి తృప్తిపడి వెళ్ళి పోయారు. మీర మాత్రం ప్రతిమలా నుంచున్న చోటనే ఉండి పోయింది.

ఉంగరాలు తిరిగిన జుత్తు, సొట్టలుపడే బుగ్గలు, మెరుపు కళ్ళ చిన్నారి వీణ ఆమె హృదయంలో దుఃఖపు అలల్ని రేపింది. జ్ఞాప కాలు రేపిన తుఫానుతో మీర కంపించిపోయింది. అందరూ వెళ్ళి పోయాక కూడా మీర అక్కడే నుంచోవటం చూసి శాము బయటికి వచ్చి 'మీరా' అని పిలిచాడు. ఆమె మనసులోని వ్యధ అతనికి అర్థమయింది. అతని మనసూ కూతురి జ్ఞాపకాలతో వ్యధజెందింది.

మీర పెదవులు బిగించి ఏడుపు ఆపుకోవటానికి ప్రయత్నిం చింది. కాని ఆమె చేతకాలేదు. శాము ఆమెను ఓదారుస్తున్నాడు.

శామును వెతుక్కుంటూ వచ్చిన సరసి ఈ దృశ్యాన్ని చూసి స్తంభించిపోయింది. ఆమె మనసులో అసమాధానపు నిప్పురవ్వ భగ్గు మంది.

తను లక్షణంగా బాబునెత్తుకుని ఇంటికివస్తే ఎవరో చచ్చి
నట్టు ఈవిడ ఏడుపేమిటి? ఆమె ఏడిస్తే ముత్యాలు రాలిపోతాయన్నట్టు
ఈయనగారు ఓదార్చటమేమిటి? అసలు తను బాబునెత్తుకుని రావ
టాన్ని చూసి ఓర్చలేకపోతోంది.

సరసి గిరుక్కున వెనక్కితిరిగి వెళ్ళిపోయింది.

సుబ్రమణ్యం ఏడుపువిని మీర కళ్ళుతుడుచుకుంటూ—

"పిల్లాడు ఏడుస్తున్నాడు. సరసి ఏది?" అంటూ లోపలికి
వెళ్ళింది. పక్కమీద పడుకుని బాబు గుక్కపెట్టి ఏడుస్తున్నాడు.

మీర బాబునెత్తుకుని "సరసీ, సరసీ" అని పిలిచింది. పెరట్లో
సావిత్రమ్మగారితో మీరను గురించి కొండేలు చెబుతున్న సరసి మీర
పిలుపువిని లోపలికొచ్చింది. మీర బాబునెత్తుకోటాన్ని చూసి ముంద
కొచ్చింది.

"బాబు గుక్కపెట్టి ఏడుస్తూంటే ఎక్కడికెళ్ళావు సరసీ?"

సరసి ఆమె మాటకు బదులు చెప్పకుండా, తిరస్కారంతో
మీర వేపుచూసి బాబునెత్తుకుని వెళ్ళిపోయింది.

"బాబుమీద నీకున్నప్రేమ నాకు తెలుసులే" అన్నట్టున్న
ఆమె చూపులు మీర హృదయాన్ని తూట్లు పొడిచాయి.

* * *

చెలువాంబా హాస్పిటల్లో హౌస్‌సర్జన్‌గా పని దొరకగానే
మీర మళ్ళీ మైసూరికి బయలుదేరింది.

డాక్టర్ పరీక్ష పూర్తయ్యాకకూడా మీర మళ్ళీ మైసూరి
వెళ్ళటం శాముకు అసమాధానాన్ని కలిగించింది.

"పరీక్షలయ్యాక ఇక్కడే ఉంటానని మాటిచ్చావ్. అం
లోనే మరచిపోయావా?" అనడిగాడు.

"అబ్బే లేదండి. అన్నెల్లే ఈ శిక్షణ. మళ్ళీ వచ్చేస్తాను"
అని నచ్చచెప్పి వెళ్ళింది మీర.

మీర వెళ్ళిపోగానే సరసి హాయిగా నిట్టూర్చింది.

మీర మైసూరికి వచ్చేసరికి విజయా, గోపీ ఇద్దరిళ్ళల్లోను
విప్లవం బయలుదేరింది.

గోపీ తండ్రి కొడుకు పెళ్ళిచేయాలని ఎన్నోవిధాల ప్రయత్నించి విఫలులయ్యారు. గోపీ మేనమామకూతురు శాంతను పుట్టినప్పటినుండి గోపీ పెళ్ళాంగా పరిగణి స్తున్నారు. గోపీ పరీక్షలవగానే అతని తండ్రీ మేనమామా ఇద్దరూ శాంతను పెళ్ళిచేసుకోమని పోరసాగారు.

"నాకు ఉద్యోగం దొరకనివ్వండి" అని ఆర్నెల్లు గడిపాడు. మెడికల్ కాలేజీలో లెక్చరర్ ఉద్యోగం దొరగ్గానే మళ్ళీ ఇంట్లో గొడవలు మొదలయ్యాయి. ఈసారి ఏ విధమయిన అడ్డూ చెప్పటానికి వీలులేకపోయింది. తల్లి అన్నం తినలేదు. తండ్రి నోటికొచ్చినట్టు తిట్టసాగారు. ఈగొడవన్నీ భరించలేక గోపీ తన మనసులోని మాట తండ్రితో చెప్పాడు.

"సరే నాన్నా. మీరు చెప్పినట్టే పెళ్ళిచేసుకుంటాను. కాని శాంతను మాత్రం చేసుకోలేను."

గోపీ తండ్రి పిచ్చికోపంతో గట్టిగా అరవసాగాడు.

"ఎందుకోయ్? ఎందుకు చేసుకోవూ అంట? శాంత అందంగా లేదా? చదువుకోలేదా? ఏం లోటుందో చెప్పు చూద్దాం."

"నా కామెమీద ప్రేమలేదు."

"అంతేకదా! ముందు పెళ్ళిచేసుకో. తరువాత ప్రేమ తనంతట తానే పుట్టుకొ స్తుంది."

"ఉహుం. శాంతను చేసుకోలేను నేను."

"మరెవరిని చేసుకుంటావోయ్?"

"మా కాలేజీలోనే విజయ అని ఓ అమ్మాయి వుండేది. ఇపుడు హౌస్‌సర్జన్‌గా ఉంది. ఆ అమ్మాయిని చేసుకుంటాను."

"బ్రాహ్మణుల పిల్లేనా?"

"మహారాష్ట్రి బ్రాహ్మణులు. వాళ్ళనాన్న పరాంజపె అని...."

గోపీమాట విని తల్లి గట్టిగా ఏడవసాగింది.

"ఇదేం ఖర్మరా నాయనా? నిన్నుకని పెంచినందుకు మామీద ఇంత కక్ష దేనికిరా? మరాఠిపిల్ల నా కోడలయితే ఇక నా అదృష్టం ఏమని చెప్పుకోను? పండగా, పర్వాలకూ, తద్దినాలకూ ఆ పిల్లను

వంటింట్లోకి రానిస్తారట్రా? ఆ పిల్ల చేతినీరు నన్ను తాగమం
వురా?'' అని శోకాలు పెట్టసాగింది.

"నేను పెళ్ళంటూ చేసుకుంటే ఆమెనే చేసుకుంటాను."

"అయితే ఇహ నీకు తల్లీ దండ్రీ లేరన్నమాటే!" తం
గర్జించాడు.

గోపీ మౌనంగా నుంచున్నాడు. తండ్రి మళ్ళీ అంతే
నంగా—

"ఆఖరిమాట చెప్పు. నామాట నువ్వు వినకపోతే నా
మొహం చూపనక్కర్లేదు" అన్నారు.

"నేను చెప్పవలసిందంతా చెప్పేశాను" గోపీ దృఢ
అన్నాడు.

"అయితే బయటికి దయచెయ్యి. మళ్ళీ నీ మొహం చూపక

"చిత్తం" అన్నాడు గోపీ.

అంతే! గోపీ ఇంటినుండి బయటపడి ఓ స్నేహితుని గ
ఉంటూ హోటల్లో భోంచేస్తూ కాలం గడుపుతున్నాడు.

ఓ ఆదివారం స్నేహితు దేదో సినిమాకు వెళ్ళాడు.
ఒకడే ఉన్నాడు గదిలో. సుమారు నాలుగుగంటల ప్రాంత
ఎవరో తలుపు కొడుతున్న చప్పుడయింది. పడుకున్న గోపీ
తలుపు తీశాడు.

ఎదురుగా సూట్ కేస్ చేత్తో పట్టుకుని నిల్చుంది వి
నవ్వుతూ. ఆమెను చూడగానే అతని కంతా అర్థమయింది.
గబా బనీనుమీద బుష్షర్టు తొడుక్కుని, పక్కచుట్టి తలదువ్వు
"లోపలికి దయచేయండి" అన్నాడు. విజయ నవ్వుతూనే లో
కొచ్చింది.

"ఎవరూ లేనపుడు నా గదికి రావటానికి నీకెంత ధైర్యం.

"ఏం చెయ్యగలరు వస్తే?" విజయ మళ్ళీ అంది.

గోపీ తెరచిన తలుపువేపు చూసి—

"తలుపు తీసేవుందిగాని లేకపోతేనా..." అన్నాడు.

విజయ తలుపు మూసి "ఇప్పుడు?" అంది.

"ఇక నువ్వు సింహంచేత చిక్కిన హరిణివి" అంటూ ముందుకొచ్చాడు గోపీ.

"ఉహుఁ" అంది విజయ. గోపీ అక్కడే నుంచున్నాడు.

"విజయా ఏం జరిగిందో చెప్పకూడదూ?"

"మీ కయిందే నాకూనూ."

"అంటే?"

"ఈరోజు మీనాన్నగారు, మా నాన్నగార్ని కలుసుకుని విషయ మంతా చెప్పారు. మా నాన్నగారు నన్ను పిల్చి 'నిజమా?' అనడిగారు. అవునన్నాను. మా నాన్నగారసలే సంప్రదాయస్థులు. మాటకు మాట పెరిగింది. దాని పరిణామం నేను ఇక్కడ, నా గోపీ ధగ్గరున్నా."

మా నాన్నగారు మీ ఇంటి కెందు కొచ్చారు?"

"నన్ను అదుపులో ఉంచుకోమని నాన్నగారితో చెబుమని వచ్చారు. కాని మనిద్దరం ఎవరి అదుపులోనూ లేమని వాళ్ళిద్దరికీ తెలియదు."

"మరి నవ్వుతూ వచ్చావేం?"

"ఇంట్లో అయితే నే నొక్కత్తినే ఏడవాలి. ఇక్కడ మీ గుండెలమీద తలఆన్చి ఏడుద్దామని ఏడుపంతా మూటగట్టుకుని వచ్చాను" అని అంటున్నప్పుడు విజయ కంఠం వణికింది.

"విజయ్, డార్లింగ్" అంటూ గోపీ ఆమెను ఓదార్చాడు. దుఃఖావేగంతో కంపిస్తున్న ఆమె పెదవులను ముద్దుపెట్టుకుంటూ

"దీని కెందు కేడవాలి విజయా? ఇదంతా మన మంచికే. ఇప్పుడు మనిద్దరం కలిసే ఉండొచ్చు."

"అంటే?"

"ముందు ఏడవనని ప్రామిస్ చెయ్యి."

"అలాగే."

"అలాకాదు, దాని కో పద్ధతుంది."

"ఛః మీరు చాలా చెడ్డవారు."

"నువ్వేమన్నా సరే, అదంతే."

"నాకు తీసుకోవటమే తెలుసుకాని ఇవ్వటం తెలీదు."

"లోభివి నువ్వు? మహాదాతని నేను."

"అయ్యోపాపం! ఇలాంటి దానంచేయ టానికి తమరేకావాలి" విజయ గోపీని వెక్కిరించింది.

నీలాంటి భిక్షకి దొరకటం నా పుణ్యం."

"పుణ్యం సంగతలాఉంచండి. ఇప్పుడేంచేద్దాం?" కలవరంతో అడిగింది విజయ.

"ఇపుడు మనకెవరి అడ్డూలేదు. ఇద్దరం మెజారిటీకి వచ్చాం. రిజిస్టర్డ్.... ...."

"ఉహూఁ, నా కందులో నమ్మకం లేదు" అంటూ దీర్ఘం తీసింది విజయ.

"నా మీద నమ్మకం లేదా?"

"అదికాదు. మనిద్దరి ప్రేమబంధానికి కోర్టు ముద్ర వేయించుకోవటానికి నాకిష్టంలేదు. ఇల్లు, భూమి, ఆస్తులనురిజిస్టర్ చేయించినటు మన పెళ్ళిని...."

"సరే, నీ యిష్ట ప్రకారమే కానిద్దాం."

"అంతవరకూ నే నెక్కడుండను?"

"మీరతో హాస్టల్లో ఉండు."

"మీరు!"

"నే నిక్కడే ఉంటాను."

"చాలా రోజులు మిమ్మల్ని వదిలి ఉండలేను" మళ్ళీ ఏడుపు మొహం పట్టింది విజయ.

"అమ్మని వదిలి ఉండలేవా?"

విజయ తల అడ్డంగా ఊపింది. ఆమె కళ్ళలో నుండి నీరు ప్రవహించసాగింది.

"అవును, అమ్మనువదిలి ఉండడం నా కలవాటేలేదు. ఇప్పుడలా ఉండటం కష్టమే."

"విజయ్, నువ్వింకా చిన్నపిల్లవు. ఇంకో రెండేళ్ళు అమ్మ దగ్గరేఉండి, నా దగ్గరకు రా."

"అమ్మనయినా వదిలిపెట్టి ఉండగలను గాని మిమ్మల్ని వదిలి పెట్టి ఉండలేను."

"నేనే వదిలిపెడితే?" గోపీ కొంటెగా అడిగాడు.

"నాలాంటి భగ్న ప్రేమికులకు చెరువు లున్నాయి."

"విజయ్, నువ్వు పిచ్చిదాని వవుతున్నావు."

"అవును. నాకు గోపీ పిచ్చి."

గోపీ దీర్ఘంగా నిట్టూర్చి అన్నాడు. "మనం ఒకర్నొకరు ఇష్టపడి సుఖంగా జీవించ గలమని అనుకుంటున్నపుడు పెద్దవారి కెందుకో ఈ పట్టుదల?"

"ఈ సంకుచిత భావాలు పోవాలంటే ఇంకా ఎంతకాలం పడుతుందో?"

గోపి గదికి తాళంవేసి విజయతోబాటు మీర దగ్గరకు వెళ్ళాడు. మీర అప్పుడే హాస్పిటల్‌నుండి వచ్చింది. ఇద్దరు కలిసి రావటాన్ని చూసి చిరునవ్వు నవ్వింది. గోపీ విజయవేపు చూపుతూ-

"ఈ పసి పాపాయిని మీకు అప్పజెప్పు తున్నాను. నేనామె పాణిగ్రహణం చేసేదాకా మీదగ్గరే ఉండనివ్వండి" అన్నాడు.

విజయ జరిగిన సంగతంతా పూస గుచ్చినట్టు వివరించింది. మీర అంతా విని కాసేపు మెదలకుండా ఊరుకుని తరువాత-

"ఇపుడేం చేద్దామను కుంటున్నారు?" అనడిగింది.

విజయ గోపీవేపు చూసింది.

"విజయకు రిజిస్టర్ మ్యారేజి ఇష్టంలేదట. హిందూ సంప్రదాయ వివాహమే కావాలట" అన్నాడు గోపీ.

"సరే"

"దాని కెవరన్నా పట్టించుకోవాలి కదా...."

"దాన్ని గురించి బెంగ మీ కనవసరం. నాలుగురోజుల్లో మీసమస్య తీరుతుంది" అంది మీర.

విజయను మీర దగ్గరే వదిలిపెట్టి గోపీవెళ్ళిపోయాడు. అతను వెళ్ళిపోగానే విజయ మంచంమీదపడి ఏడవసాగింది.

"ఎందుకమ్మా అంత ఏడుపు?"

"నా చేతగాదు మీరా, ఇదంతా భరించలేను నేను."

"ఏం?"

"గోపీ నన్ను ఎంతగా ప్రేమిస్తున్నారో చూశావా? నాకోసం అమ్మా-నాన్నలకు కూడా దూరమయ్యారు."

"మరి నువ్వూ అంతేగా?"

"అయినా ఆయన నన్ను ప్రేమించినంతగా నేనాయన్ని ప్రేమించటంలేదు. నాకేం పాలుపోవటంలేదు మీరా!"

"నువ్వేం బెంగపెట్టుకోకు. అంతా నే చూసుకుంటాగా" అని భరోసా ఇచ్చింది మీర.

మరుసటిరోజు ఒక్కరోజు శలవుపెట్టి మీర పల్లెకు వెళ్ళింది. చెప్పా చేయకుండా వచ్చిన మీరనుచూసి శాము సరసి ఇద్దరు చకితులయ్యారు.

"అకస్మాత్తుగా దయచేశారేం రాణీగారు?" శాము అడిగాడు.

"కాస్త పనుండి వచ్చాను" అని మొదలుపెట్టి గోపీ విజయల స్నేహం, వారి తల్లితండ్రుల విరోధం అన్నీ వివరించింది. శాము, సరసి అంతా మౌనంగా విన్నారు. మీర అంతా చెప్పగానే సరసి—

"బ్రాహ్మణుల అబ్బాయి మరాఠీ అమ్మాయిని చేసుకోవటమేమిటి? ఇలాంటివాటిని మనం ప్రోత్సహించనేరాదు" అంది.

మీర ఆమె మాటల్ని విననట్టే శామూవేపు తిరిగి "మీరేమంటారు?" అంది.

"వాళ్ళిద్దరికీ నిజమైన ప్రేమ ఉంటే పెళ్ళి చేసుకోవటంలో తప్పేమీ లేదు."

మీరమొహం సంతోషంతో ప్రఫుల్లమయింది. ఆనందంతో-

"అయితే వాళ్ళకు నేను సాయం చేయటానికి మీకేం అభ్యంతరం లేదుకదా?" అనడిగింది.

"అంటే?"

"వాళ్ళ నిక్కడికి పిలిపించి హిందూ సంప్రదాయం ప్రకారం పెళ్ళి చేద్దామా?"

"వాళ్ళ తల్లితండ్రులు గొడవపెడితే?"

"ఇద్దరూ మెజారిటీకి వచ్చారు. ఇకనెవరూ ఏంచెయ్యలేరు."

"ఈ పెళ్ళి నాకు సుతరాం ఇష్టంలేదు" అంది సరసి.

శాము సరసిమాటల్ని పట్టించుకోలేదు. అతనేదో ఆలోచిస్తు న్నాడు. పెళ్ళంటే బాధ్యతతో కూడిన పని నిజమే. కాని దానివల్ల ఎంత ఆత్మతృప్తి కలుగుతుంది! కాస్త డబ్బు ఖర్చవుతుంది పరే. దానివల్ల తను నష్టపోయేదేమీ ఉండదు. అలా చేస్తేనేం? ముఖ్యంగా దీనివల్ల మీరకెంతో సంతోషం కలుగుతుంది.

"అలాగే" అన్నాడు శాము.

సరసి మాత్రం తామే డబ్బు ఖర్చుపెట్టి ఈ అన్యాయపు పెళ్ళి చేయటాన్ని ఎంతమాత్రం ఆమోదించలేదు. కాని మీరకోసం శాము ఆమె నెదిరించటానికి నిశ్చయించుకున్నాడు. భర్త తన మాటను లక్ష్య పెట్టకుండా మీర మాటనే మన్నించటం ఆమె కెంతో ఆగ్రహాన్ని తెప్పించింది.

"మీ రిలా దుబారా చేయటం మొదలెట్టా రంటే ఇహ మీ కొడుక్కి పైసాకూడా మిగల్చరు."

మీర, శాము అదిరిపడి సరసి వేపు చూశారు. ఇన్నేళ్ళ కాపు రంలో మీరఎప్పుడూ భర్తతో ఆస్తిగురించి మాట్లాడిఎరుగదు. ఆ ఆస్తి పరాయి వాళ్ళకు పోగూడ దన్న ఆశయంతోనే సరసిని ఇచ్చి శాముకు పెళ్ళి చేయించింది. కాని ఎన్నడూ ఇలాంటి తక్కువరకపు మాట అని ఎరుగదు.

శాము గద్దించాడు. "ఓ వెయ్యి రూపాయలు ఖర్చుపెడితే నా ఆస్తేం తరగిపోదు."

"పెద్దవాళ్లు ఇష్టపడని పెళ్ళిచేసి ఆ పాపం మూట కట్టుకుం టారా?"

"కన్యాదానం పాపం కాదు"

"ఇన్ని ఆట లాడినది కన్యా?" సరసి వ్యంగ్యంగా అంది.

"సరసీ, నోటికొచ్చినట్టల్లా వాగకు" మీర కోపంగా అంది.

"ఉన్నమాటంటే ఎందుకూ మీ కంతకోపం? ఏమయినా ఈ పెళ్ళి నా ఇంట్లో జరగనివ్వను."

"ఇదీ, నా ఇల్లన్నసంగతి మర్చిపోకు. మీరా, నువ్వం
సిద్ధంచేయి. మనమే విజయను గోపీకి ధారపోద్దాం" అన్నాడు రె
పోతూ శాము.

బాబు ఏడుస్తున్నా పట్టించుకోకుండా సరసి లేచి లోపల
వెళ్ళిపోయింది.

మీర శుభసమాచారంతో మైసూరు వెళ్ళింది. విజయ
చెప్పింది. విజయ కన్నీరు పెట్టుకుంటూ "నువ్వు ఏ జన్మలోనో
తల్లి ని మీరా" అంది.

గోపీ మటుకు మీర సలహాకు వప్పుకోలేదు.

"మాకోసం మీరు ఖర్చుపెట్టటం నా కిష్టంలేదు."

"మా స్నేహానికి మీరిచ్చే విలువ ఇంతేనా?"

మీర మాటకు గోపీ జవాబు చెప్పలేకపోయాడు.

అవధాన్లవారు పెళ్ళికి ముహూర్తం పెట్టారు. పెళ్ళికి ముం
రోజున మీర, విజయ, గోపీ, మరో నలుగురు స్నేహిత
వచ్చారు. ధుమధుమ లాడుతున్న మొహంతోనే అందర్నీ ఆహ
నించింది సరసి. శామువూత్రం సంతోషంగా ఉన్నాడు. మీర అ
రికీ తన భర్తను పరిచయంచేసింది.

విజయ మెప్పుకోలుగా "నీ భర్త ఎంత హేండ్ సమ
ఉన్నారు మీరా!" అంది.

"చూశారా, పెళ్ళికిముందే ఇలా అంటోందే, ఇహ నా
మిటి?" అని గోపీ మీరతో మొరపెట్టుకున్నాడు.

"ఈ అమ్మాయిని వెంటనే మంగళసూత్రంతో బంధించ
టమే మంచిది" అంది మీర.

సరసి ఎవరితోనూ మాట్లాడలేదు. విజయ మొహంచూ
ఒళ్ళు మండుకు పోతోం దామెకు. గోపీలాంటి మంచబ్బాయిని
వేసుకున్న టక్కులాడి అనిపించింది సరసికి. లక్షణంగా బ్రా
ణుల ఇంట్లో పుట్టి, మరాఠీపిల్లను పెళ్ళి చేసుకోటమా?

మరుసటిరోజు గోపీ విజయల పెళ్ళి నిరాడంబరంగా
పోయింది. మీర, శాము విజయను అగ్నిసాక్షిగా గోపీ కిచ్చి

చేశారు. పెళ్ళిలో జరగాల్సిన శాస్త్రాలన్నీ సక్రమంగా జరిపించాడు శాము.

నూతన వధూవరులు తమ హనీమూన్ పల్లెలోనే సంతోషంగా గడిపారు. చెరువుఒడ్డున వెన్నెల్లో భోజనం. చెరుకుతోటల్లో విహారం. తోటలో దాగుడుమూతలు, ఎండ్లబండిలో పిక్నిక్ ఇలా పసిపిల్లల్లా కాలం గడిపారు.

మీర, శాము వాళ్ళకి కావలసిన సౌకర్యాలన్నీ కల్పించారు. మూడు రోజుల తరువాత అందరూ మైసూరికి బయలుదేరారు. వెళ్ళే ముందు గోపీ, శాముకు తన కృతజ్ఞత తెలుపుతూ-

"మీ ఉపకారాన్ని ఎన్నటికీ మర్చిపోలేం" అన్నాడు.

"ఇందులో నాదేముంది? అంతా మీర ఏర్పాటే!"

"మీరు సహృదయంతో సమ్మతించబట్టేకదా?"

"మా పల్లెటూళ్లో మీకేమీ ఇబ్బంది కలగలేదు కదా?" అనడిగాడు శాము. గోపీ విజయవేపు చూశాడు. విజయ నవ్వుతూ,

"మా ఇద్దర్నీ చూస్తూంటే మీ కేమనిపిస్తోంది?" అంది.

విజయ ఆనందమే మూర్తీభవించినట్టుగా ఉంది. గోపీ మొహంలో సంతోషం పొంగి పొరలుతోంది. యౌవనంలోకి ఇప్పుడే అడుగు పెట్టిన తెల్లటి జంటపావురాల్లా కనిపించారు వాళ్ళిద్దరూ శాముకు. వారి నిర్మల నిష్కపట ప్రేమలో ఏ విధమయిన సంకోచమూ ఉండేది కాదు. చుట్టూ మనుష్యు లున్నారన్న సంగతే మరిచి ఒకరివే పొకరు చూస్తూ ఉండి పోయేవారు. అదిచూసి సరసి మండిపడేది.

ఓ రోజు భోజనాలప్పుడు విజయా గోపీ ఒకరివే పొకరు చూసుకుని నవ్వుకుంటున్నారని సరసి మీరఎదుట 'అన్నీ వేషాలు' అని గొణిగింది. మీర తన కోపాన్ని అతి కష్టంతో ఆపుకుంది.

"ఒకరివేపొకరు చూసుకోవటం, నవ్వుకోటం, గుసగుసలు, ఛ, ఛ! ఏం మనుషులో!"

"వాళ్ళిద్దరికీ పెళ్ళయి రెండురోజులు మాత్రమే అయిందన్న సంగతి మరిచిపోతున్నావు సరసీ!"

"కొత్తగా పెళ్ళయినంత మాత్రాన అలా ఉండాలని ఎక్కడుంది? నిన్న వెన్నెల్లో భోజనానికోసం చెరువుదగ్గరికి వెళ్ళారా? అక్కడేమో విజయ గడ్డిమీద కూర్చుందట. ఈయనగారేమో ఆమె ఒళ్లో తలపెట్టి పడుకున్నాడట. తిమ్మమ్మచూసి సిగ్గుపడి వెనక్కి వచ్చిందట."

"వాళ్ళిద్దరూ భార్యా భర్త లేగా? అతనిపెళ్ళాం ఒళ్లో పడుకుంటే తప్పేమిటి?"

"అలాంటిచోటే కావాలా వారి ప్రేమ ప్రదర్శనకు?"

"అందమయిన వెన్నెల. ఆ సమయంలో అక్కడెవరూ మనుష్యులు లేరు. ఇంకేవరూ రారని అనుకునిఉంటారు. వాళ్ళిద్దరూ నూతన దంపతులన్న విషయం మర్చిపోతున్నావు సరసీ. ఒకర్నొకరు ప్రేమించి కోరికోరి పెళ్ళిచేసుకున్నారు. కనుక వారిప్రేమ కాస్త గుడ్డిదయి ఉండవచ్చు."

"కాని చుట్టూ ఉన్నవారికి కళ్ళున్నాయి."

"అయితే నన్నేం చేయమంటావ్? వాళ్ళిద్దర్నీ పిల్చి కోప్పడమన్నావా?"

మీర జుగుప్సతో అంది.

"ఎక్కడన్నా నాశనమవనీ. నా కేం?"

"శాంతం. పాపం ఎక్కడయినా సుఖంగా ఉండనీ అనకూడదూ?"

"వాళ్ళిద్దరూ ఇక్కడుండేంతవరకూ ఊళ్ళో తలెత్తుకు తిరగలేను నేను. నిన్న ఉదయం చెరుకుగానుగ దగ్గర చెరుకు పానకం తాగేటప్పుడు విజయ తాగుతున్న కప్పు లాక్కొని తాగాడు గోపీ."

"ఇంకా ఈ విషయంమీద వాదించటం నా కిష్టంలేదు."

"ఎవరికి లేని అపురూపమయిన పెళ్లాం తనకే ఉన్నట్లు నెత్తిమీద కెక్కించుకుని...." సరసి ఇంక మాట్లాడుతుండగానే మీర అక్కడనుండి లేచి వెళ్ళిపోయింది.

సరసి మాటలతో ఆమె మనసు వ్యగ్రమయింది. అందుకే మూడురోజులు కాగానే అందరితో కలిసి మైసూరికి బయలుదేరింది.

మైసూరికి రాగానే గోపీ అద్దెఇంటికోసం వెతకనారంభించాడు. ఇద్దరి తలిదండ్రులూ వారికి ఏమాత్రం సాయంచేయటానికి ఇష్ట పడలేదు.

"విజయను తీసుకుని ఇంటికి రానా" అని గోపీ తండ్రికి కబురుచేస్తే—

"అతను మాకు ఉండీ లేనట్లే" అని బదులు వచ్చింది.

విజయ తండ్రి "అదేమన్నా ఇంట్లోకి అడుగుపెడితే కాళ్ళు విరగ్గొట్టి పంపుతాను" అని అందరి ఎదుటా ఎగిరారు.

విజయా గోపీ కాపురం పెట్టడానికి కో చిన్న యిల్లు దొరికేదాకా విజయ మీరగదిలోనే ఉంది. రెండుగదు లున్న ఓ యిల్లు అద్దెకు దొరగ్గానే గోపీ వచ్చి—

"ఇక విజయను పంపుతారా?" అనడిగాడు మీరను.

"ఇల్లెక్కడ చూశారు?"

"శివరామపేటలో. ఇల్లు బాగాలేదనుకోండి. కాని ఎన్నిరోజు లిలా ఉండగలం?"

"మహారాజులా తీసుకెళ్ళండి బాబూ. నా అడ్డేమిటి మధ్యన?"

"ఉదయంవచ్చి తీసుకెడతాను. మీరూ వచ్చి మాతో టీ తీసుకోవాలి."

"నాకు టీ సయించదే!"

"విజయకు కాఫీ సయించదు. అందుకని నేనూ టీ అలవాటు చేసుకున్నా."

"ఆమెకే కాఫీ అలవాటు చెయ్యలేకపోయారూ?"

"విజయ చపాతీలకు బదులు అన్నం అలవాటు చేసుకుంటుందట. ఇప్పుడు సరిపోయింది కదూ?"

"ఆ!"

"విజయ ఏది?"

"ఆమెకు నైట్‌డ్యూటీ ఉంది. నేను వచ్చేసరికి గదికి తాళం వేసుకుని వెళ్ళిపోయింది."

"అయితే ఇక ఉదయం తొందరగా లేవదనుకొంటా."

"నేను లేపుతా లెండి."

"వద్దు. వద్దు. నిద్రపోతూంటే లేపకండి. రాత్రంతా నిద్రుండదు కదా! ఉదయం నిద్రపోనివ్వండి. నేను పదకొండింటికి వస్తాను. మీరూ కలవు పెట్టేయండి."

"అలాగే" అంది మీర.

ఉదయం ఎనిమిదింటికి విజయ డ్యూటీ పూర్తిచేసుకుని గదికి వచ్చింది. విజయ రాగానే గోపీ చెప్పిన కబురు అందజేసింది.

"ఊఁ....ఊఁ" అని ఆవలిస్తూ మంచంమీద పడి నిద్రలో మునిగింది విజయ. గోపీ పదకొండింటికి వచ్చినపుడు కూడా విజయ నిద్రపోతూనే ఉంది. మీర గోపీని కూర్చోబెట్టి అడిగింది.

"విజయను లేపనా?"

"వద్దు. ఆమె లేచేదాకా వెయిట్ చేస్తాను."

"సరే, అయితే ఈ పుస్తకం చూస్తూవుండండి" అని మీర గోపీచేతి కొక పుస్తకం ఇచ్చి బయటికి వెళ్ళి యశోదగదిలో కబుర్లు చెబుతూ కూర్చుంది.

గంటన్నరయాక మీర మళ్ళీ గదిలోకి వచ్చేసరికి గోపీ అలాగే పుస్తకం పట్టుకుని కూర్చున్నాడు. విజయ నిద్రపోతూనే ఉంది.

"ఇంకా లేవలేదూ?"

"ఆఁ. ఫరవాలేదండి."

మీర కిటికీతలుపు చప్పుడు చేసింది. టేబుల్ ముందుకు లాగింది

కలకంటున్నాను అనుకుందో ఏమో విజయ!

అస్పష్టంగా 'గోపీ' అంటూ చేతులు ముందుకు చాచింది.

మీర క్షణంలో బయటికి జారుకుంది. ఆమె మళ్ళీ వచ్చేసరికి విజయ తన ఇంటికి వెళ్ళటానికి సిద్ధంగా ఉంది. గదికి తాళంవేసి ముగ్గురూ బయలుదేరారు.

గోపీ ఇల్లు చిన్నదైనా అనుకూలంగా ఉంది. హీటింగ్ సర్క్యూట్ వేయించినందువల్ల ఇంటిపని భారం బాగా తక్కువయింది. తన అభిరుచికి అనుగుణంగా ఇంటిని అలంకరించాడు గోపీ.

విజయ ఇంటిని చాలా మెచ్చుకుంది. ఆ దంపతుల నిర్మలా నందాన్ని చూసి మీర హృదయం పొంగిపోయింది. విజయ అందరికీ టీ, బిస్కట్స్ ఇచ్చింది. ఇంట్లో సామాన్లు సర్దటంలో విజయకు సాయం చేయబోయాడు గోపీ.

"పసిపిల్లల్లాగా కాళ్ళకూ చేతులకూ అడ్డం వస్తారేం? మీరు సాయం చేయక్కర్లేదు గాని అలా కూర్చోండి" అంది విజయ.

ఇల్లు సర్దటం అయ్యాక మీర తనగదికి బయలుదేరింది.

"ఇవాల్టికి ఇక్కడే ఉండకూడదూ?" గోపీ అడిగాడు.

"వద్దుబాబూ. ఇంకో రో జెపుడయినా వస్తాను" అని వెళ్ళి పోయింది మీర.

* * *

ఆర్నెల్ల శిక్షణ పూర్తికాగానే పల్లెకు వెళ్ళి పోవాలని నిశ్చయించు కుంది మీర. గోపీ, విజయ దీనికి వప్పుకోలేదు.

విజయ "పల్లెలో ఏం చేస్తావు మీరా?" అన్నప్పుడు—

"పల్లెలోనూ రోగులున్నారు విజయా!" అని బదులిచ్చింది మీర. ఆమె మనసు మార్చాలని ప్రయత్నించి నిరాశ చెందా రా దంపతులు.

"అక్కడ డిస్పెన్సరీ పెడతావా?"

"ఇక్కడిలా అక్కడ డిస్పెన్సరీ పెట్టను. మండ్యడిస్ట్రిక్ట్. ఆ చుట్టుపక్కల పల్లెల్లో, చాలా మామూలుగా ఉండే మలేరియా, లివర్ అనీమియా, ఆడవాళ్ళ జబ్బులు వీటిని దూరం చెయ్యటానికి నాకు చేతనయినంతవరకూ ప్రయత్నిస్తాను. గ్రామనైర్మల్యం, సంతాన నిరోధం విషయంలో గ్రామస్థులకు తెలియచెప్పటానికి ప్రయత్నిస్తాను.

"అయితే మళ్ళా ఇక్కడికి రావా?"

"ఎందుకు రాను? మందులు, ఇంజక్షన్లు అన్నీ అక్కడినుండి వారాని కోసారి వచ్చి తీసుకెడుతూంటాను."

"అప్పుడు నీ చెల్లి ఇల్లు ఈ ఊళ్ళోనే వుందన్న విషయం మర్చిపోకు మీరా!"

మీర తల ఊపింది. గోపి, విజయా స్టేషనుకు వచ్చి ఆమెకు

వీడ్కోలు యిచ్చారు. మీర తనతోబాటు వీలయినన్ని వస్తువులు తీసుకుని వెళ్ళింది.

మీర ఇక పల్లెలోనే ఉంటుందన్న విషయం శాముకు ఆనందంలో ముంచివేసింది. కాని సరసి మొహం మాడిపోయింది. మీర పల్లెకు వచ్చేందుకు ముందురోజున శాము ఆమె కోసం ఓ గది ఖాళీ చేయించి, సామాన్లు సర్దుకోటానికి వీలుగా అమర్చిపెట్టాడు. అతనే స్వయంగా వెళ్ళి మీరను తీసుకొచ్చాడు. శాము తనకోసం చేసి ఉంచిన సౌకర్యాలను చూసి ఆమె కంఠం గద్గదమయింది.

మీర డాక్టరయి వచ్చిన విషయం ఊరంతా క్షణంలో వ్యాపించింది.

"శామపోరి భార్య డాక్టరయి వచ్చారట. సూదిమందిస్తారట" అన్న సంగతి చుట్టూరా పల్లెల్లో వ్యాపించింది. అంతవరకూ పల్లె ప్రజలకు పండితులవారి కషాయం మాత్రమే తెలుసు. ఆస్పత్రి చేదు మందు, ఇంజక్షన్లు వాళ్ళకి బాగా కొత్త. అందులో వాళ్ళకేమాత్రం నమ్మకంలేదు. కనుకనే పల్లెకువచ్చిన ఆమెకు కావలసినంత సహకారం లభించలేదు.

వెంకు, ఓ మారు మండ్యనుండి పుట్టింటికి వచ్చింది. ఆమె కొడుకు మూడేళ్ళ నంజుండికి హఠాత్తుగా డిఫ్తీరియా వచ్చింది. బాబు పడుతున్న బాధ చూసి పండితులవారు ఏం చెయ్యలేక తలమీద చేతులు పెట్టుకుని కూర్చున్నారు. ఆయన లేహ్యం కషాయాలతో నంజుండి గొంతునొప్పి తగ్గలేదు. వెంకు కంగారుపడి ఏడుస్తూ మీర దగ్గరికివచ్చి-

"మీరా, ఎలాగైనా నా బాబును బ్రతికించండి" అని బ్రతిమాలింది. మీర వెంటనేవెళ్ళి పరీక్షించింది. డిఫ్తీరియా అని తెలియగానే,

"వెంకూ, వెంటనే మైసూరు వెళ్ళాలి-సిద్ధంగా ఉండండి. ఇపుడే వస్తాను" అంది.

"ఇపుడు రైలేదిలేదే!" అంది వెంకు ఏడుస్తూ.

"అదంతా నీ కెందుకు? నువ్వు సిద్ధంగా ఉండు" అని ఇంటికి వెళ్ళిపోయింది మీర.

శాముకు సంగతి తెలిసింది. మీర సలహాప్రకారం పైరు చక్రాలున్న బండి, వేగంగా పరిగెత్తగలవని పేరుపొందిన ఎడ్లజతలు కట్టించాడు. అయిదు నిమిషాల్లో శాము, మీర, వెంకు, నంజుండి, పండితులు, మైసూరుకి బయలుదేరారు. నింగడి చాకచక్యంవల్ల బండి రెండున్నర గంటల్లో మైసూరు చేరుకుంది.

సమయానికి తగిన చికిత్స దొరకటంతో- నంజుండి బ్రతికాడు. తన బిడ్డను బ్రతికించిన మీర చేతుల్ని పట్టుకుని వెంకు కృతజ్ఞతతో-

"మీరు చదువుకోటానికి వెళ్ళినపుడు నేను ఏదేదో అన్నాను. అదంతా వెనక్కి తీసుకుంటున్నాను. మీ రింకా ఎందరికి ప్రాణదానం చేయాల్సి వుందో! ఈ పవిత్రమయిన పని ఆపకండి. నన్ను క్షమించండి" అంది.

"నేనేం చేశానని? నా దగ్గర ఇంజక్షన్లు లేవు. అందుకని ఇక్కడికి తీసుకొచ్చాను అంతే."

"మీరు డిప్తీరియా అని చెప్పి తీసుకురాబట్టే గదా...."

"అంతగా పొగడకు వెంకు, ఆ తరువాత మీర కళ్ళు నెత్తికెక్కుతాయి" అన్నాడు శాము.

ఈ ఘటన జరిగాక పల్లెప్రజలకు మీరమీద కొంత నమ్మకం ఏర్పడింది. ఎవరికి ఏ జబ్బు వచ్చినా మీరదగ్గరికి పరుగెత్తుకొచ్చేవారు. పక్క పల్లెల్నుండి కూడా బండి కట్టించుకుని వచ్చి మీరదగ్గర మందు తీసుకుని వెళ్ళేవారు.

తన రైతులనుండి ఫీజుకాని, మందులకు డబ్బుకాని తీసుకోవద్దని మీరతో చెప్పాడు శాము. కాని మిగిలిన రైతులనుండి డబ్బు తీసుకోవటానికి అతనేం అభ్యంతరం పెట్టలేదు. కాని సరసి కది నచ్చలేదు. ఆమె అసమాధానంతో,

"డబ్బు తీసుకోకుండా వట్టినే మందులిస్తారా?" అని ప్రతిఘటించింది శామును.

"నా రైతులదగ్గర మాత్రమే డబ్బు తీసుకోవద్దన్నాను కాని, అందరిదగ్గర కాదుగా?"

"మీ రైతులయితే మాత్ర మేం? వాళ్ళకెందుకు ఉచితంగా మందులివ్వాలి? ఇలా దుబారా చేశారంటే మీ కొడుకుచేతికి చిప్ప వస్తుంది అంతే."

శాము శాంతంగా అన్నాడు: "సరసీ, నే నీ రోజు ధనవంతుణ్ణయ్యానంటే అదంతా నా రైతులవల్లనే! వాళ్ళు ఆరోగ్యంగా వుంటే నాకే లాభం. వాళ్ళకు ఉచితంగా మందులివ్వటంలోనూ స్వార్థముంది. ఆవుకు బాగా మేతవేస్తే పాలు ఎక్కువ ఇస్తుంది కదా?"

"నేనేం చెప్పినా మీ తల కెక్కటం లేదు. మీకూ సంసారం ఉంది. మమ్మల్ని అన్యాయం చెయ్యకండి."

"ఆ సంగతి నాకూ తెలుసు. నాకు ఇద్దరు పెళ్ళా లున్నారు. ఓ కొడుకున్నాడు. మరోబిడ్డ కలగబోతోందన్న విషయం నాకూ గుర్తుంది. కాని నా భూముల్లో చెమటోడ్చి పనిచేసే రైతులదగ్గర డబ్బు లాగలేను."

అతని మాటలు విని సరసి కోపంతో అక్కడినుండి వెళ్ళిపోయింది.

ఉదయంనుండీ సాయంత్రందాకా తనదగ్గిరికి వచ్చే రోగుల్ని చూసేది మీర. అయిదుగంటల తరువాత పల్లెలో తిరుగుతూ రైతు స్త్రీలకు మలేరియాని అరికట్టడాన్ని గురించి వివరించేది. పాకలదగ్గర మురుగునీరు నిలవ వుండకుండా చేయటానికి సలహా నిచ్చేది. మైసూరు నుండి ల్యాంట్రన్ లెక్చర్ ఇచ్చేవారిని పిలిపించి మలేరియా రోగాన్ని అరికట్టే విధానాన్ని తెరమీద చూపింది.

మలేరియా, లివర్ జబ్బుల నివారణ గురించే కాకుండా, మిత సంతానాన్ని గురించికూడా వారికి నచ్చచెప్పటానికి ప్రయత్నించింది మీర. కాని ఈ విషయంలో ఆమెకు మొదట ఓటమే లభించింది.

ఓ రోజు మీర రైతుస్త్రీలను కూర్చోబెట్టుకుని వివరించి చెప్పింది. "మీ ఆరోగ్యం, శక్తీ నాశనమవటమే కాకుండా పిల్లలకూ సుఖం ఉండదు. ఇప్పుడు బోరడినే చూడండి. అతనికి తొమ్మండుగురు పిల్లలు. ఒక్కరికీ కడుపునిండా తిండిలేదు. దానికి బదులు ఇద్దరో ఇద్దరు పిల్లలుండి ఉంటే?"

"ఆఁ. నారుపోసినోడు నీరు పోయడా?" అంది నీలమ్మ.

"మీరు చెప్పినట్టే చెయ్యటం మహాపాపం కాదా? శివుడు మెచ్చుతాడా?" అంటూ ప్రతిఘటించింది రామక్క.

"ఎనిమిదీ పదిమంది పిల్లల్ని కని వాళ్ళకు కడుపునిండా తిండి పెట్టలేక మాడ్చటం పాపంకాదా రామక్కా? పుట్టించటానికి మన బాధ్యత అయినపుడు పెంచటానికి దేవుడిమీద భారంవేస్తే ఎలాగా?"

"మీ రన్నది నిజమే నండమ్మగోరూ" అంది మాదవ్వ.

చిన్న వయసులోనే అయిదారుగురు పిల్లల్నికన్న మనిషామె. పిల్లలు అస్తమానం పీక్కుతినేవారు. ఆకలో అని గోలచేసేవారు. జీవితంమీదే జుగుప్స కలిగిం దామెకు. భర్త హనుమడుకూడా 'పాడు పిల్ల' లొద్దనేవాడు. కాని రెండేళ్ళకో బిడ్డ పుడుతూనే ఉన్నాడు.

"నీ కయినా నా మాట నచ్చింది కద! అంతే చాలు"అంది మీర.

"ఊఁ, ఎట్టాగయినా పిల్లలు రాకుండా ఉండేదారి చూపుతల్లి. పచ్చిపోతూండాను"

"సరే అయితే, రేపు నీ మొగుణ్ణి తీసుకునిరా"

"అలాగే నండమ్మా."

మిగతా ఆడవాళ్ళంతా మాదవ్వను 'పాపి' అన్నారు. ప్రపంచాన్ని తల్లక్రిందులు చేస్తాది" అని ఎగతాళి చేశారు. కాని మాదవ్వ ఇదేమీ వినిపించుకోలా.

మాదవ్వ, హనుమడు మీరసలహా తీసుకున్నాడు. దాని ఫలితంగా మాదవ్వ చిన్నకొడుక్కి నాలుగేళ్ళయినా ఆమెకు మళ్ళీ కడుపు రాలేదు. నీరసించిన మొహంలోకి కాంతి వచ్చింది. చంటిబిడ్డకు నాలుగేళ్ళయినా, అస్తమానం ఆమె నంటిపెట్టుకుని ఏడిచే పిల్లాడు లేక పోవటంలో ఆమెకు ఓ క్షణం హాయిగా విశ్రాంతి తీసుకోటానికి అవకాశం లభించింది. హనుమడూ తృప్తిగా ఉంటున్నాడు.

మాదవ్వను ఎగతాళి చేసినవారి నోళ్ళు కట్టుబడ్డాయి. మాదవ్వకు కలిగిన తృప్తిని చూసి ఈరమ్మకూడా ముందుకు వచ్చింది. పెళ్ళయిన అయిదేళ్ళకే అయిదుగురు పిల్లల తల్లయిందామె.

ఓ రోజు మాదవ్వతో తన సంగతంతా చెప్పుకుని ఏడ్చింది.

"అమ్మగోరి దగ్గర కెడదాంరా. నీ మొగుణ్ణీ తీసుకురా" అం
మాదవ్వ.

ఈరమ్మకూ, ఆమె భర్తకూ చెప్పాల్సినదంతా చెప్పిం
మీర.

"ఇహ పిల్లలే పుట్టరన్న భరోసా ఇవ్వలేను, కాని నలుగు
పుట్టేచోట ఒక్క పిల్లాడు పుడితే మంచిదే కదా? మీరుమాత్ర
జాగ్రత్తగా ఉండండి" అంది.

మీరమాటలు విని సరసి అసహ్యించుకుంది. హనుమడ
రంగడు ఇలాంటి పరాయి మగవాళ్ళతో దాంపత్య జీవితాన్ని గురిం
నిర్భయంగా, నిస్సంకోచంగా చర్చించి మీర వారికి సలహా ఇవ్వట
విని సరసి అవమానంతో తలవంచుకుంది, వాళ్ళు వెళ్ళిపోగానే మీర
బాగా బుద్ధిచెప్పాలని నిశ్చయించుకుంది. వాళ్ళువెళ్ళగానే గదిలోకివచ్చి

"మీరు చేస్తున్నది సరయిన పనేనా?" అంది.

"దేన్నిగురించి అడుగుతున్నావు?"

"సంతాన నిరోధాన్ని గురించి సలహా ఇవ్వటం తప్పుకాద
ప్రకృతి నియమాన్ని ఎదిరించటం పాపం కాదూ?"

"కానేకాదు."

"మగవాళ్ళముందు అలా మాట్లాడటం...." సరసిమాట పూ
కాకముందే మీర గట్టిగా నవ్వేసింది.

"డాక్టర్ని కావాలని మెడికల్ కాలేజీలో అడుగు పెట్టిన
నేను స్త్రీనన్న విషయం విస్మరించాను."

అంతలో ఎవరో బిడ్డను చూపటానికి లోపలికి రావటం
సరసి గొణుక్కుంటూ లోపలికి వెళ్ళిపోయింది.

రానురాను మీరకు పని ఎక్కువ కాసాగింది. అపుడ
పురిటికేసుల గురించి చుట్టుపక్కల పల్లెలకూడా వెళ్ళాల్సి వచ్చే
ఇలా శక్తికి మించినపని చెయ్యటంవల్ల ఆమెకు బడలిక, అల
ఎక్కువయ్యాయి.

ఓ రోజు పురిటికేసు చూసుకుని మూడుమైళ్ళ దూరంలోన
పల్లెనుండి నడిచివచ్చింది. మందులబ్యాగు టేబుల్‌మీద పెట్టి అ

సంతో పక్కమీద ఒరిగింది. సరసి చంటిపిల్ల కామాక్షి తప్పటడుగులు వేసుకుంటూ మీరదగ్గరికి వచ్చింది. మీర కామాక్షిని మంచంమీద కూర్చోబెట్టుకుంది. కామాక్షి తల్లి తనను జోకొట్టినట్టే మీరను జోకొడుతోంది.

మీర పడుకుని వుండటం చూసి శాము కంగారుపడి "వంట్లో బాగా లేదా?" అనడిగాడు.

"కొంచెం ఆయాసంగా ఉంది, నడిచివచ్చినందువల్ల అయ్యుంటుంది. పక్క పల్లెలకు వెళ్ళిరావటం కొంచెం కష్టంగానే ఉంది."

"చుట్టుపక్కల పల్లెలకు వెళ్ళటాన్ని మానుకోవటమే మంచిది. దీనివల్ల వృథాగా డబ్బు ఖర్చవటమే తప్ప లాభంలేదు" అంది సరసి.

మీర బదులు చెప్పలేదు. కాని శాము కల్పించుకుని-

"అది సరికాదు. తనవల్ల నలుగురికీ ఉపకారం కలగాలనే చదివించాను కాని నా ఆస్తి వృద్ధి పరచటానికి కాదు. దేవుడు నాకేం తక్కువ చేశాడు కనుక?" అన్నాడు.

"దేవుడిచ్చాడని ఇలా విరజిమ్మితే పిల్లలగతేం కాను? ఎవరినో ఉద్ధారం చేయబోయి ఇల్లు గుల్లచేయకండి" సరసి శామును నిలదీసింది.

మీరవల్ల అనవసరంగా డబ్బు ఖర్చవుతోందన్న భావం సరసి మనసులో దృఢంగా నాటుకుపోయింది. మీర సంపాదించిన డబ్బు మళ్ళీ మందులు కొనటానికి సరిపోయేది. ఒక్కొక్కసారి దానిక్కూడా చాలక చేతినుండి పెట్టుకోవాల్సి వచ్చేది.

సరసి మాటలకు శాము "నిన్నెవరు పిలిపించా రిక్కడికి?" అన్నాడు.

సరసి కనుబొమలు ముడివేసి "నాకూ ఈ ఇంటికీ సంబంధముంది. నా పిల్లల్ని అన్యాయం చెయ్యకండి" అంధి.

"సుబ్రమణ్యం, కామాక్షి నాకు మాత్రం పిల్లలుకారా?"

"నా పెళ్ళాం, నా పిల్లలన్న వ్యామోహం మీకుంటే నేనింత ఆరాటపడాల్సిన అవసరమే ఉండేదికాదు" అంటూ వెళ్ళిపోయింది సరసి.

మీర ఈ మాటల్లో కల్పించుకోకుండా పడుకుని ఉంది. స
మాటలతో శాముకు బాగా కోపం వచ్చింది.

"ఇదంతా చేసింది నువ్వే. దీన్ని నాకు ముడిపెట్టి ...."
మీర మీద ఎగిరాడు. మీర నవ్వుతూ కామాక్షీ వేపు చూపి-

"పాప నెత్తుకుని ఆ మాట అనండి చూస్తాను" అంది. శా
మొహం క్షణంలో మారిపోయింది. ప్రేమగా కూతుర్ని ఎత్తుకుం
"నీకో ఉత్తరం వచ్చింది. ఇవ్వటం మర్చేపోయాను" అం
జేబులో నుండి ఉత్తరం తీసిచ్చాడు. మీర పడుకునే ఉత్తరం చద
కుంది.

"మీరా,

మీరు మీ చెల్లెలింటిని పూర్తిగా విస్మరించినట్టున్నారు. ఫ
లేదు. మేము మాత్రం మిమ్మల్ని మరిచిపోలేదు. కాలేజీలో ఉ
గానికి రాజీనామా ఇచ్చి స్వంతంగా 'విజయా ఫార్మసీ' ఓపెన్
మనుకుంటున్నా. దానికి తోడుగా 'విజయా నర్సింగ్‌హోం' కు
ప్రారంభిద్దా మనుకుంటున్నాను. దీని కంతా డబ్బెక్కడిదని
ఆశ్చర్యపడపచ్చును, నేనూ, విజయా కష్టపడి కూడబెట్టినదే కాకుం
మమ్మల్నే తాకట్టుపెట్టి డబ్బు అప్పుగా తీసుకున్నాం. నర్సింగ్‌హో
ఫార్మసీ రెండింటికీ శుక్రవారం ప్రారంభోత్సవం చేద్దామనుకు
న్నాం. మీరూ, మీ వారూ వచ్చి ఈ ప్రారంభోత్సవాన్ని యశసి
జరిగేటందుకు తోడ్పడతారని ఆశిస్తూ-గోపీ"

మీర ఉత్తరం చదివి భర్తచేతిలో పెట్టింది. శాము ఉత్త
చదివి 'అలాగే వెడదాం' అన్నాడు.

గురువారం శాము, మీర మైసూరికి వెళ్ళారు. గోపీ, విజ
స్టేషనుకు వచ్చి తీసుకెళ్ళారు.

శుక్రవారం సాయంత్రం అయిదింటికి నర్సింగ్‌హోం, ఫా
సీల ప్రారంభోత్సవం వైభవంగా జరిగింది. గోపీ విజయల స్నే
తులూ, ఆత్మీయులు చాలామంది వచ్చారు. ఆహ్వానపత్రాలు పం
గోపీ విజయల తల్లిదండ్రులు రాలేదు.

శాము శనివారమే వెళ్ళిపోవా లనుకున్నాడు. కాని గోపీ వెళ్ళనివ్వలేదు. శాము, మీరా మరొక్కరోజు ఉండక తప్పలేదు.

శనివారం రాత్రి భోజనాలయ్యాక అందరూ కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు.

"ఈ మధ్య మీర చాలా చిక్కిపోతోంది. పల్లెల్లో తిరిగి మందులివ్వటంవల్ల ఆయాసం, బడలికాకూడా ఎక్కువవుతున్నాయి. ఏంచెయ్యాలో పాలుపోవటంలేదు" అన్నాడు శాము.

"దానికంత ఆలోచించాల్సిన పనేముంది? మీరు కొంచెం డబ్బు ఖర్చుపెట్టటానికి సిద్ధంగావుంటే నేనో సలహా ఇవ్వగలను. అదేమంత పెద్దకష్టంకూడా కాదు" అన్నాడు గోపీ.

"అదేమిటో చెప్పండి."

"మీరు ఓ కారు కొనవచ్చుకదా? మీర డ్రైవింగ్ నేర్చుకుంటే వేరే డ్రైవర్ అవసరంకూడా ఉండదు. ఏమంటారు?"

శాము మాట్లాడలేదు.

"నిజమే. ఇది మంచి ఆలోచనే. అప్పటికీ ఇప్పటికీ మీర బాగా చిక్కిపోయింది. ఓకారు కొనటం మీకేం కష్టంకాదు. అలా చెయ్యండి" అంది విజయ.

"ఓ కారుకి ఎంతవుతుంది?"

"మంచి కారయితే పదివేలు కావచ్చును. మీ కదేం పెద్ద ఖర్చు కాదుకదా?"

పదివేలు. నిజమే, శాము కదేం పెద్దఖర్చుకాదు. ఇటీవలనే పన్నెండు వేలుపెట్టి కొబ్బరితోట కొనలేదూ? కాని ఆ తోటవల్ల ఆదాయం ఉంది. అయితే కారువల్ల? కాని మీరకు చాలా సుఖాన్నిస్తుంది. విశ్రాంతిలేని పనివల్ల అలసిపోతున్న మీరను చూసినప్పుడల్లా అయ్యో అనిపించటంలేదూ? కారు కొనటమే మంచిది.

కాని సరసి ఏమంటుందో? ఈ సంగతి తెలిస్తే ఇంట్లో ఇంకెన్ని గొడవలు లేస్తాయో? సరసిని ఎదిరించయినా సరే....

"మీరేమంటారు మీరా?" గోపీ అడిగాడు.

మీరకూడా శాములాగే ఆలోచిస్తోంది. ఆమె విషయంలో

శాము ఎప్పుడూ ఖర్చుకోసం వెనుదీసి ఎరుగడు. ఆమెకోసం డ
నీటిలా ఖర్చుపెట్టేవాడు. ఈమధ్య ఇంట్లో అడుగడుగునా సరసి
వ్యంగ్యపు పలుకులు, హేళనలతో జుగుప్సచెందింది మీర.
బదులు చెప్పకుండా మూగదానిలా అన్నిటినీ సహించి ఊరుకు

పదివేలు ఖర్చుపెట్టి తనకోసం శాము కారు కొంటా
సంగతి సరసి వింటే ఇక ఇల్లు రణరంగమయిపోదూ?

"ఏమి టాలోచిస్తున్నా రిద్దరూ?"

విజయ మాటతో శాము, మీరా ఈలోకంలో పడ్డారు.

శాము మనసులో గోపీ సలహా బాగా నాటుకుంది. :
తిరిగి వచ్చేటప్పటి కతని మనసునంతా ఆక్రమించుకున్న ఆలో
అదొక్కటే. సరసిని ఎదిరించి పదివేలు ఖర్చుపెట్టటం అతనికి
కష్టమయిన పనేంకాదు. అది అతని డబ్బు. కాని ఇంటి నావ
కునే అసమాధానపు వాతావరణం, దెబ్బలాటలూ తల్చుకుం
విసుగనిపించేది. ఎన్నోసార్లు సరసి మీర వైద్యవృత్తిని గ
దానికిగాను ఖర్చవుతున్న డబ్బును గురించి కటువుగా మాట్లా

శాము మీరవేపు చూశాడు. రైల్లో కిటికీ నానుకుని
మూసుకుని కూర్చుంది మీర. శాము హృదయం ద్రవిం
ఎండలోపడి తిరగటంవల్ల ఆమె మొదటి దేహకాంతి :
మయింది. శక్తికి మించిన శ్రమవల్ల ఆమె మొదటి ఆరో
కోల్పోయి నీరసించిపోయింది.

"మీరా!"

మీర కళ్ళుతెరచింది.

"ఇంకొకరి ఆరోగ్యానికోసం పాటుపడేవారు తమ ఆరో
గురించి జాగ్రత్త తీసుకోనవసరం లేదా?"

మీర నవ్వి ఊరుకుంది. శాము మళ్ళీ అడిగాడు.

"కారు సంగ తేమంటావ్?"

"ఇంటిని నరకం చెయ్యాలనుకుంటే చూడండి.
రంగా లేనిపోని గొడవలు తెచ్చుకోవటం నా కిష్టంలేదు."

"కాని నువ్వెలా తీసిపోయావో తెలుసా?"

"ఏం ఫరవాలేదు. దయచేసి ఇంట్లో ఈ గొడవ తేకండి. మీకు పుణ్య ముంటుంది."

"నా డబ్బు నేను ఖర్చుపెట్టుకోవటానికి సరసి అడ్డేమిటి? సరసి తన డబ్బు ఇవ్వటంలేదుగా?"

"పిల్లలకు అన్యాయం జరక్కూడదనేగా తన ఆరాటం? అది సహజమే? ఇహ కారు సంగతి ఎత్తకండి. నామీద ఒట్టే."

శాము అప్పటికి ఊరుకున్నాడు. మీర కిచ్చిన మాటకు కట్టుబడి ఇంట్లో కారుకొనే విషయం ఎత్తలేదు. కాని మనసులోనే మరో దారికోసం వెతుకుతూనే వున్నాడు.

మీర ఎప్పటిలా పనిచేసుకుంటూనే ఉంది. అయిదారు మైళ్ళ దూరంలోఉన్న పల్లెలకంతా వెళ్ళి వస్తూనే ఉండేది. మిగతారోగులు ఆమె దగ్గరికే వచ్చినా, పురిటికేసులకు ఆమె వెళ్ళక తప్పేదికాదు. తన ప్రాణాన్నే పణంగాపెట్టి వైద్యంచేస్తున్న ఆమెనుచూస్తే అపరిమితమయిన జాలి కలిగేది శాముకు.

"బండి కట్టించుకు వెళ్ళకూడదూ?" అని శాము అడిగినపుడు

"వద్దు. ఫరవాలేదు. బండ్లో కుదుపు తట్టుకుంటూ వెళ్ళటానికన్నా నడిచివెళ్ళటమే హాయి నాకు" అనేది.

ఓ రోజు మధ్యాహ్నం మీర టిఫిన్ తీసుకుంటూండగా ఓ అబ్బాయి కంగారుగా పరిగెత్తుకుని వచ్చి "మా అక్కయ్యకు జ్వరం ఎక్కువయి పిచ్చిగా మాట్లాడుతోంది. వెంటనే రావాలట" అన్నాడు. మీర వెంటనే లేచి మందులబ్యాగ్ తీసుకుని బయలుదేరింది. ఊపిరి పీల్చుకోలేక అవస్థపడుతున్న అమ్మాయికి ఇంజక్షనిచ్చి కాస్సేపక్కడే కూర్చుంది. కాస్సేపట్లో ఆ అమ్మాయి హాయిగా ఊపిరి పీల్చటానికి ప్రారంభించింది. పిల్లతల్లి మీర కాళ్ళు పట్టుకోబోయింది.

"మీకన్నా చిన్నదాన్ని. నా కాళ్ళు పట్టుకోకండి. ఆయుస్సుంటూ ఉంటే నేను రాకపోయినా మీపిల్ల బ్రతికేదే" అనిచెప్పి అక్కడి నుండి బయలుదేరింది మీర.

ఎండ మండిపోతోంది. ఇంటినుండి కంగారుగా బయలు

దేరటంవల్ల మామూలుగా తీసుకునే గొడుగు తీసుకురావటం మర్చి పోయింది. అంతకు ముందురోజే ఆరుమైళ్ళ దూరంలోఉన్న పల్లెకు వెళ్ళి వచ్చింది. బండిలోనే వెళ్ళొచ్చినా కుదుపులవల్ల ఆమెకు చాలా ఆయాసంగా వుంది.

నడుస్తూండగా ఆమె కళ్ళు తిరిగాయి. అడుగు ముందుకు పడలేదు. నుంచున్న చోటనే కూలబడిపోయింది.

ఆమె తేరుకునేసరికి ఆమెతోబాటు వచ్చినకుర్రాడు "డాక్టరు గారూ" అంటూ ఏడుస్తున్నాడు.

"చాలాసేపు పడుకున్నానా?"

"లేదండి. ఓ క్షణం పడుకుండిపోయారు. నాకు భయ మేసింది."

ఇంటికి వెళ్ళగానే వరండాలోనే కూర్చున్న శాముతో ఆ అబ్బాయి మీర కళ్ళు తిరిగి పడిపోవటాన్ని గురించి చెప్పాడు. ఆ క్షణంలోనే శాము కారు కొనాలని నిశ్చయించుకున్నాడు. ఈసారి మీర కూడా గట్టిగా వద్దనలేదు.

"కారు కొన్నా కుదుపు తప్పదు" అని మాత్రం అంది.

"బస్‌రూట్‌లో వెడితే కుదుపు లుండవు. దగ్గరకదాని నువ్వు అడ్డత్రోవలో వెడతావుకాని బస్‌రూట్ కాస్త చుట్టయినా రోడ్డు బావుంటుంది" అన్నాడు.

కారు సంగతి చెవినపడగానే తోకత్రొక్కిన త్రాచులా లేచింది సరసి.

"మీరేమయినా చేసుకోండి, పిల్లల్ని తీసుకుని నేను పుట్టింటికి వెళ్ళిపోతాను." అని శామును బెదిరించింది.

"ఓ మహారాజులా వెళ్ళు. కాని సుబ్రమణ్యం, కామాక్షులను నువ్వుకాదు, నీ తల్లోని జేజమ్మకూడా తీసికెళ్ళలేదు" అన్నాడు శాము కటువుగా.

"పిల్లలమీద మీకున్నప్రేమా అంతంతమాత్రమేగా! నిజంగా ప్రేమవున్నవాళ్ళయితే ఇలా డబ్బు నీళ్ళలా ఖర్చుపెట్టేవారా?"

"చూడు సరసీ, మీర నీ కన్నాముందే ఈ ఇంట్లో అడుగు

పెట్టింది. కూతుర్ని పోగొట్టుకున్న తల్లి. అదొక్కటి గుర్తుంచుకునే ఆమెను చదివించాను. నిజానికి నా ఆస్తిలో సగం ఆమెకే చెందాలికదా?"

"సగమేమిటి ఖర్మ! పూర్తిగా ఆవిడకే రాసిచ్చెయ్యండి. నాకేం? పుట్టింట్లో నేనూ, నా పిల్లలూ కలోగంజో తాగి బ్రతుకుతాం."

"పిల్లలమాట వదిలేయి. నువ్వలా పుట్టింటికి వెళ్ళావంటే మళ్ళీ ఈ ఇంటి గుమ్మం తొక్కలేవు. పిల్లల్ని మళ్ళీచూసే ఆశ వదులుకుని వెళ్ళు. నువ్వు మొండివయితే నేను శతమొండినన్న విషయం గుర్తుంచుకో."

ఆ రోజునుండి సరసి మీరతో మాట్లాడటం మానేసింది. మీర పలకరించినా బదులు చెప్పేదికాదు. తనమీద కోపాన్ని పిల్లల మీద తీర్చుకోవటాన్ని మాత్రం సహించలేకపోయింది మీర.

ఓ రోజు సాయంత్రం మీర బయటికి వెళ్ళాలని బయలు దేరుతోంది, సుబ్రమణ్యం "నేనూ వస్తాను పెద్దమ్మా" అన్నాడు.

పిల్లలకు పెద్దమ్మదగ్గర చాలా చనుకు. సరసిలా మీర ఎప్పుడూ పిల్లల్ని కొట్టేది కాదు.

"సరే వెడదాం రా. తల దువ్వుతాను."

సుబ్రమణ్యాని కింకా జుట్టు తీయించలేదు కనుక ఆడపిల్లలా జుట్టు పెరిగింది. తిరుపతిమొక్కు ఉండటంవల్ల అతనికి జడవేసి పూలు పెట్టేవారు. మీర శుభ్రంగా దువ్వి జడవేసి పూలు పెట్టింది. తెల్లటిగుడ్డలు తొడిగింది. పెద్దమ్మతో షికారుకు వెళ్ళటమంటే అతనికి ఎక్కడలేని సరదా. తను అడిగిన ప్రశ్నలన్నిటికీ ఓపికతో జవాబు లిచ్చేది. అన్నీ తెలుసుకోవాలన్న బాల్యసహజమయిన ఆసక్తి ఆ అబ్బాయిలో యిపుడిపుడే రేకెత్తుతోంది. కాని సరసి, "ఎందుకూ, ఏమిటి" అని అస్తమానం నన్ను వేధించకు" అని అతని కుతూహలాన్ని త్రుంచివేసేది. కాని మీర ఎపుడూ అతని ఉత్సాహానికి అడ్డు వచ్చేది కాదు. అందుకనే పెద్దమ్మతో షికారుకు వెళ్ళటమంటే అంత సరదా సుబ్రమణ్యానికి.

మీర చిటికెనవేలు పట్టుకుని అతను బయలుదేరేసరికి సరసి లోపల్నుండి వచ్చింది. మీరవేపు చూడకుండానే,

"ఎక్కడికిరా వెడుతున్నావ్?" అనడిగింది.

"బొబ్బిపోతాను."

"ఎక్కడికీ వెళ్ళనక్కర్లేదుగాని ఇంట్లోనే పడిఉండు."

"ఉహుఁ" అంటూ మొండికేశాడు సుబ్రమణ్యం.

"పోనీ నేను తీసికెడతాను రా" అంటూ పిలిచింది సరసి.

"వద్దూ, నువ్వొద్దు." సుబ్రహ్మణ్యం రాగంతీశాడు.

కొడుకు తన్నికాదని మీరతో బయలుదేరటం ఆమెకు మరింత కోపం తెప్పించింది. ఆవేశంతో సుబ్రహణ్యాన్ని పట్టుకు బాదింది సుబ్రమణ్యం నేలమీదపడి దొర్లాడు. తల్లోపెట్టిన పూలు నలిగి నే పాలయ్యాయి. తెల్లటిబట్టలు నలిగి పాడయ్యాయి. కంటికి పెట్టి కాటుక కన్నీళ్ళతోబాటు బుగ్గలమీదికి దిగివచ్చింది.

"పాడు ముండావాళ్ళు. ఈ ఇంట్లో అందరూ నాకు శత్రు వులే. చెప్పినమాట వినకపొయ్యాక ఎందుకొచ్చిన పిల్లలు? పాలిటి రాక్షసులు" అంటూ మళ్ళీకొట్టింది. తనమీది కోపాన్ని వాడిమీద తీర్చుకోవటాన్ని సహించలేక పోయింది మీర. సుబ్ర మణ్యాన్ని ఎత్తుకుంటూ,

"నామీద కోపానికి బాబు నెందుకు కొడతావు?" అంది.

"నా కొడుకు. నేనేమయినా చేసుకుంటాను. ఇవాళ మీతో బయటికి వెళ్ళాడంటే వాడికాళ్ళు విరగ్గొడతాను" అంది సరసి.

"అంత సాహసం చేయద్దులేమ్మా" అంటూ మీర సుబ్ర మణ్యాన్ని కిందికి దించి వెళ్ళిపోయింది.

మీర ఇలాంటివన్నీ శాముకు చెప్పేదికాదు. కాని వెంకమ్మ గారు ఊరుకోలేక అంతా చెప్పేసేవారు. వెంకమ్మగారికీ, సరసి మొదటినుండీ పడేదికాదు. మీర వెంకమ్మగార్ని చూసేతీరుకూ, సర చూసే తీరుకూ చాలా భేదముంది. ఇంతకుముం దోమారు ఏదో చిన్నకారణానికి వెంకమ్మగారిమీద సరసి,

"వంటవాళ్ళను ఎక్కడుంచాలో అక్కడుంచాలి. నె

కెక్కించుకుంటే ఇలాగే అవుతుంది.” అని విరుచుకుపడింది. ఆ మాటవిన్న వెంకమ్మగారికి కడుపులో దేవినట్టయింది. తిన్నగా సరసి దగ్గరకొచ్చి,

“అమ్మా, నువ్వు నీ స్వభావానికి సరిపోయేమాట అన్నావు. శామ కాని, మీరకాని ఎప్పుడూ అలాంటిమాట అని ఎరుగరు ఎంతయినా వాళ్ళు పెద్దమనుషులు” అన్నారు.

దాంతో సరసికి వళ్లుమండినా, పెద్దగా దెబ్బలాడటానికి భయపడింది. శామ వెంకమ్మగార్ని ఎంతగా గౌరవిస్తాడో సరసికి బాగా తెలుసు.

అప్పటినుండి సరసికి, వెంకమ్మగారికీ మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గుమనేది. ఆమె కావాలనే సరసిముందు మీరను పొగిడేవారు. “ఇంటి యజమానురాలివి నువ్వు” అని ఆమె మీరను అన్నప్పుడల్లా సరసికి కంట్లో కారం పోసినట్టయ్యేది.

వెంకమ్మగారు చెప్పిన మాట విని శామ రుద్రావతారం దాల్చాడు. అతను ఎప్పుడూ పిల్లలమీద చెయ్యిచేసుకునే వాడు కాదు. పువ్వుల్లో పెట్టినట్టు చూసుకునేవాడు. అలాంటప్పుడు సరసి కొట్టటమా?

పరిణామం—ఆ రాత్రి సరసికి మళ్ళీ దెబ్బలు తగిలాయి.

ఇంట్లో పొగ రోజురోజుకూ ఎక్కువవుతోంది. ఊపిరాడని వాతావరణంలో పడి కొట్టుకులాడిపోతోంది మీర.

ఇంకోసారి కామాక్షికి మీర పెప్పర్‌మెంట్ కొనిపెట్టింది. అది చూడగానే సరసి గబగబా వచ్చి బిడ్డ నోట్లోంచి బిళ్ళ లాగేసి,

“విషం ఇవ్వటానిక్కూడా వెనుతీయదు” అని గొణిగి, బిడ్డ నోటిని తడిగుడ్డతో తుడిచింది.

ఆమె మాట గురిచూసి వదిలిన బాణంలా మీర హృదయాన్ని తాకింది. ఒక్క క్షణం చైతన్యాన్ని కోల్పోయి శిలాప్రతిలా నుంచుండిపోయింది. తరువాత మెల్లిగా తేరుకుని తన గదిలోకి పెళ్ళి ముసుగు పెట్టుకొని పడుకుంది.

శామ—ఇద్దరిమధ్య నలిగిపోతున్నాడు. మీరను దూరం చేసుకోటానికి అత నెప్పుడూ సిద్ధంగా లేడు. పిల్లలకోసం సరసిని భరి

స్తున్నాడు. కాని రోజు రోజుకూ ఇంట్లో శాంతి కరు వవుతు
వచ్చింది. ఎన్నోసార్లు సరసి మూర్ఖత్వానికి ఏమీ చెయ్యలేక త
బ్రద్దలు కొట్టుకోవా లనిపించేది. అతని పరిస్థితిచూసి మీర లోలోప
బాధపడేది.

సుబ్రమణ్యం పెద్దమ్మను తల్లికంటే అధికంగా ప్రేమిం
వాడు. ఆ నేరానికి తల్లిచేత శిక్ష తప్పేదికాదు.

కామాక్షి—తను పోగొట్టుకున్న వీణనే గుర్తుకుతెచ్చే కామ
క్షంటే మీరకు ప్రాణం. కామాక్షిని తన హృదయానికి హత్తుకు
'వీణా' అని ముద్దాడేది. వీణ కామాక్షిగా తిరిగి వచ్చిందని మీరా
శామూ నమ్మారు. సరసి దానికూ్కడా మీరముందు వ్యంగ్యం
మాట్లాడింది.

"అల్పాయస్సు కలిగిన కూతురిపేరుతో దీవించకండి!"

మీర తనలోని చైతన్యాన్నంతా కూడదీసుకుని ఆ మాట
జీర్ణించుకుంది.

కాని సరసి ఆమెమీద ఆరోపించిన ఆఖరి అపరాధం—
"విషం ఇవ్వటానికూ్కడా వెనుతీయదు అని".

కూర్చుంటే, నుంచుంటే సరసిమాటలు శూలంలా గుచ
కునేవి.

"విషం ఇవ్వటానికూ్కడా వెనుతీయదు."

చల్లగా వీచేగాలి గుసగుసలాడేది. "విషం ఇవ్వటానికూ్క
వెనుతీయదు" అన్నమాటలే వినిపించేవి.

ఆకుల గలగలలో, ఎడ్ల మెడల్లోని మువ్వల చప్పుడులో
తిరగలి ధ్వనిలో, లేగదూడ అంబా అన్న పిలుపులో, బండిచక్రా
ధ్వనిలో, పసిపిల్లల రోదనలో ఆమెకు వినిపించేవి-

"విషం ఇవ్వటానికూ్కడా వెనుతీయదు" అన్నమాటలు.

కలలోకూడా సరసిమాటలు ఆమెను హింసించేవి.

—కామాక్షి మందులబీరువా తలుపులుతీసి మందుసీసాల
ఆడుకుంటోంది. ఆడుతూ 'విషం' అని రాసున్నసీసా తెరిచి నోట

పోసుకోవటానికి ప్రయత్నిస్తోంది. అది చూసి మీర 'విషం, తాగొద్దు' అని గట్టిగా అరచింది.

"మేలుకో మీరా, కలవరిస్తున్నావా?" అంటూ శాము ఆమెను తట్టి లేపాడు.

"కామాక్షి విషం తాగేసింది" అంటూ నిద్రకళ్ళలోనే వెక్కి వెక్కి ఏడ్చింది మీర.

"కామాక్షి హాయిగా నిద్రపోతోంది మీరా"

"లేదు లేదు. విషంతాగింది."

"పిచ్చిదానా" అంటూ శాము నవ్వుతూ లేచివెళ్ళి నిద్ర పోతున్న కామాక్షిని తీసుకొచ్చి మీరపక్కన పడుకోబెట్టాడు. మీర కళ్ళుతెరచి కామాక్షిని చూసి దగ్గరకులాక్కుని పడుకుంది.

కాని నిద్ర ఆమెనుండి దూరమయింది.

సరపి ములుకుల్లాంటి పలుకులను విని జీర్ణించుకునే శక్తిని కోల్పోయిం దామె. సరపిని శాము కిచ్చి పెళ్ళి చేయించినపుడు, అతని రెండోపెళ్ళి తన జీవితపు ఆదర్శాన్ని యీ విధంగా రూపొం దిస్తుందని కల్లోకూడా అనుకోలేదామె. సంవత్సరంలో ఎక్కువ భాగాన్ని మైసూర్లోనే గడుపుతున్న ఆమెకు సరపి స్వభావ పరిచయం కూడా ఎక్కువగా కాలేదు.

కాని చదువు పూర్తిచేసి డాక్టరుగా ఆమెపల్లెలో స్థిరపడేసరికి సరపిలో ఎంతమార్పు కలిగింది! అడుగడుగునా వ్యంగ్యపు మాట లతో ఆమెను బాధించటమే తన పనిగా పెట్టుకుంది సరపి. విసురుగా వచ్చే వాగ్బాణాలు సూటిగా మీర హృదయాన్ని తాకేవి. వాటి ధాటకి తట్టుకోలేక విలవిలలాడి పోయేది మీర.

శాముకోసం, పల్లెప్రజలకోసం, తనకోసం మీర నవ్వు మొహంతో సరపి మాటల్ని సహించడానికి ప్రయత్నించింది.

పెళ్ళయిన కొత్తలో మీరకు శాము అంటే ఏమాత్రం ప్రేమ లేదు. తను డాక్టరు కావాలన్న కోర్కెను సమూలంగా నాశనంచేసిన 'విలన్' శాము అనే అనుకుంది. తన ఆదర్శాన్ని మట్టిపాలుచేసిన

శాము ప్రేమించటం అసాధ్యమన్న భావనతోనే భర్త ఇంట
అడుగు బెట్టిందామె.

వీణ రాక మీర మనోమందిరంలో నూతన ప్రపంచాన్నే
సృష్టించింది. అయిదేళ్ళు వారి జీవితాలను నందనవనం చేసిన వీ
కర్పూరంలా హరించుకుపోగానే మీరా, శాము మళ్ళీ దూరమయ్యార

మీర ఆరాటం, ఆవేదనా శాము అర్థంచేసుకున్నాడు. అం
కోసమే ఉదార హృదయంతో మీర చదువుకు అనుమతించాడు.

అతని ఔదార్యం మీర హృదయంలో నిద్రిస్తున్న కోమ
భావాలను తట్టి లేపింది. మీర హృదయం శాము వేపుకు వాలిం
ప్రేమామృత వర్షంలో తడిసి మెత్తబడిన ఆమె హృదయం, తనవా
వంశాభివృద్ధికోసం, స్వార్థాన్ని మరిపించి, అతనికి రెండోపె
చేయించింది.

ఎలాటి పరిస్థితుల్లోనయినా తను సర్దుకుంటానని భర్త
భరోసా ఇచ్చింది. ఆ భరోసావల్లనే శాము సరసిని చేపట్టాడు.

కాని....కాని, జరిగిందేమిటి?

సరసి మీరను ద్వేషిస్తోంది. మీరను అతిగా ప్రేమించే భర్త
ఈసడిస్తోంది.

న్యాయంగా తన పిల్లలకు చెందాల్సిన ఆస్తిని మీర దు
వినియోగం చెయ్యటం సరసి కిష్టంలేదు.

కాని ఇందులో ఆమె తప్పేమిటి?

పల్లెలో మూడోవంతు రైతులు శాము పొలాల్లో పనిచేసేవా
వాళ్ళు పొలాల్లో కష్టపడి చెమటోడ్చి బంగారాన్ని పండించేవా
వాళ్ళ శ్రమవల్లనే శాము ఈనాడు ధనవంతు డయ్యాడు.

మట్టినుండి బంగారాన్ని పండించే రైతుల ఆరోగ్యం కోస
మీర పాటుపడుతున్నది. ఆమె ఆశయం శాము ప్రోత్సాహంవల్ల స
వేరుతోంది. ఆమెను నమ్ముకున్న రైతులను ఒక్క సారిగా వ
వెళ్ళాలంటే మీరకూ కష్టంగానే ఉంది.

కాని వేరే దారేముంది?

పల్లెలోనేవుండి పల్లెప్రజలసేవ చేయాలన్న కాంక్ష అమితం

ఉందామెకు. ఆమె అక్కడుంటే శాము, సరసిలకు కొంచెమయినా శాంతి సమాధానాలు లభించేలా లేవు.

మీర మూలంగానే శాము సరసులమధ్య అసమాధానపు పొగ రాజుకుంటోంది. ఇద్దరు భార్యలమధ్య శాము నలిగిపోతున్నాడు.

ఇప్పుడు అతని అలసిన మనసుకు సాంత్వన కలిగించటం ఆమె కర్తవ్యంకదా?

భర్తదగ్గర మీరఎన్నడూ ఓటమిని ఎరుగదు. అతన్నిఒప్పించి డాక్టరయిందామె. కాని ఓ ఆడదాని దగ్గరే తను ఓడిపోవాల్సివస్తుందని మీర ఎన్నడూ ఊహించలేదు.

ఇంకా అక్కడేవుండి ఆ మనస్తాపాలనూ, అసమాధానాన్ని మరింత ఎక్కువచేయటంలో అర్థంలేదని తెలుసుకుంటుదామె.

ఇహ మిగిలిన దొక్కటే మార్గం.

శామును సరసికీ, పిల్లలకు అప్పజెప్పి వెళ్ళిపోవడమొక్కటే ఆమెకు మిగిలింది.

వీణ ఆమెనుండి దూరమయింది. ఇపుడు ఆమె శామునుండి దూరం కాబోతోంది. ఆమె హృదయం బాధతో విదీర్ణమైంది.

అపస్వరంతో ప్రారంభమైన ఆమె జీవితం అపజయంతోనే అంతం కావాలి. తప్పదు.

ముద్దులకూతుర్ని పోగొట్టుకున్నమీర ప్రీతిపాత్రుడయిన భర్తకు దూరం కాక తప్పదు.

మీర పక్కమీద దొర్లుతూ మరణయాతననుభవిస్తోంది.

మరుసటిరోజు మీరమైసూరికి బయలుదేరింది. అకస్మాత్తుగా మైసూరుప్రయాణం పెట్టుకున్న మీరనుచూపి శాముఆశ్చర్యపోయాడు.

"మందు లేమైనా తెచ్చుకోవాలా మీరా?"

"లేదు. 'విజయ తల్లి కాబోతుంది. నర్సింగ్‌హోం పనిచూసే వారెవరూ లేరు. మీరువచ్చి నా బరువు కాస్తతగ్గించండి' అని గోపీ రాశాడు. అందుకే వెడదామనుకుంటున్నా."

"మళ్ళీ రావట మెప్పుడూ?"

"బహుశా నే నిక రానునుకుంటా" మీర శాంతంగానే జవాబు చెప్పింది.

"మీరా!"

"అవునండి. నన్నిక ఆపకండి. ఇక్కడ ఒక్కక్షణంకూడా ఉండలేను."

నిన్ను నమ్ముకున్న పల్లె ప్రజలసంగతి ఆలోచించావా?"

"దేవుడెలాగో కాపాడుతాడు. నేను లేనపుడుమాత్రం జీవించ లేదా వాళ్ళందరూ?"

"ఇలాహఠాత్తుగా బయల్దేరటానికి కారణమేమిటో చెప్పుపోనీ"

"కారణం నేను చెప్పలేను. నేను వెళ్ళాక...."

"సరసి ఏమయినా...."

"సరసి ప్రమేయం ఇందులో ఏమీలేదు. ఈ విషయంలో ఆమె నేమీ అనకండి. అలా అని మాటివ్వండి నాకు."

"సరసిని పిలిచి అడగనా?"

"నామీదవట్టే. ఆమె కామాక్షి, సుబ్రమణ్యాలను కన్నతల్లి"

ఆమాట విని శామునోరు మూతబడింది.

"నువ్వు వెళ్ళిపోతే నే నెలా ఉండను?"

"కామాక్షి, సుబ్రమణ్యం ఉన్నారు."

"నువ్వెందుకు వెళ్ళిపోతున్నావో చెప్పలేవా మీరా?"

"ఊహుఁ. అదొక్కటే అడక్కండి, మొదటిమారు నాకోసమే పల్లెవదిలి చదువుకోవటానికి వెళ్లాను. ఈమారు మీకోసం వెళ్ళిపోతు న్నాను."

"అపుడపుడూ వస్తూంటావు కదూ?"

"ఊహుఁ, నన్ను చూడాలని పించినపుడు మీరేరండి. వచ్చే టపుడు కామాక్షి, సుబ్రమణ్యాలను తీసుకురండి."

శాము ఆమె నిర్ధారాన్ని కదిలించలేక పోయాడు. మీర వెళ్ళి పోవటం అతని కెంత బాధాకర మైన విషయమయినా అతని మనసు చెబుతూనే వుంది: ఇదేమంచిది. నిప్పులో చెయ్యిపెట్టి కాల్చుకోటం

కన్నా, జ్వాలాముఖిని ఆరోహించి ఆహుతి కావటంకన్నా దూరంగా వెళ్ళిపోవటమేమంచిది. దీనివల్లఆమె ఇంతకన్నా సుఖంగాఉంటుంది"

అందుకనే శాము ఆమెను అక్కడే ఉండమని మళ్ళీ బలవంతం చేయలేదు.

"గోపీకి ఉత్తరం రాసి రేపు వెళ్ళకూడదూ?"

"ఫరవాలేదు. వాళ్ళెప్పుడూ నన్ను పరాయిదానిగా చూడలేదు. చెల్లెలింటికి ఉత్తరం రాసి వెళ్ళాలా?"

ఆమె ప్రశ్నకు శాము జవాబు ఇవ్వలేదు.

"దెబ్బమీద దెబ్బతగిలినా నేనెన్నటికీ ఓడిపోననే అనుకున్నాను. మిమ్మల్ని గెలుచు కున్నంత సులభంగానే సరసినీ గెలుచుకుంటా నను కున్నాను. ఈ మారు నాకు ఓటమి కలిగింది" అంది మీర నవ్వుతూ.

"మీరా నవ్వకు. ఏడ్చేలా ఉంటే మనస్ఫూర్తిగా ఏడ్చేయి." అన్నాడు శాము.

ఆమె ఊహించుకున్న దేమిటి?-సుందరమైన సంసారం. తనూ, సరసీ అక్కచెల్లెళ్ళలా, స్నేహితుల్లాకలసి మెలసిఉండే తృప్తికరమైన సంసారం. ఎలాంటి పరిస్థితుల్లోనయినా సర్దుకు పోగలనన్న నమ్మకం ఉండే దామెకు.

కాని ఆ నమ్మకం అబద్ధమయింది. ముళ్ళ కర్రతో దెబ్బలు తినటం ఆమెకు సాధ్యం కాలేదు.

పరిగెత్తుకుంటూ తన దగ్గరికి వచ్చి చీర కుచ్చిళ్ళు పట్టుకుని నవ్వుతున్న కామాక్షి నెత్తుకుని ముద్దుపెట్టుకుంది మీర.

"నిన్ను వదిలి ఎలా ఉండను మీరా?" శాముకంఠం వణికింది.

అతనిప్రశ్నకు జవాబుగా మీర కామాక్షిని శాముచేతికి అందించింది.
